వాకిలి
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ
epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
గుంటూరు
: fb.com/vaartha Digital

నేటి మీ కపిల్‌చిట్స్ తో సభ్యత్వం ఓ మంచి ఆర్థిక నేస్తంతో బంధుత్వం
KAPIL GROUP కపిల్ చిట్స్ 45 years
Visit Us: www.kapilchits.com
కపిల్ చిట్స్ మీ కలలకు సాకారం

Published from Guntur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
17-11-2025 సోమవారం సంపుటి: 31 సంచిక: 286 పేజీలు: 12 వెల: 6.50

## రాజ్యాంగంవల్లే హక్కులపై కోర్టుల్లో అప్పీలు

### సిజెఐగా ఇది నా చివరి కార్యక్రమం: గవాయ్

**విజయవాడ,నవంబరు 16,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రాథమిక హక్కులకు భంగం కలిగితే కోర్టులను ఆశ్రయించే హక్కు రాజ్యాంగం కల్పించిందని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బిఆర్ గవాయ్ అన్నారు. 75 యేళ్ల భారత రాజ్యాంగంపై ఎపి హైకోర్ట్ అడ్వకేట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సదస్సు భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ భూషణ్ రామకృష్ణ గవాయ్ హాజరయ్యారు. ఎపి చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, సిఎం చంద్రబాబులు సిజెఐ బిఆర్ గవాయ్‌కు స్వాగతంపలికారు. జ్యోతి ప్రజల్వనచేసి సదస్సును ప్రారంభించిన సిజెఐ గవాయ్, ప్రారంభిం >>2




ఆదివారం విజయవాడలో ఎపి హైకోర్ట్ న్యాయవాదుల ఆధ్వర్యంలో జరిగిన సదస్సులో పాల్గొన్న సిజెఐ జస్టిస్ గవాయ్, హైకోర్టు సిజె ధీరజ్ సింగ్ ఠాకూర్, సిఎం చంద్రబాబు

# మన విధానం 'నేషన్ ఫస్ట్'

### చాయ్‌వాలా ప్రధాని అయ్యారంటే రాజ్యాంగ ఔన్నత్యమే కారణం

### గవాయ్ వంటి జస్టిస్ గైడెన్స్ అవసరం

### 75 యేళ్ల రాజ్యాంగ సదస్సులో సిఎం చంద్రబాబు

### హాజరైన సిజెఐ గవాయ్, హైకోర్టు సిజె ఠాకూర్

**విజయవాడ, నవంబరు 16 ప్రభాతవార్త ప్రతినిధి:** నేషన్ ఫస్ట్ అనే విధంగానే ప్రతి ఒక్కరూ ఆలోచన చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. సోషల్ ఈక్వాలిటీ, ఎకనామిక్ ఈక్వాలిటీ ఉండే సమాజాన్ని తీర్చిదిద్దాల్సిన అవసరం కన్పిస్తోందని... ఈ రకమైన సమానత్వాన్ని సాధించడానికి పబ్లిక్ పాలసీలు కీలక పాత్ర పోషిస్తాయని స్పష్టం చేశారు. భారత రాజ్యాంగంలో అమల్లోకి వచ్చి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఆదివారం సికె కన్వెన్షన్‌లో ఆంధ్రప్రదేశ్ హైకోర్ట్ న్యాయవాదుల ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో సిజెఐ జస్టిస్ గవాయ్, ఎపి హైకోర్టు సిజె ధీరజ్ సింగ్ ఠాకూర్‌తో పాటు ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొన్నారు. ఈసందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ... ఛాయ్ వాలాగా జీవితాన్ని ప్రారంభించిన నరేంద్ర మోడీ ప్రధానిగా ఉన్నారంటే అందుకు భారత రాజ్యాంగమే కారణమనిఅన్నారు. ఇలాంటి సందర్భంలో అంబేద్కర్‌ను స్మరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రధానిగా నరేంద్ర మోడీ అద్భుతమైన పనితీరు కనబరుస్తున్నారని వివరించారు.


**ప్రజాస్వామ్యాన్ని రక్షించేది న్యాయవ్యవస్థే**

సమాజంలో ఏమైనా తప్పిదాలు జరిగితే వాటిని సరిదిద్ది ప్రజాస్వామ్యాన్ని రక్షించేది న్యాయవ్యవస్థేనని ముఖ్యమంత్రి అన్నారు. 'సోషల్ మీడియా వచ్చాక ప్రతి ఒక్కరూ ఎడిటర్లు అయిపోతున్నారు.. వ్యక్తిత్వ హననాలకు పాల్పడుతున్నారని అభిప్రాయపడ్డారు. వన్ పర్సన్ - వన్ ఓట్.. అనేది అంబేద్కర్ ఇచ్చిన వరం. కొన్ని దేశాల్లోని ఓటర్లకు సమాన హక్కులు >>2

## రూ. 50 లక్షల కోట్లపెట్టుబడులు ఐదేళ్లలో రాక

### విశాఖ సిఐఐ సదస్సు ఫలితంగా రానున్న రూ. 13 లక్షల కోట్ల పెట్టుబడులకు అత్యంత అనువైన ప్రాంతంగా ఎపికి ప్రపంచ గుర్తింపు

### ఇక వివిధ రంగాల సత్వర అభివృద్ధి: సిఎం చంద్రబాబు



**విజయవాడ,నవంబరు 16,ప్రభాతవార్తప్రతినిధి:** పెట్టుబడులకు అత్యంత అనువైన ప్రాంతంగా ఎపిని ప్రపంచం గుర్తించిందని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. విశాఖలో రెండు రోజుల పాటు నిర్వహించిన సిఐఐ పెట్టుబడులదారుల భాగస్వామ్య సదస్సు అత్యంత విజయవంత మైందన్నారు. ఎనర్జీ, పర్యాటక, అతిధ్యేయ, విద్యా, ఎఐ, క్వాంటం కంప్యూటస్, టెక్స్‌టైల్, ఎలక్ట్రానిక్, రవాణా రంగాల్లో పెట్టుబడుల ద్వారా లాభాలను అర్జించేందుకు అవసరమైన పెట్టుబడులు పెట్టేందుకు పలు విదేశీ సంస్థలు ఆసక్తి చూపాయన్నారు. ముఖ్యంగా డ్రోన్స్ ఇతర రంగాల్లో యువత ఆంధ్ర పట్ల మొగ్గు చూపిందన్నారు. వివిధ దేశాల నుంచి 30కి పైగా మంత్రులు ఈ భాగస్వామ్య సదస్సుకు హాజరయ్యారని తెలిపారు. భాగస్వామ్యాలు, పెట్టుబడులు, ఎంవోయూలు ఇలా 67 సెషన్లను రెండ్రోజుల్లో నిర్వహించగలిగామని సిఎం వివరించారు. 45దేశాల్లో మనసమ్మిట్ చర్చనీయాంశమైందన్నారు. విశాఖ పేరు మార్మోగుతోందంటే టీం వర్క్‌తోనే ఇది సాధ్యమైంది. దావోస్‌లో ఎంవో యూలు బయట జరుగుతాయి. ప్రపంచం ఏ దిశగా ముందుకు వెళుతోంది అన్నారు. భవిష్యత్ ఏ విధంగా ఉంటుంది, ఎదురయ్యే సవాళ్లు, అందివచ్చే అవకాశాలపై మెయిన్ వెన్యూలో చర్చిస్తారు అన్నారు. కానీ వినూత్న పద్ధతిలో విశాఖ సమ్మిట్‌కు మనం శ్రీకారంచుట్టాం. ఎవరికి ఏ సబ్జెక్ట్ పైన ఆసక్తి ఉంటే ఆ సెమినార్‌కు సమ్మిట్‌లో అంతా ప్లానింగ్ తో నిర్వహించామన్నారు. ప్రధాని మోడీ సహకారంతో రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తున్నాం. దేశంలో సుస్థిర ప్రభుత్వం ఉంది, పెట్టుబడులు పెట్టొచ్చనే ధైర్యాన్ని పారిశ్రామికవేత్తల్లో కలిగించారు అని అన్నారు. 2024 ఎన్నికల్లో ప్రజలు చారిత్రాత్మక తీర్పు ఇచ్చారు. విధ్వంసపాలనకు చరమగీతం పలికారు. 94 శాతం స్ట్రైక్‌రేట్‌తో కూటమి ప్రభుత్వాన్ని >>2

## ఇక పంచాయతీలకు ఐఎస్‌ఓ గుర్తింపు

### రాష్ట్రంలోని 19 జిల్లాల్లో ప్రయోగాత్మకంగా 24 గ్రామాల ఎంపిక

**విజయవాడ,డిసెంబరు 16,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో 24 గ్రామ పంచాయితీలకు అంతర్జాతీయ ప్రమాణాల సంస్థ (ఐఎస్‌వో) గుర్తింపు కోసం కూటమి ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. 52 పంచాయితీలను ప్రయోగాత్మకంగా ఎంపిక చేసి తొలి దశలో 24కు గుర్తింపు లభించేలా చర్యలు తీసుకుంటోంది. రెండోదశలో మిగిలిన 28 పంచాయితీల్లో ఏర్పాట్లు చేయనుంది. ప్రజలకు అందిస్తున్న పౌర సేవలు,దస్త్రాల నిర్వహణ, సుపరిపాలన, ఘనవ్యర్థాల నిర్వహణ,పాలనలో పారదర్శకత, ధ్రువపత్రాల జారీ, జవాబుదారీతనం, ఇలా 32 అంశాల్లో అత్యుత్తమ పనితీరు కనబర్చిన పంచాయితీలకు ఐఎస్‌వో సర్టిఫికెట్ జారీ చేయనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం పంచాయితీల్లో పలు సంస్కరణలు తీసుకొస్తోంది. పాలనలో పారదర్శకత, మెరుగైన పౌరసేవల కోసం చర్యలుతీసుకుంటోంది. తాజాగా 'స్వర్ణ పంచాయితీ' పోర్టల్‌ను ప్రారంభించింది. కేరళ స్ఫూర్తితో ఐఎస్‌వో గుర్తింపునకు ఇప్పుడు అడుగులు వేస్తోంది. ఆ రాష్ట్రంలో 941 పంచాయితీలు,152 బ్లాకులు, ఐఎస్‌వో గుర్తింపు సాధించాయి. దేశంలో ఈ ఘనత సాధించిన తొలి రాష్ట్ర ంగా కేరళ గుర్తింపు సాధించింది. ఏపీలో 19 జిల్లాల్లో ఎంపిక చేసిన 25 పంచాయితీల్లో ఆరు నెలల క్రిందట కసరత్తు ప్రారంభమైంది. కేరళకు చెందిన స్థానిక పరిపాలనా వ్యవహారాల సంస్థ సేవలను రాష్ట్ర ప్రభుత్వం వినియోగించు కుంటోంది. ఐఎస్‌వో ప్రమాణాల మేరకు 80% పనులు పూర్తయ్యాయని అధికారులు చెబుతున్నారు. నెలాఖరులోగా మిగతా 20% పూర్తి చేసి ఐఎస్‌వో గుర్తింపునకు నివేదించనున్నారు. దీనిపై సంబంధిత ప్రతినిధుల బృందం క్షేత్రస్థాయిలో పరిశీలించి ప్రజాభిప్రాయాన్ని తెలుసుకుని సర్టిఫికెట్ కోసం సిఫార్సు చేయనుంది. సేవలు,నాణ్యత,భద్రత,ఉత్పత్తులు,సామర్థ్యం వంటి అంశాల్లో తగిన ప్రమాణాలు పాటించే సంస్థలకు జెనీవా ప్రధాన కేంద్రంగా పనిచేస్తున్న అంతర్జాతీయ ప్రమాణాల సంస్థ (ఐఎస్‌వో) సర్టిఫికెట్ జారీ చేస్తుంది. ఇది ప్రభుత్వేతర సంస్థ.160కి పైగా సభ్య దేశాలు ఈ సంస్థకు అనుబంధంగా ఉన్నాయి. ఇందులో భారత్ కూడా ఒకటి. ప్రపంచంలోని వివిధ ప్రభుత్వ ప్రైవేటు సంస్థలు,పరిశ్రమలు ఐఎస్‌వో గుర్తింపు పొంది నిర్ధేశిత గడువు తర్వాత మళ్లీ పునరుద్దరించుకుంటాయి. వీటిలో స్థానిక ప్రభుత్వాలూ ఉన్నాయి. దేశంలో మహారాష్ట్ర,ఒడిశా ప్రభుత్వాలు కూడా తమ రాష్ట్రాల్లో పంచాయితీలకు ఐఎస్‌వో గుర్తింపునకు తాజాగా ధరఖాస్తు చేశాయి. రాష్ట్రంలో ఎంపిక చేసిన పంచాయితీల్లో పాలనలో విప్తవాత్మక మార్పులు తీసుకురాను న్నారు. ప్రతి కార్యాలయంలోనూ ఫ్రంట్ ఆఫీస్‌ప్రజలు తమ సమస్యలు ఒకరి తర్వాత మరొకరు సిబ్బందికి తెలిపేలా టోకెన్ సిస్టంసమస్యలు పరిష్కరించాక ప్రజల మొబైల్ ఫోన్లకు సమాచారం అందుబాటులోకి అనేక దశాబ్దాల క్రితం నాటి దస్త్రాలుప్రజలు అడిగిన సమాచారం నిర్ధేశిత గడువులోపు ఆచరించే ఏర్పాట్లు మరణ, జనన ధ్రువీకరణ,ఇతర సర్టిఫికెట్లు గంటల వ్యవధిలో జారీ చేసే వ్యవస్థ 500 రకాలైన సేవలు ప్రజలకు తెలిసేలా సమాచార బోర్డుల ప్రదర్శనసేవలపై ఏటా అంతర్గత ఆడిట్‌నైపుణ్యాలు పెంచుకునేలా సిబ్బందికి ఎప్పటికప్పుడు శిక్షణ కార్యాలయాలకు వచ్చేవారికోసం ఆవరణలో మరుగుదొడ్లు, మంచినీటి సదుపాయం, చంటిపిల్లల సంరక్షణ కేంద్రాలు ఉంటాయి. పంచాయి తీలను నూతన సంస్కరణలతో పట్టణ పాలకసంస్థలకు దీటుగా రూపొందిస్తు న్నామని డిసిఎం పవన్ వెల్లడించిన నేపథ్యంలో ఐఎస్‌ఓ గుర్తింపుకు కృషి జరుగుతుంది.

## మరో ఎన్‌కౌంటర్

### మహిళ సహా ముగ్గురు మావోయిస్టుల మృతి

2లో

## ప్రభుత్వ ఆర్థిక విధానాలు అస్తవ్యస్తం

### పెరిగిపోతున్న అప్పులు: మాజీ సిఎం జగన్



**విజయవాడ,నవంబరు 16,ప్రభాతవార్తప్రతినిధి:** సిఎం చంద్రబాబు నేతృత్వంలోని టిడిపి కూటమి ప్రభుత్వంపై వైఎస్సార్సీ అధినేత జగన్ తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. రాష్ట్ర ఆర్థిక నిర్వహణ పూర్తిగా విఫలమైందని, ఆదాయం పడిపోతూ అప్పులు భారీగా పెరుగుతున్నాయని ఆరోపించారు. కాగ్ విడుదల చేసిన తాజా గణాంకాలను ఉటంకిస్తూ ఆయన ట్వీట్ చేశారు.

"2025-26 ఆర్థిక సంవత్సరం మొదటి అర్ధభాగానికి కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) విడుదల చేసిన గణాంకాలు రాష్ట్ర ప్రభుత్వ ఆదాయంలో చాలా నిరుత్సాహకరమైన వృద్ధిని వెల్లడిస్తున్నాయి. తాము అధికారంలోకి వస్తే ప్రభుత్వ ఆదాయాలు వేగంగా పెరుగు >>2



రైలు నుంచి కిందపడిన బొమ్మను పరిశీలిస్తున్న ఎఎస్పీ, సిబ్బంది

## వీడని సతీష్ మృతి మిస్టరీ

### బొమ్మతో బండారం బయటపడేనా?

### మొన్న రెండు, నిన్న మూడు బొమ్మలతో పరిశీలన

**తాడిపత్రి, నవంబరు16, ప్రభాతవార్త:** టిటిడి మాజీ ఎవిఎస్‌వో సతీష్‌కుమార్ హత్యకేసు బండారాన్ని బొమ్మతో బయటపెట్టాలనే పోలీసుల ప్రయత్నం ఏ మేరకు ఫలించనుందోననే విషయం ఆసక్తికరంగా మారింది. శుక్రవారం సతీష్ మృతి సంఘటన చోటు చేసుకున్నప్పటి నుంచి రాష్ట్రంలో ఈ కేసు దర్యాప్తుపై సర్వత్రా ఉత్కంఠత నెలకొంది. శనివారం రెండు బొమ్మలు ఒక రైలు..ఆదివారం మూడు బొమ్మలు..ఒక రైలును వినియోగించిన పోలీసులు సీన్ రీకన్‌స్ట్రక్షన్ ద్వారా సతీష్ మృతిపై నెలకొన్న సందిగ్ధతకు తెరదించాలని ప్రయత్నిస్తున్నారు. జిఆర్‌పి నుంచి కేసును బదిలీ చేసుకున్న తాడిపత్రి పోలీసులు ఆదివారం సంఘటనా స్థలంలో మరోసారి సీన్ రీకన్‌స్ట్రక్షన్‌ను ప్రయోగించి ఘటన జరిగిన తీరును అంచనా వేసే ప్రయత్నం చేశారు. ఎఎస్పీ రోహిత్‌కుమార్ చౌదరి నేతృత్వంలోని పోలీసు బృందం చెన్నై ఎగ్మోర్ ఎక్స్‌ప్రెస్‌లో మూడు బొమ్మలను ఉంచి వివిధ రకాలుగా ప్రయోగ పూర్వక చర్యలు చేపట్టారు. సతీష్‌కుమార్ ఎత్తుకు, బరువుకు సమానంగా ఉండేలా మూడు బొమ్మలను తయారుచేసి నిలబడిన స్థితిలో తోస్తే ఎలా..కూర్చున్న స్థితిలో ప్రమాదవ >>2




17-11pg2exHMNWJQER 2_17-11pg2exHMNWJQER.qxd 17/Nov/25 12:07 AM Page 1





ఆదివారం సూరత్‌లో బుల్లెట్ రైలు స్టేషన్ నిర్మాణం పరిశీలిస్తున్న ప్రధాని మోదీ

# పదిరోజుల వైకుంఠద్వార దర్శనాలపై తర్జనభర్జనలు

## ఆఫ్‌లైన్/ఆన్‌లైన్ విధానం టోకెన్లు విడుదలపై కుదరని ఏకాభిప్రాయం!, రేపు టిటిడి బోర్డు సమావేశంలో నిర్ణయం

**ప్రభాతవార్తప్రతినిధి-తిరుమల:** కలియుగవైకుంఠం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ధనుర్మాసంలో మోక్షమార్గం వైకుంఠద్వారం పదిరోజులు తెరిచి దర్శనాలు చేయించే విధానంపై తర్జనభర్జనలు జరుగుతున్నాయి. గతంలోలాగా వైకుంఠ ఏకాదశి,వైకుంఠ ద్వాదశి(డిసెంబర్ 30,31తేదీలు)పర్వదినాలతోపాటు మరో ఎనిమిదిరోజులు ఆన్‌లైన్‌లో 300 రూపాయలు ప్రత్యేక ప్రవేశ దర్శన టిక్కెట్లు విడుదల చేయడంతోపాటు ఉచిత సర్వదర్శన టైమ్‌స్లాట్(ఎస్ఎస్‌డి)టోకెన్లు జారీ విధానంపై టిటిడి బోర్డు, అధికారులు ఒక నిర్ణయం తీసుకోలేకపోతున్నారు. ఇప్పటికే ఈ అంశంపై బోర్డు, టిటిడి అధికారులు పలు దఫాలుగా సమాలోచనలు చేసినా సామాన్యభక్తులను దృష్టిలో ఉంచుకుని ఎలా అమలుచేస్తే సాఫీగా ప్రశాంతంగా తిరుమలకు చేరుకుని వివాదాలు లేని వైకుంఠద్వార దర్శనం చేసుకోగలరనే విషయంపై అధికారులు తలలుపట్టుకుంటున్నారు. పదిరోజులకు సంబంధించి తిరుపతిలో ప్రత్యేక కౌంటర్లు అదనంగా ఏర్పాటుచేసి పూర్తిగా ఆఫ్‌లైన్‌లో ఒకేసారి టోకెన్లు జారీచేయాలా లేక ఆయా రోజులకు సంబంధించి ఏరోజుకామందురోజు టోకెన్లు జారీచేయడం వల్ల సమస్య పరిష్కారం చేయగలమా అనే చర్చ సాగిస్తున్నారు.పదిరోజులకు సంబంధించి టోకెన్లు పూర్తిఅయ్యేవరకు జారీ చేసినా భక్తులు తిరుమలకు చేరుకోవడంపై ఆందోళనలు రేకెత్తుతున్నాయనేది ప్రధాన సమస్య.అంతేగాక గతంలోలాగా టోకెన్లు,టిక్కెట్లు లేని భక్తులను తిరుమలకు అనుమతించాలా?లేదా అనేది కూడా ఇప్పుడు గందరగోళంగా మారింది. ఎలాంటి టోకెన్లు, టిక్కెట్లు లేకుండా అనుమతించినా భక్తుల రద్దీని నియంత్రించడం కూడా చాలా కష్టంగా మారుతుందనేది అధికారులు మల్లగుల్లాలు పడతున్నారు. డిసెంబర్‌నెల అందునా వర్షాలు కురిసినా, చలిగాలులు,మంచు ప్రభావం తీవ్రంగానే ఉంటుంది. దీనివల్ల తిరుమలకు భక్తులను అనుమతించినా రెండులక్షలమందిచేరితే పరిస్థితులు తారుమారయ్యే ప్రమాదం లేకపోలేదనేది టిటిడి అధికారులను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. గత ఏడాది పదిరోజుల వైకుంఠద్వార దర్శనాలు దాదాపు 7.80లక్షల మంది భక్తులకు కల్పించారు. ఇందుకోసం 2024 డిసెంబర్‌నెలలోనే పదిరోజుల ముందే ఆన్‌లైన్‌లో (పది రోజులకు) 1.59లక్షల ఎస్ఇడి టిక్కెట్లు విడుదల చేయడం జరిగింది. అలాగే ఆఫ్‌లైన్‌లో (పది రోజులకు) 4లక్షల టైమ్‌స్లాట్ (ఎస్ఎస్‌డి)ఉచిత టోకెన్లు జారీ చేశారు. వీరేగాక వైకుంఠ ఏకాదశి,ద్వాదశి ఘడియల్లో వివిఐపిలు, విఐపిలు స్వయంగా వచ్చి వైకుంఠద్వారంలో శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకుంటారు. ఈ నేపథ్యంలో గత జనవరిలో చోటుచేసుకున్న ఘటనలతో టిటిడి అధికారులు ఇప్పుడు తీసుకోనున్న నిర్ణయంపై దర్శనాలు అనుమతించే విధానం మంగళవారం (రేపు)తిరుమలలో జరగనున్న టిటిడి బోర్డు ఛైర్మన్ బిఆర్‌నాయుడు, ఇఒ అనిల్‌కుమార్‌సింఘాల్, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి ఆధ్వర్యంలోసమావేశంలో ఖరారుకానుంది.

**గత ఘటనలతోనే అధికారుల్లో భయం!:**

సాక్షాత్తు మహావిష్ణువే కలియుగంలో ఏడుకొండలవేంకటేశ్వరస్వామిగా భక్తులను కటాక్షిస్తున్నారని, ఆలయంలోపల వైకుంఠద్వార దర్శనం చేసుకుంటే పాపాలనుండి విముక్తికలిగి మోక్షం లభిస్తుందని కోట్లాదిమంది భక్తుల విశ్వాసం. ఇదే ప్రగాఢనమ్మకంతో దేశంలోని అనేక రాష్ట్రాల నుండి భక్తులు భారీగా తరలివస్తారు. 2019వరకు ధనుర్మాసంలో వైకుంఠ ఏకాదశి,ద్వాదశి ఘడియల్లోమాత్రమే వైకుంఠద్వారాలను తెరచి భక్తులకు మోక్షం కల్పించేవారు. ఆ రెండురోజులు అన్ని ప్రత్యేక దర్శనాలను ,ఆర్జితసేవలు రద్దుచేసి గతంలో ఎలాంటి టోకెన్‌లేని భక్తులు కూడా తిరుమలకు చేరుకుని సాఫీగా ప్రశాంతంగా 1.80లక్షలమంది వరకు వైకుంఠద్వార దర్శనం చేసుకునేవారు. అందుకు తగ్గట్లు అప్పటి టిటిడి బోర్డు, ఉన్నతాధికారులు ప్రణాళికలు అమలుచేసి పటిష్టంగా ఏర్పాట్లుతో ముగించేవారు. అయితే 2020వ సంవత్సరం నుండి గత వైసిపి ప్రభుత్వంలోని టిటిడి బోర్డు పెద్దలు పదిరోజులు వైకుంఠద్వారాలను తెరచి భక్తులను అనుమతించేలా చూస్తున్నారు. దీనివల్ల భారీగా భక్తులు తరలివస్తుండటంతో నియంత్రించలేక విఫలమై ఈ ఏడాది జనవరి 8వతేదీ తిరుపతిలో దురదృష్టవశాత్తు ప్రత్యేక కౌంటర్ల వద్ద తోపులాట తొక్కిసలాట ఘటనలు చోటుచేసుకుని భక్తులు ప్రాణాలు కోల్పోయారు.

దీంతో ఇప్పుడు మళ్ళీ పదిరోజులు వైకుంఠ ద్వారదర్శనాలు కొనసాగిస్తున్నా భక్తులను అనుమతించే విషయంపై కీలక నిర్ణయాలు ఓ కొలిక్కిరాలేదు. పూర్తిగా ఆఫ్‌లైన్‌లో జారీచేస్తే ఎలా అమలుచేయాలి?పూర్తిగా ఆన్‌లైన్‌లో జారీచేస్తే సామాన్యభక్తులు, తిరుపతి స్థానికులు అందుకోలేక మరింత గందరగోళం నెలకొనే పరిస్థితులు తలెత్తుతాయి. ఇవన్నీ భేరీజు వేసుకుని డిసెంబర్ 30,31తేదీల్లో పవిత్రమైన వైకుంఠ ఏకాదశి, ద్వాదశి ఘడియల టోకెన్లు స్థానికులకు మాత్రమే కేటాయిస్తే మంచిదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. 2026 జనవరి 1వతేదీకి సంబంధించి అన్ని దర్శనాలు రద్దుచేసినా పూర్తిగా మిగిలిన వైకుంఠ దర్శనాలు ఆన్‌లైన్ చేయడం వల్ల కొంతవరకు భక్తుల రద్దీని నియంత్రించే అవకాశం ఉంటుందనేది అధికారుల ఆలోచన. మరీ రేపు మంగళవారం జరగనున్న టిటిడి బోర్డు సమావేశంలో ఎలాంటి నిర్ణయం వెలువడనుందనేది భక్తుల్లో ఉత్కంఠగా మారింది.

**మోక్షమార్గం దర్శనాలకు అనూహ్యరద్దీ:**

తిరుమల ఆలయంలో వైకుంఠద్వారాలను ప్రతి ఏడాది ధనుర్మాసంలో వచ్చే వైకుంఠ ఏకాదశి, ద్వాదశి ఘడియల్లో తెరచి దర్శనభాగ్యం కల్పిస్తారు. ఈ రోజుల్లో వైకుంఠద్వారంలో ఇష్టదైవాన్ని దర్శించుకుంటే కష్టాలు తొలగిపోయి మోక్షం కలుగుతుందని భక్తుల విశ్వాసం. తిరుమల ఆలయంలో స్వామివారికి కుడివైపున వైకుంఠద్వారం ఉంది. వైకుంఠ ఏకాదశి,ద్వాదశి ఘడియల్లోమాత్రమే 48గంటలు పాటు (రెండు రోజులు మాత్రమే)తెరచివుంచి భక్తులకు దర్శనం కల్పించేవారు. ఆ తరువాత భక్తుల నుండి వస్తున్న అనూహ్యస్పందనతో శ్రీరంగంలోని రంగనాథస్వామి ఆలయం తరహాలో తిరుమల ఆలయంలోనూ పదిరోజుల వైకుంఠద్వార దర్శనాలు తెరచి సామాన్యభక్తులకు మోక్షం కల్పిస్తున్నారు. సామాన్యభక్తులు, ధనవంతులు టిక్కెట్లు,టోకెన్లు లేకుండా నేరుగా ఆ పది రోజులు తిరుమలకు వస్తే ఆలయంలోనికి ప్రవేశించే అవకాశం కూడా ఉండదు.

# మన విధానం 'నేషన్ ఫస్ట్'

>> ఉండవని.. ఓటు హక్కు విషయంలో పేదధనిక, లింగ బేధాలు లేని దేశంగా భారత దేశం ఉందని చెప్పారు. ఓటు విషయంలో ఇంకా పేదరికాన్ని తారతమ్యాలు ఉన్నాయని.. ఈ అంతరాలను తగ్గించేలా అందరూ ఆలోచన చేయాలని సిఎం సూచించారు. అందరికీ సమాన అవకాశాలు కలిగేలా చేయగలిగితే.. ఈ తారతమ్యాలు మాయం అవుతాయని అభిప్రాయపడ్డారు. అందుకే నేను 'హెల్తీ, వెల్తీ, హ్యాపీ సొసైటీ రూపకల్పనకు ప్రణాళికలు రచిస్తున్నామని.. దీనికి అందరి నుంచి సహకారాన్ని కోరుతున్నా' అని సిఎం చెప్పారు. ప్రధాని మోడీకూడా వసుధైక కుటుంబం గురించే మాట్లాడతారని.. ప్రపంచంలో ఉన్న ప్రతి ఒక్కర్నీ మన కుటుంబ సభ్యులుగానే భావించాలని.. వసుధైక కుటుంబం భావన ఉండాలని వివరించారు. అలాగే ఒకరి సార్వభౌధికారంలో వేరే వారు జోక్యం చేసుకోకుండా పరిధులు దాటకుండా ఉండాలని.. ఈ విధానాన్ని ఎవరైనా అతిక్రమిస్తే చూస్తూ ఊరుకోవాల్సిన అవసరం కూడా లేదని స్పష్టం చేశారు. ఆపరేషన్ సింధూర్ ద్వారా కేంద్ర ప్రభుత్వం ఇదే విషయాన్ని స్పష్టంగా చెప్పిందని సిఎం చంద్రబాబు అన్నారు.

**గవాయ్ లాంటి వ్యక్తులు గైడ్ చేస్తూనే ఉండాలి**

జస్టిస్ బిఆర్ గవాయ్ సిజెఐ స్థాయిలో ఉన్నా... చాలా సింపుల్‌గా ఉంటారని ముఖ్యమంత్రి చెప్పారు. సమానవత్వానికి సిజెఐ ఎక్కువ ప్రాధాన్యత ఇస్తారని... చాలా మంచి మనస్సున్న వ్యక్తి జస్టిస్ గవాయ్ అనే చెప్పారు. తన విధి నిర్వహణలో గవాయ్ మంచి తీర్పులు ఇచ్చారని... ప్రజలంతా ఆ తీర్పులు గుర్తు పెట్టుకునేలా ఉంటాయని చంద్రబాబు అన్నారు. గవాయ్ లాంటి వారు దేశాభివృద్ధి కోసం నిరంతరం గైడ్ చేస్తూనే ఉండాలని కోరారు. "అమరావతిలో ఈ సదస్సు జరుగుతోంది... సిజెఐ బిఆర్ గవాయ్ కూడా మహారాష్ట్రలోని అమరావతి నుంచే వచ్చారని సిఎం వివరించారు. తాను సిఎంగా, సిజెఐగా గవాయ్, ఎపి హైకోర్టు సిజెగా ధీరజ్ సింగ్ ఠాకూర్ ఉన్నామని... మేం మా విధులను రాజ్యాంగబద్ధంగా నిర్వహిస్తున్నాం" అని ముఖ్యమంత్రి అన్నారు.

**దేశంలో పెద్దఎత్తున మానవ వనరులు**

ఆర్థిక సంస్కరణల తర్వాత ప్రజల ఆలోచనా విధానం మారిందని.. పరిస్థితులు కూడా మారుతున్నాయని సిఎం చంద్రబాబు చెప్పారు. చాలా దేశాలు యువత లేక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని.. కానీ భారత దేశానికి అలాంటి సమస్య లేదు. మన దేశంలో పెద్ద ఎత్తున మానవ వనరులు అందుబాటులో ఉన్నాయని.. భారత దేశాన్ని ప్రపంచంలో నెంబర్1 స్థానంలో నిలిపేలా ప్రధాని పనిచేస్తున్నారని చెప్పారు. 2047 నాటికి ప్రపంచ వ్యాప్తంగా భారతీయులు ప్రభావం చూపే స్థాయికి చేరుకుంటారని ముఖ్యమంత్రి చెప్పారు. ఉమ్మడి రాష్ట్రంలో ఉన్నప్పుడు ఐటిని ప్రమోట్ చేయాలనే విధాన నిర్ణయం తీసుకున్నామని... హైదరాబాద్ అభివృద్ధే దానికి నిదర్శనమని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు.

# రాజ్యాంగంవల్లే హక్కులపై కోర్టుల్లో అప్పీలు

>> చారు.ఈ సందర్భంగా సాంఘిక ఆర్థిక న్యాయ సాధన కోసం రాజ్యాంగంలో ఆదేశిక సూత్రాలను పొందుపరిచారని జస్టిస్ బీఆర్ గవాయ్ అన్నారు. రాజ్యాంగాన్ని రాజ్యాంగ సభకు అప్పగిస్తూ డాక్టర్ బిఆర్ అంబేడ్కర్ చేసిన ప్రసంగం ప్రతి న్యాయవాదికి కంఠోపాఠం కావాలని చెప్పారు. రాజ్యాంగాన్ని అంబేడ్కర్ ఓ స్థిర పత్రంగా చూడలేదని కాలానుగుణంగా మార్పులు అవసరమనే భావించారని తెలిపారు. కొన్ని అంశాల్లో సవరణ సులభమని కాని మరి కొన్ని అంశాల్లో చాలా కఠినమని జస్టిస్ గవాయ్ చెప్పారు. రాజ్యాంగం అమల్లోకి వచ్చిన మరుసటి యేడాదే రిజర్వేషన్ల అంశంపై మొదటి సవరణ చేసుకున్నామని స్పష్టం చేశారు. ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా గతేడాది ఏడుగురు జడ్జిల సుప్రీంకోర్టు ధర్మాసనం తీర్పు ఇచ్చిందని జస్టిస్ గవాయ్ వివరించారు. ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లలోనూ క్రీమీలేయర్ విధానం ఉండాలన్నది నా అభిప్రాయమని పని ప్రదేశాల్లో మహిళలపై వివక్ష ఉండరాదని విశాఖ కేసు తీర్పులో సర్వోన్నత న్యాయస్థానం తీర్పు ఇచ్చిందని తెలిపారు. మరో 2 రోజుల్లో పదవీ విరమణ చేయబోతున్నాను. సిజెఐగా ఇది నా చివరి కార్యక్రమం. నా స్వస్థలం మహారాష్ట్రలోని అమరావతి. సిజెఐగా నా చివరి కార్యక్రమంలో కూడా అమరావతిలోనే కావడం విశేషం. ప్రాథమిక హక్కులకు భంగం కలిగితే కోర్టులను ఆశ్రయించే హక్కు రాజ్యాంగం ఇచ్చింది. సాంఘిక, ఆర్థిక న్యాయ సాధన కోసం రాజ్యాంగంలో ఆదేశిక సూత్రాలను పొందుపరిచారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా తనను నియమించిన తర్వాత తొలిసారిగా ఎపి రాజధాని అమరావతికి వచ్చానని చెప్పుకొచ్చారు. ఈ కార్యక్రమంలోనఎపి హైకోర్టు సిజె జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ మాట్లాడుతూ భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చిన తర్వాత చాలా మైలురాళ్లు అధిగమించాం అన్నారు ప్రజలందరికీ సమాన అవకాశాలు, జవాబుదారీతనం ఉండేలా రాజ్యాంగాన్ని రూపొందించారన్నారు.పేదలకు, వెనుకబడిన వర్గాలు, మైనార్టీలకు వివిధ అంశాల్లో రక్షణ కల్పించేలా రాజ్యాంగాన్ని రాశారు. ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లు కల్పించారు.జాతీయ సమగ్రత, ప్రజాస్వామ్య భావన, సోషల్ ఇంటిగ్రేషన్ వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని రాజ్యాంగ రచన చేశారు.రాజ్యాంగానికి 1951 సంవత్సరంలో తొలి సవరణ చేస్తే.. ఇప్పటి వరకు 106 రాజ్యాంగ సవరణలు జరిగాయి అన్నారు. మహిళా రిజర్వేషన్ల చట్టం, వర్క్ ప్లేసులో మహిళలపై వేధింపుల నిరోధక చట్టం, లోకాయుక్త చట్టం ఇలాంటి వాటి ద్వారా న్యాయ వ్యవస్థలో మార్పులు వచ్చాయి అన్నారు.

# రాష్ట్రంలో నేడు, రేపు భారీ వర్ష సూచన

**విజయవాడ,నవంబరు 16,ప్రభాతవార్తప్రతినిధి:** నైరుతి బంగాళాఖాతంలో శ్రీలంక తీరంలో శనివారం అల్పపీడనం ఏర్పడింది. దీనికి అనుబంధంగా ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. వీటి ప్రభావంతో బుధవారం వరకూ తమిళనాడు,కేరళ రాష్ట్రాల్లో,సోమ,మంగళ వారాల్లో ఏపీ లోని పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశముందని భారత వాతావరణ విభాగం తెలిపింది. సోమవారం శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు,అన్నమయ్య,చిత్తూరు,తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు,ప్రకాశం,వైఎస్సార్ కడప జిల్లాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని విపత్తుల నిర్వహణ సంస్థ పేర్కొంది.మంగళవారం నెల్లూరు,తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడ ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు,ప్రకాశం, శ్రీసత్యసాయి వైఎస్సార్ కడప, అన్నమయ్య,చిత్తూరు జిల్లాల్లో అక్కడక్కడ తేలిక పాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురవచ్చని అంచనా వేస్తోంది. అల్పపీడనం ప్రభావంతో కోస్తా తీరం వెంబడి గంటకు 35 కి.మీ.వేగంతో గాలులు వీచే అవకాశ ముందని అమరావతి వాతావరణ కేంద్రం పేర్కొంది. సోమవారం వరకు మత్స్యకారులు వేటకు వెళ్ళరాదని సూచించింది.ఈ నెల 21 నాటికి ఆగ్నేయ బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడే అవకాశముంది. దీని ప్రభావంతో 24 నుంచి 27 వరకు రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు. మరో పక్క రాష్ట్రంలో చలి తీవ్రతం కొనసాగుతోంది. తెలంగాణ,ఒడిశా సరిహద్దుల్లోని పలు ప్రాంతాల్లో కనిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 3 నుంచి 4 డిగ్రీలు తక్కువగా నమోదవుతున్నాయి. అల్లూరి సీతారామరాజు జిల్లా అరకులో అత్యల్పంగా 7 డిగ్రీలు నమోదైంది. అదే జిల్లా లోని డుంబ్రిగుడలో 7.6,హుకుంపేట, ముంచంగిపుట్టులో 8.9 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

## వారం - వర్జ్యం

17-11-2025, సోమవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
ఆశ్వయుజ మాసం, దక్షిణాయణం
శరదృతువు, కృష్ణపక్షం
త్రయోదశి పూర్తి
చిత్త తె.5.01, విశాఖ కార్తె
వర్జ్యం : ఉ.11.19-1.07
దు.ము.12.16-1.01, 2) మ.2.32- 3.17
శుభసమయం : ఉ.9.15 - 9.55
రాహుకాలం - ఉ.7.30-9.00

## వార్తాఫలం

**మేషం :** పలుకుబడి కలిగినవ్యక్తులతో పరిచయాలు లాభిస్తాయి. సోదరుల నుండి వచ్చిన వార్తవల్ల ఆనందం కలుగుతుంది.

**వృషభం:** కొన్ని అవకాశాలు అనుకోకుండా లభిస్తాయి. ప్రయాణాలు. సంతానం ఉద్యోగ యత్నాలు ఫలిస్తాయి. శ్రమ ఫలించే సమయం.

**మిథునం:** ముఖ్య వ్యవహారాలలో తొందర పాటు వద్దు. వ్యాపారాలు అనుకూలంగా వుంటాయి.పట్టుదలతో ముందుకు సాగుతారు.

**కర్కాటకం:** పాత మిత్రులను కలుసుకొని ఆనందంగా గడుపుతారు. నూతన వ్యాపారాలు ప్రారంభిస్తారు.వస్తు,వస్త్రాలాభాలు పొందుతారు.

**సింహం:** కార్యాలయములో ఉన్నతాధికారుల మెప్పును పొందే శుభసూచనలు ఉన్నాయి.పోటీ పరీక్షలలో, ఇంటర్వ్యూలలో విజయం సాధిస్తారు.

**కన్య :** నూతన వ్యవహారాలలో విజయం సాధిస్తారు. శ్రమకు తగ్గిన ఫలితం దక్కుతుంది. గృహనిర్మాణ ఆలోచనలు కలిసి వస్తాయి.

**తుల :** మాటల చాతుర్యంతో ఎదుటి వారిని ఆకట్టుకుని పనులు పూర్తి చేస్తారు.బాంధవ్యాల యత్నాలు అనుకూలిస్తాయి.

**వృశ్చికం:** శత్రువులు సైతం మిత్రులుగా మారి సాయం అందిస్తారు. సంగీత సాహిత్యా విషయాలలో ఆసక్తి చూపుతారు.వస్త్రలాభాలు.

**ధనుస్సు:** బంధువులను కలిసి ఆనందంగా గడుపుతారు. దీర్ఘకాలిక సమస్యల నుండి బయట పడుతారు.వృత్తివ్యాపారాలు విస్తరిస్తారు.

**మకరం:** రాజకీయ, కళారంగాల వారికి విదేశీ యోగం. వాహన సౌఖ్యం. గృహ నిర్మాణ ఆలోచనలు కలిసి వస్తాయి.

**కుంభం:** మరిన్ని లాభాలు కోసం అదనపు మార్గాలను అన్వేషిస్తారు, అంతంత ఫలితాలు సాధిస్తారు.కోర్టుకేసుల నుండి బయట పడతారు.

**మీనం :** స్త్రీలలో విభేదాలు ఏర్పడే సూచనలు ఉన్నాయి. జాగ్రత్తలు పాటించండి. ఆస్తి వివాదాలు తీరి లబ్ధి పొందుతారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# రూ. 50 లక్షల కోట్ల పెట్టుబడులు ఐదేళ్లలో రాక

>> గెలిపించారు. 60 దేశాలకు చెందిన ప్రతినిధులు భాగస్వామ్య సదస్సుకు హాజరయ్యారని తెలిపారు. 700కు పైగా బీటూబీ సమావేశాలు జరిగాయన్నారు. మొత్తంగా రూ.13లక్షల కోట్లకుపైగా పెట్టుబడులు వచ్చాయని తెలిపారు. సిఐఐ సదస్సు కేవలం పెట్టుబడుల కోసం మాత్రమే కాదని అన్నారు. మేధోపరమైన చర్చలకు, వినూత్న ఆవిష్కరణల్ని పంచుకునేందుకు కూడా దేశవిదేశాల నుంచి పారిశ్రామిక వేత్తల్ని, మేధావుల్ని, విదేశీ ప్రతినిధుల్నికూడా ఆహ్వానించాంఅన్నారు. 500 మంది విద్యార్థు లను సెలెక్ట్ చేసి ఈ సిఐఐ సదస్సుకు ఆహ్వానించాం అన్నారు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా వారిని మార్చాలన్నదే మా ఉద్దేశం అన్నారు.ఆస్పిరెంట్ ఇండస్ట్రియలిస్ట్స్‌గా వారిని మార్చే అవకాశం ఉంటుంది అన్నారు. ఆర్టీఐహెచ్ ద్వారా వినూత్న ఆవిష్కరణల్ని,ఆలోచనల్ని, స్టార్టప్‌లను పెంచాలన్నదే ప్రభుత్వ లక్ష్యం యువత, విద్యార్థుల ఆలోచనలకు ఇదో వేదిక కావాలన్నదే మా ఉద్దేశం అన్నారు.

ఇదోక వినూత్నమైన పారిశ్రామిక అభివృద్ధి మోడల్. కేంద్ర ప్రభుత్వం క్వాంటం మిషన్ తీసుకువచ్చింది. క్వాంటం వ్యాలీని ఏర్పాటు చేసి దానిని మనం అందిపుచ్చుకున్నాం అన్నారు. 2026 జనవరికి క్వాంటం వ్యాలీ ఏర్పాటు అవుతుంది అన్నారు. గ్రీన్ ఎనర్జీ లేకపోతే గూగుల్ డేటా సెంటర్ రాదు. ఎకోసిస్టం తయారైంది కాబట్టే మరో నాలుగైదు డేటా సెంటర్లు ఏర్పాటుకు ముందుకు వచ్చారు. ఈజ్ నుంచి గేర్ మార్చి స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ వచ్చాం. సింగపూర్‌ను ఒప్పించి మళ్లీ రాష్ట్రానికి తీసుకువచ్చాం. అమరావతిలో భాగస్వామి కాకపోయినా ఇతర ప్రాంతాల్లో కలిసి పనిచేసేలా ఒప్పించాం. బ్రాండ్ దెబ్బతింది. రూ.21 లక్షల కోట్ల పెట్టుబడులు ఈ 18 నెలల్లో వచ్చాయి. 17 లక్షల ఉద్యోగాలుకూడా వస్తాయి. పరిశ్రమలకు విశ్వాసం కల్పించాలనే దేశంలో ఎక్కడా లేనట్టుగా ఎస్క్రో ఖాతాను ఏర్పాటు చేస్తున్నాం. దీనికి సావరిన్ పవర్‌ను ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నాం. గుడ్ గవర్నెన్స్, డెవలప్మెంట్‌పై శ్రద్ధపెడతామని ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటున్నాం. 10 ఏళ్లలో 1 ట్రిలియన్ డాలర్లు కోటిమందికి ఉద్యోగాలు తీసుకురావటమే లక్ష్యంగా పనిచేస్తున్నాం అన్నారు. శ్రీకాకుళంనుంచి కుప్పం వరకూ అభివృద్ధి వికేంద్రీకరణ జరుగుతోంది. ఎంఎస్ఎంఇ పార్కులు, పోర్టులు, రైలు,రోడ్ లాంటి ఇన్ ఫ్రా అభివృద్ధి చేస్తున్నాం. ఈస్ట్ టు వెస్ట్ లాజిస్టిక్స్ డెవలప్ చేయాలని నిర్ణయించాం అన్నారు. డీప్ టెక్నాలజీలను అభివృద్ధి చేయాలని నిర్ణయించాం, ఏరోస్పేస్, క్వాంటం, ఏఐ, 12శాతం కాదు. సీరియస్ ఇన్వెస్టర్స్‌తోనే మాట్లాడి ఒప్పందాలు చేసుకున్నాం అన్నారు. 8.8 లక్షల కోట్ల పెట్టుబడులు కేబినెట్‌లో క్లియర్ చేసి ఉత్పాదన దశకు వస్తాం అన్నారు. 20 లక్షల కోట్ల పెట్టుబడులు మెటీరియలైజ్ అవుతుంది అన్నారు. ప్రతీ 15 రోజులకూ ఎస్ఐపీసీ, ఎస్ఐపిబి సమావేశాలు, విజన్ డాక్యుమెంట్, 25 పాలసీలు పెట్టుకుని ప్రోత్సహిస్తున్నాం అన్నారు. గతంలో బకాయిలు పెట్టిన పరిశ్రమలకూ ఇన్సెంటివ్‌లు ఇచ్చాం. బ్రాండ్ ను రివైజ్ చేసుకుని స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానంలో వెళ్తున్నాం అన్నారు. 3 ఏళ్లలోనే ఈ పెట్టుబడులు అన్నీ ఉత్పత్తి దశకు వస్తాయి, గ్రూప్ ఆఫ్ మినిస్టర్స్ దీనిని పర్యవేక్షిస్తుంది. అన్నారు పరిశ్రమలు వచ్చేందుకు ఇప్పటికే మౌలిక సదుపాయాలు ఉన్నాయి. అలాగే వాటికి ప్రోత్సాహకాలు ఇచ్చేందుకు కూడా మా వద్ద విధానం ఉంది. మొత్తంగా ఎకనామిక్ యాక్టివిటీ రివైవ్ అవుతుంది. జీఎస్టీ ఆదాయం కూడా వస్తుంది అన్నారు.



ఆదివారం పాట్నాలోని హరిమందిర్‌ను కుటుంబ సభ్యులతో కలిసి సందర్శించిన కేంద్ర మంత్రి పాశ్వాన్

# నితీశ్ ప్రమాణోత్సవానికి హాజరుకానున్న ప్రధాని



**పాట్నా, నవంబరు 16:** బీహార్‌లో కొత్త ప్రభుత్వ ఏర్పాటుకు చకచకా ఏర్పాట్లు జరుగుతున్నాయి. రాజధాని పాట్నా గాంధీ మైదానంలో ప్రమాణస్వీకారానికి సన్నాహాలు చేస్తున్నారు. ముఖ్యమంత్రి ఎవరనేది కూడా లాంఛనంగా ప్రకటించాల్సి ఉంది. అయితే పాశ్వాన్, మాంఝీ వంటి నేతలు నితీష్‌కు మద్దతుగా నిలుస్తున్నారు. సిఎం పదవిలో నితీష్ కొనసాగుతారని చెబుతున్నారు. ఈ నెల 19 లేదా 20 తేదీన నితీష్ కుమార్ ముఖ్యమంత్రిగా, ఎన్‌డిఎ కూటమి మంత్రులు ప్రమాణ స్వీకారం చేయనున్నారు. కొత్త ప్రభుత్వ ప్రమాణస్వీకార కార్యక్రమానికి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, పలువురు కేంద్రమంత్రులు, ఎన్‌డిఎ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు హాజరుకానున్నారు. ఇక కొత్త ప్రభుత్వ ఏర్పాటులో భాగంగా సోమవారంనాడు నితీష్ మంత్రివర్గం సమావేశమై త్వరలో గడువు తీరనున్న అసెంబ్లీని రద్దు చేసేందుకు నిర్ణయం తీసుకుంటుంది. అనంతరం నితీష్ తన రాజీనామాను గవర్నర్ ఆరిఫ్ మహమ్మద్ ఖాన్‌కు సమర్పిస్తారు. కొత్త ప్రభుత్వం ఏర్పాటుకు ఆహ్వానించాల్సిందిగా గవర్నర్‌కు విజ్ఞప్తి చేస్తారు. ఆ తరువాత ఎన్‌డిఎ ఎమ్మెల్యేలతో సమావేశమై శాసనసభా పక్ష నేతగా నితీష్ కుమార్‌ను ఎన్నుకోనున్నారు. 243 అసెంబ్లీ స్థానాల్లో ఎన్‌డిఎ కూటమి 202 స్థానాల్లో విజయం సాధించింది. ప్రతిపక్ష మహాగఠ్ బంధన్ 35 స్థానాలకు పరిమితమైంది. దీంతో ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేసేందుకు సిద్ధమవుతోంది. ఈ నెల 19 లేదా 20న బీహార్ సిఎంగా నితీష్‌కుమార్ ప్రమాణస్వీకారం చేయనున్నారు. కేబినెట్ కూర్పు కోసం కూటమిని ప్రతి పార్టీకి ఆరుగురు ఎమ్మెల్యేలకు ఒక మంత్రి పదవి చొప్పున నితీష్ కుమార్ ప్రభుత్వం చోటు కల్పించనున్నట్లు సమాచారం. కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో జెడియు వర్కింగ్ ప్రెసిడెంట్ సంజయ్‌కుమార్ సహా ఎన్‌డిఎ కూటమి సీనియర్ నేతల సమావేశంలో ఈ మేరకు అవగాహన కుదిరినట్లు తెలుస్తోంది. ఈ ఫార్ములా ప్రకారం, బిజెపికి కేబినెట్‌లో సింహభాగం వాటా దక్కనుంది. కమలం పార్టీకి 15 నుంచి 16 మంత్రి పదవులు లభించే అవకాశముంది. జెడియుకు 14, ఎల్‌జెపికి 3 మంత్రిపదవులు దక్కే అవకాశం కనిపిస్తోంది. జితిన్ రామ్ మాంఝీ సారథ్యంలోని హెచ్ఏఎం (సెక్యులర్)కు ఒకటి, రాజ్యసభ ఎంపీ ఉపేంద్ర కుష్వాహ ఆర్ఎల్ఎంకు ఒక మంత్రి పదవి దక్కే వీలుంది. కాగా, కొత్త ప్రభుత్వ ప్రమాణస్వీకారం తేదీని ఇంకా ప్రకటించనప్పటికీ సాధ్యమైనంత త్వరలోనే ఉండవచ్చని తెలుస్తోంది.

# మరో ఎన్‌కౌంటర్

**జమ్మికుంట/హుజురాబాద్, ప్రభాత వార్త:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 2024 జనవరి నుండి ఆపరేషన్ ఖగార్ పేరిట నక్సల్స్ ప్రభావిత ప్రాంతాలలో దండకార్యాలను జల్లెడ పడుతుండడంతో 23 మాసాలుగా ఇప్పటికే వందలాది మంది నక్సల్స్ మృతి చెందగా సుమారు 300 మంది ఛత్తీస్‌గఢ్, మహరాష్ట్ర, తెలంగాణ ప్రభుత్వాల ముందు లొంగిపోయిన విధితమే. ఇదిలా ఉండగా ఆదివారం ఉదయం ఛత్తీస్‌గఢ్ సుకుమా జిల్లా పోలీసులకు అందిన పక్కా సమాచారం మేరకు జెజ్జి, చింతగుఫా పోలీస్ స్టేషన్ పరిధిలోని తుమల్‌పాడ్ అటవీ ప్రాంతంలో జిల్లా రిజర్వుడ్ భద్రతా బలగాలకు నక్సలైట్లకు జరిగిన ఎదురుకాల్పుల్లో ఇద్దరు దళ కమాండర్స్‌తో పాటు ముగ్గురు మరణించినట్లు సుకుమా జిల్లా పోలీస్ సూపరిండెంట్ కిరణ్ ఛవాన్ ఆదివారం సాయంత్రం విలేకరులకు వెల్లడించారు. మృతి చెందిన వారిలో మద్వీదేవా అలియాస్ జెనివి లిథియా కమాండర్‌తో పాటు మరో మావోయిస్టు మహిళా కోంఠ ఏరియా కమిటి దళ కమాండర్ పోడియం గంగి ఇద్దరి దళ కమాండర్ లు మృతి చెందగా మరో మహిళ నక్సలైట్ కిస్తారామ్ ఏరియా కమిటి దళ సభ్యురాలు సోడి గంగి మృతి చెందినట్లు ఎస్‌పి కిరణ్ ఛవాన్ వెల్లడించారు. మృతి చెందిన మావోయిస్టు ఒక్కొక్కరిపై 5 లక్షల రూపాయల చొప్పున రివార్డు ఉన్నట్లు వెల్లడించారు. ఎన్‌కౌంటర్ జరిగిన స్థలంలో మృతి చెందిన మావోయిస్టుల నుండి కిట్ బ్యాగ్‌లు, 303 రైఫిల్స్, బిజిఎల్ లాంఛర్లు, ఇతర ఆయుధాలు, మందుగుండు సామాగ్రి స్వాధీనం చేసుకున్నట్లు పోలీస్ అధికారులు వెల్లడించారు.

**ఇప్పటికైనా లొంగిపోండ: బస్తర్ రేంజ్ ఐజి సుందర్‌రాజన్**

ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రంలో దండకారణ్యంలో మిగిలిపోయిన మావోయిస్టులు ఇప్పటికైనా ఆయుధాలతో వచ్చి ప్రభుత్వానికి లొంగిపోతే ప్రభుత్వం ఉపాధి కల్పిస్తుందని, సంక్షేమ కార్యక్రమాలు అందిస్తుందని, ఆయుధాలు దించి లొంగిపోవాలని బస్తర్ రేంజ్ ఇన్స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ సుందర్‌రాజన్ మావోయిస్టులకు విజ్ఞప్తి చేశారు. ఛత్తీస్‌ఘడ్‌లోని బస్తర్ దండకారణ్యంలో మావోయిస్టుల ఏరివేత కార్యక్రమం చివరి దశలో ఉందని, ఆ ఉన్న కొద్దిమంది అయిన ప్రభుత్వానికి లొంగిపోతే ప్రాణాలు దక్కుతాయని, హింసను విడిచిపెడితే పునరావాసం కల్పిస్తామని సుందర్‌రాజన్ విజ్ఞప్తి చేశారు.

# ప్రభుత్వ ఆర్థిక విధానాలు అస్తవ్యస్తం

>> తాయని టిడిపి, జనసేన ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలకు ఇది పూర్తి విరుద్ధంగా ఉంది. టిడిపి కూటమి ప్రభుత్వ ఆర్థిక పనితీరును ఒక్కసారి పరిశీలిస్తే వారి వైఫల్యాలు స్పష్టంగా కనిపిస్తాయి. 2025- 26 ఆర్థిక సంవత్సరం మొదటి ఆరు నెలల్లో, రాష్ట్ర సొంత పన్నుల ఆదాయంలో గతేడాదితో పోలిస్తే కేవలం 7.03 శాతం వృద్ధి మాత్రమే నమోదైంది. జీఎస్టీ, అమ్మకం పన్ను వసూళ్ల వినియోగానికి అద్దం పడతాయి. ఈ రెండింటి ద్వారా వచ్చిన మొత్తం ఆదాయం గతేడాది ఇదే సమయంతో పోలిస్తే కేవలం 2.85 శాతం మాత్రమే పెరిగింది.

గత రెండేళ్ల (2023-24 నుంచి 2025- 26) మొదటి అర్ధభాగంలో రాష్ట్ర సొంత పన్ను రాబడి వార్షిక వృద్ధి రేటు కేవలం 2.75 శాతంగా ఉంది. ఇది మరింత ఆందోళన కలిగించే విషయం. అయినా, రాష్ట్రం అద్భుతమైన ఆర్థిక వృద్ధిని సాధిస్తోందని చంద్రబాబు ప్రజలను నమ్మించే ప్రయత్నం చేస్తున్నారు. 2024 -25లో 12.02 శాతం, 2025-26లో 17.1 శాతం జీఎస్‌డీపీ వృద్ధిని లక్ష్యంగా పెట్టుకున్నామని వారు చెబుతున్నారు. ఈ స్థాయిలో వృద్ధి ఉంటే పన్నుల రాబడి కూడా 12 శాతం నుంచి 15 శాతం వరకు పెరగాలి. కానీ వాస్తవ వృద్ధి కేవలం 2.75 శాతం మాత్రమే. మరోవైపు, మూలధన వ్యయం గత రెండేళ్లలో మైనస్ 16 శాతం వార్షిక వృద్ధి రేటుతో క్షీణించడం మరింత బాధాకరమని జగన్ అన్నారు.

# వీడని సతీష్ మృతి మిస్టరీ

>> జారి పడితే ఎలా..ఆత్మహత్యకు పాల్పడితే ఎలా అనే విషయాలను బొమ్మల ద్వారా పరిశీలనాత్మకంగా ప్రయోగించి చూశారు. మొదటి బొమ్మను నిల్చోబెట్టి కిందకు పడవేయగా అది 61 అడుగుల దూరంలోనూ, రెండవ బొమ్మ నిలబడి ప్రమాదవశాత్తు కాలు జారేలా చేయగా అది 88 అడుగుల దూరంలోనూ, మూడవ బొమ్మ కూర్చొని జారి పడగా 46 అడుగుల దూరంలో పడిపోవడాన్ని పోలీసులు డ్రోన్ కెమెరాతో చిత్రీకరించారు. ఈ కేసు విచారణలో కొన్ని కీలక అంశాలు వెలుగులోకి వచ్చినట్లు తెలిసింది. రైల్వే టిసి, ఇతర సిబ్బందిని విచారించిన పోలీసులు డ్రోన్ కెమెరాల సాయంతో సీన్ రీకన్‌స్ట్రక్షన్ దృశ్యాలను చిత్రీకరించారు. సతీష్‌కుమార్ అనుమానాస్పద మృతి కేసులో ఆదివారం మరో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఆయన ప్రయాణించిన రైలులో లభించిన లగేజి సంచిపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఆయన 29వ సీటు రిజర్వు చేసుకుంటే 11వ సీటులోకి సదరు లగేజి ఎలా వచ్చిందనే అంశం అనుమానాస్పదంగా మారింది. తిరుపతి ఆర్పీఎఫ్ కార్యాలయంలో ఉదయం 8 గంటలకు అప్పగించారని చెబుతున్న ఈ లగేజి బ్యాగును ఎవరు అప్పగించారనే అంశం కూడా సందిగ్ధంగా మారింది. ఆదివారం సుమారు 5 గంటల పాటు కొనసాగిన సీన్ రీకన్‌స్ట్రక్షన్ ద్వారా కేసు దర్యాప్తు వేగవంతం కానుందని పోలీసు వర్గాలు తెలిపాయి. టిటిడి పరకామణి కేసులో కీలక అధికారిగా ఉన్న పూర్వ ఎవిఎస్‌వో సతీష్ కుమార్ అనుమానాస్పద మృతి కేసును ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్నట్లు, సాధ్యమైనంత త్వరగా కేసు దర్యాప్తును పూర్తి చేసి దోషులను కోర్టుముందర పెట్టాలనే పట్టుదలతో ఉన్నట్లు పోలీసులు పేర్కొంటున్నారు. శవపరీక్ష నివేదిక రావాల్సి ఉండటం, సతీష్ చరవాణితో పాటు ఆయన భార్య చరవాణిని కూడా సాంకేతిక సాయంతో పరిశీలించిన వివరాలు బహిర్గతం కావాల్సి ఉండటంతో ఇప్పుడే పూర్తి వివరాలు వెల్లడించలేమని పోలీసులు చెబుతున్నారు.



ఆదివారం రామోజీ ఎక్స్‌లెన్స్ జాతీయ అవార్డు ప్రదానోత్సవంలో పాల్గొన్న ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్, తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, సిఎం చంద్రబాబు, తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి, కేంద్రమంత్రులు కిషన్ రెడ్డి, రామ్మోహన్‌నాయుడు, సుప్రీం మాజీ సిజె ఎన్.వి.రమణ తదితరులు

# ఆలోచనలను సంస్థలుగా మార్చిన రామోజీ

## రామోజీ ఎక్స్‌లెన్స్ జాతీయ అవార్డుల ప్రదానోత్సవంలో ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్

## నమ్మిన సిద్ధాంతాలను వదలని అక్షరయోధుడు: సిఎం చంద్రబాబు

### రామోజీ పేరే ఒక బ్రాండ్: తెలంగాణ సిఎం రేవంత్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,నవంబరు16:** తెలుగు రాష్ట్రాల మధ్య సమస్యల పరిష్కారానికి సహకరిస్తామని, సమస్యల పరిష్కారం కోసం సీఎంలు ముందుకు వస్తే సహకరిస్తామని ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ పేర్కొన్నారు. తెలుగు రాష్ట్రాల సమస్యలు కుటుంబంలోని సమస్యల్లాంటివే, కలసి కూర్చుని మాట్లాడుకుంటే సమస్యలు పరిష్కారం అవుతాయని పేర్కొన్నారు. రామోజీ ఓ కుగ్రామం నుంచి వచ్చి ఎంతో గొప్పస్థాయికి చేరారని, ఆలోచనలను సంస్థలుగా తీర్చిదిద్దిన వ్యక్తి రామోజీరావు ఆయన పేర్కొన్నారు. రామోజీ గ్రూప్ సంస్థల వ్యవస్థాపకులు రామోజీరావు పేరిట ఏర్పాటు చేసిన రామోజీ ఎక్స్‌లెన్స్ జాతీయ అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమం ఆదివారం సాయంత్రం రామోజీ ఫిల్మ్ సిటీలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ మాట్లాడుతూ దేశంలో ఎక్కడ విపత్తు వచ్చినా రామోజీరావు స్పందించేవారని చెప్పారు. రామోజీరావు దానం చేస్తూ ప్రజలనూ భాగస్వాములను చేసేవారని,సమాజానికి స్ఫూర్తిగా నిలవడమే ఓ గొప్ప విజయమన్నారు. మీడియా సంస్థలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ప్రజా ఉద్యమాలను నిర్మించాలని సూచించారు. ఏఐ యుగంలో ఫేక్ న్యూస్‌ను కనిపెట్టడం సవాలుగా మారిందని పేర్కొన్నారు. నమ్మిన సిద్ధాంతం కోసం, విలువల కోసం చివరి శ్వాస వరకు పోరాడిన రామోజీరావు సేవలు చిరస్మరణీయమని ఏపీ సిఎం నారా చంద్రబాబునాయుడు పేర్కొన్నారు. ఆయన ఏర్పాటు చేసిన వ్యవస్థలు శాశ్వతంగా నిలిచి ఉంటాయని, ఆయన స్ఫూర్తి ఎందరికో ఆదర్శమని అన్నారు. అక్షర యోధుడు రామోజీరావుకు నా ఘన నివాళులు. ఆయన సేవలను ఎప్పటికీ మర్చిపోలేం. సమాజంలో ప్రతిపక్షం బలహీనంగా ఉన్నప్పుడు, ఆ లోటును రామోజీరావే తన పత్రిక ద్వారా భర్తీ చేసేవారు. ప్రభుత్వాల లోపాలను ఎత్తిచూపుతూ, ప్రజల గొంతుకగా నిలిచారు. ఆయన కేవలం ఒక మీడియా అధినేత మాత్రమే కాదు, సామాజిక బాధ్యత కలిగిన ఒక మార్గదర్శకుడు అని ప్రశంసించారు. నమ్మిన సిద్ధాంతం కోసం దేనినైనా వదులుకునే తత్వం ఆయనది. ఈనాడు పత్రికను కేవలం వార్తలకే పరిమితం చేయకుండా, ప్రజలను సమాజ సేవలో భాగస్వాములను చేశారు. ఎలాంటి ప్రకృతి వైపరీత్యాలు సంభవించినా, తన సొంత డబ్బుతో బాధితులను ఆదుకోవడానికి ముందుకు వచ్చేవారు. రామోజీరావుకు తెలుగు భాషపై ఉన్న మమకారాన్ని ఈ సందర్భంగా చంద్రబాబు ప్రత్యేకంగా ప్రస్తావించారు. రామోజీరావు స్ఫూర్తితో, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా తెలుగు భాష పరిరక్షణకు, దాని అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఒక సీఎంగా తెలుగు భాషను కాపాడేందుకు ఏమైనా చేస్తాను.రామోజీరావు ఆశయాలను ముందుకు తీసుకెళ్లే బాధ్యత మనందరిపైనా ఉంది అని ఆయన స్పష్టం చేశారు. రామోజీరావు సంస్థలు తెలంగాణకు గర్వకారణంగా నిలిచాయని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. రామోజీ ఫిల్మ్‌సిటీ రెండువేల ఎకరాల కళాఖండమని, తెలంగాణకు నాలుగో అద్భుతంగా ఆర్ఎఫ్‌సీ నిలిచిందని కొనియాడారు. పొంతన లేని వివిధ రంగాల్లో ఒకే వ్యక్తి రాణించడం చాలా కష్టం. రామోజీరావు రోజుకు 18 గంటలు శ్రమించే వారు. రామోజీ ఏ రంగంలో అడుగుపెట్టినా తనదైన ముద్ర వేసేవారు. రామోజీ అవార్డు గొప్ప గౌరవంగా భవిష్యత్‌లో నిలుస్తుంది. రామోజీరావు స్ఫూర్తిని భావితరాలకు మనం అందించాలి. పదవుల గురించి సీఎంలకు తాను సిఫార్సు చేయనని నిక్కచ్చిగా చెప్పేవారు. రామోజీరావు పేరు కాదు, ఒక బ్రాండ్. రామోజీ గ్రూపు సంస్థలకు మా సంపూర్ణ సహకారం ఉంటుంది. రామోజీ అవార్డుల ఆలోచన చేసిన కుటుంబసభ్యులను అభినందిస్తున్నా.రామోజీ స్ఫూర్తిని ముందుకు తీసుకెళ్లాలని కుటుంబసభ్యులు భావించడం ప్రశంసనీయం అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు, మాజీ భారత ప్రధానన్యాయమూర్తి జస్టిస్ ఎన్.వి.రమణ, కేంద్రమంత్రులు జి. కిషన్‌రెడ్డి, బండిసంజయ్, రామ్మోహన్‌నాయుడు, తెలంగాణ ఐటి,పరిశ్రమల శాఖ డి. శ్రీధర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.జర్నలిజం, గ్రామీణాభివృద్ధి, మానవ సేవ, సైన్స్ అండ్ టెక్నాలజీ, కళసంస్కృతి, మహిళా సాధికారత, యూత్ ఐకాన్ వంటి ఏడు విభాగాల్లో ఈరామోజీ ఎక్సలెన్స్ అవార్డులను ప్రదానం చేశారు. రామోజీరావు ఆదర్శాలను,ఆయన సేవా దృక్పథాన్ని ప్రజల్లోకి మరింత బలంగా తీసుకెళ్లాలనే లక్ష్యంతో ఈ అవార్డులను ఏర్పాటు చేసినట్లు రామోజీ గ్రూప్ సంస్థల ప్రతినిధులు తెలిపారు.




మీట్ ది ప్రెస్‌లో సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా

# ప్రశ్నార్థకంగా మారిన ఎన్నికల సంఘం

## సమగ్ర సంస్కరణలు అవసరం

### సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా

**విజయవాడ,నవంబరు 16,ప్రభాతవార్తప్రతినిధి:** రాజ్యాంగబద్ధ ఎన్నికల సంఘం పాత్ర ప్రశ్నార్థకమైందని సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి. రాజా అన్నారు.ఈ నేపథ్యంలో సమగ్ర ఎన్నికల సంస్కరణలు ఆవశ్యమని ఉద్ఘాటించారు. బీహార్‌లో ఎన్నికల సంఘం ఎన్నో ఇబ్బందులను కల్పించిందన్నారు. తల్లిదండ్రుల పుట్టిన తేదీ సర్టిఫికెట్లను సమర్పించాలంటూ తీవ్రమైన ఆంక్షలు విధించిందని, తద్వారా అత్యధిక సంఖ్యాకులు ఓటర్లుగా నమోదు చేసుకోలేకపోయారని ఆయన పేర్కొన్నారు. బీహార్ ఎన్నికల ఫలితాలు ఇండియా కూటమి పార్టీలను నిరాశపరిచాయన్నారు. దీనిపై వారు నిశితంగా ఆత్మ పరిశీలన చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో ఆదివారం విజయవాడ ప్రెస్ క్లబ్ నిర్వహించిన మీట్ ది ప్రెస్ కార్యక్రమంలో డి. రాజా మాట్లాడారు. దేశం నేడు సంక్లిష్ట పరిస్థితుల్లో ముందుకు సాగుతున్నదని, భారత రాజ్యాంగం, ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడ్డాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. స్వాతంత్ర ఉద్యమంలో ఎన్నడూ పాల్గొనని ఆర్ఎస్ఎస్ తపాలా బిళ్ళను, ఆ సంస్థ శత వార్షికోత్సవం సందర్భంగా, కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం విడుదల చేయడం విడ్డూరంగా ఉందని ఆయన విమర్శించారు. విజయవాడ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు జయరాజ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే విజయవాడ నగర యూనిట్ అధ్యక్ష, కార్యదర్శులు చావా రవి, దారం వెంకటేశ్వరరావు ఐజేయూ సభ్యులు షేక్ బాబు. సామ్నా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ .రమణారెడ్డి, ప్రెస్ క్లబ్ కార్యదర్శి దాసరి నాగరాజు పాల్గొన్నారు.

## అమరావతి భూ సమీకరణ పంచాయతీల్లో

# రూ.1305 కోట్లతో మౌలిక సదుపాయాలు

### అమరావతిలో 423 కోట్లతో ఫ్లడ్ పంపింగ్ స్టేషన్లు

### టెండర్లు పిలిచిన అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్

**రాజంపేట, నవంబరు 16 ప్రభాతవార్త:** రాజధాని అమరావతికి భూములు ఇచ్చిన రైతులకు శుభవార్త. సి ఆర్ డి ఏ భూములు సమీకరించిన గ్రామపంచాయతీలో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ఎట్టకేలకు అమరావతి డెవలప్మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ చర్యలకు కార్యాచరణ సిద్ధం చేసింది. రోడ్లు, డ్రైనేజీ, అవెన్యూ ప్లాంటేషన్లు, విద్యుత్, మొత్తం మౌలిక సదుపాయాలు కల్పించేందుకు, నిర్మాణం పనులు చేపట్టేందుకు ఎడిసిఎల్ ఆదివారం టెండర్ ప్రక్రియ ప్రారంభించింది. రాజధాని జోన్ 8 తో పాటు రాజధాని అమరావతి చుట్టుపక్కల జోన్ల అభివృద్ధికి కూడా యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసింది. ప్రభుత్వం భూములు సమీకరించిన కృష్ణాయ పాలెం, వెంకట పాలెం, పెనుమాక, ఉండవల్లి గ్రామపంచాయతీలలో 1305.39 కోట్ల వ్యయంతో అభివృద్ధి పనులను చేపట్టనుంది. అలాగే రాజధానికి వరద ముప్పు లేకుండా 8400 క్యూసెక్కుల వరద నీటిని పంపింగ్ చేసేందుకు ప్రపంచ బ్యాంక్, ఏసియన్ డెవలప్మెంట్ బ్యాంక్ నిధులతో 423.64 కోట్లతో పనులు చేపట్టేందుకు టెండర్లు పిలిచింది. అలాగే రాజధాని నీటి అవసరాలు తీర్చేందుకు కొండవీటి వాగు, గుంటూరు ఛానల్ లకు రెగ్యులేటర్ కూడా ఏర్పాటు చేస్తారు. రెండు లైన్ల బ్రిడ్జిని కూడా నిర్మించేందుకు 55 కోట్లతో టెండర్లు పిలిచారు.1784 కోట్ల ఏంతో పిలిచిన టెండర్లను పనులు చేపట్టడంతో పాటు పూర్తయిన తర్వాత రెండేళ్ల పాటు నిర్వహణ చేసేందుకు కూడా టెండర్లలో షరతు విధించారు. టెండర్ల ప్రక్రియ సోమవారం ప్రారంభమవుతుంది. టెండర్లలో పాల్గొనేందుకు డిసెంబర్ 9 చివరి గడువుగా నిర్ణయించారు. ఇదే రోజున టెక్నికల్ బిడ్ కూడా ఓపెన్ చేసి నిర్మాణ సంస్థను ఖరారు చేస్తారు.

# 'సిట్'వద్దకు రాలేను, విచారణకు హైదరాబాద్‌కు రండి

### మాజీ టిటిడి ఛైర్మన్ సుబ్బారెడ్డి సమాచారం



**తిరుమల,నవంబరు 16ప్రభాతవార్తప్రతినిధి:** దేవుని చెంత సేవకుడిగా సేవలందించిన టిటిడి బోర్డు మాజీ ఛైర్మన్ వైవి సుబ్బారెడ్డిని కల్తీనెయ్యి కేసులో విచారణ చేయడానికి సిబిఐ సిట్ అధికారులు సిద్ధమయ్యారు. ఇందుకోసం ఇప్పటికే ఆయనకు సిట్ అధికారులు గత వారమే నోటీసులు జారీచేశారు. అయితే కొన్ని అనివార్యకారణాల వల్ల 13వతేదీ ,16వతేదీ విచారణకు రాలేనని 17వతేదీ తరువాత వస్తానని సమాచారం ఇచ్చారు. ఇప్పుడు ఆయన ఏకంగా శనివారం సిట్ అధికారులకు తనదైన శైలిలో సమాచారం ఇవ్వడం, తనకు ఆరోగ్యం సరిగా లేనందున తిరుపతిలోని సిట్ తాత్కాలిక కార్యాలయానికి రాలేనని, వీలైతే 20వతేదీ హైదరాబాద్‌లోని తన ఇంటికి వచ్చి విచారణ చేయవచ్చని తెలిపారు. దీంతో సిట్ అధికారులు ఇప్పుడు అనుసరించే వ్యూహం ఏంటనేది కల్తీనెయ్యి ఘటనలో ఆరోపణలు ఎదుర్కొంటున్న, రిమాండ్‌లో ఉన్న నిందితుల్లో మరింత ఆందోళన నెలకొందని తెలుస్తోంది. ఇదేసమయంలో వైవి మాజీ పిఎ చిన్నఅప్పన్నను కస్టడీకి తీసుకునే అంశంపై నేడు నెల్లూరు ఏసిబి కోర్టు తీర్పువెలువరించనుంది. ఒకవేళ కోర్టు కస్టడీకి ఇస్తే అప్పన్నను కూడా హైదరాబాద్‌కు తీసుకెళ్ళి సుబ్బారెడ్డితో బాటు కలిపి విచారణ చేస్తారా అనే అనుమానాలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికే 20వతేదీ విచారణకు వస్తున్నామని సిట్ కూడా ఆయనకు సమాచారం అందించడం విశేషం.

# రాజకీయాల్లోకి మోహనరంగా కుమార్తె ఆశా కిరణ్



**విజయవాడ, నవంబరు 16,ప్రభాతవార్త ప్రతినిధి:** దివంగత వంగవీటి మోహనరంగా కుమార్తె వంగవీటి ఆశా కిరణ్ రాజకీయాల్లో క్రియాశీలకం కానున్నారు. విజయవాడలో ఆదివారం తన తండ్రి వంగవీటి మోహన రంగా విగ్రహానికి నివాళులు అర్పించిన అనంతరం కుమార్తె వంగవీటి ఆశా కిరణ్ రాజకీయాల్లోకి వస్తున్నట్లు ప్రకటించారు. రాధా రంగా మిత్రా మండలి ఆహ్వానం మేరకు తాను ఇకపై కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటానని తెలిపారు. తన తండ్రి రంగా ఆశయాలను నెరవేర్చడానికి కృషి చేస్తాననిఆమె పేర్కొన్నారు. కొంతకాలంగా ప్రజా జీవితానికి దూరంగా ఉన్న ఆశా కిరణ్, ఇకపై తన ప్రయాణం పూర్తిగా బహిరంగంగా, ప్రజల మధ్య ఉంటుందని స్పష్టం చేశారు. ప్రజలకు ఏ కష్టం వచ్చినా తాను అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ప్రస్తుతం రాధా రంగా మిత్రా మండలి మధ్య ఉన్న గ్యాప్‌ను పూరించడానికి తాను వస్తున్నానని ఆశా కిరణ్ స్పష్టం చేశారు.

# అప్పు చెల్లించమని అడిగినందుకు హత్య

### కర్ణాటక పోలీసుల అదుపులో నిందితులు



కర్ణాటక పోలీసుల అదుపులో ఉన్న నిందితులు

**కుప్పం, నవంబర్ 16 ప్రభాతవార్త:** తన పెదనాన్న కుమారుడి వద్ద నుంచి తీసుకున్న నలభై లక్షల అప్పు తిరిగి చెల్లించక ఎగ్గొట్టాలని భావించి వరుసకు అన్న అయ్యే వ్యక్తి మరొకరి సాయంతో తమ్ముడినే హతమార్చి ఇంటి కింద గుంతలో పూడ్చి పెట్టిన సంఘటన చిత్తూరు జిల్లా కుప్పంలో ఆదివారం వెలుగుచూసింది. ఈసంఘటనకు సంబంధించి కర్ణాటక, ఆంధ్ర పోలీసు అధికారులు తెలిపిన మేరకు కుప్పం పట్టణంకుచెందిన కమలనాథ్ కుమారుడు శ్రీనాథ్ తనకుటుంబంతో బెంగళూరులో స్థిరపడ్డాడు. శ్రీనాథ్ చిన్నాన్న అయిన బలరాం కుమారుడు ప్రభాకర్ డికెపల్లిలో ఉంటూ 2013లో ఓ హత్య కేసులో నిందితుడుగా ఉండడంతో జైలుకు వెళ్లి 2022లో బయటకు వచ్చాడు. ఇతని భార్యది ముద్దనపల్లి. కాగా ప్రభాకర్ బెంగళూరులో శ్రీనాథ్ ఇంట్లో జరిగిన ఓ శుభకార్యానికి హాజరయ్యాడన్నారు. ఈ నేపథ్యంలో శ్రీనాథ్ బాగానే ఉండడంతో అతన్ని వ్యాపారం చేద్దాం అరవై లక్షలు పెట్టుబడి పెట్టు ఏడాది లోపే లాభాలు వస్తాయని చెప్పి ప్రభాకర్ శ్రీనాథ్ నుంచి దాదాపు 40లక్షలు అప్పు తీసుకున్నాడు. అయితే ఏడాది అనంతరం ఎలాంటి లాభం ఇవ్వలేదు, శ్రీనాథ్ ఈవిషయంపై ప్రభాకర్‌ను అడిగాడు. చివరకు తన పాప ఆరోగ్యం బాగా లేదని పది లక్షలు కావాలని అడిగితే గత అక్టోబర్ నెలలో కుప్పానికి రమ్మని ఇస్తానని చెప్పి పని కాలేదని ప్రభాకర్ పంపేశాడన్నారు. కుప్పం వచ్చే సమయంలో ఫోన్ తేవద్దని సైతం సూచించాడన్నారు. ఈ నేపథ్యంలో గత నెల 27న శ్రీనాథ్ కుప్పంకు వచ్చాడని అప్పటికే శ్రీనాథ్‌ను హతమార్చాలని నిర్ణయించుకున్న ప్రభాకర్ తనకు జైలులో పరిచయం అయిన చిత్తూరుకు చెందిన మరో నిందితుడ్ని కుప్పంకు పిలిపించుకున్నాడు. స్థానిక కాలనీలో అసంపూర్తిగా ఉన్న ఇంటిని ఇదివరకే కొనుగోలు చేసిన ప్రభాకర్ శ్రీనాథ్‌కు అక్కడకు తీసుకెళ్లి మత్తుమాత్రలు ఇచ్చాడన్నారు. అనంతరం అతని తలపై సమ్మెటతో కొట్టి హతమార్చి ఇంట్లో తీసిన గుంతలో పూడ్చిపెట్టి వెళ్లిపోయారన్నారు. తన భర్త కుప్పం వెళ్లి రాకపోగా శ్రీనాథ్ భార్య అక్టోబర్ 31న కుప్పంకు వచ్చి ప్రభాకర్‌ను అడిగితే తనకు తెలియదని పేర్కొన్నాడన్నారు. దీంతో శ్రీనాథ్ భార్య బెంగళూరు అత్తిబెలే స్టేషన్‌లో తన భర్త కన్పించడం లేదని ఫిర్యాదు చేసింది. దీంతో కర్ణాటక పోలీసులు ప్రభాకర్‌ను అదుపులో తీసుకుని విచారించగా బుకాయించాడన్నారు. చివరకు అతని సెల్‌ఫోన్ కాల్ డేటా పరిశీలించి చిత్తూరుకు చెందిన వ్యక్తిని అదుపులో తీసుకుని విచారించగా హత్య కేసు వెలుగుచూసిందన్నారు. ఆదివారం కర్ణాటక పోలీసులు నిందితులను తీసుకువచ్చి కాలనీలోని ప్రభాకర్ ఇంటినుంచి శ్రీనాథ్ మృతదేహాన్ని వెలికితీశారు. కర్ణాటక పోలీసులకు అర్బన్ సిఐ శంకరయ్య, ఎస్సై బాబులు సహకరించారు.

# రెండోఘాట్‌లో కారు బోల్తా



**తిరుమల,నవంబరు 16ప్రభాతవార్తప్రతినిధి:** తిరుపతినుండి తిరుమలకు వస్తున్న తమిళనాడు భక్తుల కారు రెండోఘాట్‌లో లింకురోడ్డుకు కిలోమీటరు ముందే అదుపు తప్పి బోల్తాపడింది. కారు అతివేగంగా నడపడంతో మలుపువద్ద అదుపుచేయలేక రైలింగ్‌ను ఢీ కొని బోల్తాపడింది. ఈ ప్రమాదంలో తమిళనాడు భక్తులకు స్వల్పగాయాలయ్యాయి. ఐదేళ్ళచిన్నారి ఉన్నట్లు పోలీసులుతెలిపారు. అదేమార్గంలో వెళుతున్న ప్రయాణీకులు కారులోంచి భక్తులను బయటకు తీసి వాహనంలో తిరుమల అశ్వనీఆస్పత్రికి తరలించారు. ఈ సంఘటనతో తిరుమలకు వచ్చే వాహనాలు కిలోమీటరు ఆగిపోయాయి. సమాచారం అందుకున్న విజిలెన్స్ అధికారులు, తిరుమల ట్రాఫిక్ పోలీసులు అక్కడకు చేరుకుని కారును తొలగించారు. ఆ తరువాత వాహనాలు తిరుమలకు కదిలాయి. తిరుమల పోలీసులు కేసు నమోదు చేశారు.

# చరిత్రాత్మక వేదికగా విశాఖ సిఐఐ సమ్మిట్

**సచివాలయం,నవంబర్ 16,ప్రభాతవార్త :** ఆంధ్రప్రదేశ్ పెట్టుబడుల దిశను మార్చిన చారిత్రాత్మక వేదికగా విశాఖ సీఐఐ సమ్మిట్ నిలిచిందని రాష్ట్ర రెవెన్యూ,రిజిస్ట్రేషన్, స్టాంప్స్ శాఖమంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు.ఏపిని పెట్టుబడుల హబ్‌గా మార్చేందుకు సీఎం చంద్రబాబు,మంత్రి నారా లోకేష్ ఎంతగా శ్రమిస్తున్నారో నిరూపించింది.పెట్టుబడులకు ఏపిని గమ్యస్థానంగా నిలపడంలో చంద్రబాబు మరోసారి తన సత్తాను చాటారు.మూడు ప్రాంతాలకు సమానంగా పెట్టుబడులు వచ్చేలా మంత్రి లోకేష్ ప్రత్యేకంగా కంపెనీలను గైడ్ చేశారు.మిగిలిన రాష్ట్రాలకు భిన్నంగా స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ను అనుసరిస్తుండడంతో ఏపికి పరిశ్రమలు క్యూ కట్టాయి. మొత్తం రూ.13లక్షల కోట్ల పెట్టుబడులు,16లక్షల ఉద్యోగాలు రావడం ఏపి పట్ల పెట్టుబడిదారుల నమ్మకానికి ప్రత్యక్ష సాక్ష్యం.అన్ని కీలక శాఖలతో ఒప్పందాలు కుదరడం పెట్టుబడులను సమగ్రంగా ఆకర్షిస్తున్న ప్రభుత్వ నైపుణ్యాన్ని చూపింది. మూడు ప్రాంతాలకు సమానంగా పెట్టుబడులు వెళ్ళడం..ప్రభుత్వ వికేంద్రీకరణ నిబద్ధతకు నిదర్శనం.సీఐఐ సదస్సులో ప్రతి జిల్లాకి ప్రాధాన్యత లభించింది.ప్రతి జిల్లాకు పరిశ్రమలను తీసుకొచ్చారు.సదస్సు విశాఖలో జరిగినా పెట్టుబడులు మాత్రం యావత్ రాష్ట్రానికి విస్తరించేలా సిఎం చంద్రబాబు,మంత్రి లోకేష్ కృషి చేశారు.

# రామోజీ అవార్డు గ్రహీతలు వీరే..

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్, నవంబర్16:** రామోజీరావు అవార్డు గ్రహీతలకు రూ.5లక్షల నగదు బహుమతితో పాటు ప్రశంసాపత్రం,జ్ఞాపికను అందజేసి సత్కరించారు. **అమలా రూయా:** గ్రామీణాభివృద్ధి విభాగంలో అసాధారణ కృషి చేసినందుకు అవార్డు లభించింది. గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి కార్యక్రమాల ద్వారా లక్షలాది మందికి ప్రయోజనం చేకూర్చారు. **శ్రీకాంత్ బొల్లా:** యూత్ ఐకాన్ కేటగిరీలో గుర్తింపు పొందారు. యువతకు ప్రేరణగా నిలిచి, విద్య,ఉపాధిరంగాల్లో కొత్త మార్గాలను సృష్టించారు. **మాధవీలత:** సైన్స్ అండ్ టెక్నాలజీ రంగంలో అద్భుత ప్రతిభ చూపి అవార్డు సాధించారు. **ఆకాశ్ టాండన్:** మానవసేవా రంగం లో అమానత్వంగా కృషి చేసినందుకు గౌరవం లభించింది. అసహాయులకు, అనాథలకు అందించిన సేవలు అపూర్వమైనవి. **ప్రసన్న శ్రీ:** కళ సంస్కృతి క్షేత్రంలో సృజనాత్మక తకు అవార్డు. భారతీయ సంస్కృతి, కళలను ప్రపంచవ్యాప్తంగా ప్రచారం చేశారు. **జైదీప్ హార్దికర్:** జర్నలిజం రంగంలో సత్య సంధత,నిర్మలతతో పనిచేసినందుకు గుర్తింపు. **పల్లవి ఘోష్:** మహిళా సాధికారత కేటగిరీలో అవార్డు. మహిళల హక్కులు, సాధికారత కోసం చేసిన కృషి ప్రశంసనీయమైనది.

# తిరుమల సమాచారం



## భగవంతుని ఆశీస్సులందరిపై ఉండాలి

### సుప్రీంకోర్టు జడ్జి సూర్యకాంత్

**తిరుమల,నవంబరు 16ప్రభాతవార్తప్రతినిధి:** శ్రీవేంకటేశ్వరస్వామి ఆశీస్సులు అందరిపై కలగాలని వేడుకున్నట్లు సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ తెలిపారు. సుప్రీంకోర్టు జడ్జి కుటుంబంతో కలసి ఆదివారం ఉదయం ఆలయంలోనికి చేరుకున్నారు. విఐపి బ్రేక్ దర్శన సమయంలో టిటిడి ఇఒ అనిల్ కుమార్ సింఘాల్, అదనపు ఇఓ వెంకయ్యచౌదరి ఆలయ అధికారులు స్వాగతం పలికి దర్శనం చేయించి, తీర్థప్రసాదాలు అందజేశారు.



## అంతా మంచి జరగాలి: హైదరాబాద్ సిపి సజ్జనార్

**తిరుమల,నవంబరు 16ప్రభాతవార్తప్రతినిధి:** కార్తీకమాసంలో శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకోవడం శుభకరమని,అంతా మంచిజరగాలని ఆకాంక్షించినట్లు తెలంగాణ హైదరాబాద్ మహానగర సిపి సజ్జన్నార్ తెలిపారు. ఆదివారం ఉదయం ఆయన కుటుంబంతో కలసి తిరుమలకు వచ్చారు. ఉదయం స్వామివారి నైవేద్యవిరామ సమయంలో ఆలయంలోనికి చేరుకున్నారు. శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకుని మొక్కులుతీర్చుకున్నారు.ఆలయంలోపల వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. ఆలయ అదికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. సిపి సజ్జ నార్ వెంట తిరుపతిజిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు ,డిఎస్పీ విజయశేఖర్ పోలీసు అధికారులు ఉన్నారు.తిరుమలలో ఏర్పాట్లు,దర్శన సౌకర్యం బావుందన్నారు.




## భగవంతుని నామస్మరణతోనే మోక్షం

### కంచిపీఠాధిపతి విజయేంద్రసరస్వతి


**తిరుమల,నవంబరు 16ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగంలో మానవాళి ప్రతిఒక్కరూ భగవంతుని నామస్మరణతోనే మోక్షం కలుగుతుందని ,తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో మానవాళి సుభిక్షంగా ఉంటారని కంచికామకోటిమఠం పీఠాధిపతి విజయేంద్రసరస్వతిస్వామి అనుగ్రహభాషణం చేశారు. కార్తీకమాసంలో ద్వాదశి ఘడియల్లో ఆదివారం ఉదయం శిష్యులతో కలసి ఆలయం వద్దకు విచ్చేసిన స్వామివారికి టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు, టిటిడి ఇఒ అనిల్‌కుమార్‌సింఘాల్, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్య చౌదరి,ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం ఆలయమర్యాదలతో మహద్వారం వద్ద స్వాగతం పలికారు.స్వామి ఆలయంలోపలకు చేరుకుని తొలుత ధ్వజస్తంభానికి నమస్కరించారు. ఆనందనిలయంలో శ్రీవారిని దర్శించుకున్నారు. రంగ నాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. టిటిడి ఛైర్మన్ నాయుడు, ఇఒ సింఘాల్ శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## ఫిబ్రవరి నెల టిక్కెట్లు రేపు ఆన్‌లైన్‌లో విడుదల

### 21న వర్చువల్ సేవా, 24న అంగప్రదక్షిణ టోకెన్లు



**తిరుమల,నవంబరు 16ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనాలకు సంబంధించి 2026 ఫిబ్రవరి నెలాకోటా టిక్కెట్లు మంగళవారం ఉదయం నుండి టిటిడి ఆన్‌లైన్‌లో విడుదల చేస్తోంది. ఇందుకు టిటిడి ఐటి విభాగం అన్ని ఏర్పాట్లు చేసింది. ఫిబ్రవరినెలకు సంబంధించి రేపు మంగళవారం 18వతేదీ ఉదయం 10గంటలకు ఆన్‌లైన్‌లో ఆర్జితసేవా టిక్కెట్లు విడుదల చేస్తే 20వతేదీ ఉదయం 10గంటల వరకు నమోదు చేసుకోవచ్చు. ఈ టిక్కెట్లు పొందిన భక్తులు 20వతేదీ నుండి 22వతేదీ మధ్యాహ్నం 12గంటలలోపు సొమ్ముచెల్లించి టిక్కెట్లు మంజూరవుతాయి. 21వ తేదీ ఉదయం 10గంటలకు కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, ఆర్జితబ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకారసేవల టిక్కెట్లను విడుదల చేయనుంది.24న ఉదయం 10గంటలకు అంగప్రదక్షణ టోకెన్లు, శ్రీవాణి టిక్కెట్లు 24న ఉదయం 11గంటలకు, వృద్ధులు దివ్యాంగులు దర్శన కోటా 24వతేదీ మధ్యాహ్నం 3గంటలకు విడుదల చేస్తారు. 300 రూపాయలు ప్రత్యేక ప్రవేశ దర్శన టిక్కెట్ల కోటా 25న ఉదయం 10గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేస్తారు. గదుల కోటాను మధ్యాహ్నం 3గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేస్తారు. భక్తులుఆన్‌లైన్‌లో స్వామివారి దర్శన టిక్కెట్లను 'టిటిదేవస్థానమ్స్. ఎపి.జివొవి.ఇన్' వెబ్‌సైట్‌ద్వారా బుక్‌చేసుకోవాలి.



## పద్మావతిలో ముగిసిన అంతర్జాతీయ నృత్యవాహిని

**తిరుపతి,నవంబరు 16ప్రభాతవార్తప్రతినిధి:** శ్రీపద్మావతిమహిళ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో మూడురోజులు జరిగిన అంతర్జాతీయ నృత్యవాహిని అంతర్జాతీయ సాంస్కృతిక మార్పిడి నృత్యమహోత్సవం ఉత్సాహంగా ముగిసింది. పద్మావతి మహిళ విశ్వవిద్యాలయం ఇందిరా ప్రియదర్శిని ఆడిటోరియంలో ఆహ్లాదకరంగా ముగిశాయి. గౌరవ అతిధిగా పద్మావతి వర్సిటీ ఉపకులపతి ఆచార్య వెన్నం ఉమ,రిజిస్ట్రార్ ఆచార్య ఎన్.రజని, ఎస్వీయూనివర్సిటీ ఉపకులపతి ఆచార్య టి.నరసింగరావు, మైసూరు విశ్వవిద్యాలయం ఆచార్య కె.శీల శ్రీధర్, వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య ఎన్.రజని, కన్వీనర్ ఆచార్య పి.విజయలక్ష్మి, ఆర్గనైజింగ్ కార్యదర్శి డాక్టర్ హిమబిందు,పిఆర్ఒ శ్రీరజని,విద్యార్థులు, కళాకారులు హాజరయ్యారు. ఈ కార్యక్రమం అత్యంత నిబద్ధతతో ,సమగ్రంగా నిర్వహించబడిందని అభినందించారు.ఇలాంటి ప్రత్యేక కార్యక్రమాలు మహిళ విశ్వవిద్యాలయం ప్రతిష్టను ఉన్నతస్థాయికి తీసుకెళ్తాయని పలువురు వక్తలు కొనియాడారు. నృత్యవాహిని వంటి సాంస్కృతిక మార్పిడి వేడుకలు విద్యార్థులకు ప్రపంచ కళా సాంప్రదాయాలను చేరువచేస్తాయన్నారు. అన్ని జట్లు తమ అద్భుత ప్రదర్శనలతో ప్రేక్షకులను ఆకట్టుకున్నారు.

**ENDOWMENTS DEPARTMENT**
**SRI ESWARA SWAMY TEMPLE**
Kokkarayapalli (V), Chennuru (M), YSR Kadapa District
e-Procurement Tender
NIT.NO.P/COE/813/2025-31 Dt:15-07-2025
E-Tenders are invited through the e-Procurement portal for Reconstruction of Temple. Interested bidders may visit the official website www.apeprocurement.gov.in for detailed information, eligibility criteria, and submission guidelines.
-EXECUTIVE OFFICER

వార్త


కోరికలు తీర్చుకునేందుకు, పనులు సానుకూలమయ్యేందుకు దైవాన్ని కొలిచే భక్తి భక్తికాదు. మనసును దైవమందు నిలపడానికి చేసే ప్రయత్నమే భక్తి.

న-ఇ.గిబ్బన్

# కాటేస్తున్న 'కాలుష్య చలి'

దేశమంతటా శీతలగాలులు ప్రారంభమయ్యాయి. ఎన్నడూ లేనిది ఈసారి 'సింగిల్ డిజిట్' ఉష్ణోగ్రత ప్రజల్ని ఇంట్లోంచి బయటకు రానీయడం లేదు. చలి రోజురోజుకి పెరిగిపోతోంది. సాధారణ ఉష్ణోగ్రతలు మటుమాయమై చలిగాలులు ప్రారంభమయ్యాయి. ఉష్ణోగ్రతలు బాగా పడిపోతాయన్న హెచ్చరికల మధ్య జనం ఇల్లు దాటి బయటకు రావడం లేదు. ఈ చలిని తట్టుకోవడం నిజానికి కష్టంగానే ఉంది. తెలంగాణ రాష్ట్రం తీవ్ర చలి ప్రభావిత కోర్ కోల్డ్‌వేవ్ జోన్‌లో ఉందని కేంద్ర వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలోని నేషనల్ ప్రోగ్రామ్ ఆన్ క్లైమేట్ ఛేంజ్ అండ్ హ్యూమన్ హెల్త్ (ఎన్‌పిసిసిహెచ్‌హెచ్), లోగడనే ప్రకటించింది. ఈసారి ముందుజాగ్రత్త చర్యలు తీసుకోదగినవేమీ లేవు. కనిష్ట ఉష్ణోగ్రతలు 8.5డిగ్రీల కన్నా కిందకు పడిపోయే ప్రమాదం ఉంది. మరో 2రోజులు ఆగితే జనం పూర్తిగాఇంటికే పరిమితమైపోవాల్సి వస్తుంది. రాత్రిపూట ఉష్ణోగ్రతలు 8.5డిగ్రీల నుంచి 12.5డిగ్రీల వరకు ప్రకృతి ఉత్పాతాలు వచ్చినప్పుడు వాతావరణ శాఖ సూచించే 'అలర్ట్'లు చలికి వేడికీ కూడావర్తిస్తాయి. చలి తీవ్రతకు సంబంధించి తెలంగాణలోని మంచిర్యాల జయశంకర్ భూపాలపల్లి, ఆసిఫాబాద్, ఆదిలాబాద్‌లకు రెడ్ అలర్ట్ ప్రకటించారు. ఈ జిల్లాలలో 10 డిగ్రీలకన్నా తక్కువకు పడిపోవచ్చునని వాతావరణ విశ్లేషణల ద్వారా కనుగొన్న హెచ్చరికలివి. మిగిలిన జిల్లాలు కూడా కనిష్ట ఉష్ణోగ్రతలకు పడిపోవచ్చుననే అంచనాతో ఎల్లోఅలర్ట్ జారీ అయింది. ఇప్పటికే చలి తీవ్రతతో ఆదిలాబాద్ జిల్లాలోని ఏజెన్సీ గ్రామాలు వణికిపోతున్నాయి. ఉదయం 9 గంటల దాకా పొగమంచు ఉంటోంది. రాష్ట్రవ్యాప్తంగా పరిశీలిస్తే గత మూడు రోజుల్లో సాధారణం కన్నా 4 నుంచి 5 డిగ్రీల మేర ఉష్ణోగ్రతలు తగ్గిపోయాయి. తెలుగు రాష్ట్రాలకు చలీ వదిలేటట్లు లేదు. వాన చినుకులు వదిలేటట్లు లేవు. ఈ వరుణుడి శాపం ఈనాటిది కాదు. గత 5,6 నెలలుగా ఈ రెండు రాష్ట్రాల రైతాంగం నిద్రలేని రాత్రులు గడుపుతున్నారు. 'మొంథా'తుఫాను ప్రభావం నుంచి కుదుటపడుతున్నారనేలోపే మరో అవాంతరం మీద పడనున్నది. ఆంధ్రప్రదేశ్‌లో కూడా రికార్డుస్థాయిలో ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. చలి తీవ్రత పెరిగిపోతోంది. అల్లూరి జిల్లా జి.మాడుగులలో 6 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఏజెన్సీ ప్రాంతాలేకాదు మైదాన ప్రాంతాల్లోని శ్రీకాకుళం, కర్నూలు, ఎన్టీయార్ జిల్లాలో కూడా కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. 6నుంచి 16 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలున్నాయి. కొన్ని జిల్లాలో వేడి గాలులు ఉన్నాయి. రానున్న రోజుల్లో 19వ తేదీ నాటికి దక్షిణ అండమాన్ సముద్రంలో ఆవర్తనం ఏర్పడ్తుందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. 21న ఆగ్నేయ బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడుతుంది. అల్పపీడనం వాయుగుండగా మారితే ఈ నెల 24నుంచి 27 వరకు కోస్తా, రాయలసీమ జిల్లాల్లో భారీవర్షాలకు అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ హెచ్చరించింది. అకాల వర్ష వాతావరణం నుంచి శీతల కాలానికి ప్రవేశిస్తున్నామనుకున్న తరుణంలో మళ్లీ వర్షాలంటే ఇక రైతు ఏమాత్రమూ కోలుకునే పరిస్థితి లేదనే భావన రైతాంగంలోఉంది. నిన్నమొన్నటి వరకు అధిక కాలుష్య సూచీలతో సతమతమైన ఢిల్లీ కూడా శీతల గాలులు వ్యాపిస్తున్నాయి. రాజధాని వాసులకు ఎలాంటి ఊరట లభించే అవకాశం లేదు. తెలుగురాష్ట్రాలకు సంబంధించి మరికొన్ని రోజులు చలిగాలులను భరించక తప్పదు. ఝూము పొద్దుటే ఎవరూ బయటకు రాలేకపోతున్నారు. రాత్రిపూట చలిగాలులకు శరీరం మంటలెక్కుతోంది. ఎముకలు కొరికే చలికి ప్రజలు గజగజలాడుతున్నారు. తెలంగాణలోని పది జిల్లాల్లో సింగిల్ డజన్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. సంగారెడ్డిజిల్లా కోహిర్‌లో అత్యల్ప కనిష్ట ఉష్ణోగ్రత 7.8డిగ్రీలు నమోదైంది. అన్ని చోట్ల దాదాపు 9డిగ్రీల కన్నా తక్కువే. వచ్చే నాలుగైదు రోజుల్లో కొన్ని ప్రాంతాలలో కనిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కన్నా 3 నుంచి 4డిగ్రీల మేరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని ఐఎండి పేర్కొంది. ఆంధ్రాలో అల్పపీడనం వాయుగుండం ప్రభావం ఉండనే ఉంది. ఈ కారణం చేత ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, ఒడిశాలో భారీ వర్షాలు కురుస్తాయి. ఇలాంటి వర్షాలకు పంటలు చివరి ప్రయత్నంగా మరోసారి నష్టాలతో చతికిలపడిపోవడం ఖాయం. చలి నుంచి కాచుకునేందుకు తెల్లారి లేచి చలిమంటలు వేసుకుంటున్నప్పుడు కాలుష్యం వెదజల్లుతుందని వాటి జోలికి పోరాదని వైద్యులు చెబుతున్నారు. మంటల వేడిమి కోసం ప్లాస్టిక్ రబ్బరు, ఇతరత్రా చెత్త కూడా మండుతున్నప్పుడు కాలుష్యం నుంచి కాపాడడం కష్టమని వాటికి పిల్లల్ని దూరంగా ఉంచమని వేడుకుంటున్నారు. ఇలాంటి మంటల సమయంలో సూక్ష్మ ధూళికణాలు వ్యాప్తి చెంది విషతుల్యమౌతుంటాయి. ఈ గాలులు కారణంగా శ్వాసకోస సమస్యలు వస్తాయని, తమవద్ద ఇలాంటి వ్యాధులకు గురయిన పిల్లలు, పెద్దలు, వృద్ధులు చికిత్సకు కోసం వస్తున్నారని వైద్యులు చెప్తున్నారు. ఆస్తమా, కేన్సర్, దీర్ఘకాలిక సమస్యలు ఏర్పడకుండా హార్మోన్ల అసమతుల్య త, ఆమ్లవర్షాల నుంచి కట్టడి చేసుకోవాలి. ఇంటిలోకి చలి ప్రవేశించకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. ఈ మధ్యనే చలితీవ్రత తట్టుకో లేక ఇద్దరు వృద్ధులు దుర్మరణంపాలయ్యారు. ఉలెన్ దుస్తులు ధరించి బయటకు రావచ్చునని డాక్టర్లు సూచిస్తున్నారు. చలి పెరగడంతో తాము నిల్వ చేసుకున్న పత్తిపై తేమ శాతం పెరుగుతోందని పత్తి రైతులు ఆందోళన వ్యక్తం చేయడం చూస్తున్నాము.

పుస్తకాలు చదవాలనే అభిలాష ఉన్నవారు ఎక్కడ ఉన్నా సుఖంగా ఉంటారు.



ఆస్కార్‌వైల్డ్

బలహీనతకి పరిష్కారం దాని గురించి చింతించడం కాదు, బలం పెంచుకోవడం గురించి ఆలోచించడం.



జార్జి ఎలియట్

# ప్రజావాక్కు



### నితీశ్ మెడలోనే బీ'హారం'

బీహార్ ఎన్నికల్లో ఎన్డీఏ కూటమిసీట్ల ప్రభంజనం సృష్టించింది. ఆ కూటమిలోని ముఖ్యమైన పార్టీలన్నీ తమ ఓట్ల, సీట్లశాతాల్ని గణనీయంగా పెంచుకున్నాయి. రెండు దశాబ్దాలుగాముఖ్యమంత్రి పదవిని ఎలాగోలాచేతిలోనే ఉంచుకున్న నితీశ్ కుమార్, ఈసారి పద్ధతిగా పదోసారి అధిష్టించడానికి అర్హత పొందారు. ఆయన పార్టీ జేడీయూ కూడా అధికసంఖ్యలో సీట్లుసాధించి, కూటమిలో మొదటి స్థానం పొంది పదవిని దర్జాగా పొందే స్థితిలో ఉన్నారు. బీజేపీ కూడా నాయకుడిగా ఆయన పేరే చెప్తూ వచ్చింది. కాబట్టి అన్నీ అనుకున్నట్టే జరగొచ్చు వారి విషయంలో. బీజేపీ ఎటూ బలంగానే ఉంది. మహిళా ఓట్ల పెరుగుదల నితీశ్ వైపే మొగ్గింది. అత్యంత వెనుకబడిన వర్గాలు, మహిళలు ఎన్డీఏ వెంట నిలిచారు. ఇది నితీశ్, మోడీ జోడీల ఉమ్మడి విజయం. ఈ ఘన విజయం వల్ల ప్రత్యేక ఎలెక్టోరల్ రివిజన్ పై కమ్ముకున్న నీలినీడల్ని విస్మరించరాదు.

- డా.డి.వి.జి. శంకరరావు, పార్వతీపురం

### తెలంగాణలో చలి గాలులు

రాష్ట్రవ్యాప్తంగా శీతల గాలులు వీచడంతో చలితీవ్రత గణనీయంగా పెరిగింది. ముఖ్యంగా ఉత్తరతెలంగాణ జిల్లాల్లో ప్రజలు గజగజ వణికిపోతున్నారు. రాత్రివేళల్లో ఉష్ణోగ్రతలు భారీగా పడిపోవడంతో గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు మంటలు వేసుకుని వేడిని పొందుతున్నారు. వాతావరణ శాఖ తెలిపిన వివరాల ప్రకారం, కొమురం భీంఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ (యూ) ప్రాంతంలో అత్యల్పంగా 10.2 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. ఇది ఈ సీజన్‌లోఇప్పటివరకు నమోదైన అత్యంతతక్కువ ఉష్ణోగ్రతల్లో ఒకటిగా గుర్తించారు. చలిగాలుల వల్ల వివిధ జబ్బులు వచ్చే అవకాశాలు వున్నాయి.

- కామిడి సతీష్ రెడ్డి, భూపాల్ పల్లి జిల్లా

### ప్రతి నెల స్ఫూర్తి ప్రోగ్రాం నిర్వహించాలి

విద్యార్థులకు ప్రతినెల నిర్ణీత సమయంలో ప్రతి విద్యా సంస్థలలో స్ఫూర్తి పోగ్రామ్ నిర్వహించాలి. గురుకులాలలో, ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలలోమొదటి తరగతి నుండి డిగ్రీస్థాయివిద్యార్థులకు ఈప్రోగ్రాం నిర్వహించాలి. ప్రతి విద్యా సంస్థ నుండి మంచి మోటివేషన్ స్పీకర్ కూడా పాల్గొనే విధంగా ఈ పోగ్రామ్‌లను నిర్వహించాలి.

-ఈదునూరి వెంకటేశ్వర్లు, వరంగల్

### సిబ్బంది కొరత

రెండు తెలుగు రాష్ట్రాల ప్రభుత్వ విశ్వవిద్యాలయాలు ప్రస్తుతం బోధనా సిబ్బంది తీవ్రకొరతతో అస్తవ్యస్తంగా మారాయి. ప్రభుత్వ గణాంకాల ప్రకారం దాదాపు 70-75 శాతం అధ్యాపక పోస్టులు ఖాళీగా ఉండటం ఆందోళన కలిగించే విషయం. ఐదు నెలల క్రితమే నియామక మార్గదర్శకాలు ప్రకటించినప్పటికీ, అమలు జరగకపోవడం ప్రశ్నార్థకం. ఈకొరత కేవలం సంఖ్యల సమస్య కాదు. రాష్ట్ర ఉన్నత విద్యా ప్రమాణాలు, విద్యార్థుల భవిష్యత్తు దీనిపై ఆధారపడి ఉన్నాయి. అధ్యాపకుల కొరత కారణంగా బోధన నాణ్యత తగ్గిపోగా, పరిశోధన కార్యకలాపాలు కూడా మందగిస్తున్నాయి. ప్రాజెక్టులు, కొత్త పరిశోధన పత్రాలు తగ్గిపోవడంవల్ల విశ్వవిద్యాలయాలు కేంద్రనిధులు ప్రతిష్టాత్మక గ్రాంట్లు కోల్పోతున్నాయి. ఇంకా, సిబ్బంది తక్కువ ఉండటంతో ఉన్న అధ్యాపకులపై పనిభారం పెరిగి, విద్యార్థులకు సరైన మార్గదర్శకత్వం అందడం లేదు.

- సి.హెచ్. ప్రతాప్, శ్రీకాకుళం

### ముందు జాగ్రత్తలు తీసుకోవాలి

రహదారి ప్రమాదాలు, మరణాలు సంభవించని రోజులేదు. దీనికి అనేక కారణాలు గోచరిస్తున్నాయి. డ్రైవర్లు మద్యం సేవించి నడపడం, స్టీరింగ్ ముందు కూర్చుని సెల్‌ఫోన్లు చూస్తూ, మాట్లాడుతూ, నిద్ర మత్తులో నడపడం ఇంకా పరిమితికి మించిన వేగం పెంచడం, సడెన్‌గా బ్రేక్ వేయడం, అనుభవం, లైసెన్సు లేని చోదకులు, నియమంప్రకారం నిర్వహణ లేని వాహనాలు, పాతబడిన వాటిని ఉపయోగించడం ఇలా అనేక కారణాలు కనిపిస్తున్నాయి. ప్రభుత్వ, ప్రైవేటు బస్సులు అన్నిటికి ఇవే లోపాలున్నాయని అనిపిస్తోంది. మరీ ముఖ్యమైంది ఏమంటే అధికారులు సమగ్ర పరిశీలనలు చేయకుండా పర్మిట్లు, పర్మిషన్స్ ఇవ్వడం కూడా ఒక కారణమై ఉండవచ్చు. ప్రయాణీకుల ప్రాణాలు తమ చేతులలో ఉన్నాయని డ్రైవర్లు మరువకూడదు.

- ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

### బదలీ అయినవారికి పోస్టింగ్ ఇవ్వాలి

ఆంధ్రప్రదేశ్ మోడల్‌స్కూల్స్‌లో పనిచేస్తున్న ప్రిన్సిపల్స్, పీజీటీలు, టీజీటీల బదలీలను నిర్వహించినవారికి వెంటనే పోస్టింగ్ ఇవ్వాలి. పోస్టింగ్ ఇవ్వకుండా ఎక్కడివారిన అక్కడే ఉంచినట్లయితే బదలీలు వృధాఅవుతాయి. కొంత మందికి పోస్టింగ్ ఇచ్చి మరికొంత మందికి ఇవ్వకపోవడం బాధాకరం. మోడల్ స్కూల్స్ సిబ్బందికి ఈ అవకాశాన్ని కల్పించాలి.

- టి. సురేష్, ఆంధ్రప్రదేశ్

# ఎన్నికల సంస్థపై కేంద్ర పెత్తనమా!

**భారతీయులు తమ విలువైన ఓటు హక్కుతో నచ్చిన ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకునే క్రమంలో లేని వ్యక్తులపై ఓట్లుచూయించి, ఒక వ్యక్తికే అనేక ప్రాంతాల్లో ఓట్లు చూయించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం అంటే భారతీయ ప్రజల ఆలోచనకి వ్యతిరేకమైన ప్రభుత్వాలు ఏర్పడుతున్నప్పుడు, ప్రజల ఇష్టాలకి గౌరవం లేనప్పుడు దేశ ప్రజలను, గొప్పనైన రాజ్యాంగాన్ని పాలకులు ఇష్టానుసారం అగౌరపరుస్తున్నట్లే కదా. అలాంటప్పుడు ప్రజాస్వామ్యం, రాజ్యాంగ విలువలు ఎలా వర్ధిల్లాబడతాయి.! కాబట్టి అంతిమంగా ఇలాంటిఅనేక సందేహాలకు కేంద్ర ప్రభుత్వం, కేంద్ర ఎన్నికల కమిషన్ అధికారులు నైతిక విలువలతో వ్యవహరించి 140కోట్ల మంది భారతీయులకి వాస్తవాలతో కూడిన సమాధానం చెప్తూ, భారత సార్వభౌమాధికారాన్ని, భారత రాజ్యాంగ ఔన్నత్యాన్ని, కేంద్ర ఎన్నికల కమిషన్‌కి ఉండే స్వతంత్ర ప్రతిపత్తిని రక్షించి కేంద్ర ఎన్నికల కమిషన్ అధికారులు తమ చిత్తశుద్ధిని నిరూపించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉన్నదనే విషయాన్నిలోతుగా ఆలోచిస్తూ పార్టీలకు, కుల, మతాలకు, ప్రాంతాలకు అతీతంగా మేధావులు, విద్యావంతులు, సామాన్య ప్రజలు సైతం గ్రహించాల్సిన చారిత్రక సత్యం.**

పుల్లెంల గణేష్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రమేయం లేకుండా స్వతంత్రంగా పనిచేసే అతికొద్ది సంస్థల్లో భారతీయ ఎన్నికల వ్యవస్థ ప్రధానమైనది. ఎందుకంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఏర్పాటుకై ఓటర్లకు సంబంధించిన ఓటర్ లిస్ట్‌ని తయారు చేసేది, వివిధ రాజకీయ పార్టీలకి గుర్తింపుని, రాజకీయ పార్టీలకి చిహ్నాలని కేటాయించేది కేంద్ర ఎన్నికల సంస్థ. కాబట్టి ఐదు సంవత్సరాలకి ఒకసారి నూతనంగా ఏర్పాటు అయ్యే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల వ్యవస్థపై పెత్తనం చూయించి వివిధ రాజకీయ పార్టీలకి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకి అనుకూలంగా వ్యవహరించేలా వేటికి కూడా హక్కు ఎన్నికల వ్యవస్థపై ఉండదు. భారతదేశం అంటే స్వేచ్ఛ సమానత్వ సోదరభావ ప్రజాస్వామ్య గణతంత్ర రాజ్యా దేశంగా ఉండడానికి భారత రాజ్యాంగంలో ఆర్టికల్ 324 ద్వారా అంబేద్కర్ ఎన్నికల వ్యవస్థకు చాలా పటిష్టమైన భద్రతను ఇస్తూ, స్వతంత్ర ప్రతిపత్తిని కల్పించారు. అందుకే కేంద్ర, రాష్ట్రాల్లో ఎంతటి బలమైన ప్రజాబలం ఉన్న నాయకులు ఉన్నప్పటికిని ఎన్నికల వ్యవస్థని, వాటిని నడిపే అధికారులని ఆయా పార్టీలకి, ప్రభుత్వాలకి అనుకూలంగా వ్యవహరించడానికి అవకాశం లేదు. ప్రజాస్వామ్యం వర్ధిల్లాడానికి భారత రాజ్యాంగం రూపంలో ఎన్నికల వ్యవస్థకి అత్యున్నతమైన స్వేచ్ఛ స్వతంత్ర ఉన్నది. ఇది భారతదేశం అతిపెద్ద ప్రజాస్వామ్య దేశం అని చెప్పడానికి నిదర్శనం. కానీ గత దశాబ్ద కాలంగా కేంద్ర ప్రభుత్వంలో బిజెపి అనుబంధ ఎన్డీయే ప్రభుత్వ హయాంలో కేంద్ర ఎన్నికల వ్యవస్థ కేంద్ర ప్రభుత్వానికి, ప్రధానమంత్రికి అనేక సందర్భాల్లో అనుకూలంగా వ్యవహరిస్తున్నదని ప్రతిపక్ష పార్టీ నాయకులు బలమైన ఆధారాలతో ఆరోపణలు చేస్తున్నారు. అందులో భాగంగానే తాజాగా కాంగ్రెస్ పార్టీ అగ్రనేత లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ ఆరోపిస్తూ హర్యానా రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఓడిపోవడానికి ప్రధాని ఎన్నికల వ్యవస్థని తమకి అనుకూలంగా మలుచుకొని హర్యానాలో బిజెపి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారని ఆధారాలతో సహా ఆరోపిస్తున్నారు. అందులో భాగంగానే తాజాగా ఢిల్లీలో ప్రొజెక్టర్లో ఫోటో, వీడియోలు వేసి ఎన్నికల వ్యవస్థ లోపాలను వివరిస్తూ దాదాపు 25 లక్షల నకిలీ ఓట్లు హర్యానాలో ఉన్నాయని చెప్తున్నారు. అందువల్లనే హర్యానాలో బిజెపి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిందని రాహుల్ గాంధీ ఆరోపిస్తున్నారు. అందుకు బలమైన ఆధారాలు చూపిస్తూ బ్రెజిల్ దేశానికి చెందిన మోడల్ పేరుపై వివిధ పేర్లతో హర్యానాలో 22 చోట్ల ఓటు హక్కు ఉండడం రాహుల్ గాంధీ చేస్తున్న ఓట్ చోర్ విధానానికి బిజెపి పాల్పడుతున్నదని నమ్మక తప్పని పరిస్థితి నెలకొన్నది. అంతేకాదు బ్రెజిల్ మోడల్ కూడా రాహుల్ గాంధీ చూయించిన ఆధారాలకు స్పందించి అవి తన గతంలోని మోడల్ ఫొటోస్ అని, ప్రస్తుతం భారతదేశంలో తాను వైరల్ అవ్వడం ఓటు హక్కు కూడా ఉండడాన్ని తీవ్రంగా




ఖండించింది. ఇది మన దేశంలోని ఎన్నికల వ్యవస్థలోని లోపాలకి నిదర్శనం కాదా, విదేశీయుల ముందు అత్యున్నత విలువలతో కూడిన భారత రాజ్యాంగాన్ని అవమానపరచడం కదా..! మరి రాహుల్ గాంధీ చేస్తున్న ఆరోపణలపై ఎన్నికల వ్యవస్థ తప్పు లేనప్పుడు కేంద్ర ప్రభుత్వానికి అనుకూలంగా ఎన్నికల వ్యవస్థ వ్యవహరించనప్పుడు స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన ఎన్నికల వ్యవస్థపై తప్పుడు ఆరోపణ చేస్తూ, ఎన్నికల వ్యవస్థనే అభాసుపాలు చేస్తున్నారని ఎన్నికల అధికారులు ప్రతిపక్ష నాయకుడైన రాహుల్ గాంధీపై చట్టపరమైన చర్యలు తీసుకునేలా కేంద్ర ప్రభుత్వంపై ఎందుకు ఒత్తిడి చేయడం లేదు. కేంద్ర ఎన్నికల సంఘం తమ స్వతంత్ర ప్రతిపత్తిని కాపాడుకోలేకపోతున్నదంటే కేంద్ర ఎన్నికల వ్యవస్థ ఎన్డీఏ కేంద్ర ప్రభుత్వానికి తొత్తుగా వ్యవహరిస్తున్నదా..? అనే విషయాన్ని మేధావులు, విద్యావంతులు, సామాన్య ప్రజలు సైతం నమ్మక తప్పడం లేదు.! ఎందుకంటే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారత దేశంలో ఒక్క ఓటే నాయకుల గెలుపు, ఓటమిని నిర్ణయిస్తుంది. కాబట్టి భారతదేశమంటేనే ఒకే వ్యక్తి ఒకే ఓటు ఒకే విలువ అనే రాజ్యాంగబద్ధమైన ఉన్నత విలువలతో కూడిన అంశం కాబట్టి ఒక్క ఓటు ఐన ముఖ్యమైనదనే విషయం జగమెరిగిన సత్యం. కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ ఆధారాలతో సహా చూయిస్తూ, బిజెపి కేంద్ర ప్రభుత్వంఓటు దొంగతనానికి పాల్పడుతున్నదనే అంశంలో ఎన్డీఏ ప్రభుత్వంలో, మోడీ నేతృత్వంలో ఎలాంటి లోపాలు లేనప్పుడు కేంద్ర ఎన్నికల సంస్థని తమకి అనుకూలంగా కీలు బొమ్మగా మార్చుకోవడం లేదని నిజం ఐతే, తప్పుడు ఆరోపణలు చేస్తూ భారతీయ ప్రజల ఓట్లని, ప్రజల ఆత్మ గౌరవాన్ని కించపరచేలా వ్యవహరిస్తున్నారని ప్రతిపక్ష నాయకుడైన రాహుల్ గాంధీ పై చట్టపరమైన చర్యలు ఎందుకు తీసుకోవడం లేదు! అంటే రాహుల్ గాంధీ చేస్తున్న ఆరోపణల్లో నిజం ఉన్నదని కేంద్ర ఎన్నికల వ్యవస్థ, కేంద్ర ప్రభుత్వ గుప్పిట్లో ఉన్నదని ప్రధాని చెప్పదలుచుకున్నారా? అంటే భారత రాజ్యాంగం ద్వారా ఎన్నికల వ్యవస్థకి కల్పించిన స్వతంత్ర ప్రతిపత్తిని కేంద్ర ప్రభుత్వం దుర్వినియోగం చేస్తున్నదంటే భారత రాజ్యాంగాన్ని, 140 కోట్ల భారతీయ ప్రజల ఆత్మ గౌరవాన్ని అవమాన పరుస్తున్నట్లే కదా! భారతీయులు తమ విలువైన ఓటు హక్కుతో నచ్చిన ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకునే క్రమంలో లేని వ్యక్తులపై ఓట్లు చూయించి, ఒక వ్యక్తికే అనేక ప్రాంతాల్లో ఓట్లు చూయించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం అంటే భారతీయ ప్రజల ఆలోచనకి వ్యతిరేకమైన ప్రభుత్వాలు ఏర్పడుతున్నప్పుడు, ప్రజల ఇష్టాలకి గౌరవం లేనప్పుడు దేశ ప్రజలను, గొప్పనైన రాజ్యాంగాన్ని పాలకులు ఇష్టానుసారం అగౌరపరుస్తున్నట్లే కదా. అలాంటప్పుడు ప్రజాస్వామ్యం, రాజ్యాంగ విలువలు ఎలా వర్ధిల్లాబడతాయి.! కాబట్టి అంతిమంగా ఇలాంటిఅనేక సందేహాలకు కేంద్ర ప్రభుత్వం, కేంద్ర ఎన్నికల కమిషన్ అధికారులు నైతిక విలువలతో వ్యవహరించి 140 కోట్ల మంది భారతీయులకి వాస్తవాలతో కూడిన సమాధానం చెప్తూ, భారత సార్వభౌమాధికారాన్ని, భారత రాజ్యాంగ ఔన్నత్యాన్ని, కేంద్ర ఎన్నికల కమిషన్‌కి ఉండే స్వతంత్ర ప్రతిపత్తిని రక్షించి కేంద్ర ఎన్నికల కమిషన్ అధికారులు తమ చిత్తశుద్ధిని నిరూపించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉన్నదనే విషయాన్ని లోతుగా ఆలోచిస్తూ పార్టీలకతీతంగా, కుల, మతాలకతీతంగా, ప్రాంతాలకు అతీతంగా మేధావులు, విద్యావంతులు, సామాన్య ప్రజలు సైతం గ్రహించాల్సిన చారిత్రక సత్యం. •

# పిల్లలపై తల్లిదండ్రుల ప్రవర్తన ప్రభావం

మేకిరి దామోదర్

నారుతోపాటు నీరు పోసే తీరుపైనే మొక్క ఎదుగుదల ఆధారపడి ఉంటుంది. పిల్లల పెంపకం కూడా అంతే! చిన్నప్పటినుంచి వారితో తల్లిదండ్రులుగా, పిల్లల ఎదుగుదలలోని వివిధ దశల్లో ఎలా ప్రవర్తిస్తున్నామనే దాన్నిబట్టి వారి వ్యక్తిత్వం రూపుదిద్దుకుంటుంది. మన పిల్లలు మొట్టమొదటి సూపర్ హీరోల్లా ఆరాధించేది సూపర్ మ్యాన్‌నో, సూపర్ హీరోనో, స్పైడర్ మాన్నో కాదు..తమ తల్లిదండ్రులనే. చిన్నారులు తొలుత ఎక్కువగా విశ్వసించేది, ప్రేమించేది తాము అనుకరించాలని కోరుకునేది కూడా వారినే. తల్లిదండ్రులు పరిపూర్ణ వ్యక్తులుగా వ్యవహరిస్తూనే, కన్నబిడ్డల్ని ప్రేమగా చూసుకుంటూవారితో గడిపేందుకు తరచూ సమయం కేటాయించుకుంటే చాలు. పిల్లలకు గొప్ప మేలు చేసినట్లేనని మానసిక నిపుణులు అంటున్నారు. ప్రతి కుటుంబంలో పిల్లల పెంపకంలో తల్లిదండ్రుల పాత్ర చాలాకీలకం, ఇది కాదనలేని వాస్తవం. తల్లిదండ్రుల పెంపకాన్ని బట్టి పిల్లల ప్రవర్తన ఉంటుందనేది నిజం. కానీ ఆధునిక టెక్నాలజీ మారుతున్న సామాజిక పరిణామాలు, ఆర్థిక పరిస్థితుల ప్రభావం తదితరాల మూలంగా తల్లిదండ్రుల భావోద్వేగాల ప్రతికూల ప్రభావం, తరచూ గొడవలు పడడం మూలంగా పిల్లలపై తీవ్ర ప్రభావాన్ని చూపుతాయని మానసిక వైద్య నిపుణులు అంటున్నారు. ఇలాంటి ఘటనలు ఎదిగే వయసులో వారిని మానసికంగా కృంగిపోయేలా చేస్తాయని హెచ్చరిస్తున్నారు. ఇంట్లో పిల్లలు పెద్దవారయ్యాక కూడా తల్లిదండ్రులు ప్రవర్తనలో మార్పులు రాకపోవడం. అదే తరహా గొడవలు వాదోపవాదాలు ఎదిగిన పిల్లల ముందు పెట్టడం మూలంగా యువతరం భావోద్వేగాలపై ప్రతికూల ప్రభావం చూపిస్తుందని చెప్తున్నారు. ఒక వయసు వచ్చి చదువు పూర్తయి పరీక్షలకు సన్నద్ధం కావటమో, ఉద్యోగాలు, వ్యాపారం వంటివి చేస్తున్న పిల్లలకు తల్లిదండ్రులు తగులాటడం అనేది వారి సంతతికి ఆధునిక సమస్యగా పరిణమించింది. అలాంటి సందర్భాల్లో గొడవలు ఆపాలని ప్రయత్నించినా తల్లిదండ్రులు వినకపోవడం, తిరిగి వారి ఎదిగిన పిల్ల



లనే నిందించడం వంటివి చేస్తున్నారు. ఉద్యోగం, పెండ్లి, భవిష్యత్తు వంటి అనేక బాధ్యతలు మీద పడుతున్న సమయంలో ఇలాంటివి దేశంలోని పలు కుటుంబాల్లో యువతి, యువకులకు ఇబ్బందికరంగా మారాయని మానసిక నిపుణులు అంటున్నారు. ఫలితంగా వారు తీవ్ర ఒత్తిడి గురవుతున్నారని చెప్తున్నారు. పిల్లలు పెద్దవారయ్యాక కూడా తల్లిదండ్రుల మధ్య గొడవలను చూసి పెరిగిన కారణంగా వారిలో కలిగే బాధ, ఆందోళన, దుఃఖము వంటివితగ్గిపోవు. తల్లిదండ్రుల మధ్య జరిగే గొడవల్లో పిల్లలు పావులుగా చిక్కుకపోతున్నారు. ఇద్దరినీ సముదాయించాలని వారు ప్రయత్నాలు చేస్తుంటారు. అయితే కొన్ని సందర్భాల్లో పంతాలకు పోవడం కారణంగా పిల్లలకు ఏమి చేయాలో పాలు పోనీ పరిస్థితి నెలకొంటున్నాయి. ఇలా పిల్లలే మధ్యవర్తులుగా మారుతున్న సందర్భాల్లో తల్లిదండ్రులు పిల్లలను పక్షపాతం వహిస్తున్నవంటూ తిరిగి తల్లిదండ్రులే పిల్లలను ఆరోపిస్తున్న సందర్భాలు ఉంటున్నాయి. ఇలాంటి స్థితి పిల్లల, ఎదుగుతున్న యువత మానసిక భావోద్వేగాలను తీవ్రంగా ప్రభావితం చేస్తుంది. దేశంలోని మెజార్టీ యువత ఇదే అనుభవాలను ఎదుర్కొంటుందని మానసిక వైద్యులు చెప్తున్నారు. తల్లిదండ్రులు పిల్లలకు విలువలు బోధించాలి. ఇక్కడ ప్రధానంగా తల్లిదండ్రులు జాగ్రత్తగా వహించాల్సిన విషయం ఏమంటే? గొడవలు ఆపాలన్న మధ్యవర్తి పాత్ర పిల్లల బాధ్యత కాదన్న విషయాన్ని తల్లిదండ్రులు గమనించాలి. పిల్లలు తల్లిదండ్రుల నుంచి సంస్కారం నేర్చుకోవాలి. మరోవైపు పలువురు తల్లిదండ్రులకు కూడా పిల్లలకు మంచి, చెడు చెప్పే సమయం ఉండటం లేదు. విలువల గురించి మాట్లాడుకోవడం కష్టమయింది. ఇలాంటి పరిస్థితుల్లో పెరుగుతున్న పిల్లలు దారి తప్పుతున్నారు. పరిస్థితి చేయి దాటిన తరువాత తల్లిదండ్రులు బాధపడుతున్నారు. అందుకే పిల్లల పెంపకం విషయంలో అత్యంత అప్రమత్తంగా ఉండాలి. విలువలు పాటించాలి, పిల్లలకు బోధించాలి. ఇంట్లో ఎప్పుడు ఘర్షణ వాతావరణం ఉంటుందో అప్పుడు పిల్లల మానసిక ప్రశాంతత దెబ్బతింటుంది. అభద్రతా భావం ఏర్పడుతుంది. తల్లిదండ్రుల ఆస్తులు వారి సంతానమే. ఆ పిల్లలను సమాజంలో సంస్కారవంతులుగా, ఉన్నత స్థాయిలో ఎదగాలంటే..ఆస్తులు కాదు? విలువలను ఇచ్చే విద్యతో పాటు కుటుంబంలో తల్లిదండ్రుల ప్రవర్తనే మంచి వ్యక్తిత్వం గల వ్యక్తులుగా ఎదగడానికి తోడ్పడుతుందని నేటితరం భావించాల్సిన అవసరం ఎంతో ఉంది. •

# విజ్ఞాన, సంస్కృతుల నిలయం గ్రంథాలయం

డా. పూసపాటి వేదాద్రి

గ్రంథాలయం అంటే కేవలం పుస్తకాల నిల్వగూడి కాదు, అది విద్యా, సాహిత్య, సంస్కృతి, విజ్ఞానాలకు కేంద్ర బిందువుగా పనిచేస్తుంది. విద్యార్థులు, అధ్యాపకులు, పరిశోధకులు, పాఠకులు తమ జ్ఞానాన్ని పెంపొందించుకునేందుకు గ్రంథాలయాలు ఎంతో ఉపయుక్తంగా ఉంటాయి. ఇంటర్నెట్, సోషల్ మీడియా వేగంగా అభివృద్ధి చెందినప్పటికీ గ్రంథాలయాల ప్రాముఖ్యత ఏమాత్రం తగ్గలేదు. ఎందుకంటే పుస్తకాలు ఇస్తున్న లోతైన జ్ఞానం, విశ్లేషణా శక్తి, ఆలోచనా సంపత్తి అమూల్యం. ప్రతి సంవత్సరం నవంబర్ 14 నుండి నవంబర్ 21 వరకు భారతదేశంలో గ్రంథాలయ వారోత్సవాలు ఘనంగా నిర్వహించబడతాయి. పుస్తకాల ప్రాధాన్యతను ప్రజలకు తెలియజేయడం, చదవడం అలవాటు పెంపొందించడం ఈ వారోత్సవాల ప్రధాన లక్ష్యం. జ్ఞానంఅనేది మనిషిని సంపూర్ణుడిగా మార్చే శక్తి. ఆ జ్ఞానానికి నిలయమేవైతే గ్రంథాలయం. అదే ఈ వారోత్సవాల ద్వారా మరింత ప్రజల్లోకి చేరుతుంది. భారత దేశ చరిత్రలో గ్రంథాలయాలు విద్య, జ్ఞానం, ప్రజల్లో చైతన్యం పెంచడంలో కీలక పాత్ర పోషించాయి. ముఖ్యంగా స్వతంత్రపోరాట కాలంలో గ్రంథాలయాలు జాతీయ చైతన్యాన్ని ప్రజల్లో నాటడంలో ఒక శక్తివంతమైన వేదికగా నిలిచాయి. బ్రిటిష్ పాలన కాలంలో భారతీయులు విద్య, జ్ఞానం, సాహిత్యం ద్వారా స్వాతంత్ర్య భావాలను బలపరిచే ప్రయత్నం చేశారు. విదేశీ పాలకుల అన్యాయాలను ప్రజలకు తెలియజేయడానికి, దేశభక్తి, జాతీయతను వ్యాప్తిచేయడానికి పుస్తకాలు, పత్రికలు, సమావేశాలు ముఖ్య సాధనాలయ్యాయి. ఈ క్రమంలో ప్రజల్లో చదువుపై ఆసక్తిని పెంచేందుకు గ్రంథాలయాలు ఏర్పాటు చేయబడ్డాయి. 1900 దశకం ప్రారంభంలోనే బెంగాల్, మహారాష్ట్ర, తమిళనాడులో గ్రంథాలయ ఉద్యమానికి ఉతమిచ్చే ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి. ఆ తరువాత దేశంలోని అనేక ప్రాంతాలకు ఈ ఉద్యమం విస్తరించింది. తెలుగునాట గ్రంథాలయ ఉద్యమాలకు ఒక విశిష్ట చరిత్ర ఉంది. ప్రజల్లో చదవాలనే తపన, అవగాహన పెంపు, సంస్కరణాత్మక భావజాలం ప్రచారం కోసం గ్రంథాలయాలు ప్రధాన వేదికలుగా నిలిచాయి. ఆంధ్రప్రదేశ్, తెలంగాణా ప్రాంతాల్లో ఈ ఉద్యమం సామాజిక, విద్యా, రాజకీయ రంగాల్లో ప్రభావవంతంగా సాగింది. 19వ శతాబ్దం చివరలో సామాజిక సంస్కరణ ఉద్యమాలు, జాతీయ స్వాతంత్ర్య ఉద్యమాలు ప్రజల్లో జ్ఞానోదయాన్ని పెంచాయి. ఈ నేపథ్యంలో ప్రజలలో చదువుపై ఆసక్తి పెరిగి, పుస్తకాల విస్తరణ కోసం గ్రంథాలయాల అవసరం ఏర్పడింది. తెలంగాణా ప్రాంతంలో గ్రంథాలయ ఉద్యమం స్వతంత్ర పోరాటం, ముఖ్యంగా నిజాం వ్యతిరేక పోరాటంతో సన్నిహిత సంబంధం కలిగి ఉంది. తెలంగాణాలో పాఠశాల విద్య అభివృద్ధి కష్టతరమైన కాలంలో, ఉస్మానియా విశ్వవిద్యాలయం (1918) స్థాపనతో ఉన్నతవిద్య విస్తరించింది. ఈ



విజ్ఞాన వాతావరణంలో గ్రంథాలయాల ఆవశ్యకత పెరిగింది. నిజాంల దోపిడీ పాలన, ఉర్దూ భాష ఆధిపత్యం ఉన్న సందర్భాలలో ప్రజల్లో జ్ఞానోదయం, స్వేచ్ఛాభావాల వ్యాప్తికి గ్రంథాలయాలు రహస్య కేంద్రాలుగా పనిచేశాయి. భారత దేశ చరిత్ర, దేశభక్తి కథలు, విప్లవ రచనలు ప్రజల్లో చైతన్యం పెంపొందించాయి. స్వరాజ్య అనే భావనను ప్రజలలో బలంగా నింపాయి. గ్రంథాలయాలు స్వాతంత్ర్య ఉద్యమానికి సమాచార కేంద్రాలుగా పనిచేశాయి. పత్రికలు, పాంప్లెట్లు, ప్రసంగాల ద్వారా ప్రజలు ఉద్యమ కార్యక్రమాలను తెలుసుకుని వాటిలో పాల్గొన్నారు. అక్షరాస్యత పెంపుద్వారా ప్రజలను జాగృతం చేయడంలో గ్రంథాలయాలు కీలకంగా మారాయి. ప్రజల్లో ప్రశ్నించే మనస్తత్వాన్ని పెంపొందించాయి. మహాత్మా గాంధీ, బాల గంగాధర తిలక్, రవీంద్రనాథ్ ఠాగూర్, సుభాష్ చంద్రబోస్ వంటి నేతల రచనలు గ్రంథాలయాల ద్వారా ప్రజలకు చేరాయి. వీటిలోని ఆలోచనలు స్వాతంత్ర భావజాలానికి బీజం వేశాయి. అనేక గ్రంథాలయాలు సమావేశ కేంద్రాలుగా ఉపయోగపడ్డాయి. ప్రజల్లో దేశభక్తిని పెంపొందించింది. భారతదేశంలో గ్రంథాలయ ఉద్యమం కేవలం పుస్తకాలు సేకరించి భద్రపరచడం కోసం కాకుండా, ప్రజలలో అక్షరాస్యతను, చైతన్యాన్ని, జాతీయ భావాన్ని పెంపొందించడానికి ఒక ముఖ్యమైన సామాజిక సాంస్కృతిక ఉద్యమంగా రూపుదిద్దుకుంది. ఈ ఉద్యమం భారత స్వాతంత్ర్య సంగ్రామంలో కీలక పాత్ర పోషించింది. ఎందుకంటే గ్రంథాలయాల ద్వారానే మహాత్మా గాంధీవంటి జాతీయ నాయకుల సందేశాలు సామాన్య ప్రజలకుచేరాయి. తెలుగు భాష సంస్కృతి పరిరక్షణకు, తెలంగాణ సాంస్కృతిక పునరుజ్జీవనానికి ఒక మైలురాయిగా నిలిచింది. నిజాం రాష్ట్ర ఆంధ్ర జనసంఘం ద్వారా గ్రంథాలయాలఏర్పాటుకు, తెలుగు భాషా వికాసానికి కృషి చేశారు. నిజాం రాష్ట్రంలో నిరంకుశ పాలనలో, గ్రంథాలయాలు ఒక రకంగా ప్రజాస్వామ్య సాధనకు, తెలుగు భాషా పరిరక్షణకు, స్వాతంత్ర్యోద్యమానికి వేదికలుగా నిలిచాయి. వారి నిస్వార్థ సేవ, దూరదృష్టి కారణంగానే ఈ ప్రాంతాలలో అక్షర జ్ఞానంవ్యాపించి, అనేక సామాజిక ఉద్యమాలకు పునాది పడింది. జాతీయ చైతన్యం పెరిగింది. అక్షరాస్యత, విద్య విస్తరించింది. దేశభక్తి భావాలు బలపడ్డాయి. ప్రజలు స్వేచ్ఛ ఉద్యమంలో పాల్గొన్నారు. కొత్త ఆలోచనలు, సంస్కరణలు వ్యాప్తి చెందాయి. స్వాతంత్ర్య సంగ్రామానికి బలమైన మౌలిక వేదికగా మారాయి. భారత స్వాతంత్ర్య పోరాటంలో గ్రంథాలయాలు అమూల్యమైన సేవలు అందించాయి. ప్రజలను చదవడం, ఆలోచించడం, ప్రశ్నించడం వైపు మళ్లించాయి, జాతీయత, స్వేచ్ఛ, సమానత్వం వంటి విలువలను ప్రజల్లో నింపాయి. భారత స్వాతంత్ర్య ఉద్యమ విజయానికి గ్రంథాలయాలు మౌన సైనికుల్లా పని చేశాయి అని చెప్పడం అతిశయోక్తి కాదు. ఈ గ్రంథాలయాల వారోత్సవాల్లో పాఠశాలలు, కళాశాలలు, ప్రభుత్వ, ప్రైవేట్ గ్రంథాలయాలు వివిధ కార్యక్రమాలు నిర్వహించి, పుస్తక ప్రదర్శనలు, పఠన పోటీలు, వ్యాసరచన కార్యక్రమాలు, సాహితీ సదస్సులు, రచయితలతో సంభాషణ కార్యక్రమాలు వంటివి నిర్వహించి విద్యార్థుల్లో పఠనాభిరుచిని పెంచవలసిన ఆవశ్యకత ఉంది. పుస్తకాలు మనలో ఉన్న అనేక సందేహాలను తీర్చడమే కాక మనలో ఆలోచనా శక్తిని, పరిశీలనా దృక్కోణాన్ని పెంచుతాయి. గ్రంథాలయాలు మన సంస్కృతి, చరిత్రను భద్రపరిచే కేంద్రాలు, పాత పుస్తకాల ద్వారా పూర్వీకుల జ్ఞానం, వారి భావాలు, సంఘటనలు మనకు లభిస్తాయి. దాంతో మన జాతి పట్ల గౌరవం, బాధ్యత పెరుగుతుంది. •



ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# ప్రభుత్వ లక్ష్యాన్ని నీరుగార్చేలా 'టిడ్కో' ఇళ్లను అద్దెకివ్వడమేంటి? : ప్రత్తిపాటి

చిలకలూరిపేట, నవంబర్ 16, ప్రభాతవార్త: 2014-19లో టీడీపీ ప్రభుత్వం పట్టణంలోని పేదలకు 5,520 టిడ్కో గృహాల నిర్మాణం ప్రారంభించిందని, పేదలకు నాణ్యమైన ఇళ్లు నిర్మించి ఇవ్వాలనే గొప్ప ఉద్దేశంతో చేపట్టిన ప్రాజెక్టును గత ప్రభుత్వం నీరు గార్చిందని మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు.ఆదివారం ఆయన పట్టణంలోని ఎన్టీఆర్ నగర్ లో ఉన్న టిడ్కో గృహాల సముదాయాన్ని కూటమి నాయకులు, మున్సిపల్, పోలీస్, గృహ నిర్మాణ శాఖ అధికారులతో కలిసి ఆకస్మికంగా తనిఖీచేశారు., ఈ సందర్భంగా అక్కడ నివాసముంటున్నవారిలో ఎక్కువమంది అద్దెదారులేనని, అసలు యజమానులు కాదని గుర్తించిన ప్రత్తిపాటి... ఇళ్ల యజమానుల తీరుపై ఆగ్రహం వ్యక్తంచేశారు. తక్షణమే వారి వివరాలు తీసుకొని, అవసరమైతే ఇళ్లు రద్దుచేయాలని అధికారుల్ని ఆదేశించారు. స్టేజ్2లోని టిడ్కో ఇళ్ల నిర్మాణపనుల్ని పరిశీలించిన ప్రత్తిపాటి.. పనుల నాణ్యత, వసతుల కల్పనపై అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు.మార్చి నాటికి 5,520 గృహాల్లో నిజమైన అర్హులు గృహ ప్రవేశాలు చేసేలా చూడండి వచ్చే మార్చినాటికి మొత్తం 5,520 ఇళ్లను




పూర్తిచేసి, మౌలికవసతులు కల్పించి గృహ ప్రవేశాలు జరిగేలా చూడాలని, లబ్ధిదారులు వాటిని సద్వినియోగం చేసుకోకుంటే వారి రిజిస్ట్రేషన్లపై ప్రభుత్వం పునరాలోచన చేస్తుందన్నారు. టీడీపీ ప్రభుత్వంలోనే 90శాతం వరకు పనులు పూర్తయ్యాయని, మిగిలిన పనులు యుద్ధప్రాతిపదికన పూర్తిచేసి, మౌలిక వసతులు కల్పించాలన్నారు. టిడ్కో గృహాలు పొందిన లబ్ధిదారులు వాటిలో నివాసముండకుండా అద్దెలకు ఇచ్చి, తమకు నచ్చిన చోట నివాసముండటం సరికాదని, అద్దెలు కూడా కట్టలేని నిరుపేదల కోసమే ఇళ్ల నిర్మాణం చేపట్టామని ప్రత్తిపాటి స్పష్టంచేశారు. తాను మంత్రిగా ఉన్నప్పుడే అర్హులకు 1008 ఇళ్లు కేటాయించడం జరిగిందన్నారు. వారంతా ఇళ్లల్లో ఉంటేనే ఇంటి తాళాలు ఇస్తామని, నివాసం లేకుంటే ప్రభుత్వానికి అప్పగించాలని ప్రత్తిపాటి సూచించారు. 5,500 మంది పేదలు ఉంటారనే దుకాణ సముదాయాలు, ప్రభుత్వ భవనాలు. ఇతరత్రా అన్ని హంగులు ఏర్పాటు చేస్తున్నామని, ప్రభుత్వ సొమ్మును దుర్వినియోగం చేయడం మంచి పద్ధతికాదని ప్రత్తిపాటి సూచించారు. ఇళ్లు పొందినవారి కేటాయింపులు రద్దుచేసి, తక్షణమే అర్హులైన వారికి కేటాయించండి : తోట రాజా రమేష్ (నియోజకవర్గ జనసేన ఇన్ ఛార్జ్) 2014లో నాటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడి ఆలోచనలకు కార్యరూపమిస్తూ నాటి నియోజకవర్గ శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు ఇళ్లులేని పేదలకోసం 52 ఎకరాల్లో దాదాపు 5వేల గృహాలు కేటాయించడం జరిగిందని నియోజకవర్గ జనసేన ఇన్ ఛార్జ్ తోట రాజారమేశ్ తెలిపారు.

**పార్కింగ్ స్థలంలో వేసిన షెడ్లను తొలగిస్తాం : మున్సిపల్ కమిషనర్, ఛైర్మన్**

పార్కింగ్ స్థలాన్ని షెడ్లు వేసి ఆక్రమించడంపై మున్సిపల్ కమిషనర్ పతి శ్రీహరి, ఛైర్మన్ షేక్ రఫాని ఆగ్రహం వ్యక్తంచేశారు. పై అంతస్తుల్లో ఉండేవారికోసం కేటాయించిన స్థలాల్ని కింద ఉండేవారు తమ అవసరాలకు వాడుకోవడం సరికాదని, అలా చేస్తే వారు వేసిన షెడ్లను పూర్తిగా తొలగిస్తామని వారు నివాసముండే వారిని హెచ్చరించారు. టిడ్కో గృహాల పరిశీలనకు వెళ్లిన వారిలో టీడీపీ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ టీడీపీ కరీముల్లా, పట్టణ ప్రధాన కార్యదర్శి మద్దుమాల రవి, జనసేన పట్టణ అధ్యక్షులు మునీర్ హాసన్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ గంగా శ్రీనివాసరావు, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ పిల్లి కోటేశ్వరరావు, టీడీపీ నాయకులు ఇనగంటి జగదీష్ , జంగా వినాయకరావు, మురకొండ మల్లిబాబు, పట్టణ చిలకలూరిపేట నియోజకవర్గం, రూరల్ మండలం, మద్దిరాల గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు షేక్ షరీఫ్ గారు మృతి చెందగా, వారి నివాసం వద్ద ఉంచిన పార్థివ దేహాన్ని సందర్శించి, నివాళులర్పించి, వారి కుటుంబసభ్యులను పరామర్శించిన ప్రత్తిపాటి పుల్లారావు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు షేక్ కరీముల్లా జవ్వాజి మదన్ , గంగా శ్రీను గట్టినేని రమేష్ , కోడె మణి ,జాష్టి రవి ,సిఐ రమేష్, టిడ్కో అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రక్తనాళాల సంబంధిత వ్యాధులపై అవగాహన కలిగి ఉండాలి

గుంటూరు కల్చరల్,నవంబర్ 16,ప్రభాతవార్త : భారతదేశంలో వివిధ కారణాల వల్ల రక్తనాళ సంబంధిత వ్యాధులు వేగంగా పెరుగుతున్నప్పటికీ వాటిపై ప్రజల్లో అవగాహన తక్కువగా ఉందని,ఈ వ్యాధి ముందస్తు గుర్తింపు ప్రాణాలను,అవయవాలను రక్షిస్తుందని అవగాహన సంస్థ ఆధ్వర్యంలో జరిగిన ఆరోగ్యసభలో వాసూ క్యులర్ సర్జన్ డాక్టర్ విజయ్‌కుమార్ విష్ణు మొలకల అన్నారు.ఆరోగ్యసభకు అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి అధ్యక్షత వహించారు.ఈ



సందర్భంగా డాక్టర్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ వ్యాస్కులర్ వ్యాధులు మన శరీర వ్యవస్థను ప్రభావితంం చేస్తాయని అ ప్రమత్తతతో వ్యవహరించి వెంటనే చికిత్స చేయించుకోవాలన్నారు.కొన్ని వ్యాస్కులర్ వ్యాధులు గుండెపోటు ,స్ట్రోక్ వచ్చే వరకు ఎటువంటి లక్షణాలు చూపించకపోవచ్చు తగు జాగ్రత్తగా ఉండాలన్నారు.సభలో హాజరైన వారు వెలిబుచ్చిన సందేహాలను డాక్టర్ విజయ్‌కుమార్ నివృత్తి చేశారు.సభలో రుమటాలజిస్ట్ డాక్టర్ దీపిక,తెలుగు పండితులు రాజన్న మాస్టారు,అనవేమా ట్రస్ట్ అధ్యక్షుడు చల్లా అంజిరెడ్డి,విశ్రాంత ఆంధ్రాబ్యాంక్ మేనేజర్ ఫణికుమార్ లు ప్రసంగించారు.

## దాత ఎన్నారై ఆళ్ల వెంకట్‌కు ఘన సత్కారం

పెదనందిపాడు నవంబర్ 16(ప్రభాతవార్త): 108 సంవత్సరాలు ఘన చరిత్ర గల పెదనందిపాడు జడ్పీహెచ్ పాఠశాల పూర్వ విద్యార్థులు అప్సా జడ్.పి.హెచ్. ఎస్ హెల్పర్ అసోసియేషన్ స్థాపించి పాఠశాల అభివృద్ధికి కృషి చేయడం ప్రశంసనీయమని మండల విద్యాశాఖ అధికారి 1. సిహెచ్ రమేష్ బాబు అన్నారు పాఠశాలలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు.పాఠశాల పూర్వ విద్యార్థి అభివృద్ధి కమిటీ సభ్యులు ఎన్ఆర్ఐ టిడిపి అధ్యక్షులు ఆళ్ల వెంకట్ వారి మిత్రులు ఆళ్ళ శేషమాధవ్. తోటకూర శ్రావణ్ శ్రీనివాసల సహకారంతో తమ సొంత డబ్బులతో.జడ్పీ పాఠశాలలో



నలుగురు ప్రాథమిక పాఠశాల లో ఇద్దరు వాలంటీర్లను నియమించి పాఠశాలల అభివృద్ధికి విద్యాభివృద్ధికి విశేష సేవలందిస్తున్నారు. ఇప్పటివరకు వాలంటీర్లకు జీతాలు కింద రెండు లక్షల పైగా నగదు అందజేశారు. ఇదేగాక వెంకట్ మిత్రబృంద సహకారంతో పాఠశాలలో రోబోటిక్ క్లాసులో నిర్వహిస్తూ విద్యార్థులలో శాస్త్రీయ విజ్ఞానాన్ని పెంపొందించడం హర్షనీయం అని పలువురు వక్తలు పేర్కొన్నారు. జడ్పీ పాఠశాల విద్యార్థులు తయారుచేసి ప్రదర్శించిన రోబోట్ పనితీరును ప్రముఖులు పరిశీలించి అభినందించారు. అనంతరం పాఠశాల అభివృద్ధికి హర్నిశలు సహాయ సహకారాలు అందిస్తున్న ఆళ్ళ వెంకటను పూర్వ విద్యార్థుల సంఘం ఘనంగా సత్కరించింది. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు రావి శివరామకృష్ణయ్య. గుంటుపల్లి అప్పారావు. జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత. విశ్రాంత ఉపాధ్యాయురాలు మక్కెన జవహర్ రాణి. ఈదర హనుమంతరావు. దివి నాగరాజు. కూనిశెట్టి సాయి ప్రసాద్. పాఠశాలల ప్రధానోపాధ్యాయులు గోవిందు శ్రీనివాసరావు. కూనిశెట్టి అనిత. పలువురు ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

గుంటూరు వార్త



## బందోబస్తు ఏర్పాట్లు పరిశీలించిన ఎస్పీ

గుంటూరు క్రైమ్ ప్రభాతవార్త నవంబర్16: భారత రాజ్యాంగం ఆమోదించడానికి మేధావుల సంభాషణ జరిగి ఆదివారం నాటికి 75 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా మంగళగిరిలోని దిరీ కన్వెన్షలో ముఖ్య అతిధులు హాజరయ్యారు.అతిధులు రాకతో జిల్లా ఎస్పీ భద్రతా ఏర్పాట్లు ను నిర్వహించి పర్యవేక్షించారు.వీవీఐపీలకు పోలీస్ గౌరవ వందనం సమర్పించే దగ్గర నుండి వారు




సమావేశానికి హాజరయ్యేందుకు హాల్ లోకి ప్రవేశించే ప్రవేశ మార్గాలను, సమావేశం ముగిసిన తరువాత బయటకు వచ్చే మార్గాలను పరిశీలించి అక్కడ చేస్తున్న భద్రత తనిఖీల విధానాన్ని పరిశీలించి, వీవీఐపీల భద్రతను దృష్టిలో పెట్టుకుని, సమావేశానికి హాజరయ్యే ప్రతి ఒక్కరిని క్షుణ్ణంగా తనిఖీ చేసి అనుమతించాల, సూచించారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారిలో ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్ గవాయ్,ఆంధ్రప్రదేశ్ గవర్నర్ అబ్దుల్ నజీర్,ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాగూర్,ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఇతర న్యాయమూర్తులు,ప్రముఖులు పాల్గొన్నారు.ఎస్పీతో పాటు జిల్లా అదనపు ఎస్పీలు తిగిజు రవికుమార్ ,ఏ.హనుమంతు(ఏఆర్), ఎస్బి డిఎస్పీబి.శ్రీనివాసులు, నార్త్ డీఎస్పీ మురళీ కృష్ణ, తెనాలి డిఎస్పీ జనార్ధన్ రావు, ఎస్బి సీఐ అలహరి. శ్రీనివాస్, ఇతర పోలీస్ అధికారులు ఉన్నారు.

## సి.ఐ సతీష్ కుమార్ ఘటకు సంబంధించిన నిందితులను వెంటనే అరెస్టుచేయాలి

పెదనందిపాడు నవంబర్ 16 (ప్రభాతవార్త): గుంటూరు జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం పెదనందిపాడు మండల కేద్రం లో ఆదివారం సాయంత్రం. మండల శాలివాహన సంఘం ఆధ్వర్యంలో స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు.అనంతరం



పెదనందిపాడు ఏస్.ఐ మధుపవన్ కి వినతిపత్రం అందజేశారు.ఈ కార్యక్రమం లో భాగంగా శాలివాహన మండల సంఘ అధ్యక్షుడు నిజాంపట్నం సుబ్బారావు మాట్లాడుతూ టీటీడీ సీఐ సతీష్‌కుమార్ మృతి చాలా బాధాకరం అని సతీష్‌కుమార్ ప్రభుత్వ విధులు నిర్వహిస్తున్న వ్యక్తి హత్య జరిగి 36 గంటలు గడిచినప్పటికీ నిందితులను అరెస్ట్ చేయకపోవడం దారుణమని. సతీష్ కుమార్ హత్యకు కారుకులైన వారిని వెంటనే అరెస్ట్ చేసి శిక్షి ంచాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకుంటే బీసీ సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనకు సిద్ధమవుతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల బీసీ సంఘ అధ్యక్షులు అద్దంకి శివన్నారాయణ . మండలం శాలివాహన సంఘం నాయకులు చలగిరి సమ్రాజం, ధనలక్ష్మి ్మ, శివయ్య, నాగయ్య,శివాజీ, భూషణం,గోపి, నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

## కొల్లిపరలో ఆశ్యవైశ్య సంఘం ఆద్వర్యంలో వనసమారాధన

కొల్లిపర,నవంబరు 16 ప్రభాతవార్త: మండల కేంద్రం కొల్లిపరలో ఆశ్యవైశ్య సంఘ అద్యక్షుడు అన్నవరపు రమేష్ ఆద్వర్యంలో వనసమారాధన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. వనసమారాధన సందర్భంగా ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో పండితులు సత్యన్నారాయణ స్వామి వ్రతాన్ని నిర్వహించి కార్తీక మాసం విశిష్టతను గురించి వివరించారు.మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు.అనంతరం విరాళాలు ఇచ్చిన దాతలను ఆర్యవైశ్య సంఘ




నాయకులు ఘనంగా సత్కరించారు.తదనంతరం అన్నదానం నిర్వహించారు.కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘ మండల అద్యక్షుడు మునగాల రామలక్ష్మణరావు,మాజీ అద్యక్షులు తాతా సతీష్‌కుమార్,సోమిశెట్టి సురేష్‌బాబు,ఆలపాటి పూర్ణచంద్రరావు,కార్యదర్శి చుండూరు వెంకటరత్నం,కోశాధికారి కాజా ప్రసాదు,ఆర్యవైశ్య సంఘ నాయకులు సుగ్గల సురేష్‌కుమార్,బొల్లిశెట్టి హరీష్,మునగాల రామ్‌ప్రసాద్ దాసరి మణికంఠ,చుండూరు జగదీష్,మునగాల శివకోటేశ్వరరావు,కోడూరు అనిల్,మహిళా కార్యవర్గసభ్యులు చుండూరు సావిత్రి,మునగాల జయలక్ష్మి,మునగాల వరలక్ష్మి,శ్రీవాసవీసేవాసమితి కమిటీ సభ్యులు,వాసవీ సభ్యులు,యాత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## విజ్ఞాన దాయక సమాజ నిర్మాణానికి గ్రంథాలయాలు దోహదం

పెదనందిపాడు నవంబర్ 16 (ప్రభాతవార్త): ప్రజలలో విజ్ఞానాన్ని పెంచి మంచి ఆలోచనలను పంచడంలో గ్రంథాలయాలు కీలకపాత్ర పోషిస్తున్నాయని, విజ్ఞానదాయక సమాజ నిర్మాణానికి గ్రంథాలయాలు వారధిగా పనిచేస్తున్నాయని ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్ గేరా మోహనరావు అన్నారు. 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా ఆదివారం పెదనందిపాడు శాఖా గ్రంథాలయం నందు గ్రంథాలయ వారోత్సవాల అవగాహన ర్యాలీని నిర్వహించడం జరిగినది. ఈ సందర్భంగా గేరా మోహనరావు మాట్లాడుతూ జాతీయ స్ఫూర్తికి, విద్యావ్యాప్తికి, ప్రజలలో ఐక్యతను పెంపొందించడానికి గ్రంథాలయాలు ప్రముఖ పాత్ర పోషిస్తున్నానని తెలిపారు. నేటి యువత సెల్ ఫోన్లు, ఇంటర్నెట్ కు



బానిసలు కాకుండా గ్రంథాలయాలకు వచ్చి పుస్తక పఠనం అలవర్చుకోవాలని విజ్ఞప్తి చేశారు. గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలను ప్రజలందరూ గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని గేరా మోహన్ రావు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ నిర్వహకులు డి శివ నాగేశ్వరరావు,వార్డ్ మెంబర్ వెలినేని శివయ్య, మంజుల, రవీంద్ర, ఆనందరావు, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

## భరతమాత పూజాదినోత్సవ వేడుకలు

గుంటూరు కల్చరల్,నవంబర్ 16,ప్రభాతవార్త : స్థానిక బృందావన్ గార్డెన్స్‌లోని శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలోని శ్రీపద్మావతి కళ్యాణ మండపం వేదికగా సంస్కార భారతి అధ్యక్షులు ఇండ్ల శ్రీధర్‌బాబు బృందం ఆధ్వర్యంలో భరతమాత పూజాదినోత్సవ వేడుకల్లో ఆదివారం పాఠశాల





విద్యార్థులకు వివిధ రంగాల్లో పోటీలు నిర్వహించారు.నగరంలోని పలు పాఠశాలల నుండి కార్యక్రమంలో పాల్గొని 1వ తరగతి నుండి 10వ తరగతి వరకు సబ్ జూనియర్స్ ,జూనియర్స్ ,సీనియర్స్ చిత్రాలకు రంగులు వేయడం,వేమన శతక పద్యాలు,ఏకపాత్రాభినయం వంటి అనేక పోటీల్లో పాల్గొన్నారు.సుమారు 963మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు.సంస్థ వారు చిన్నారులకు ప్రశంసాపత్రాలు,బిస్కెట్లు పంపిణీ చేశారు.తొలుత కార్యక్రమాన్ని ఆలయ పాలక మండలి అధ్యక్షులు సిహెచ్ మస్తానయ్య,పలు రాష్ట్రాల అతిధులు ప్రారంభించారు.

## విజనరీ, నమ్మకంతోనే లక్షల కోట్ల పెట్టుబడులు

### సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ విధానాలే కారణం

### గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్

గుంటూరు వెస్ట్ నవంబర్ 16 ప్రభాతవార్త : సీఎం చంద్రబాబు నాయుడులాంటి విజనరీ, నమ్మకం, లోకేశ్ వంటి దూరదృష్టి కలిస్తే విశాఖ వేదికగా చరిత్ర ఆవిష్కృతమైందని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీ వెల్ఫేర్ కమిటీ ఛైర్మన్ నసీర్ అన్నారు. ఈ మేరకు ఆదివారం విడుదల చేసిన ఓ పత్రిక ప్రకటనలో ఎమ్మెల్యే నసీర్ పేర్కొన్నారు. రూ.13.25 లక్షల కోట్ల పెట్టుబడులతో 619 ఒప్పందాలతో దేశం దృష్టి మొత్తం ఏపీవైపు చూసేలా చేశామన్నారు. ప్రతి రాష్ట్రం ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ను అనుసరిస్తుంటే ఆంధ్రప్రదేశ్ స్పీడ్ ఆఫ్ డూయింగ్ ద్వారా ఇన్వెస్టర్లను ఆకర్షించిందని



చెప్పారు. ప్రతి రంగానికి స్పష్టమైన పాలసీలు రూపొందించి, సింగిల్ విండో విధానం ద్వారా అన్ని అనుమతులు వేగవంతంగా ఇస్తామని భరోసా కల్పించామని తెలిపారు. సదస్సుకు ఒక రోజు ముందే రూ.3,65,304 కోట్ల పెట్టుబడులతో 1.26,471 ఉద్యోగావకాశాలు సృష్టించేలా 35 సంస్థలతో ప్రభుత్వం ఒప్పందం కుదుర్చోవడం చూస్తుంటే సీఎం చంద్రబాబు నాయుడుపై పారిశ్రామికవేత్తలు ఎంత విశ్వాసం ఉంచారో అర్థమవుతుందన్నారు. సీఆర్డీఏ, ఎనర్జీ, ఫుడ్ ప్రాసెసింగ్, వాణిజ్యం, ఐటీ ఎలక్ట్రానిక్స్ , టూరిజం వంటి కీలక ఒప్పందాల ద్వారా యువత భవితకు భరోసా దొరికిందని చెప్పారు. అమరావతి రాజధాని ప్రాంతంలో ఉన్న గుంటూరు తూర్పు నియోజకవర్గ యువతకు ఇదొక గొప్ప వరమని పేర్కొన్నారు. పారిశ్రామికంగానూ, ఉద్యోగపరంగానూ తమ జీవితాలను ఉన్నతంగా మలుచుకునేందుకు ఇదొక వరమని అన్నారు. జగన్ విధ్వంసకర విధానాలకు భయపడి రాష్ట్రం విడిచి వెళ్లిపోయిన రెన్యూ, హీరో ఫ్యూచర్స్ వంటి కంపెనీలు సైతం సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేశ్ స్పీడ్ ఆఫ్ బిజినెస్ కు ఆకర్షితులై తిరిగి ఏపీకి రావడం చూస్తుంటే కూటమి ప్రభుత్వం విజనరీ అర్థమవుతుందని స్పష్టం చేశారు.

## రాష్ట్ర ప్రభుత్వంతో రూ. 70 కోట్ల పెట్టుబడికి అవగాహన ఒప్పందం

గుంటూరు విద్య, ప్రభాతవార్త: : భారతదేశపు అతిపెద్ద వైవిధ్యభరితమైన ఆగ్రిఫుడ్ వ్యాపారాలలో ఒకటైన గొద్రేజ్ ఆగ్రోవెట్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం తో ఒక నాన్‌బైండింగ్ అవగాహన ఒప్పందం పై సంతకం చేసింది. ఈ అవగాహన ఒప్పందం కింద, కంపెనీ తన పాడి వ్యాపారంలో పాడి ప్రాసెసింగ్ విలువజోడించిన ఉత్పత్తుల సామర్థ్యాలను విస్తరించడానికి మరియు ఆయిల్ పామ్ రైతులకు ఏకైక పరిష్కార కేంద్రాలైన కొత్త సమాధాన్ కేంద్రాలను ఏర్పాటు చేయడానికి 70 కోట్ల రూపాయలను పెట్టుబడిగా పెట్టనుంది.

## ఇంటర్ పబ్లిక్ పరీక్షల ఫీజు చెల్లింపునకు బోర్డు మరో అవకాశం


గుంటూరు విద్య, ప్రభాతవార్త : ఇంటర్ పబ్లిక్ పరీక్షల ఫీజు చెల్లింపునకు బోర్డు మరో అవకాశం కల్పించింది. ఇప్పటి దాకా ఫీజు చెల్లించని రెగ్యులర్, ప్రైవేటు విద్యార్థులు రూ.2,000 ఆలస్య రుసుం తో ఈ నెల 25 వరకు ఫీజు చెల్లించవచ్చని ఇంటర్మీడియట్ విద్యా మండలి కార్యదర్శి రంజిత్ బాషా తెలిపారు. జనరల్, ఒకేషనల్ గ్రూపుల విద్యార్థులకు ఈ అవకాశం వర్తిస్తుందన్నారు. కాగా, ఈ విద్యా సంవత్సరం నుంచి ఇంటర్ ఫస్టియర్ విద్యార్థులకు కొత్త సిలబస్, సీబీఎస్ఈ విధానాన్ని అమలు చేస్తోన్న విషయం తెలిసిందే. కొందరు విద్యార్థులు సెకండ్ లాంగ్వేజ్ ఆర్ట్స్ సబ్జెక్టులను, ఎంపీసీ, బైపీసీ కోర్సుల్లో బయాలజీ, గణితం సబ్జెక్టు లను ఆరో పేపర్ గా ఎంచుకున్నారు. దీంతో ఖీఒకరోజు ఒక పేపర్ఖీ విధానంలో పరీక్షలు జరిగేలా అధికారులు చర్యలు తీసుకున్నారు. అలాగే, గతేడాది ఫెయిలైన విద్యార్థులకు బ్యాక్ లాగ్ పేపర్లు పూర్తిచేసేలా షెడ్యూల్ రూపొం దించారు. ఇంటర్ ఫస్టియర్ పరీక్షలు ఫిబ్రవరి 23 నుంచి, సెకండియర్కి 24 నుంచి ప్రారం భం కానున్నాయి. మార్చి 24 వరకు పరీక్షలు జరుగుతాయి. ప్రాక్టికల్ పరీక్షలు ఒకేషనల్ విద్యార్థులకు జనవరి 27 నుంచి ఫిబ్రవరి 10 వరకు, జనరల్ విద్యార్థులకు ఫిబ్రవరి 1 నుంచి 10 వరకు జరుగుతాయి. సమగ్ర శిక్ష ప్రాజెక్టు లో భాగంగా నిర్వహిస్తోన్న ఒకేషనల్ ట్రేడ్స్కు ఫిబ్రవరి 13న ప్రాక్టికల్స్ ఉంటాయి. ఎథిక్స్ అండ్ హ్యూమన్ వేల్యూస్ పరీక్ష జనవరి 21న, పర్యావరణ విద్యపై 23న పరీక్ష నిర్వహిస్తారు.

## పీఎం శ్రీ పాఠశాలల విద్యార్థులకు విజ్ఞాన విహారయాత్రల నిధులు విడుదల

గుంటూరు విద్య, ప్రభాతవార్త: పీఎంశ్రీ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఈ ఏడాది విజ్ఞాన విహార యాత్రలకు అనుమతినిస్తూ ఎస్పీడీ వారు ఉత్తర్వులు విడుదల చేశారు ఆ మేరకు సమగ్ర శిక్షా ద్వారా ఒక్కో విద్యార్థికి రూ.500 వంతున నిధులు కేటాయించింది. సమగ్ర శిక్షా నిధులతో 6-12వ తరగతి వరకు విద్యార్థులను విహార యాత్రలకు వెళ్లేందుకు అనుమతినిచ్చారు. పాఠశాలలో ఉన్న విద్యార్థుల్లో 8శాతం విద్యార్థులకు నిధులు కేటాయించారు. ఈ నెల 20తో సమ్మేటివ్-1 పరీక్షలు ముగుస్తున్నందున అనంతరం నెలాఖరులోగా ఎక్స్‌పోజర్ విజిట్స్ పూర్తి చేయాలి.

## ఉచిత వేరికోస్ వీన్స్ వైద్య శిబిరం విజయవంతం

పెదనందిపాడు నవంబర్ 16 (ప్రభాతవార్త) పెదనందిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో టిడిపి సీనియర్.నాయకులురావిశివరామకృష్ణయ్య, దివ్వి నాగరాజు ల ఆధ్వర్యంలో .ఏషియస్ వాస్కులర్ హాస్పిటల్ హైదరాబాద్ వారి సహకారంతో ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత వెరికోస్ వీన్స్ వైద్య



శిబిరం విజయవంతమైంది. శిబిరంలో 200 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి అందులో 80 మందిని ప్రత్యేక పరీక్షలకు ఆసుపత్రి వద్దకు రమ్మని చెప్పడం జరిగిందని నిర్వాహకులు రావి శివరామకృష్ణయ్య దివి నాగరాజులు.తెలిపారు. సుమారు 5,000 రూపాయలు ఖరీదు చేసే వైద్య పరీక్షలను ఉచితంగా ప్రజలకు అందించడం జరిగిందని తెలిపారు. ఎన్నారై టిడిపి నాయకులు ఆళ్ల వెంకట్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన వైద్య చికిత్సలు అందించడానికి కృషి చేస్తున్న శివరామకృష్ణయ్య కు ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, టిడిపి మండల అధ్యక్షులు కోడూరి రాంబాబు, మక్కెన జవహర్ రాణి, బండి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సమావేశం



పెదనందిపాడు నవంబర్ 16 (ప్రభాతవార్త) ప్రత్తిపాడు మండలంలోని ఐసిడిఎస్ ప్రాజెక్ట్ కార్యాలయం ఈనెల10 నుండి16 తేదీ వరకు నిర్వహిస్తున్న బాలల వారోత్సవాలు లో బాగంగా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ వారి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా. డి సి పి ఓ విజయ్ కుమార్ మాట్లాడుతూ బాలబాలికల హక్కుల గురించి . చైల్డ్ వెల్ఫేర్ కమిటీ విజన్ లో పిల్లలందరికీ ఆరోగ్యకరమైన సంతోషకరమైన బాల్యాన్ని అందించడం లాంటి ఏ ఒక్క విషయంలో నైనా పిల్లలు వెనుక పడకూడదు అని .బాల్యవివాహాలు జరగకుండా చూడాలని పిల్లలను దత్తత తీసుకునే చట్టాల గురించివివరించారు. ఈ కార్యక్రమానికి అడ్వకేట్ వాసంతి అధ్యక్షత వహించగా సిడిపిఓ జి విజయలక్ష్మి ్మ . ఏ సి డి పి ఓ విజయనిర్మల .ఐసిడిఎస్ సెక్టార్ సూపర్వైజర్స్ పెదనందిపాడు పత్తిపాడు మండలాల కు చెందిన అంగన్వాడీల టీచర్స్.వర్కర్స్. మహిళా పోలీసులు పాల్గొన్నారు.

## అన్నక్యాంటీన్‌కు రూ.లక్ష విరాళం

చిలకలూరిపేట, నవంబర్ 16, ప్రభాతవార్త: చిలకలూరిపేట పట్టణానికి చెందిన దివంగత బొగ్గవరపు రామతులసమ్మ జ్ఞాపకార్థం బొగ్గవరపు చెంచు పూర్ణయ్య అన్న క్యాంటీన్ కు లక్ష రూపాయలు శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావుకు అందజేశారు.

## టిడిపి నేత మృతికి సంతాపం

చిలకలూరిపేట, నవంబర్ 16, ప్రభాతవార్త: చిలకలూరిపేటరూరల్ మండలం, మద్దిరాల గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు షేక్ షరీఫ్ మృతి చెందగా, వారి నివాసం వద్ద ఉంచిన పార్థివ దేహాన్ని సందర్శించి, నివాళులర్పించి, వారి కుటుంబసభ్యులను పరామర్శించిన శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు షేక్ కరీముల్లా గారు, జవ్వాజి మదన్ , గంగా శ్రీను , గట్టినేని రమేష్ , కోడె మణి , జాష్టి రవి , తదితరులు పాల్గొన్నారు.

## నూతన ప్రారంభం

చిలకలూరిపేట, నవంబర్ 16, ప్రభాతవార్త: చిలకలూరిపేట పట్టణంలోని, రూరల్ మండలం, మద్దిరాల గ్రామం నందు ప్రత్తిపాటి ప్రసాద్, లింగ రవి కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సాయి బాలాజీ గ్రానైట్ ను ప్రారంభించిన శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు షేక్ కరీముల్లా , జవ్వాజి మదన్ , గంగా శ్రీను , గట్టినేని రమేష్, కోడె మణి , జాష్టి రవి , తదితరులు పాల్గొన్నారు.

## వివాహ వేడుకల్లో పాల్గొన్న ప్రత్తిపాటి



చిలకలూరిపేట, నవంబర్ 16, ప్రభాతవార్త: మంగళగిరి పట్టణంలోని, దిరీ కన్వెన్షన్ సెంటర్‌లో రాజ్యసభ మాజీ సభ్యులు మోపిదేవి వెంకటరమణ కుమారుని వివాహానికి హాజరై, ఆ నూతన వధూవరులు రాజీవ్, దేదీప్యా ను ఆశీర్వాదించి, వారికి వివాహ శుభాకాంక్షలు తెలియచేసిన శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు

## ఘనంగా 'సత్య' వ్రతాలు

చిలకలూరిపేట, నవంబర్ 16, ప్రభాతవార్త: చిలకలూరిపేట పట్టణం చినప సుమద్రు జాతీయ రహదారి ఓగేరుకు దక్షిణాన ఉన్న అయ్యప్ప స్వామి దేవస్థానంలో కార్తీకమాస పర్వదినాన్ని పురస్కరించుకొని సామూహిక రమా సహిత సత్యనారాయణ స్వామి వ్రతాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతం లో దంపతుల పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ వెలంపల్లి రవిశంకర్ మాట్లాడుతూ దేవస్థానంలో దసరా నుంచి సంక్రాంతి వరకు అయ్యప్ప స్వామి మాల ధారులకు, మాల ధరించిన స్వాములకు ఆలయ కమిటీ సభ్యులు దాతలు భక్తుల సహకారంతో అన్న ప్రసాద్ వేతన ఆలయ కమిటీ సభ్యులు దాతలు భక్తుల సహకారంతో అన్న ప్రసాద్ వితరణ జరుగుతుందని తెలిపారు. కార్తీక మాసంలో దేవస్థానంలో ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహిస్తున్నామని అందులో భాగంగా సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించడం జరిగిందని ఈ వ్రతాలలో దంపతుల పెద్ద సంఖ్యలో పాల్గొన్నారని తెలియజేశారు. కార్యక్రమంలో పోలూరు పాండురంగారావు పసుమర్తి రామ మూర్తి, తవ్వ చలపతిరావు సుబ్రహ్మణ్యం, నాగబైరు జగన్మోహన్రావు, కరణం అనిల్, ఊటుకూరు శ్రీనివాసరావు, రమేష్, ఆలయ అర్చకులు వేద పండితులు శనగవరపు కిరణ్, వింజనంపాటి సాయి, లక్ష్మణ ఆలయ కమిటీ సభ్యులు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

## అయ్యప్ప స్వామికి ఘనంగా పూజలు

చిలకలూరిపేట, నవంబర్ 16, ప్రభాతవార్త: చిలకలూరిపేట సుభాని నగర్ లో వేంచేసి ఉన్న ఈ హరిహర క్షేత్రంలోని శ్రీ అయ్యప్ప స్వామి దేవస్థానం నందు ఆదివారం శబరిమల లో స్వామివారి ఆలయం తెరిచే రోజు కావడం వలన పట్టణంలోని సుభాని నగర్ లో ఏం చేసి ఉన్న అయ్యప్ప స్వామి దేవస్థానం నందు స్వామివారికి తెల్లవారుజాము నుంచే ఆవు పాలు ఆగు నెయ్యి పెరుగు తేనె మరియు సుగంధ భరిత ద్రవ్యాలతో ఘనంగా అభిషేకం జరిగింది ఈ కార్యక్రమము ఆలయ ప్రధాన అర్చకులు మరియు ఆలయ అధ్యక్షులు అంబటిపూడి వెంకటేష్ ఆధ్వర్యంలో జరిగే ఘనంగా జరిగాయి ఈ కార్యక్రమానికి అయ్యప్ప స్వాములు శివ స్వాములు భవాని సాంగ్ పెద్ద ఎత్తున హాజరై స్వామివారి అభిషేక తొలగించి స్వామి వారి చేత ప్రసాద స్వీకరించారు సాయంత్రం అయ్యప్ప స్వామి పడిపూజ జరుగుతుందని తెలిపారు

## వృద్ధులకు దుప్పట్లు, పండ్లు పంపిణీ



చిలకలూరిపేట, నవంబర్ 16, ప్రభాతవార్త: ఇన్నర్ వీల్ క్లబ్ ఆఫ్ చిలకలూరిపేట ఆధ్వర్యంలో స్థానిక సమస్థ నందు వృద్దులకు దుప్పట్లు, అరటి పండ్లు పంచడం జరిగింది. ఈ కార్యక్రమం లో ఇన్నర్ వీల్ ప్రెసిడెంట్ నార్నె జయలక్ష్మి, వైస్ ప్రెసిడెంట్ జాష్టి ప్రమీల, పాస్ట్ ప్రెసిడెంట్ తియ్యగూర రమాదేవి, మండవ మెంబర్స్ లలిత సునీత, సుగుణ, లక్ష్మి, దేవకీ పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి జాష్టి ప్రమీల దుప్పట్లు పంపిణీ చేశారు.

## 12 వార్డు స్మశానం వెనకవైపు బజార్‌ను పరిశీలించిన మున్సిపల్ చైర్మన్, యార్డ్ వైస్ చైర్మన్


చిలకలూరిపేట, నవంబర్ 16, ప్రభాతవార్త: చిలకలూరిపేట పట్టణంలోని శాసనసభ్యులు గౌరవనీయులు ప్రతిపాటి పుల్లారావు ఆదేశాల మేరకు 12 వ వార్డులోని మారుతి నగర్ ముందు



స్మశానం వెనకవైపు ఉన్నటువంటి వారిని కలిసి అక్కడ ఉన్న పరిస్థితులను స్మశానం వెనకవైపు గోడ పెంచడం మరియు రోడ్డు ఇరువైపులా కాలువలు వేయడం వారి సమస్యలను తెలుసుకొని మన శాసనసభ్యులు వారి దృష్టికి తీసుకుని వెళ్లి త్వరగా పరిష్కారం చేస్తామని మున్సిపల్ చైర్మన్ షేక్. రఫాని గారు మరియు మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ పిల్లి కోటి గారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వార్డు ప్రెసిడెంట్ రాము మరియు టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## అభివృద్ధిలో ముఖ్యమంత్రి అసలు రాజీపడరు : ప్రత్తిపాటి

చిలకలూరిపేట, నవంబర్ 16, ప్రభాతవార్త: పార్కులు, చెరువులు, శ్మశానాల అభివృద్ధి విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు అసలెప్పుడూ రాజీపడరని, పట్టణాలు, గ్రామాల్లో చెత్తను ఏ రోజుకి ఆ రోజే జనావాసాలకు దూరంగా తరలిస్తున్నారని, నగరాలు, పల్లెల శుభ్రతతోనే ప్రజారోగ్యం ముడిపడి ఉందని మాజీమంత్రి , శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. రాష్ట్రాన్ని మిగులు బడ్జెట్ లోకి తీసుకొచ్చి, ఆదాయం పెంచి, ప్రజల సంపద పెంచాలనే కృతనిశ్చయంతో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్ ఉన్నారని ఆయన చెప్పారు. సీఐఐ



సదస్సును విజయవంతంచేసి పెట్టుబడులు ఆకర్షించడంలో ముఖ్య మంత్రి సూపర్ సక్సెస్ అయ్యారని ప్రత్తిపాటి చెప్పారు. పట్టణంలోని సీ.ఆర్ కాలనీ పార్క్ లో వాకర్స్ క్లబ్ అసోసియేషన్ నిర్వాహకులు, సభ్యులు ఆదివారం ఏర్పాటు చేసిన వనభోజనాల కార్యక్రమానికి ప్రత్తిపాటి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. చిలకలూరిపేట ఆత్మీయుడు ఐఏఎస్ కృష్ణతేజ వంటి ఈ ప్రాంతానికి చెందిన ప్రముఖులు, ఉన్నతస్థానాల్లో ఉన్నవారు మన ప్రాంత అభివృద్ధికి సహాయ సహకారాలు అందించడంలో ఎప్పుడూ ముందే ఉంటారని ప్రత్తిపాటి చెప్పారు. ఐఏఎస్ అధికారి కృష్ణతేజ పార్క్ అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పడం ఆయన గొప్పతనానికి నిదర్శనమన్నారు. చిలకలూరిపేట ఆణి ముత్యమైన కృష్ణతేజ సీ.ఎస్.ఆర్ నిధుల్ని సమాజపురోభివృద్ధికి వినియోగిస్తున్నారని ప్రత్తిపాటి చెప్పారు. నిన్ననే ఆర్.వి.ఎస్ పాఠశాల మరుగుదొడ్లు, స్విమ్మింగ్ పూల్ నిర్మాణానికి కృష్ణతేజ రూ.40 లక్షలు అందించారని తెలిపారు. సీ.ఆర్. పార్కును ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఎక్కడా లేనివిధంగా అభివృద్ధి చేయడానికి తగిన సహాయ సహకారాలు అందిస్తామని, ప్రభుత్వంతో మాట్లాడి నిధులు మంజూరు అయ్యేలా చూస్తానని, అవసరమైతే మున్సిపాలిటీ నిధులు కూడా కేటాయిస్తామన్నారు. ప్రత్తిపాటి హామీ ఇచ్చారు. ప్రహరీ గోడ మరమ్మతులు, రంగులు వేసే పనులు, పార్క్ కు ఎదురుగా టాయిలెట్ల నిర్మాణం, వాటర్ ఫౌంటేన్ ఏర్పాటు, పార్క్ సంరక్షణకు ఇద్దరు వాచ్ మెన్ లు, నేమ్ బోర్డ్ ఏర్పాటు చేయాలని కోరుతూ నిర్వాహకులు, సభ్యులు ఎమ్మెల్యే ప్రత్తిపాటికి వినతి పత్రం అందించారు. టీడీపీ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ టీడీపీ కరీముల్లా, మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ గంగా శ్రీనివాసరావు, క్లబ్ సభ్యులు పఠాన్ జాఫర్ ఖాన్, గుడిపల్లి సాంబశివరావు, అరెకట్ల కోటి సుబ్బారావు, విరుమట్ల శ్రీనివాసరావు, రామ సుబ్బారావు, గ్రంధి భాస్కర్ రావు, మోహన్ రావు, మారెళ్ళ అప్పారావు, గట్టినేని రమేష్, పిల్లి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# పల్నాడు జిల్లా వార్త



## మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగించుకోండి : కలెక్టర్



నరసరావుపేట,నవంబరు16 ప్రభాతవార్త : మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగించుకోవాలని కలెక్టర్ కృతికాశుక్లా ఆదివారం జిల్లా ప్రజలను కోరారు. ఈ నెల 17వతేదీన కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కారవేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. అర్జీదారులు దాఖలు చేసిన తమ అర్జీలకు సంబంధించిన వివరాలను 1100 నెంబర్‌కు కాల్ చేసి తెలుసుకోవచ్చన్నారు. అదే విధంగా తమ అర్జీలను మీ కోసం డాట్ ఏపి డాట్ జిఓవి డాట్ ఇన్ వెబ్‌సైట్ నందు నమోదు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. పబ్లిక్ గ్రీవెన్స్ ఉదయం 10 గంటల నుండి 2 గంటల వరకు జరుగుతుందన్నారు. గతంలో ఇచ్చిన అర్జీలకు సంబంధించి స్లిప్పులను ప్రజలు తమ వెంట తీసుకురావాలని కలెక్టర్ కృతికాశుక్లా సూచించారు.

## గ్రంథాలయంలో ప్రముఖులకు నివాళి



నరసరావుపేట, నవంబరు 16ప్రభాతవార్త : స్థానిక శాఖ గ్రంథాలయంలో ఆదివారం గ్రంథాలయధికారి యడ్లపాటిరాధా అధ్వర్యంలో ప్రముఖులు ఎస్ఆర్ రంగనాథన్, అయ్యంకి వెంకట రమణయ్య, పాతూరి నాగభూషణంలకు నివాళి తెలిపారు. వారి చిత్ర పటాలకు పూలమాలలు వేసి, సమాజానికి అందించిన సేవలు గుర్తు చేసారు. కృష్ణవేణి కళాశాల ప్రిన్సిపాల్ నాతాని వెంకటేశ్వర్లు, కె కుమారి గ్రంథాలయానికి అందిస్తున్న సహాయాన్ని వారు తెలిపారు. గ్రంథాలయోద్యమకారునిగా అయ్యంకి వెంకట రమణయ్య గొప్ప సేవలందించారని పేర్కొన్నారు. కెఎంఎల్‌ప్రసాద్ మాట్లాడుతూ ఎస్ఆర్ రంగనాథన్ చేసిన సేవలు వివరించారు. కార్యక్రమంలో విద్యార్థులకు వ్యాస రచనపోటీలు నిర్వహించారు. అదే విధంగా అవధాన సుధాకర బాల సుబ్రమణ్యం 380వ అష్టావధానం నిర్వహించారు.ప్రముఖులు చేరెడ్డి మస్తాన్‌రెడ్డి, పి రాధాకృష్ణమూర్తి, భాను ప్రసాదరావు,నాగరాజ శర్మ, రత్నాకరం రాము, శివరామయ్య, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## పట్టణంలో వైఎస్సార్‌సిపి ఆందోళన



నరసరావుపేట, నవంబరు 16ప్రభాతవార్త : పట్టణంలో ఆదివారం వైఎస్సార్‌సిపి ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద జిల్లా వైకాపా వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి మాట్లాడారు. హిందూపురం వైకాపా కార్యాలయం పై టిడిపి గుండాలు దాడి చేసి ఫర్నిచర్ ధ్వంసం చేయటం, కార్యాలయంలోని సిబ్బందిని గాయపర్చటం దారుణమన్నారు. వందలు, వేల తప్పులు ప్రభుత్వం చేస్తుందన్నారు. ప్రజా వ్యతిరేకతను దృష్టి మరల్చేందుకు ప్రయత్నం ఇటువంటి దుర్మర్గాలను చేస్తున్నారని తెలిపారు. ప్రజాస్వామ్యం ఖూని అవుతుందని ఆందోళన వ్యక్తం చేసారు. దాడికి పాల్పడిన వారిని అరెస్ట్ చేయలని డిమాండ్ చేసారు. వారిని తమ పార్టీ ఖచ్చితంగా వదిలి పెట్టదని హెచ్చరించారు. రాబోయే రోజుల్లో ఎవ్వరిని వదిలిపెట్టే పరిస్థితి ఉండదని డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు.కార్యక్రమంలో పార్టీ అనుబంధ సంఘాల నాయకులు పాల్గొని మాట్లాడారు.

## గ్రంథాలయ వారోత్సవాలు

నకరికల్లు, నవంబరు 16ప్రభాతవార్త : నకరికల్లు శాఖ గ్రంథాలయంలో ఆదివారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు.గ్రంథాలయాధికారి పాశం నారాయణ రెడ్డి ఈ సందర్భంగా మాట్లాడారు. గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా నిర్వహిస్తున్న కార్యక్రమాలకు సహాకారం అందిస్తున్న గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు, విద్యార్థులకు కృతజ్ఞతలు తెలిపారు. అదే విధంగా గ్రంథాలయ పితామహులు అయిన అయ్యంకి వెంకట రమణయ్య చిత్ర పటానికి పూలమాలలు వేసి వారి సేవలను గుర్తు చేసారు. వారి ఆశయాలను కొనసాగించేందుకు యువత ముందుకు రావాలని పాశం నారాయణరెడ్డి కోరారు.

## స్విమ్మింగ్ పోటీలకు ఎంపికైన ఎస్ఎస్ఎన్ విద్యార్థి

నరసరావుపేట, నవంబర్ 16 ప్రభాతవార్త :అఖిల భారత అంతర్ విశ్వవిద్యాలయాల స్విమ్మింగ్ పోటీలకు స్థానిక శ్రీ సుబ్బరాయ అండ్ నారాయణ కళాశాలకు చెందిన యస్. జగదీశ్ ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంయస్. సుధీర్ ఆదివారం తెలిపారు. ఈనెల 14న గుంటూరులోని



ఎన్టీఆర్ స్విమ్మింగ్ పూల్ లో జరిగిన ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ స్విమ్మింగ్ టీమ్ సెలెక్షన్స్‌లో తమ కళాశాల యస్. జగదీశ్ 100 మీటర్లు బటర్ ఫ్లై ఈవేంట్ 1.5 సెకండ్స్ లోను, 800 మీటర్లు ఫ్రీస్టయిల్ ఈవేంట్ 10నిమిషాల 25సెకండ్స్‌లో ఈది ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ (పురుషుల) టీమ్ కి ఎంపికయ్యాడని తెలిపారు. డిసెంబర్ 18 23వ తేది వరకు ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో జరిగే అఖిల భారత అంతర్ విశ్వవిద్యాలయాల స్విమ్మింగ్ పోటీల్లో పాల్గొనబోతున్నాడని చెప్పారు. ఈ సందర్భంగా యస్. జగదీశ్ ను కళాశాల పాలకవర్గ అధ్యక్షులు కపలవాయి విజయకుమార్, సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ మరియు మాజీ మున్సిపల్ ఛైర్పర్సన్ నాగసరపు సుబ్బరాయగుప్తా, జాయింట్ సెక్రెటరీ ఊటుకూరి వెంకట అప్పారావు, పాలకవర్గ సభ్యులు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి. శ్రీనివాస సాయి, వ్యాయమ అధ్యాపకులు డాక్టర్ యక్కల మధుసూదనరావు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, అభినందించారు.

## కార్తీక వన సమారాధనల్లో పాల్గొన్న ఎమ్మెల్యే చదలవాడ

నరసరావుపేట, నవంబర్ 16 ప్రభాతవార్త :నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు ఆదివారం కోటప్పకొండలో నిర్వహించిన వివిధ కార్తిక వన సమారాధన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కోటప్పకొండ ఏకలవ్యుల కార్తీక వన సమారాధన కార్యక్రమంలో పాల్గొని ఏకలవ్య మరియు బిఆర్. అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కోటప్పకొండ



యాదవ కార్తీక వన సమారాధన కార్యక్రమంలో పాల్గొని, సమాజ సేవా కార్యక్రమాలను ప్రశంసించారు. శ్రీ త్రికోటేశ్వర కృష్ణ బలిజ సంఘం అన్నదాన సత్రం వద్ద జరిగిన శ్రీ సత్యనారాయణ వ్రతం మరియు వనసమారాధన మహోత్సవంలో ఎమ్మెల్యే అరవింద బాబు హాజరై, అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించి భక్తులతో కలిసి ప్రార్థనలు చేశారు. మేదర కార్తీక వన సమారాధన, రజకుల అన్నదాన సత్రంలో రజక కార్తీక వన సమారాధన కార్యక్రమంలో హాజరై, సమాజంలోని వివిధ వర్గాల అభివృద్ధికి తన మద్దతు ఇస్తానని హామీ ఇచ్చారు. కోటప్పకొండ బార్ అసోసియేషన్ సభ్యుల కార్తీక వన సమారాధన కార్యక్రమంలోను ఎమ్మెల్యే పాల్గొని, న్యాయవాదుల సేవలను కొనియాడారు.

## ఘనంగా రెడ్డి సామాజిక వర్గ కార్తీక వన సమారాధన

నరసరావుపేట, నవంబర్ 16 ప్రభాతవార్త : మండలంలోని ప్రముఖ శైవ క్షేత్రమైన కోటప్పకొండ వద్ద ఆదివారం రెడ్డి సామాజిక వర్గ కార్తీక వనభోజనాలు ఘనంగా జరిగాయి. కార్యక్రమంలో వేల సంఖ్యలో రెడ్డి సామాజిక వర్గం వారితో పాటు ఇతర కులాల వారు పాల్గొన్నారు. వైయస్సార్సీపి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, వైకాపా అధికార ప్రతినిధి కారుమూరు వెంకటరెడ్డి,



సత్తనపల్లి నియోజకవర్గ పార్టీ ఇన్చార్జి డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ్ రెడ్డి,ప్రముఖ వైద్యులు డాక్టర్ గజ్జల బ్రహ్మారెడ్డి,డాక్టర్ చెంచి రెడ్డి, డాక్టర్ కామిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి పాల్గొని హాజరైన వారిని ఉద్దేశించి మాట్లాడారు. రెడ్డి అనేది కులం కాదని గుణమని తెలిపారు. కులానికి వైయస్ రాజశేఖర్ రెడ్డి వన్నెతెచ్చారని ఆయన బాటలోనే మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి నడుస్తున్నారని అండగా ఉండాలని పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రిగా రాష్ట్ర ప్రజలకు సేవలు అందించిన అనేకమంది ఆశయ సాధన కొరకు రాబోయే ఎన్నికల్లో కచ్చితంగా వైఎస్ జగన్ ను ముఖ్యమంత్రి చేసుకోవాలని పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం రెడ్డి సామాజిక వర్గ అధికారులను, రాజకీయ పార్టీ నాయకులు, కార్యకర్తలను అక్రమ కేసులతో వేధిస్తున్నారని ఆరోపించారు. సూపర్ సిక్స్ హామీలు అమలు చేశామంటూ అబద్ధాలతో ప్రజలను మోసం చేసే ప్రయత్నం ప్రభుత్వం చేస్తుందన్నారు. అన్నీ సామాజిక వర్గాలు సుఖ సంతోషాలతో ఉండేందుకు ఖచ్చితంగా వైఎస్ జగన్మోహన్ రెడ్డి పాలన రావాలని వారన్నారు. తొలుత యోగి వేమారెడ్డి,వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహాలకు పూలమాలలు వేసి వారు నివాళులర్పించారు. పాల్గొన్న 16 వేల మందికి అన్న ప్రసాద కార్యక్రమాలను ప్రముఖులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. అన్నదాన సత్రం కమిటీ సభ్యులు ప్రత్యేక కార్యక్రమాలను పర్యవేక్షి ంచారు.

## అమాయక కుటుంబాలను వేధిస్తున్నారు: డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి

నరసరావుపేట, నవంబర్ 16 ప్రభాతవార్త :అభం శుభం తెలియని ఎస్సీ కుటుంబానికి చెందిన ఖాదర్ కుటుంబ సభ్యులను హత్య కేసులో ఇరికించడానికి ప్రయత్నించినందుకు టిడిపి నాయకులు క్షమాపణలు చెప్పాలని పల్నాడు జిల్లా వైసీపీ కార్యనిర్వాహక అధ్యక్షులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి డిమాండ్ చేశారు. స్వర్గపురి 2 హత్య కేసులో ఆరోపణలు ఎదుర్కొన్న ఖాదర్ భార్య సారమ్మ తీవ్ర



మానసిక క్షోభతో నరాలు చిట్లి పోయి పక్షవాతానికి గురై ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నా సారమ్మను ఆదివారం డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి కలిసి, వారి కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి ధైర్యం చెప్పారు. అనంతరం డాక్టర్ గోపిరెడ్డి మాట్లాడుతూ గత నెల 17వ తేదీన స్వర్గపురి 2 లో జరిగిన గాడిపర్తి ఎఫ్రాన్ హత్య కేసులో ఖాదర్ అనే వ్యక్తి ప్రమేయం ఉందంటూ, హత్య కేసులో ఇరికించాలని పోలీసులపై స్థానిక టిడిపి నాయకులు తీవ్రమైన ఒత్తిడి తీసుకువచ్చి వారిని పోలీస్ స్టేషన్ కు తరలించి తీవ్ర మానసిక ఒత్తిడికి గురి చేశారని ఆరోపించారు. హత్య కేసులో చనిపోయిన ఎఫ్రాన్ సహాయకుడు నాగరాజు అనే వ్యక్తిని నేరస్తుడుగా పేర్కొంటూ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించే వరకు మానసిక ఒత్తిడికి గురయ్యిన ఖాదర్ భార్య సారమ్మ పక్షవాతానికి గురై, ప్రస్తుతం ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారని తెలిపారు. తప్పుడు ఆరోపణలు చేయడం మానుకొని, అమాయకులైన వ్యక్తులను ఇబ్బంది పెట్టటం మానుకోవాలన్నారు. భవిష్యత్తులో ఖాదర్ కుటుంబానికి ఏదైనా ఆపద వాటిల్లితే దానికి పూర్తి బాధ్యత టిడిపి వహించాల్సి ఉంటుందన్నారు. తక్షణమే తప్పుడు ఆరోపణలు చేసినందుకు ఖాదర్ కుటుంబ సభ్యులకు ఆయన క్షమాపణ చెప్పాలని డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఉన్నారు.

## బ్రాహ్మణుల సంక్షేమానికి అందరం కలిసి కృషి చేద్దాం

### -ఏపి బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య రాష్ట్ర కోశాధికారి ప్రసాద్

పొన్నూరు, నవంబరు 16,ప్రభాతవార్త: పేద బ్రాహ్మణుల సంక్షేమానికి అందరం కలిసి కృషి చేద్దామని ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య రాష్ట్ర కోశాధికారి పివిఎస్ఎస్వి ప్రసాద్(ఆడిటర్) పిలుపునిచ్చారు. స్థానిక బ్రాహ్మణ బజారులోని గాయత్రీ మందిరంలో బ్రాహ్మణ కార్తీక వన సమారాధన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పివిఎస్ఎస్వి ప్రసాద్ మాటా్లడుతూ పేద బ్రాహ్మణుల అభ్యున్నతికి బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య ఆధ్వర్యంలో ఎంత వరకు చేయగలమో అంతవరకు ప్రయోజనం చేకూరే విధంగా చేస్తున్నామన్నారు. శంకరమఠం, గాయత్రీ మందిరంలో నిర్వహించే కార్యక్రమాలకు బ్రాహ్మణ మహాసభ సభ్యులందరూ సహకరిస్తున్నారన్నారు. వారి సహకారం వల్లే నిర్వహించే ప్రతి కార్యక్రమం విజయవంతమవుతుందన్నారు. అదేవిధంగా ఇటీవల పదవులు పొందిన పలువురిని సత్కరించారు. ఈ కార ్యక్రమంలో బ్రాహ్మణ మహాసభ అధ్యక్షుడు గణపవరపు రామశాస్త్రి, ఎఆర్‌కెస్టీసాయి, దేశిరాజు శ్రీనివాసరావు, దేశిరాజు బాలగంగాధర తిలక్, మునిపల్లె మురళి,జానపాటి శివప్రసాద్‌శాస్త్రి తదితరులు ఏర్పాట్లు చేశారు.



## జాతీయ గ్రంధాలయ వారోత్సవాలు ప్రారంభం


తాడేపల్లి,నవంబర్ 16,ప్రభాతవార్త : తాడేపల్లి శాఖా గ్రంధాలయంలో 58వ జాతీయ గ్రంధాలయ వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు.మొదటిరోజు జవహర్‌లాల్ నెహ్రు జన్మదిన సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేశారు.కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్ ఉపాధ్యాయులు గన్ని శ్రీనివాస విశ్వనాథ్ మరియు ఆర్ శ్రీలత,టి.జయ శారద విచ్చేశారు.ముఖ్యఅతిథి శ్రీశ్రీ వాసవి విశ్వనాథ్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి తమ జీవితంలో ఏదో ఒకరోజు ఏదో ఒక క్షణం తప్పనిసరిగా గ్రంధాలయానికి విచ్చేయడం జరుగుతుందని దీనివల్ల జ్ఞాన సముపార్జన జరుగుతుందని ఖచ్చితంగా ప్రతి విద్యార్థి గ్రంధాలయంలోని పుస్తకాలను చదివి జ్ఞానాన్ని పెంపొందించుకోవాలని తెలిపారు.జూనియర్ ్స విభాగంలో విద్యార్థిని విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించారు.కార్యక్రమానికి న్యాయ నిరే ్ణతగా గన్నే శ్రీనివాస విశ్వనాథన్ వ్యవహరించారని గ్రంధాలయాధికారి షేక్ నాగూర్ బాష తెలిపారు.

## నేటి యువత నెహ్రూను ఆదర్శంగా తీసుకోవాలి : షేక్ సలీం

తాడేపల్లి,నవంబర్ 16,ప్రభాతవార్త : భారత మొదటి ప్రధానమంత్రి పండిట్ జవహర్‌లాల్ నెహ్రు జయంతి వేడుకలు ఎంటిఎంసి పరిధిలోని తాడేపల్లి నెహ్రుబొమ్మ సెంటర్‌లో కాంగ్రెస్ పార్టీతాడేపల్లి పట్టణ అధ్యక్షులు దర్శనపు శ్యామ్యూల్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.కార్యక్రమంలో ముఖ్య అతిధులుగా కాంగ్రెస్ పార్టీ మంగళగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి షేక్ సలీం పాల్గొని నెహ్రు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత దేశానికి స్వాతంత్రం అనంతరం సుదీర్ఘకాలం ప్రధానమంత్రి గా పనిచేసి పంచవర ్ష ప్రణాళికలను తీసుకొచ్చి దేశాభివృద్ధిలో నెహ్రు కీలకపాత్ర వహించారన్నారు.శాంతియుత పాలన అందించడంలో నెహ్రు ముందున్నారని నేటి యువకు ఆయన ఆదర్శమన్నారు.దేశవ్యాప్తంగా ఇరిగేషన్ ప్రాజెక్టులు నిర్మించి దేశాన్ని సుసంపన్నం చేసిన మహానీయుడు జవహర్‌లాల్ నెహ్రు అని కొనియాడారు.నెహ్రుకు చిన్న పిల్లలంటే అమితమైన ప్రేమని అందుకు పండిత్ జవహర్‌లాల్ నెహ్రు జయంతి వేడుకలను బాలల దినోత్సవంగా జరుపుకోవడం జరుగుతుందన్నారు.కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు షేక్ ముని ్న,జిల్లా కాపు సాధికారిక చైర్మన్ రేమిడిశెట్టి హనుమంతరావు,మంగళగిరి మండల అధ్యక్షులు కుప్పాల కృష్ణచౌదరి,నియోజకవర్గ బిసి సెల్ అధ్యక్షులు ఆర్ల వెంకటస్వామి,జిల్లా ఎస్సీ సెల్ వైస్ ప్రెసిడెంట్ బొల్లా సమర్పణకుమార్,తాడికొ ండ వెంకటేశ్వరరావు,తదితరులు పాల్గొన్నారు.

## రెండోరోజు పుస్తక ప్రదర్శన

తాడేపల్లి,నవంబర్ 16,ప్రభాతవార్త : స్థానిక శాఖా గ్రంధాలయంలో 58వ జాతీయ గ్రంధాలయ వారోత్సవాల్లో భాగంగా రెండోరోజు పుస్తక ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమానికి స్థ ానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల శ్రీభగవాన్ రవీంద్రభారతీ విద్యార్థులు పాల్గొన్నారు.విద్యార్థులు గ్రంధాలయాలు అనే అంశం మీద జూనియర్స్ విభాగంలో వ్యాసరచన పోటీలు నిర్వహించారు.కార ్యక్రమానికి ఎం.జ్యోతి,డి.సునీత,టి.జయశారద,ఆర్ శ్రీలత ఉపాధ్యాయురాలు న్యాయ నిర్ణేతగా వ్యవహరించారని గ్రంధాలయాధికారి తెలిపారు.



## విశ్రాంత అధ్యాపకులు మాణిక్యా రావు శత జయంతి ఉత్సవాలు

నకరికల్లు, నవంబర్ 16 ప్రభాతవార్త :స్థానిక శ్రీ సుబ్బరాయ నారాయణ కళాశాలలో ఆదివారం కళాశాల యాజమాన్యం మరియు ఆక్టా ఏపీ సంయుక్త ఆధ్వర్యంలో ఎంజే. మాణిక్యారావు శతజయంతి ఉత్సవాలలో భాగంగా 17వ సంస్మరణ సభ ఘనంగా నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంఎస్. సుధీర్ తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల యాజమాన్యం, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది ఎంజే. మాణిక్యా రావు చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి, ఘననివాళి అర్పించారు. కార్యక్రమంలో ముఖ్య అతిధిగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు హాజరై మాణిక్యా రావుతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. వీరు అనేక ఉద్యమాలు చేపట్టి, అధ్యాపకులకు, ఎయిడెడ్ కళాశాలలో పని చేస్తున్న సిబ్బందికి గవర్నమెంట్ ఉద్యోగులతో సమానంగా నేరుగా వ్యక్తిగత బ్యాంకు ఖాతాలకు జీతాలు, పెన్షన్లు, పీఎఫ్, రిటైర్మెంట్ బెనిఫిట్లు, యూజీసీ మొదలైనవి వచ్చేటట్లు కృషి చేశారని అన్నారు. కార్యక్రమంలో కళాశాల కమిటీ అధ్యక్ష, కార్యదర్శులులు కపలవాయి విజయ కుమార్, నాగసరపు సుబ్బరాయ గుప్తా ఆక్టా ఏపీ రాష్ట్ర ప్రెసిడెంట్ కే. మోహన రావు, కళాశాల వైస్ ప్రిన్సిపాల్, ఆక్టా ఏపీ రాష్ట్ర అడిషనల్ జనరల్ సెక్రటరీ డాక్టర్ పి. శ్రీనివాస సాయి, ఆక్టా ఏపీ రాష్ట్ర జనరల్ సెక్రటరీ ఎం. శ్రీనివాస రెడ్డి, రాష్ట్ర పబ్లికేషన్ సెక్రటరీ డాక్టర్ ఐ. సదాశివరెడ్డి, ఆక్టా ఏపీ కళాశాల యూనిట్ ప్రెసిడెంట్ డాక్టర్ ఎం. రమేష్, వి. ఆనంద కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# బాపట్ల జిల్లా వార్త



## విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు

రేపల్లె, నవంబరు 16,ప్రభాతవార్త: జాతీయ గ్రంధాలయ వారోత్సవాల సందర్భంగా ఆదివారం రేపల్లె మండలంలోని నల్లూరుపాలెం శాఖా గ్రంధాలయంలో విద్యార్థులకు చిత్ర లేఖనం పోటీలు జరిగాయి.ముందుగా గ్రంధాలయాల అభివృద్ధికి కృషి చేసిన అయ్యంకి వెంకట రమణయ్య,ఎస్.ఆర్.రంగనాథ్,పాతూరి నాగభూషణం చిత్రపటాలకు గ్రంధాలయ అభివృద్ధి కమిటీ ఛైర్మన్ ఎం.సంగీతరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రంధాలయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంధాలయ శాఖ అధికారి పి.శివకృష్ణ, గ్రంధాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు,పాఠకులు పాల్గొన్నారు.

## బంధు మిత్రులను కలిపే కార్తీక వనభోజనాలు: మంత్రి అనగాని

రేపల్లె,నవంబరు 16, ప్రభాతవార్త:కార్తీక మాసంలో వనభోజనాల కార్యక్రమం ప్రకృతితో అనుబంధాన్ని పెంచుకోవటంలో భాగంగా బంధు మిత్రులను కలిపి సంతోషాన్ని కలిగిస్తుందని రాష్ట్ర రెవెన్యూ రిజిస్ట్రేషన్ స్టాంప్స్ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు.ఆదివారం రేపల్లె మండలంలోని ఉయ్యూరువారి పాలెంలో రేపల్లె పట్టణ గౌడ సంఘీయుల కార్తీక సమారాధన కార్యక్రమం జరిగింది.శాస్త్రోక్తంగా సత్యనారాయణ స్వామి వ్రతాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా మంత్రి అనగాని సత్యప్రసాద్ మాట్లాడుతూ ప్రజలు భక్తి మార్గంలో ముందుకు సాగటం శుభ పరిణామం అన్నారు. ఐకమత్యంతో గౌడ సంఘీయులు విస్తృతంగా సేవా కార్యక్రమాలు నిర్వహించాలని ఆయన పిలుపునిచ్చారు.గౌడ సంఘీయుల సమస్యలు పరిశీలించి పరిష్కరిస్తానని మంత్రి హామీనిచ్చారు.గౌడ సంఘీయులకు అందుబాటులో ఉంటానని చెప్పారు. ఈ కార్యక్రమంలో మంత్రి సోదరుడు, సీనియర్ టిడిపి నేత అనగాని శివప్రసాద్ టి.ఏడుకొండలు, గుర్రం మురహరి రావు,కేసన రవీంద్ర,కేసన నరసింహ,కేసన సోమయ్య, రాంబాబు,మాజీ కౌన్సిలర్ గుర్రం విజయలక్ష్మి, ఎం.అంజయ్య, పడమట సాంబయ్య, పడమట వెంకట సుబ్బారావు, న్యాయవాది కె.రవి బాబు తదితరులు పాల్గొన్నారు.



## ప్రైవేట్ విద్యా సంస్థలను మూసివేయించిన ఎస్ఎఫ్ఐ

రేపల్లె, నవంబరు 16,ప్రభాతవార్త: రేపల్లె పట్టణంలో ఆదివారం సెలవు అయినప్పటికీ నిబంధనలకు విరుద్ధంగా పనిచేస్తున్న ప్రైవేట్ కార్పొరేట్ విద్యా సంస్థలను ఎస్ఎఫ్ఐ నాయకులు మూసివేయించారు.శ్రీ చైతన్య, నారాయణ,భాష్యం, మోంట్ ఫోర్ట్,ఆర్.కె మోడల్, రాఘవ, వివేకానంద పాఠశాలలతో పాటు శ్రీ చైతన్య కాలేజీ పనిచేస్తున్నట్లు గుర్తించిన ఎస్ఎఫ్ఐ నాయకులు నిరసన తెలిపారు.ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రేపల్లె శాఖ కార్యదర్శి ఎం.సూర్యప్రకాష్ మాట్లాడుతూ విద్యాశాఖ అధికారుల నిర్లక్ష్యం వలన నిబంధనలు అమలు కావడంలేదన్నారు. మానసికంగా విద్యార్థులను ఒత్తిడికి గురిచేస్తూ ర్యాంకుల కోసం సెలవు రోజుల్లో తరగతులు నిర్వహిస్తున్నప్పటికీ విద్యాశాఖ అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం శోచనీయమన్నారు. వారంలో 6 రోజులు ఆటలకు ప్రాధాన్యతనివ్వకుండా ర్యాంకుల కోసం విద్యార్థులను ఒత్తిడికి గురి చేస్తున్నారని ఆయన ఆరోపించారు. పర్వదినాలు,ఆదివారాలు సెలవు ఇవ్వకుండా విద్యార్థులకు తరగతులు నిర్వహించటం విద్యాశాఖ అధికారులకు కన్పించటం లేదా అని సూర్య ప్రకాష్ ప్రశ్నించారు.స్టడీ అవర్స్ పేరిట రాత్రి 8.30 గంటల వరకు తరగతులు నిర్వహిస్తున్నందున రాత్రి సమయంలో ఇంటికి వెళ్ళే విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన పేర్కొన్నారు సహాయ కార్యదర్శి వై.నవీన్, సంజయ్,శరత్, ప్రశాంత్, సుమంత్, విద్యార్థులు పాల్గొన్నారు.

## పత్రికా స్వేచ్ఛను కాపాడుకోవాలి

రేపల్లె, నవంబరు 16, ప్రభాతవార్త: సమాజంలోని ప్రతి ఒక్కరూ పత్రికా స్వేచ్ఛను గౌరవించి తీరాలని ఎపిడబ్ల్యూజెఎస్ రాష్ట్ర కార్యదర్శి రాచాబత్తుని శ్రీనివాసరావు అన్నారు.రేపల్లె పట్టణంలో ఆదివారం జర్నలిస్టులు జాతీయ స్థాయి పత్రికా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు.ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా ఫోర్త్ ఎస్టేట్ హోదా కలిగిన పత్రికా రంగం ప్రాధాన్యతను గుర్తించాలన్నారు.నిస్వార్థంతో వాస్తవాలను వెలుగులోకి తెస్తున్న జర్నలిస్టులపై దాడులు జరగటం విచారకరమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.అక్రమ కేసులు బనాయించటం దుర్మార్గమన్నారు.సీనియర్ జర్నలిస్ట్ వాగోలు బాబూరావు మాట్లాడుతూ జర్నలిస్టుల సంక్షేమం కోసం ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.జర్నలిస్టులకు భద్రత కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని అన్నారు.ఈ కార్యక్రమంలో రేపల్లె తాలూకా ప్రెస్ క్లబ్ అసోసియేషన్ ప్రతినిధులు, పాత్రికేయులు తదితరులు పాల్గొన్నారు.



## పాత్రికేయుల సేవలు ప్రశంసనీయం



రేపల్లె,నవంబరు 16,ప్రభాతవార్త: ప్రజాస్వామ్య విలువలను పరిరక్షిస్తూ వాస్తవాలను ప్రజలకు,ప్రజా ప్రతినిధులకు తేటతెల్లం చేస్తూ అకుంఠిత దీక్షతో ముందుకు సాగుతున్న పాత్రికేయుల సేవలు ప్రశంసనీయమని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు.ఆదివారం ఆయన మాట్లాడుతూ పాత్రికేయులకు హృదయపూర్వకంగా జాతీయ పత్రికా దినోత్సవం శుభాకాంక్షలు తెలియజేశారు.పాత్రికేయులు వ్యక్తిగత జీవితానికి సైతం ప్రాధాన్యతనివ్వకుండా ఫ్రంట్ లైన్ వారియర్స్ గా కోవిడ్ సమయంలో విధులను నిర్వహించిన తీరును మరచిపోలేమని మంత్రి అనగాని సత్యప్రసాద్ గుర్తుచేశారు.

## కర్తార్ సింగ్ పోరాటం చిరస్మరణీయం

రేపల్లె,నవంబరు 16, ప్రభాతవార్త: భారతీయ విప్లవకారుడు కర్తార్ సింగ్ సరభా పోరాటపటిమ చిరస్మరణీయమని డివైఎఫ్ఐ కార్యదర్శి కె.వి.లక్మణరావు అన్నారు.ఆదివారం స్థానిక కొరటాల మీటింగ్ హాలులో డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో కర్తార్ సింగ్ సరభా వర్ధంతి జరిగింది. కర్తార్ సింగ్ సరభా చిత్ర పటానికి అధ్యక్షుడు సిహెచ్.ప్రకాష్ పూల దండలతో నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ కార్యదర్శి కెవి లక్ష్మణరావు మాట్లాడుతూ భగత్ సింగ్కు స్ఫూర్తినిచ్చిన ఘనత కర్తార్ సింగ్ కే దక్కిందన్నారు.1915 నవంబర్ 16న 19 సంవత్సరాల వయసులో బ్రిటిష్ పాలకులు కర్తార్ సింగ్ ను ఉరితీశారని ఆయన పేర్కొన్నారు.గదర్ పార్టీలో ప్రముఖ సభ్యునిగా భారత స్వాతంత్ర్య ఉద్యమంలో చురుకైన పాత్ర పోషించాడని కొనియాడారు.ఉన్నత విద్య కోసం అమెరికాకు వెళ్లినప్పుడు బ్రిటిష్ పాలకు లఅణచివేత గురించి తెలుసుకొని స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొనాలని నిర్ణయించుకున్నాడని ఆయన వివరించారు.



## బాలికలకు రంగవల్లుల పోటీ

రేపల్లె, నవంబరు 16, ప్రభాతవార్త: భట్టిప్రోలులోని శ్రీ మాటూరు రామారావు శాఖా గ్రంథాలయంలో ఆదివారం 34 మంది బాలికలకు రంగవల్లుల పోటీలు నిర్వహించారు.న్యాయ నిర్ణేతగా మెడతాటి భవానీ వ్యవహరించారు. రంగవల్లుల పోటీలలో సీనియర్ విభాగంలో కె.ప్రణతి,ఎ.వైష్ణవి లి ఖిత,టి.నాగ అశ్వని,టి.గీతిక, జూనియర్ విభాగంలో టి సరస్వతి,కె లేఖ్యశ్రీ బహుమతులు సాధించారు.గ్రంధాలయ ఉద్యమ ప్రముఖులు ఎస్ ఆర్. రంగనాధన్,అయ్యంకి వెంకట రమణ, పాతూరు నాగభాషణం సేవలను వక్తలు కొనియాడారు.ఈ కార్యక్రమంలో శాఖా గ్రంథాలయ అధికారి కలపాల సుభాష్ చంద్రబోస్, తలశిల సత్యవతి, విద్యార్థులు పాల్గొన్నారు.



## ప్రజల ఐక్యతకు నిదర్శనం

రేపల్లె, నవంబరు 16,ప్రభాతవార్త: కార్తీకమాస వనసమారాధనలు జరుపుకోవడం ప్రజలు ఐక్యతకు నిదర్శనమని వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు అన్నారు.ఆదివారం భట్టిప్రోలు టిఎంరావు ఉన్నతపాఠశాలలో శ్రీ మార్కండేయ పద్మశాలీయ సేవా సంఘం ఆధ్వర్యంలో వన సమారాధన అత్యంత ఘనంగా నిర్వహించారు. శ్రీ రమా సహిత సత్యనారాయణ స్వామి వారి వ్రతం జరుగుతున్న ప్రదేశంలో ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు స్వామివారికి టెంకాయ కొట్టి పూజలు నిర్వహించారు. రమా సహిత సత్యనారాయణ స్వామి వారి వ్రతాన్ని బట్టు బాల నగేష్ బాబు నాగలక్ష్మి దంపతులు నిర్వహించారు. మండల పరిధిలోని భట్టిప్రోలు,అద్దేపల్లి, ఐలవరం తదితర గ్రామాల్లోని పద్మశాలీయ సంఘీయులు వన సమారాధనలో పాల్గొన్నారు



## కెఎల్యు పూర్వవిద్యార్థులకు పురస్కారాల ప్రధానోత్సవం

తాడేపల్లి,నవంబర్ 16,ప్రభాతవార్త : వడ్డేశ్వరంలోని కెఎల్యు లోని పూర్వ విద్యార్థులకు పురస్కారాల ప్రధానోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు.వివిధ రంగాల్లో పలు సంస్థల్లో పలు హోదాల్లో ఉన్నటువంటి వారు సాధించిన విజయాలకు గుర్తుగా ఈ వేడుక నిర్వహిస్తున్నట్లు పూర్వ విద్యార్థుల విభాగం డైరెక్టర్ డాక్టర్ కెసిహెచ్ శ్రీకావ్య తెలిపారు.ప్రతి ఏడాది అలుమ్ని అవార్డ్స్ ఇదే విధంగా నిర్వహించి తమ పూర్వ విద్యార్థులను సత్కరించుకుంటామని ఆమె తెలిపారు.తమ విద్యార్థులు ఇంత ఎత్తుకు ఎదగడం తమకి గర్వకారణమన్నారు.వర్సిటీ విసి డాక్టర్ జి.పార్థసారధి వర్మ,రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావులు మాట్లాడుతూ విద్యార్థి దశనుండి పలు ఎంఎన్సి కంపెనీల్లో వివిధ హోదాల్లో దేశ విదేశాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులను చూస్తూంటే తమకు ఎంతో గర్వంగా ఉందన్నారు. యూనివర్సిటీ విద్యార్థులు,పూర్వ విద్యార్థులను తమకి టెక్నాలజీ రంగంలో ఉన్న వివిధ సందేహాలు అడిగి తెలుసుకున్నారు. యూనివర్సిటీ విసి డాక్టర్ జి.పార్థసారధి వర్మ,ప్రొఫెసర్ విసిలు డాక్టర్ ఏవిఎస్ ప్రసాద్,డాక్టర్ ఎన్.వెంకటరామ్,డాక్టర్ కె.రాజశేఖరరావు,రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు,విద్యార్థి సంక్షేమ విభాగం ఇన్చార్జీ డీన్ డాక్టర్ కెఆర్ఎస్ ప్రసాద్,స్కిల్ డెవలప్మెంట్ డీన్ డాక్టర్ ఎ.శ్రీనాథ్,పూర్వ విద్యార్థుల విభాగం డైరెక్టర్ డాక్టర్ కెసిహెచ్ శ్రీకావ్య,అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ కె.సోని తదితరులు పాల్గొన్నారు.

## బాపట్లలో గవర్నర్ పర్యటన



బాపట్ల,నవంబర్16,ప్రభాతవార్త: బాపట్ల జిల్లా,పాండురంగ పురం,ఒడరేవు, సూర్యలంక బీచ్ గోల్డెన్ సాండ్స్ 5 స్టార్ హోటల్ కు రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ అదివారం ఉదయం విచ్చేశారు .బాపట్లకు వచ్చిన గవర్నర్ జిల్లా కలెక్టర్ వినోద్కుమార్,ఎస్పీ ఉమామహేశ్వర్, ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మలు మర్యాద పూర్వకంగా కలిసి పూల మొక్కను అందించారు. గవర్నర్ అబ్దుల్ నజీర్ బాపట్ల జిల్లా ఒక్క రోజు పర్యటన నిమిత్తం ఉదయం 12.20 గంటలకు పాండురంగ పురం,ఒడరేవు సూర్యలంక బీచ్,గోల్డెన్ సాండ్స్ 5 స్టార్ హోటల్ చేరుకున్నారు.రాష్ట్ర పతికి స్వాగతం పలికిన వారిలో బాపట్ల ఆర్డీఓ పి.గ్లోరియా, డిఎస్పీ రామాంజనేయులు, బాపట్ల,చీరాల తహశీల్దార్లు షేక్ సలీమ,గోపి కృష్ణ, తదితరులు ఉన్నారు.

## వేగేశన నరేంద్రవర్మ కుమారుడు,కోడలను ఆశీర్వదించిన గవర్నర్ అబ్దుల్ నజీర్

బాపట్ల,నవంబర్16,ప్రభాతవార్త: బాపట్ల నియోజకవర్గం ఎమ్మెల్యే నరేంద్ర వర్మ, కుమారుడు వివాహం అనంతరం నిర్వహించిన రిసెప్షన్లో రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ పాల్గొని అశ్వీరదించారు.మండల పరిదిలోని సూర్యలంక లోని అంజంతా బ్రమరావేదిక నందు నూతన వధువు వరులైన రాకేష వర్మ, రూప నాగదేవికలను రాష్ట్ర గవర్నర్ ఆశీర్వదించి గిఫ్టును అందించారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్,శాసన సభ్యులు వేగేశన నరేంద్రవర్మ దంపతులు పాల్గోన్నారు.



## చదువుతోనే అభివృద్ధి సాధ్యం: కాపు కులస్తుల అభివృద్దే లక్ష్యం
## మాజీ ఎమ్మెల్సీ అన్నం సతీష్

బాపట్ల,నవంబర్16,ప్రభాతవార్త: కాపు కులస్తులందరూ ఐక్యమత్యంతో ముందుకు నడుస్తూ కష్టపడి చదువుకుంటే అభివృద్ధి చేందటం జరుగుతుందని మాజీ ఐఏఎస్ లక్ష్మీకాంతం అన్నారు. బాపట్ల కాపు సేవా సంఘం ఆధ్వర్యంలో సూర్యలంక రోడ్డులోని జీడి మామిడి తోటలో అదివారం కాపు వర సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాపట్ల నియోజకవర్గంలో అన్నం సతీష్ ప్రభాకర్ చేస్తున్న సేవా కార్యక్రమాలను కొనియాడారు. రాష్ట్రంలో అన్ని ప్రదేశాలలో కాపు కులస్తులు ప్రతి కార్తీక మాసంలో మన సమారాధన నిర్వహిస్తుంటే బాపట్లలో ప్రత్యేకంగా గత 15 సంవత్సరాలుగా అన్నం సతీష్ ప్రభాకర్ నాయకత్వంలో వందల మంది విద్యార్థులకు కార్తీక మాస వన సమారాధనలో లక్షల రూపాయల నిధులను స్కాలర్షిప్లుగా ఇవ్వడం సంతోషమన్నారు. మాజి ఎమ్మెల్సీ,బిజెపి సీనియర్ నాయుకులు అన్నం సతీష్ ప్రభాకర్ మాట్లాడుతూ బాపట్ల నియోజకవర్గం లో కాపుల అభివృద్ధి లక్ష్యంగా తాను ముందుకు నడుస్తున్నానని, కాపులు అన్ని రంగాలలో అభివృద్ధి చెందడంతో పాటు ఆర్థికంగా ఎదిగి కాపు కులానికి చేయూతగా నిలవాలన్నారు.బాపట్ల కాపు సేవా సంఘం ద్వారా వందల మంది విద్యార్థులకు స్కాలర్షిప్ల పంపిణీ చేస్తున్నామంటే దీని వెనక ఎందరో కాపు కులస్తుల కృషి ఉందని,కాపు సేవా సంఘం కమిటీ సభ్యులను ప్రత్యేకంగా అభినందిస్తున్నట్లు చెప్పారు.ప్రతి ఒక్క విద్యార్థి చదువుకుని ఉన్నత స్థానాలను అధిరోహించి కాపు కులానికి,కాపు కులస్తులకు చేదోడుగా నిలిచి పలువురికి ఆదర్శంగా నిలవాలన్నారు. కాపు కులంలో మెడిసిన్ చదువుతున్న ఇద్దరు విద్యార్థులకు 30వేలు,బివి ఎస్సీ చదువుతున్న ఇద్దరు విద్యార్థులకు 13వేలు, పీజీ చదువుతున్న 27 మంది విద్యార్థులకు లక్ష,62 వేలు, బీటెక్ 80 శాతం పెచ్చు 172 మంది విద్యార్థులకు 8 లక్షల 60వేలు,పీజీ 80 శాతం తక్కువ 100 మంది విద్యార్థులకు నాలుగు లక్షలు, డిగ్రీ 41 మంది విద్యార్థులకు ఒక లక్ష 64 వేలు, బి ఫార్మసీ ముగ్గురు విద్యార్థులకు 12 వేలు, డిప్లమా ఎనిమిది మంది విద్యార్థులకు 32 వేలు, సప్లమెంటరీ 26 మంది విద్యార్థులకు 7800, ఇంటర్మీడియట్ 183 మంది విద్యార్థులకు 5 లక్షల 49 వేలు,మొత్తం 564 మంది విద్యార్థులకు 23లక్షల రూపాయలు స్కాలర్షిప్ల పంపిణీ చేశామన్నారు. అనంతరం మహిళలకు చిన్నారులకు ఆటలు పోటీలు నిర్వహించారు పోటీలలో గెలుపొందిన మహిళలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాపు సేవా సంఘం అధ్యక్షులు ఇక్కుర్తి శ్రీనివాసరావు,జాతీయ కాపునాడు అధ్యక్షుడు గోళ్ళ సుబ్రమణ్యం,మెండు చక్రపాణి, బిఎల్ నరసింహారావు, గొర్రిపాటి అర్జున్ రావు, బొందలపాటి వెంకట్రావు,తులసి సాయి దాసు,పర్వతారెడ్డి భాస్కరరావు,మాజి మున్సిపల్ చైర్మన్నరాలశెట్టి ప్రకాష్రావు,తదితరులు పాల్గొన్నారు.



## ఆపదలో ఉన్నవారిని ప్రతిఒక్కరు ఆదుకోవాలి

కర్లపాలెం,నవంబర్16,ప్రభాతవార్త: ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడం కోసం ఫ్రెండ్స్ ఆదర్శ యూత్ ఆర్గనైజేషన్ ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని ఆర్గనైజేషన్ కార్యదర్శి బత్తుల సురేష్ అన్నారు.కర్లపాలెం మండలం యాజలి గ్రామనికి చెందిన నిరుపేద కూలి లుక్క అంకమ్మ వంట చేసే క్రమంలో గ్యాస్ లీకై మంటలు వ్యాపించడంతో మహిళకు గాయాలు అయ్యాయి.బాధిత మహిళకు ఆదివారం ఆర్గనైజేషన్ సభ్యులు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా సభ్యులు శ్రీరాం సునీల్ మాట్లాడుతూ యాజలి గ్రామానికి చెందిన మహిళకు మంటలు అంటుకుని తీవ్రగాయాలైయని సదరు మహిళకు తమ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఆర్థిక సహాయం చేశామన్నారు.బాధిత మహిళకు మానవతా దృక్పథంతో ప్రతి ఒక్కరు ఆర్థిక సహాయం చేసి ఆదుకోవాలన్నారు. తమ వంతు సహాయాన్ని అందించామని, తమ సభ్యుల సహకారంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు వేజెండ్ల శ్రీనివాసరావు,అధ్యక్షుడు బండ్రెడ్డి గోపి,కోశాధికారి జోగి సువర్ణ రాజు,సభ్యులు కోళ్లపూడి కుమార్, బొగ్గవరపు శివ, యాశం రాజా రమేష్, నరాలశెట్టి నాగరాజు, సుబ్బారావు,పెద్దమళ్ళు శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



## జాతీయ గ్రంధాలయ వారోత్సవాలు

కర్లపాలెం,నవంబర్16,ప్రభాతవార్త: కర్లపాలెం శాఖా గ్రంధాలయంలో 58వ జాతీయ గ్రంధాలయ వారోత్సవాల్లో భాగంగా మూడవ రోజున గ్రంథాలయ ప్రముఖులు అయినటువంటి అయ్యంకి వెంకటరమణయ్య ఎస్సార్ రంగనాథన్ పాతూరి నాగభూషణం గురించి స్మరించుకోవడం జరిగింది వారి చిత్రపటాలకు పూలమాలలతో అలంకరించటం జరిగింది ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు చిట్టి రాజు బుర్ల శ్రీనివాసరావు విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు మరియు గ్రంథాలయ ఆవరణంలో బాలబాలికులకు కోకో మ్యూజికల్ చైర్స్ పోటీలు నిర్వహించామని గ్రంథాలయ అధికారిని టీవీ రమణమ్మ తెలియజేశారు



## చిత్రలేఖనంతో విద్యార్థులలో సామర్థ్యాలను వెలికితీయవచ్చు

కొల్లిపర,నవంబరు 16 ప్రభాతవార్త: చిత్రలేఖనం పోటీలలో పాల్గొనటం వలన విద్యార్థులలో ఉన్నటువంటి సామర్థ్యాలను వెలికితీయవచ్చని వల్లభాపురం గ్రంథాలయాధికారి సాంబశివనాయక్ అన్నారు.ఆదివారం మండల పరిధిలోని వల్లభాపురం,మున్నంగి,తూములూరు శాఖా గ్రంథాలయాల్లో 58 వ జాతీయ గ్రంథాలయ వార్షికోత్సవాలలో భాగంగా 3 వ రోజున గ్రంథాలయ ఉద్యమకారులైన శ్రీఅయ్యంకి వెంకటరమణయ్య,శ్రీపాతూరు నాగభూషణం,ఎన్.ఆర్.రంగనాధన్లను విద్యార్థులు స్మరించుకున్నారు.అనంతరం అధికారులు ఆటలు, వ్యాచరచన, చిత్రలేఖనం,మ్యూజికల్ చైర్స్ పోటీలు నిర్వహించారు.ఈ సందర్భంగా వల్లభాపురం గ్రంథాలయంలో జరిగిన కార్యక్రమంలో సాంబశివనాయక్ మాట్లాడుతూ గ్రంథాలయాల ఏర్పాటుకు కృషి చేసిన మహానుభావులను తలచుకొనటం చాలా ఆనందంగా ఎఉందన్నారు.గ్రంథాలయాధికారి జ్యోతి మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో ముందంజలో ఉండాలన్నారు.తూములూరు గ్రంథాలయాధికారి సత్యమ్మ మాట్లాడుతూ విద్యార్థులు గ్రంథాలయాలను సద్వినియోగించుకోవాలన్నారు.ఆయా కార్యక్రమాలలో కొండా కిషోర్రెడ్డి,కట్టా శ్రీహరిరెడ్డి,బద్దిగం శ్రీనివాసరెడ్డి,ఆళ్ళ సాంబిరెడ్డి,శ్రీధర్రెడ్డి గ్రామస్తులు. పాఠకులు,విద్యార్థులు పాల్గొన్నారు.





## ఘనంగా గ్రంధాలయ వారోత్సవాలు



కొల్లూరు, నవంబరు 16 (ప్రభాతవార్త) : 58వ జాతీయ గ్రంధాలయ వారోత్సవాల సందర్భంగా ఆదివారం గ్రంధాలయాల అభివృద్ధికి సేవలందించిన మహనీయుడు గ్రంధాలయ ఉద్యమ పితామహుడైన అయ్యంకి వెంకటరమణయ్య చిత్రపటానికి గ్రంధాలయ అధికారి పూలమాలలు వేయగా ఉపాధ్యాయులు మరియు విద్యార్థిని, విద్యార్థులు ఘనంగా నివాళులర్పించిరి. తదుపరి సబ్ జూనియర్స్ కు అయ్యంకి వెంకటరమణయ్య జూనియర్స్ కు పాతూరి నాగభూషణం మరియు సీనియర్స్ కు ఎస్.ఆర్.రంగనాధన్ అనే అంశాలపై వకృత్వ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు ఎన్.శివరామకృష్ణ, ఈవో అమర్తలూరు గ్రూప్ టెంపుల్స్ పులివర్తి రాజేంద్రబాబు, జూనియర్ అసిస్టెంట్ దోనేపూడి మరియు కె.నాగలక్ష్మి చైతన్య స్కూల్ ఉపాధ్యాయురాలు న్యాయ నిర్ణేతలుగా ఉన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంధాలయాధికారి విద్యార్థిని, విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## అనంతవరం శాఖా గ్రంధాలయంలో ఘనంగా వారోత్సవాలు

కొల్లూరు, నవంబరు 16 (ప్రభాతవార్త) : 58వ జాతీయ గ్రంధాలయ వారోత్సవాల్లో భాగంగా కొల్లూరు మండల పరిధిలోని అనంతవరం శాఖ గ్రంధాలయంలో ఆదివారం గ్రంధాలయ ఉద్యమమునకు పాటుపడిన ప్రముఖుల గురించి స్మరించుకొనుట జరిగింది. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ ఆలపర్తి ఉషారాణి, పంచాయితీ సెక్రటరీ బద్దిగం ఉమామహేశ్వరరెడ్డి, నాగళ్ళ గంగాధరరావు, గ్రామ 4వ వార్డు నెంబర్ దూళిపాళ్ళ వెంకటేశ్వరరావు, గ్రంధాలయ ఉద్యమ ప్రముఖులు ఎస్సార్ రంగనాధన్, అయ్యంకి వెంకటరమణయ్య, పోతూరి నాగభూషణం, ఫోటోలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం గ్రంధాలయమునకు చేసి సేవలను కొనియాడారు. అలాగే పుస్తక పఠనం యొక్క ప్రాముఖ్యతను గురించి వివరించరు. విద్యార్థులు క్రమం తప్పకుండా గ్రంధాలయమునకు రావాలని తెలియజేశారు. విద్యార్థులకు డిబేట్ నిర్వహించారు. సబ్ జూనియర్స్ కి అయ్యంకి వెంకట రమణయ్య గురించి, జూనియర్స్ కి పాతూరి నాగభూషణం గురించి, సీనియర్స్ కి యస్.ఆర్.రంగనాధన్ గురించి గ్రంధాలయ అధికారి జి.కనకదుర్గ, గ్రంధాలయ ఉద్యమ ప్రముఖుల గురించి ప్రసంగించారు. అదే విధంగా ప్రతిరోజు కూడా ప్రతి ఒక్కరూ గ్రంధాలయాన్ని ఉపయోగించుకోవాలి, అలాగే సభ్యత్వం తీసుకోవాలని వివరించారు. అనంతరం విద్యార్థులకు తగు సూచనలు, సలహాలు అందరికి తెలియజేశారు.



## ఓట్చోర్ తోనే బీహార్ ఎన్నికల్లో బిజెపి విజయం...

వేమూరు నవంబరు 16 (ప్రభాతవార్త) : బీహార్ ఎన్నికల ఫలితాలను నిశితంగా పరిశీలిస్తే పోలీఐన ఓట్లు కంటే ఈవీయంలో లెక్కించిన ఓట్ల అధికంగా ఉన్నాయని, అకారణ ఓట్ల పెరుగుదలపై ఈసి విచారణ ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు యార్లగడ్డ గోపి డిమాండ్ చేశారు. ఆదివారం వేమూరులో విలేఖర్లతో మాట్లాడుతూ బీహార్, హార్యానా రాష్ట్రంలో ఓట్చోర్ ఎలా జరిగిందో అనే దానిపై కాంగ్రెస్ అగ్రనేత, లోక్సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్గాంధీ ఆధారాలతో మీడియా ముఖంగా నిరూపించారని, మొదటి నుంచి బీహార్ ఎన్నికల్లో నూతన ఓట్లు చేర్చటంలో ఉన్న ఓట్లు తొలగించడంలో అక్రమాలు జరుగుతూనే ఉన్నాయని, తాజా బీహార్ ఎన్నికల ఫలితాలు అందుకు నిదర్శనం అన్నారు. బీజేపీ, ఈసి చేస్తున్న ఓట్ల చోరీ మోసాని ప్రజలు క్షమించారని తెలియజేశారు. బీజేపీ ఎన్నికల్లో ఓట్చోర్ చేస్తూ ప్రజాస్వామ్య వ్యవస్థను అపహాస్యం చేస్తుందని, దీనిపై కాంగ్రెస్ శ్రేణులు, ఇతర పార్టీలతో కలిసి పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని గోపి తెలియజేశారు.



## గ్రంధాలయ ఉద్యమకారులకు నివాళి



వేమూరు నవంబరు 16 (ప్రభాతవార్త) : గ్రంధాలయాల ఏర్పాటుకు ఉద్యమించిన డాక్టర్ ఎస్.ఆర్.రంగనాధన్, పోతూరి నాగభూషణం, అయ్యంకి వెంకటరమణయ్య సేవలు అభినందనీయమని హెల్త్ సూపర్వైజర్ కారుమూరి పున్నారావు పేర్కొన్నారు. 58వ జాతీయ గ్రంధాలయ వారోత్సవాలను పురస్కరించుకుని ఆదివారం వేమూరు శాఖా గ్రంధాలయంలో గ్రంధాలయ ఉద్యమకారులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారి సేవలను స్మరించుకున్నారు. కార్యక్రమంలో గ్రంధాలయ అధికారి కంచర్ల శ్రీనివాసరావు, విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.


## విద్యార్థులకు పుస్తకపఠనం ముఖ్యం: త్రీటౌన్ సిఐ సాంబశివరావు

తెనాలి మునిసిపాలిటీ, నవంబర్ 16, ప్రభాతవార్త:విద్యార్థులు, యువత చెడు మార్గాల వైపు మళ్లకుండా ఉన్నత వ్యక్తులుగా సమాజంలో మంచి గుర్తింపు, గౌరవాన్ని పొందడంలో గ్రంథాలయాల పాత్ర ముఖ్యమైనదని 3వపట్టణ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎస్.సాంబశివరావు పేర్కొన్నారు.ఆదివారం కొత్తపేట మహిళా బాలల గ్రంథాలయంలో 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలకు ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు.ముందుగా గ్రంథాల ఉద్యమ పితామహులు అయ్యంకి వెంకటరమణ,గాడిచర్ల హరిసర్వోత్తమరావు,ఎస్ఎన్ రంగనాథన్,పాతూరి నాగభూషణం చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం సిఐ సాంబశివరావు మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ అక్షరజ్ఞానం కలిగి ఉండి విజ్ఞానవంతులుగా తయారవ్వాలని,ఉద్యమాలు చేసి మనందరికీ ఈ రోజున గ్రంథాలయాలు అందుబాటులోకి తీసుకువచ్చిన మహనీయుల జీవిత చరిత్రలు ప్రతి ఒక్కరు తప్పక చదవాలన్నారు.తాను ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనే పేరు పొందిన వేటపాలెం గ్రంథాలయంలో చిన్నప్పుడు కథలు పుస్తకాలు, మహనీయుల జీవిత చరిత్రలతో పాటుగా పోటీ పరీక్షల కొరకు నాలెడ్జి బుక్స్ చదవడం వల్లే ఈరోజు సొసైటీలో ఉన్నతమైన పోలీసు ఉద్యోగిలో ఉన్నందుకు గర్వపడుతున్నాను అన్నారు. విద్యార్థులు కూడా గంజాయి వంటి మాదక ద్రవ్యాలకు అలవాటు పడకుండా విలువైన సమయాన్ని సెల్ ఫోన్ చూస్తూ గడపకుండా, మంచి మంచి పుస్తకాలు చదివి భారతదేశం గర్వించే పౌరులుగా తయారవ్వాలి అన్నారు.ఈ సందర్భంగా మున్సిపల్ బాయ్స్ హై స్కూల్ విద్యార్థినీ,విద్యార్థులకు 35 మందికి సభ్యత్వ రసీదులు సాయిమంగ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు కంకిపాటి రమేష్ కుమార్ ఆధ్వర్యంలో అందించారు.మంచి చెడుల మధ్య వ్యత్యాసాన్ని మిత్రుడు వంటి పుస్తకాలు నేర్పుతాయని గ్రంథాలయ డెవలప్మెంట్ సెక్రటరీ స్వరలయ వ్యవస్థాపకులు సాయి లక్కరాజు తెలియజేశారు. ఆరోగ్యవిస్తరణాధికారి అందె బాలచంద్రమోళి మాట్లాడుతూ, ప్రతిరోజు న్యూస్ పేపర్ తో పాటు కథల పుస్తకాలు తప్పక చదవాలని విద్యార్థులకు సూచించారు .గ్రంథాలయ అధికారిణి కడియాల సుజాత ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో టీవీఎన్ మల్లేశ్వరరావు సిహెచ్ శ్రీదేవి వి నాగేంద్ర,హరి కిషన్ ఉపాధ్యాయులు పుల్లారావు బాయ్స్ హైస్కూల్ విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.




## ఘనంగా లక్ష దీపోత్సవ కార్యక్రమం

మంగళగిరి, నవంబర్ 16 ప్రభాతవార్త : హరే కృష్ణ గోకుల క్షేత్రం ఆవరణలో హరేకృష్ణ మూమ్మెంట్ ఆధ్వర్యంలో కార్తీక మాసంను పురస్కరించుకొని లక్ష దీపోత్సవం కార్యక్రమం శనివారం ప్రారంభమైంది. లక్ష దీపోత్సవంను హరేకృష్ణ మూమ్మెంట్ ప్రెసిడెంట్ శ్రీ వంశీధర దాస ఆధ్వర్యంలో ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమం తులసిపూజతో ప్రారంభం కాగా అనంతరం సంధ్య హారతి, సంకీర్తన, ప్రవచనం కార్తీకమాసం దీపోత్సవం ప్రాముఖ్యతను వివరించి తొలిదీపం వెలిగించారు. లోక కల్యాణం కోశం ఏకాదశి సందర్భంగా హరినామ జప యజ్ఞం నిర్వహించారు. 30 లక్షల హరి నామాలను జపించారు. అనంతరం నృత్య రూపంలో కృష్ణ లీలలను ప్రదర్శించడం జరిగింది. అలాగే భక్తులచే లక్ష దీపోత్సవం వెలిగించడం జరిగింది. ఈ లక్ష దీపోత్సవం ఈనెల 20వ తేదీవరకు నిర్వహించనున్నారని, కాబట్టి భక్తులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విలాస దాస తెలియజేశారు. ఈ కార్యక్రమంలో హరేకృష్ణ గోకుల క్షేత్రం ప్రతినిధి రఘు నందన దాస తదితరులు పాల్గొన్నారు.



## హ్యాపీ రిసార్ట్ లో ఘనంగా యాదవ కార్తీక వన సమారాధన

మంగళగిరి, నవంబర్ 16, ప్రభాతవార్త : మంగళగిరి హ్యాపీ రిసార్ట్స్ లో మంగళగిరి యాదవ సంఘం ఆధ్వర్యంలో యాదవ కార్తీక్ అన్న సమారాధన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మంత్రి కొలుసు పార్థసారథి, టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాస్ యాదవ్, మాజీమంత్రులు రఘువీరారెడ్డి, కారుమూరు నాగేశ్వరరావు, బీసీవై పార్టీ అధ్యక్షులు బోడె రామచంద్ర యాదవ్, తాళ్ల వెంకటేష్ యాదవ్ తదితరులు పాల్గొని ప్రసంగించారు. టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ రాష్ట్రంలో యాదవ భవన్ కొరకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ లు ఐదు ఎకరాల భూమిని కేటాయించేందుకు సిద్ధంగా ఉన్నారని త్వరలోనే అధికారిక ప్రకటన వెలువడుతుందని, ఇప్పటికే మంత్రి నారా లోకేష్ స్థల పరిశీలన కూడా చేశారని చెప్పుకొచ్చారు. తొలుత కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మాజీమంత్రి రఘువీరారెడ్డి, బీసీవై పార్టీ అధినేత బోడె రామచంద్ర యాదవ్ లు జ్యోతి ప్రద్వాలను చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి మాట్లాడుతూ యాదవులందరూ కుటుంబ సభ్యులతో ఆనందంగా ఉండాలని ఆర్థికంగా రాజకీయంగా అభివృద్ధి చెదాలని ఆకాంక్షి ంచారు.బీసీవై పార్టీ అధినేత బోడె రామచంద్ర యాదవ్ , కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మాజీమంత్రి రఘువీరా రెడ్డి , చీరాల ఎమ్మెల్యే ఆలూరి కొండయ్య యాదవ రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్ జి నరసింహారావు యాదవ్, మాగంటి సుధాకర్ యాదవ్, దానబోయిన సుందర్రావు యాదవ్, తుళ్ళి మిల్లి రామకృష్ణ యాదవ్, ఆరుద్ర భూలక్ష్మి ్మ, తోట శివశంకరరావు, దొడ్డక కృష్ణ, తాడిబోయిన సురేష్ పాల్గొన్నారు.



## ఏఎన్‌యు వీసి రాక మరికొన్ని రోజులు ఆలస్యం..?

### - మరో 8రోజుల్లో బాధ్యతలు తీసుకోవాల్సిందే

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం,నవంబరు16, ప్రభాతవార్త: ఏఎన్‌యు వీసిగా నియమితులైన ఆచార్య సామంతపూడి వెంకట సత్యన్నారాయణ రాజు బాధ్యతల స్వీకరణ మరికొన్ని రోజులు ఆలస్యం కానున్నట్లు తెలిసింది. ఆయన ప్రస్తుతం వీసిగా విధులు నిర్వహిస్తున్న బంద్రా యూనివర్సిటీకి



రాజీనామా చేశారని అయితే అక్కడ నుంచి ఇంకా రిలీవింగ్ ఆర్డర్స్ రాలేదని సమాచారం. అక్కడి నుంచి రిలీవ్ అయిన తరువాత మధర్ యూనివర్సిటీలో ప్రభుత్వ నిబంధనల ప్రకారం కనీసం 3రోజులు పనిచేయాల్సి ఉంటుంది. అనంతరం ఆ యూనివర్సిటీ నుంచి ఏఎన్‌యు వీసిగా రానున్నారు. ఇదంతా జరగటానికి కనీసం వారం రోజులు పడుతుంది. ఏఎన్‌యు వీసిగా సత్యన్నారాయణ రాజు అక్టోబరు 8న నియమితులయ్యారు. ఈమేరకు గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ ఆదేశాలతో జి.ఓ యంఎస్. నెంబరు.91 విడుదలయింది. 3ఏళ్ళపాటు రెగ్యులర్ వీసిగా ఆయన విధులు నిర్వహించనున్నారు. అయితే ఆదివారానికి ఆయనను వీసిగా నియమించి 40రోజులౌతుంది. యూనివర్సిటీ యాక్ట్ ప్రకారం వీసిగా నియమితులైన వారు 48రోజుల్లో బాధ్యతలు స్వీకరించాలి. లేకుంటే ఆయన అఫీషియల్‌గా సమయం కావాలని ప్రభుత్వంకు లేఖ సమర్పించాల్సి ఉంది. వీసిగా బాధ్యతలు తీసుకునేందుకు ప్రభుత్వం నుంచి మరికొన్ని రోజుల సమయం కోరనున్నట్లు సమాచారం. ఇదిలాఉండగా రానున్న వారం రోజుల్లో వీసిగా బాధ్యతలు తీసుకుని మరొక నెల రోజులు సెలవు కోరతారనే ప్రచారం జరుగుతుంది. అదే జరిగితే రెక్టార్ (ప్రో వైస్ చాన్సలర్) గా ఉన్న వ్యక్తి అధనపు బాధ్యతలు చేపట్టాల్సి ఉంటుంది. గతంలో వీసిలుగా పనిచేసిన వారిలో వివిధ కారణాలతో విదేశీ ప్రయాణాలు, ఇతర వ్యక్తిగత కార్యకలాపాలపై ప్రభుత్వం అనుమతితో సెలవు కోరితే ఇదే విధానం అమలుజరిగేది. ఏదేమైనా వీసి రాక వర్సిటీకి అనివార్యంగా చర్చ జరుగుతుంది. ప్రభుత్వం ప్రస్తుతం వీసిగా తాత్కాలిక బాధ్యతలు నిర్వహిస్తున్న ఆచార్య గంగాధరరావు కేవలం సాధారణ పాలన చేయాలని మాత్రమే అనుమతి ఇచ్చింది.

**వర్సిటీలకు త్వరలో సెర్చ్ కమిటీలు**

రాష్ట్రంలోని పలు యూనివర్సిటీలకు త్వరలో సెర్చ్ కమిటీలు జరుగనున్నాయి. వీటిల్లో శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీ (తిరుపతి), ద్రవిడ యూనివర్సిటీ (కుప్పం), ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం యూనివర్సిటీ(ఒంగోలు)లు ప్రదానంగా ఉన్నాయి. వీటికి వీసిలను నియమించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. ఆయా యూనివర్సిటీలకు పోటీ భారీగానే ఉంది.

## మాచర్లలో 18న మెగా జాబ్‌మేళా



మాచర్ల, నవంబరు 16 ప్రభాతవార్త: నిరుద్యోగ యువత మెగా జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్, ట్రైనింగ్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో మాచర్ల ఎస్‌కెబీఆర్ కళాశాలలో ఈ నెల 18న జాబ్ మేళా జరుగుతుందన్నారు. మల్టీనేషనల్ కంపెనీల ప్రతినిధులు ఈ జాబ్‌మేళాలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. ఈ జాబ్‌మేళాను యువతకు ఎంతగానో దోహదపడుతుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు క్వాలిఫికేషన్ సర్టిఫికెట్, రెస్యూమ్, పాన్, ఆధార్ జిరాక్సులతో హాజరు కావాలన్నారు. మరిన్ని వివరాలకు 7842747682, 9492158153 నంబర్లలో సంప్రదించాలన్నారు.

## గ్రంథాలయ ఉద్యమ నాయకుల సేవలు మరువలేనివి

మాచర్ల, నవంబరు 16 ప్రభాతవార్త: 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మాచర్ల శాఖా గ్రంథాలయంలో ఆదివారం గ్రంథాలయ ఉద్యమంలో పాల్గొన్న నేతలను స్మరించుకున్నారు. గ్రంథాలయ ఉద్యమ నాయకులు గాడిచర్ల హరిసర్వోత్తమరావు, అయ్యంకి వెంకటరమణయ్య, ఎస్.ఆర్. రంగనాథన్, పాతూరి నాగభూషణం చిత్రపటాలకు ఇన్‌ఛార్జి గ్రంథాలయాధికారి మాచర్ల మెర్సీ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రంథాలయ ఉద్యమ నాయకులు గ్రంథాలయాల కోసం ఎన్నో ఉద్యమాలు చేసి గ్రంథాలయాలు ఈ రోజు ఇంత ఉన్నతంగా ఉన్నాయంటే వారు చేసిన కృషి ఫలితమేనని విద్యార్థులకు తెలిపారు. కార్యక్రమంలో శ్రీనివాసరావు, స్వరూప, కిషోర్, గ్రంథాలయ పాఠకులు తదితరులు పాల్గొన్నారు.



## సామూహిక సత్యనారాయణ స్వామి వ్రత మహోత్సవం

మాచర్ల, నవంబరు 16 ప్రభాతవార్త: కార్తీక మాస పర్వదినాన్ని పురస్కరించుకుని పట్టణంలోని పాతూరు సోమిరెడ్డి బజారులో వేంచేసియున్న కటారుమిట్ట గణపతి దేవాలయం, పార్వతీ సమేత





భస్మేశ్వరసాన్వమి ఆలయంలో సామూహిక సత్యనారాయణస్వామి వ్రత మహోత్సవం వైభవంగా జరిగింది. దేవాలయ కమిటీ సభ్యులు, నిర్వాహకులు వ్రతానికి అవసరమైన ఏర్పాట్లను చేశారు. దంపతులు పీటల మీద కూర్చొని ఈ వ్రతంలో పాల్గొన్నారు. వ్రతం పూర్తయిన తర్వాత 3వ వార్షిక కార్తీకమాస అన్న సంతర్పణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలువురు ప్రముఖులు పాల్గొని భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

## పెట్టుబడులకు స్వర్గధామం ఆంధ్రప్రదేశ్: ఎమ్మెల్యే జూలకంటి

మాచర్ల, నవంబరు 16 ప్రభాతవార్త: పెట్టుబడులకు స్వర్గధామంగా ఆంధ్రప్రదేశ్ నిలిచిందని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. విశాక వేదికగా జరిగిన సీఐఐ సమ్మిట్ 2025 విజయవంతంపై ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఒక్క సదస్సుతో లక్షల కోట్ల పెట్టుబడుల ప్రవాహం ఏపీకి వరదలా వచ్చిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ పెద్దఎత్తున శ్రమించారన్నారు. అంతేకాక మూడు ప్రాంతాలకు సమానంగా పెట్టుబడులు వచ్చేలా కంపెనీలను ఒప్పించడం ప్రశంసనీయమన్నారు. ఈ భాగస్వామ్య సదస్సుతో రాష్ట్రంలో దాదాపు 13 లక్షల కోట్ల పెట్టుబడులు, 16 లక్షల ఉద్యోగ అవకాశాలు అందిపుచ్చుకోవడం ఒక చరిత్ర అని కొనియాడారు. మిగతా రాష్ట్రాలతో పోల్చుకుంటే, ఏపీలో స్పీడ్ ఆఫ్ డూయింగ్ అనే నినాదంతో బిజినెస్ విధి, విధానాలను అనుసరించడంలో పరిశ్రమలు రాష్ట్రానికి క్యూ కట్టాయన్నారు. అన్ని కీలక ఒప్పందాలు ఒకేసారి కుదరడమే పెట్టుబడిదారుల నమ్మకాన్ని కూటమి ప్రభుత్వం గెలుచుకుందన్నారు. పెట్టుబడులు మూడు ప్రాంతాల్లోని ప్రతి జిల్లాకు ప్రాధాన్యత కల్పించడం గర్వకారణంగా ఉందని హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రాభివృద్ధికి, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఊపందుకోవడానికి అహర్నిశలు పాటుపడుతున్న సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, ఐటీ శాఖ మంత్రి లోకేష్‌లకు ఈ సందర్భంగా ఆయన ధన్యవాదాలు తెలిపారు.

## పేకాట స్థావరాలపై పోలీసుల దాడులు


మాచర్ల, నవంబరు 16 ప్రభాతవార్త: మాచర్ల రూరల్ మండలంలోని జమ్మలమడకలో పేకాట స్థావరాలపై పట్టణ, రూరల్ పోలీసులు ఆదివారం దాడులు జరిపారు. పట్టణంలోని 26వ వార్డు నూరు



మసీదు ప్రాంతంలో పట్టణ సీఐ వెంకటరమణ ఆధ్వర్యంలో పట్టణ ఎస్సైలు దాడులు జరిపి పేకాట ఆడుతున్న వారిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.14 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. జమ్మలమడక గ్రామంలో రూరల్ ఎ స్సై సంధ్యారాణి సిబ్బందితో పేకాట స్థావరంపై దాడి చేసి పేకాట ఆడుతున్న తొమ్మిది మందిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.2700 స్వాధీనం చేసుకున్నారు. వీరిపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## వన సమారాధన కార్యక్రమంలో పాల్గొన్న సమన్వయకర్త డాక్టర్ గజ్జల

ముప్పాళ్ళ సెప్టెంబర్16 ప్రభాతవార్త:ముప్పాళ్ళ మండలం పలుదేవర్లపాడు గ్రామానికి చెందిన వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యుల వన సమారాధన కార్యక్రమంలో పాల్గొన్న సత్తెనపల్లి నియోజకవర్గ వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త డాక్టర్ .గజ్జల సుధీర్ భార్గవ రెడ్డి..



## నువ్వా? ...నేనా ? అన్నట్లు కొనసాగుతున్న అంతర్ జిల్లాల కబడ్డీ పోటీలు

వినుకొండ,నవంబర్16,ప్రభాతవార్త: ఆంధ్రప్రదేశ్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజి క్రీడా మైదానం నందు ఏర్పాటు చేసిన 69వ అంతర్ జిల్లాల అండర్-19 బాలబాలికల కబడ్డీ పోటీలు రెండవ రోజు ఆదివారం నువ్వా నేనా అన్నట్లుగా సాగాయి. బాలికల విభాగంలో శ్రీకాకుళం జట్టు కడప జట్టుపై గెలుపొందింది. బాలుర విభాగంలో అనంతపురం జట్టు విజయనగరం జట్టుపై విజయం సాధించింది. ప్రజలు తిలకించేందుకు వీలుగా ప్రత్యేక



గ్యాలరీ,ఫ్లడ్‌లైట్‌లు ఏర్పాటు చేశారు. వివిధ జిల్లాల నుంచి విచ్చేసిన క్రీడాకారులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఉచిత భోజనం వసతి టోర్నమెంట్ నిర్వాహకులు గంగినేని రాఘవరావు ప్రత్యేకంగా పర్యవేస్తున్నారు. పల్నాడు జిల్లా స్కూల్ గేమ్స్ సెక్రటరీ ఎస్.సురేష్ కుమార్,టోర్నమెంట్ అబ్జర్వర్,జిల్లా వ్యాయామ ఉపాధ్యాయుల అధ్యక్ష,కార్యదర్శులు స్వర్ణ రాజు,ఖాదర్ మస్తాన్,ఎన్నార్టీ డివిజనల్ ఎస్‌జిఎఫ్ కో ఆర్డినేటర్ వై.వి చిరంజీవిరావు,వినుకొండ వ్యాయామ ఉపాధ్యాయ సంఘ అధ్యక్షులు అంగటి బాజు,కార్యదర్శి గణప వీరాంజనేయులు,పీఈటి రాగుల రాధాకృష్ణమూర్తి,పాపచాని చిన్నామయ్య,కాకుమాను రాజేష్,మద్దం వెంకటేశ్వర్లు,ఎన్.వెంకటరత్నం,జి.చిన్న అంకారావు,మహేష్, వ్యాయామ ఉపాధ్యాయులందరూ పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో శివ కళ్యాణోత్సవం

పొన్నూరు, నవంబరు 16,ప్రభాతవార్త: స్థానిక బ్రాహ్మణ బజారులో వేంచేసియున్న శ్రీ శంకర మఠంలో ఆదివారం కార్తీక మాసాన్ని పురస్కరించుకొని శివ పార్వతుల కళ్యాణోత్సవాన్ని నిర్వహించారు. ఈ కళ్యాణోత్సవంలో ప్రముఖ న్యాయవాది, బ్రాహ్మణ మహాసభ నాయకుడు ఎఆర్‌కెఎస్టీసాయి దంపతులు పాల్గొని స్వామివారికి ముత్యాల తలంబ్రాలు, పట్టు వస్త్రాలను సమర్పించారు. ఈ సందర్భంగా



ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య రాష్ట్ర కోశాధికారి పులిపాక వెంకట సత్యసాయి వరప్రసాద్ మాట్లాడుతూ కార్తీక మాసంలో శివ పార్వతుల కళ్యాణోత్సవానికి ఒక ప్రత్యేకమైన విశిష్టత ఉందన్నారు. కార్తీక మాసంలో శివ పార్వతుల కళ్యాణోత్సవాన్ని నిర్వహించినా, వీక్షించి ఫలితం సిద్ధిస్తుందన్నారు. శివ పార్వతుల కళ్యాణోత్సవం ద్వారా ఈతి బాధలు తొలగిపోతాయన్నారు. శివ పార్వతుల కళ్యాణోత్సవాన్ని తిలకించేందుకు భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. ఓం నమ: శివాయ....ఓం నమ: శివాయ...అనే భక్తుల నినాదాలతో శంకరమఠం పరిసరాలు మార్మోగిపోయాయి. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా బ్రాహ్మణ మహాసభ అధ్యక్షుడు గణపవరపు రామశాస్త్రి, పివిఎస్ఎస్‌వి ప్రసాద్ పర్యవేక్షణలో సభ్యులు ఏర్పాట్లు చేశారు.

## నెలాఖరులోపు స్మార్ట్ రేషన్ కార్డులు తీసుకోండి

### -తహశీల్దార్ మహమ్మద్ జియావుల్ హక్

పొన్నూరు, నవంబరు 16,ప్రభాతవార్త: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పాత రేషన్ కార్డుల స్థానంలో నూతనంగా స్మార్ట్ కార్డులను ముద్రించి కార్డుదారులకు అందజేసేందుకు శ్రీకారం చుట్టిందన్నారు. తొలుత స్మార్ట్ కార్డులను రేషన్ షాపులు, సచివాలయాల ద్వారా పంపిణీ చేయడం జరిగిందన్నారు. అనంతరం సచివాలయాల పరిధిలోని విఆర్వోల పర్యవేక్షణలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ చేయించడం జరుగుతుందన్నారు. ఇప్పటికే చాలా మంది స్మార్ట్ కార్డులను పొందడం



జరిగిందన్నారు. అయితే వివిధ పనుల మీదు వేరే ప్రాంతాలకు వెళ్ళిన వారు, గ్రామంలోని లేనివారి కార్డులు మిగిలి ఉన్నాయన్నారు. వీరంతా ఈ నెలాఖరులోపు తీసుకోవాలని, లేనట్లయితే వారి రేషన్ కార్డులను ప్రభుత్వానికి నివేధించడం జరుగుతుందన్నారు. పొన్నూరు నియోజకవర్గంలోని చేబ్రోలు మండలంలో 22,354కార్డులకు గాను 21,457మంది కార్డులను తీసుకున్నారన్నారు. ఇంకా 897మంది కార్డులు తీసుకోవాల్సి ఉందన్నారు. పెదకాకాని మండలంలో 23,677కార్డులకు గాను 21,867మంది తీసుకున్నట్లు తెలిపారు. మిగిలిన 1810మంది కార్డులు విఆర్వోల వద్ద ఉన్నట్లు చెప్పారు. పొన్నూరు మండలంలో 34,637కార్డులకు గాను, 32,415మంది కార్డులను తీసుకెళ్ళారన్నారు.మిగిలిన 2222కార్డులు తీసుకెళ్ళాల్సి ఉందన్నారు. పొన్నూరు నియోజవకర్గంలో 93.89శాతం మందికి పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఈ ఆఖరి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ కోరారు.

## కాపు సంఘీయుల సంక్షేమానికి కృషి చేయాలి

పొన్నూరు, నవంబరు 16,ప్రభాతవార్త: కాపు సంఘీయుల్లో ఆర్థికంగా ఎదిగినవారు, వివిధ ప్రభుత్వ ఉద్యోగాలు చేస్తున్నవారు కాపుల్లోని పేదల అభ్యున్నతికి కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రముఖ వైద్యులు డాక్టర్ గాజుల రామకృష్ణ పిలుపునిచ్చారు. జీబీసి రోడ్డులోని వినాయకస్వామి గుడి సమీపంలో పోకల ప్రసాద్ ఎస్టేట్ ఆవరణలో ఆదివారం కాపు ఉద్యోగుల సేవా సమితి ఆధ్వర్యంలో కార్తీక వన సమారాధన జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిలుగా పాల్గొన్న డాక్టర్ రామకృష్ణ,




డాక్టర్ కల్లగంటినాగార్జునరావు, మాట్లాడుతూ కాపుల్లో ఆర్థికంగా, సామాజికంగా, విద్యాపరంగంలో ఎంతో మంది పేదలున్నారని, వారిని ఆదుకునేందుకు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా బలోపేతమైన వారు ముందుకు రావాల్సి ఉందన్నారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కాపు ఉద్యోగుల సేవా సమితి అధ్యక్షుడు చందు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఇప్పటికే కాపు సేవా సమితి ఆధ్వర్యంలో పదవతరగతి, ఇంటర్మీడియెట్ తదితర కోర్సుల్లో ప్రగతి సాధించిన, సాధిస్తున్న వారికి నియోజకవర్గ స్థాయిలో ఉపకార వేతనాలను అందజేస్తున్నట్లు చెప్పారు. తులసీ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ ఛైర్మన్ తులసీ రామచంద్రప్రభు చేతుల మీదుగా ఈ ఉపకార వేతనాలను ప్రతి ఏడాది అందజేస్తున్నట్లు చెప్పారు. అర్హులైన కాపు విద్యార్థులందరూ దరఖాస్తు చేసుకోవాలని చందు వెంకటేశ్వరావు కోరారు. వన సమారాధనను పురస్కరించుకొని పెద్దలను, అతిథులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో రాయల్ కాపు ఉద్యోగ సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షుడు చందనం శ్రీనివాసరావు, ప్రైమ్9 ఎలక్ట్రానిక్ మీడియా బ్యూరో శొంఠెం రవికృష్ణ, వల్లంశెట్టి శ్రీధర్, నాగశ్రీనివాస్, పల్లికల శ్యామ్ పాల్గొన్నారు.

## ఆహ్లాదాన్ని పంచేవిధంగా పార్కులను నిర్వహించాలి

పొన్నూరు, నవంబరు 16,ప్రభాతవార్త: పట్టణంలోని పార్కుల్లో ఆహ్లాదాన్ని పంచేవిధంగా పార్కుల నిర్వహణ చేపట్టాలని మునిసిపల్ కమిషనర్ ముప్పాళ్ళ రమేష్‌బాబు కింది స్థాయి సిబ్బందిని



ఆదేశించారు. పట్టణంలోని పలు వార్డుల్లో ఉన్న వివిధ పార్కులను ఆయన సందర్శించి అక్కడి సిబ్బందికి పలు సూచనలు చేశారు. స్థానిక 23వ వార్డు అంబేద్కర్ నగర్ కాలనీలోని పార్కును సందర్శించి పార్కు, పార్కు పరిసరాలు పరిశుభ్రంగా ఉండేవిధంగా చూడాలన్నారు. పార్కులకు వచ్చే ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలుగకుండా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. శానిటేషన్ సమస్య తలెత్తకుండా చూడాలన్నారు. సచివాలయ సిబ్బంది పార్కులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఆదేశించారు

## ఎందరో ప్రముఖుల త్యాగఫలితమే గ్రంథాలయాల ఏర్పాటు : పద్మ


యడ్లపాడు, నవంబర్ 16, ప్రభాతవార్త : గ్రంథాలయాలు ఏర్పాటు కొరకు ఊరూరు కరపత్రికలు ద్వారా నప్రచారం చేసిన అయ్యలంకి వెంకటరామయ్య, పాతూరి నాగభూషణం, గాడిచర్ల హరిసర్వోత్తమరావు, కె రంగనాదన్ లాంటి మహనీయులు చేసిన కృషి ఎంతో ఉత్తమమైనదని



జగ్గాపురం జిల్లా పరిషత్ అంగ్లభాషా పండితురాలైన పోపూరి పద్మ పేర్కొన్నారు. యడ్లపాడు గ్రామంలో ని శాఖ గ్రంథాలయ 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలో భాగంగా అదివారం నిర్వహించిన కార్యక్రమంలో అమె పాల్గొని ప్రసంగించారు. గ్రంథాలయాలు జ్ఞాన సంపద మరియు పుస్తక పఠనం వలన జ్ఞానాన్ని పెంపొందిచుకొనుటకు సహాయ పడతాయన్నారు. పుస్తక పఠనంపై అసక్తి పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ పాత్రికేయుడు మానుకొండ రామారావు, గ్రంథాలయాధికారి చేవూరి అంజమ్మ, అభివృద్ధి కమిటి సభ్యులు గోనుగుంట్ల శివరామకృష్ణ, జాలాది శేషయ్య, యడ్లూరి సంజీవరావు, విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

## మాల సంఘీయుల ఆత్మీయ సమ్మేళనం

విజయపురిసౌత్, నవంబరు 16 ప్రభాతవార్త: మాలలు ఆర్థికంగా ఎదగాలని మాలమహానాడు నాయకులు కోరారు. విజయపురిసౌత్‌లోని జింఖానా గ్రౌండ్‌లో జరిగిన మాలల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని విజయపురిసౌత్ మాల సంఘం అధ్యక్షుడు బొబ్బిలి చంద్రశేఖర్ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా జాతీయ




అధ్యక్షులు డా॥ బీఆర్ అంబేద్కర్ మనవడు బా॥ బీమ్‌రావ్ యశ్వంత్ అంబేద్కర్ పాల్గొన్నారు. పల్నాడు జిల్లా ఏర్పడిన తర్వాత మొట్టమొదటిసారిగా విజయపురిసౌత్‌లో నిర్వహించిన మాలల ఆత్మీయ సమ్మేళనానికి రాష్ట్రం నలువైపుల నుండి భారీగా మాలలు తరలివచ్చారు. అనంతరం యశ్వంత్ అంబేద్కర్ మాట్లాడుతూ మాలలు ఆర్థికంగా ఎదగాలని, వారి ఆర్థిక సామాజిక ఎదుగుదల కోసం చేసుకునే ఆత్మీయ సమావేశంలో పలు అంశాలపై చర్చించారు. అంబేద్కర్ గొప్ప విద్యావేత్త, మహాజ్ఞాని, న్యాయవాది, సంఘసంస్కర్త, అన్ని కుల మత ప్రాంతాలకు అతీతంగా రాజ్యాంగ ఫలాలు అందాలని ప్రపంచంలోనే అత్యున్నతమైన రాజ్యాంగాన్ని భారతదేశానికి అందించారని అన్నారు. పేదలు, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి అహర్నిశలు కృషి చేసిన మహనీయులు అని అంబేద్కర్‌ను కొనియాడారు. మాలలు అన్ని రంగాల్లో ప్రావీణ్యం చాటాలన్నారు. ముందుగా విజయపురిసౌత్‌కు విచ్చేసిన డా॥ బీమ్రావ్ యశ్వంత్ అంబేద్కర్‌కు మాల సంఘం కమిటీ సభ్యులు ఘనంగా పూలమాలలు, దుశ్శాలువాలతో సన్మానించారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో విజయపురిసౌత్ మాల కమిటీ సభ్యులు, ఉన్నతాధికారులు, విశ్రాంత ఉద్యోగులు, చుట్టుపక్కల గ్రామస్థులు పాల్గొన్నారు.

## ఘనంగా కొండవీటిరెడ్డి సంఘీయుల కార్తీక వన మహోత్సవం

కారంపూడి, నవంబరు 16 ప్రభాతవార్త: పల్నాడు కొండవీటిరెడ్డి సంఘీయుల కార్తీకమాస వన భోజన మహోత్సవం కారంపూడి మండలంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి





ముఖ్యఅతిథులుగా పల్నాడు జిల్లా వైసీపీ అధ్యక్షులు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, గురజాల మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి, వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆరె శ్యామల, వైసీపీ రాష్ట్రకార్యదర్శి పెదకూరపాడు, వినుకొండ నియోజకవర్గాల పరిశీలకులు యెనుము మురళీధర్‌రెడ్డిలు పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో కారంపూడి మండలంలోని రెడ్డి సోదర సోదరీమణులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

## పల్నాటి ఉత్సవాల్లో అంకాళమ్మ దేవాలయానికి ప్రత్యేక విశిష్టత

### పల్నాటి ఆరాధ్య దేవతగా చరిత్ర ప్రసిద్ధి



కారంపూడి, నవంబరు 16 ప్రభాతవార్త: ప్రస్తుతం కారంపూడిగా పిలువబడే కార్యమపూడి అసలు పేరు కల్యాణపురం. పల్నాటి యుద్ధానికి ముందు కల్యాణపురంలో అంకాళ పరమేశ్వరి పేరుతో ఆంకాళమ్మను పూజించేవారు. పల్నాటి యుద్ధం అనంతరం వీర్లఅంకమ్మ పేరుతో అమ్మవారిని ఆ ప్రాంతవాసులు కొలవడం ప్రారంభించారు. పార్వతీదేవి అంశగా పల్నాటి వీరులతో కొలవబడి శతాబ్దాల చరిత్రకు తార్కాణంగా నిలిచింది. పల్నాటి వీరాచార వంశీకులతోపాటు ఇక్కడి పల్లెల ప్రజలతో పూజలందుకుంటూ కోరిన కోర్కెలు తీరుస్తూ అమ్మల గన్న అమ్మగా పేర్గాంచింది. అంకమ్మ, అంకాళమ్మ, అంకమరావు, అంకాళయ్య వంటి పేర్లు పల్నాటి ప్రజలకు సుపరిచితం. 12వ శతాబ్దంలో పల్నాటి యుద్ధానికి ముందు బ్రహ్మానాయుడిచే ప్రతిష్టించబడిన అంకాళ పరమేశ్వరి అమ్మవారి ప్రస్థానం కల్యాణదుర్గం నుంచి తీసుకువచ్చినట్లు చరిత్ర చెబుతుంది. పూర్వం కల్యాణదుర్గం రాజ్యంలో శైవం మాత్రమే విరాజిల్లుతూ అన్యదేవతలను కొలిచేవారు కాదు. ఈ పరిస్థితి పార్వతీదేవి దృష్టికి వచ్చి ఆమె ఆగ్రహంతో అంకమ్మ పోతురాజు వంటి 101 శక్తులను సృష్టించి ఆ రాజ్యంపైకి పంపగా ఆ రాజ్యాన్ని పాలిస్తున్న గణపతి వీరసోమరాజు అమ్మవారికి కొలుపులు జరిపించి శాంతింపజేసి రాజ్యదేవతగా స్థాపించి పూజించాడు. పల్నాటి యుద్ధ సమయంలో ఆ రాజ్య వారసుడు కొమ్ముర్రాజు ద్వారా పల్నాడుకు చేరిన అంకమ్మ పీఠం కొమ్ముర్రాజు యుద్ధంలో అసువులు బాయటంతో బ్రహ్మన్న ద్వారా కారంపూడిలో పల్నాటి వీరులను కొలవబడి వీర్లంకమ్మ, పల్నాటి అంకమ్మగా పేర్గాంచింది. పల్నాటి యుద్ధంలో వీరులు మృతి చెందుతుండగా అది చూసి కన్నీటి పర్యంతమైందని దేవాలయ ప్రధాన ప్రహరీకి కిటికీ ఏర్పాటు చేసిన కిటికీ గుండా యుద్ధక్షేత్రం అమ్మవారు చూస్తుందని ఇందుకు ప్రతీకగా అమ్మవారి తల ఎడమపక్కకు ఒరిగి ఉంటుందని చరిత్ర చెబుతుంది. పల్నాటి యుద్ధంలో అసువులు బాస్తున్న యుద్ధవీరులను చూసి కన్నీరు పెడుతుందని. ఈ నీరు లోకానికి అరిష్టమని అమ్మవారి విగ్రహం వద్ద చిన్నపాటి గిన్నెను ఏర్పాటు చేయడం నేటికీ నిదర్శనం.

## పేదలకు లక్ష రూపాయల సహాయం

సత్తెనపల్లి టౌన్, నవంబర్ 16 ప్రభాతవార్త: సత్తెనపల్లి పట్టణంలోని రైల్వే గేట్ సమీపంలో ఉన్న పురాతన శ్రీరామాలయం ప్రాంగణం ఈ ఆదివారం కార్తీక మాసం సేవా కార్యక్రమంతో ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. గంజి వీరస్వామి ఆధ్వర్యంలో గత 25 సంవత్సరాలుగా నిరంతరాయంగా జరుగుతున్న ఈ మహా సేవా కార్యక్రమం ద్వారా వందలాది మంది నిరుపేదలకు,




వృద్ధులకు ఊరట లభించింది. ప్రముఖుల భాగస్వామ్యంఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు పిన్నమనేని పాములయ్య, బగ్గి నరసింహారావు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పిన్నమనేని పాములయ్య మాట్లాడుతూ. గంజి వీరస్వామి గత 25 సంవత్సరాలుగా నిస్వార్థ సేవతో కార్తీక మాసం పుణ్య దినాలలో పేదలకు అండగా నిలుస్తున్నారు. కేవలం భోజనమే కాకుండా, పేదలకు దుస్తుల పంపిణీ, ఆర్థిక సహాయం అందించడం అభినందనీయం" అని కొనియాడారు. సమాజంలో ఇటువంటి సేవకులు ఉండటం మనందరికీ గర్వకారణం అని తెలిపారు. లక్ష రూపాయల విలువైన వస్తువుల పంపిణీ ఈ సేవా కార్యక్రమంలో భాగంగా నిర్వాహకులు దాదాపు లక్ష రూపాయల విలువ గల వస్తువులను, సహాయాలను పేద ప్రజలకు పంపిణీ చేశారు.

**చోటి మిషన్లు:** 108 మంది నిరుపేదలకు ఆశ్రయించడానికి వీలుగా చోటి మిషన్లు అందజేశారు.

**వస్త్ర పంపిణీ:** 800 మంది పేద మహిళలకు చీరలు, 50 మంది వృద్ధులకు వెచ్చని రగ్గులు (దుప్పట్లు) పంపిణీ చేశారు. భోజన సౌకర్యం: వందలాది మంది ప్రజలకు అనంతరం ఆత్మీయంగా భోజన సౌకర్యం కల్పించారు. గంజి వీరస్వామి మాట్లాడుతూ"దాతల సహకారంతో ఈ సేవను నిరాటంకంగా కొనసాగిస్తున్నాం. పేదల ఆకలి తీర్చడం, వారికి జీవితంలో ఏదో ఒక విధంగా చేయూత ఇవ్వడం కార్తీక మాసం యొక్క పరమార్థంగా భావిస్తున్నాం" అని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, రామాలయ కమిటీ సభ్యులు, దాతలు, తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## చింతపల్లిలో బాలుడిపై పిచ్చుకుక్క దాడి

అచ్చంపేట, నవంబర్ 16, (ప్రభాతవార్త): మండలంలోని చింతపల్లిలో నాలుగేళ్ల చిన్నారి పిచ్చుకుక్క దాడికి గురైన ఘటన స్థానికంగా ఆందోళన రేకెత్తించింది. ఇంటి వద్ద ఆడుకుంటున్నప్పుడు అకస్మాత్తుగా కుక్క దాడి చేసి చిన్నారి ముఖం, చేతులకు గాయాలు అయ్యాయి.



కుటుంబ సభ్యులు వెంటనే చిన్నారిని స్థానిక ఆసుపత్రికి తరలించగా, వైద్యులు మొదటి చికిత్స అందించారు. గాయాలు తీవ్రంగా ఉండడంతో వైద్య పర్యవేక్షణ కోసం చిన్నారిని గుంటూరు ఆసుపత్రికి రిఫర్ చేశారు. ప్రస్తుతం చిన్నారి వైద్యుల పర్యవేక్షణలో చికిత్స పొందుతున్నట్లు తెలుస్తోంది. ఈ ఘటనపై గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తూ ఇలాంటి కుక్కలపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు

17-11Pg5 9_17-11Pg5.qxd 16/Nov/25 9:49 PM Page 1



# లాలూ ఇంట్లో 'రాజకీయ'చిచ్చు



**కుటుంబ సభ్యుల మధ్య కీచులాట**

**కన్నీళ్లతో బయటకొచ్చిన కుమార్తెలు**

**ఆడబిడ్డల కన్నీళ్లు ఎవరికీ మంచిది కాదు: రబ్రీదేవి సోదరుడు సాధు యాదవ్**

**చెల్లెళ్ల జోలికొస్తే ఖబడ్దార్: తేజ్‌ప్రతాప్**

**తేజస్విపై రోహిణి తీవ్ర ఆరోపణలు**

**పాట్నా, నవంబరు 16:** బీహార్ ఎన్నికల ఫలితాలు లాలూప్రసాద్ యాదవ్ కుటుంబంలో చిచ్చురేపాయి. ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో లాలూ పార్టీ ఆర్‌జెడి కేవలం 25స్థానాలకే పరిమితమైంది. ఎన్నికల ఫలితాలు కేవలం పార్టీపైనే కాదు, లాలూ కుటుంబంపై కూడా తీవ్ర ప్రభావం చూపాయి. లాలూ పెద్ద కుమారుడు తేజ్‌ప్రతాప్ ఇప్పటికే ఇంటి నుంచి, ఆర్‌జెడి నుంచి బయటకెళ్లిపోగా, తాజాగా అతని కుమార్తెలు నలుగురూ ఇంటి నుంచి వెళ్లిపో యారు. లాలూ ఇంట్లో ఏదో జరుగుతోంది బీహార్ రాజకీయ వర్గాల్లో విస్తృతంగా జరు గుతోంది. ఎన్నికల్లో ఓడిపోయినంత మాత్రాన కుటుంబసభ్యుల మధ్య కీచులాటలేంటి?, ఇంటి నుంచి కూతుళ్లను కొడుకు తేజస్వి వెళ్లగొడు తుంటే తల్లిదండ్రులుగా లాలూ, రబ్రీదేవి ఏం చేస్తున్నారు? అంటూ ప్రశ్నలు లేవనెత్తుతు న్నారు. ఇక లాలూ ఇంట్లో కీచులాటలకు సంబంధించి కూతురు రోహిణి ఆచార్య రాజకీయాలకు గుడ్‌బై చెప్పారు. కుటుంబం నుంచి బంధాలు తెంచుకుంటున్నానని పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం సోషల్ మీడియాలో ట్వీట్ చేసిన విషయం తెలిసిందే. కాగా, గత కొన్నేళ్ల నుంచి లాలూ కొడుకు తేజస్వి యాదవ్‌కు, రోహిణి ఆచార్యకు మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఎన్నికల ఫలితాల నేపథ్యంలో అవి తారాస్థాయికి చేరాయి. కాగా, ఆదివారం వరుస సంచలన పోస్టులు పెట్టింది. సోదరుడు తేజస్విపై తీవ్ర ఆరోపణలు గుప్పించింది. అలాగే, తండ్రికి కిడ్నీ ఇచ్చిన విషయాన్ని ప్రస్తావించింది. ఆ పోస్టుల్లో "నిన్న ఓ కూతుర్ని, ఓ సోదరిని, ఓ వివాహితను, ఓ తల్లిని దారు ణంగా అవమానించారు. చెప్పుతో కొట్టడానికి కూడా ప్రయత్నించారు. ఆత్మ గౌరవం విషయంలో నేను వెనక్కు తగ్గను. ఏడుస్తున్న తల్లిదండ్రులు, అక్కాచెల్లెళ్లను వదిలి ఇంటి బయటకు రావాల్సి వచ్చింది. నన్ను ఓ అనాథలా మార్చేశారు.

నాపై అమానుషమైన కామెంట్లు చేశారు. డబ్బుల కోసం, టికెట్ కోసం మా నాన్నకు కిడ్నీ ఇచ్చానని అవమానించారు. ప్రతీ వివాహితకు నేను ఒకటే చెబుతున్నా మీ పుట్టింట్లో అన్నయ్య, తమ్ముడు ఉంటే ఏ పరిస్థితుల్లోనూ మీ తండ్రిని కాపాడేందుకు ముందుకు రాకండి. మీ సోదరులనే కిడ్నీ ఇవ్వమని చెప్పండి. మీరు ఎవరూ నా లాంటి తప్పు చేయకండి. ఏ ఇంట్లోనూ రోహిణి లాంటి కుమార్తె, చెల్లెలు పుట్టకూడదు' అంటూ ఆవేదన వ్యక్తం చేశారు.

**ఇది మంచిది కాదు: రబ్రీదేవి సోదరుడు సాధు యాదవ్:** రోహిణి నా మేనకోడలు ఆమె కన్నీళ్లతో ఇంటి నుంచి బయటకు రావడం తన మనస్సు కలిచివేసింది. ఏఇంటి ఆడబిడ్డ అయినా కన్నీళ్లలో బయటకెళ్లకూడదు. అది ఎవరికీ మంచికాదు అని రబ్రీదేవి సోదరుడు సాధు యాదవ్ పేర్కొన్నారు. 'రబ్రీదేవి నా సోదరి, నేను కూడా చాలా బాధలు పడ్డాను, కానీ నా సొంత సోదరికి వ్యతిరేకంగా నేనెప్పుడూ ఒక్క మాట కూడా మాట్లాడలేదు. రోహిణి ఆచార్య నా మేనకోడలు. ఎవరైనా ఆమెతో అలా ప్రవర్తించి ఉంటే, అది ఎప్పుడూ జరగకూడదు, అది తప్పు' అని సాధు యాదవ్ అన్నారు. ఎవరినీ ప్రత్యే కంగా వేలెత్తి చూపలేకపోయినా, పరిస్థితి పూర్తిగా ఆలోచించాల్సిన అవసరం ఉందన్నారు.

రబ్రీదేవి మరో సోదరుడు సుభాష్ యాదవ్ కూడా ఈ సంఘటనను ఖండించారు. 'ప్రస్తుతం జరుగుతున్నదంతా ఆర్‌జెడి ఓటమి వల్లే జరిగింది. నెల రోజుల క్రితం వారు సిఎం అవుతున్నారు. నేడు పార్టీని నడపడానికి సమర్థవంతమైన నేత కూడా లేదు. బీహార్ ఏమి కోరుకుంటున్నదో వారికి అర్థం కాలేదు. రోహిణి విషయానికొస్తే, ఆమెకు అలా జరగకూడదు' అని సుభాష్ యాదవ్ పేర్కొన్నారు.

**నా చెల్లెల్ని అవమానిస్తే సహించను:** తన చెల్లెలు రోహిణి ఆచార్యకు బాసటగా ఉంటానని, ఆమెను అవమానిస్తే సహించేది లేదని పెద్ద కుమారుడు తేజ్ ప్రతాప్ యాదవ్ హెచ్చరించారు. తన సోదరికి జరిగిన అవమానం సహించరానిదని అన్నారు. తనకు అన్యాయం జరిగితే భరించానని, అయితే తన చెల్లెల్ని అవమానిస్తే మాత్రం మోనంగా చూస్తూ ఉండేది లేదని హెచ్చరించారు. తన సోదరిని చెప్పుతో కొట్టారనే విషయం తెలిసి తన గుండె రగిలిపోయిందన్నారు. నేరుగా ఎవరి పేరునూ ఆయన ప్రస్తావించకుండా తన కుటుంబంపై దాడి చేసిన వంచకులను బీహార్ ప్రజలు ఎప్పటికీ క్షమించరని అన్నారు. ఈ విషయంలో తన తండ్రి లాలూ ప్రసాద్ జోక్యం చేసుకోవాలని తేజ్‌ప్రతాప్ కోరారు. 'మీరు (లాలూ)ఒక్క సైగచేయండి చాలు. ఈ జయచందలను బీహార్ ప్రజలు పూడ్చిపెడతారు' అని తేజ్ ప్రతాప్ ఘాటుగా వ్యాఖ్యానించారు. ఇదేమీ రాజకీయ పోరాటంకాదని, ఇది ఒక కుటుంబ గౌరవం, ఒక ఆడకూతురు గౌరవం, బీహార్ ఆత్మాభిమానంపై జరుగుతున్నపోరాట మని అభివర్ణించారు. ఈ మేరకు ఎక్స్‌లో ట్వీట్ చేశారు.

# మెక్సికోలో జెన్‌జెడ్ ఉద్యమం



## వేలాది యువత రోడ్లపైకి వచ్చి నిరసనలు

## ఘర్షణల్లో 100మంది పోలీసులకు గాయాలు

**మెక్సికోసిటీ, నవంబరు 16:** జెన్ జెడ్ ఉద్యమం ప్రపంచ దేశాలకు ఎగబాకుతోంది. నేపాల్‌లో ప్రభుత్వాన్నే కూల్చివేసిన ఈ జెన్‌జడ్ ఉద్యమం ఇపుడు ఉత్తర అమెరికాను తాకింది. మెక్సికోలో వేలాది మంది యువత రోడ్లపైకి వచ్చిన నిసనలు చేశారు. దేశ అధ్యక్షురాలు క్లాడియా షిన్‌బామ్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ క్రమంలోనే అధ్యక్ష భవనమైన నేషనల్ ప్యాలెస్‌లోకి దూసుకెళ్లేందుకు ఆందోళనకారులు ప్రయత్నించారు. దీంతో పోలీసులు నిరసనకారుల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. మెక్సికో సిటీలో జెన్ జెడ్ యువత చేపట్టిన నిరసనలు హింసాత్మకంగా మారాయి. నేషనల్ ప్యాలెస్ చుట్టూ ఉన్న ఇనుప కంచెలను ముసుగులు ధరించిన కొందరు నిరసనకారులు కూల్చేశారు. హింసను అరికట్టడంలో ప్రభుత్వం విఫలమైందని ఆగ్రహం వ్యక్తం చేస్తూ అధ్యక్ష భవనంలోకి దూసుకెళ్లేందుకు యత్నించారు. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు నిరసనకారులపైకి టియర్ గ్యాస్ ప్రయోగించారు. కాగా, ఈ ఘర్షణల్లో 100 మంది పోలీసులకు గాయాలయ్యాయని సిటీ సిటిజెన్ సేఫ్టీ సెక్రటరీ పాబ్లో వాజ్‌క్వెజ్ చెప్పారు. మరో 20 మంది యువత కూడా గాయపడ్డాని తెలిపారు. ఇప్పటికే 20 మంది నిరసనకారులను అరెస్టు చేసినట్లు వెల్లడించారు. మెక్సికోలో జెన్ జెడ్ ఎందుకు నిరసలు చేస్తున్నారు ఈనెల ఒకటవ తేదీ మెక్సికో పశ్చిమ రాష్ట్రమైన మికోకాన్‌లోని ఉరుపాన్ నగర మేయర్ కార్లోస్ మంజో దారుణ హత్యకు గురయ్యాడు. నేరాలకు వ్యతిరేకంగా ఈయన పోరాడేవాడు. 'డే ఆఫ్ ది డెడ్' అనే ఓ బహిరంగ కార్యక్రమంలో కార్లోస్‌ను దుండగులు కాల్చి చంపారు. ఈ దారుణ హత్య దేశవ్యాప్తంగా యువతలో తీవ్ర ఆగ్రహావేశాల్ని రేపింది. ప్రభుత్వాలు హింసను అరికట్టడంలో విఫలమయ్యాయి అంటూ నిరసనలకు దిగారు యువత. మెక్సికో సిటీతో పాటు పలు నగరాల్లో వేలాది మంది యువత ప్రదర్శనలు చేపట్టారు. ఈ నేపథ్యంలో యువతలో ఆగ్రహం కట్టలు తెంచుకుంది. దీంతో అధ్యక్ష భవనం ముట్టడికి ప్రయత్నించారు. షీన్‌బామ్ అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాదిలో ఆమెకు 70 శాతానికి పైగా అప్రూవల్ రేటింగ్ ఉంది. అయితే, దేశంలో హింసను అరికట్టడంలో విఫలమవుతున్నారని తరచుగా తీవ్ర విమర్శలకు గురవుతున్నారు.

# పేలుడు కోసం 'మదర్ ఆఫ్ సైతాన్'



## సున్నితమైన ఒత్తిడికే పేలిపోయే రసాయనం

**న్యూఢిల్లీ, నవంబరు 16:** దేశ రాజధాని ఢిల్లీలో గతవారం సంభవించిన పేలుడు ఘటనపై దర్యాప్తు ముమ్మరంగా కొనసాగుతోంది. విచారణలో సంచలన వాస్తవాలు బయటపడుతున్నాయి. తాజాగా, ఈ పేలుడుకు ట్రైఎసిటోన్ ట్రై పెరోక్సైడ్ అనే రసాయనాన్ని ఉయోగించినట్టు దర్యాప్తు అధికారులు అనుమానిస్తున్నారు. 'మదర్ ఆఫ్ సైతాన్ 'గా గుర్తింపు పొందిన ఈ రసాయనం డెటోనేటర్ లేకుండానే వేడి కారణంగా పేలిపోయే గుణం కలిగి ఉంటుందని నిపుణులు తెలిపారు. ఢిల్లీ పేలుడుకు ఇదే కారణమైందా అనేది ఫోరెన్సిక్ నిపుణులు ప్రస్తుతం పరీక్షిస్తున్నారు. ఎర్రకోట వద్ద 20 కారులో పేలుడు సంభవించి 13 మంది చనిపోగా మరో 20 మంది వరకు గాయపడ్డారు. ఆ కారును నడిపిన డాక్టర్ ఉమర్ మహ్మద్ నబీకి పాకిస్థాన్ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తోన్న జైషే మహమ్మద్ ఉగ్రవాద సంస్థతో సంబంధాలు ఉన్నాయని పోలీసులు తెలిపారు. దర్యాప్తు బృందాల ప్రకారం టీఏటీపీ ప్రమాద తీవ్రత గురించి అవగాహన ఉండటంతో నిందితుడు ఉమర్ జనసాంద్రత అధికంగా ఉన్న ప్రాంతంలోకి కారును నడిపించాడు. పేలుడు జరిగిన ప్రదేశంలో పాత ఢిల్లీలో అత్యంత రద్దీగా ఉండే చాందినీ చౌక్‌కు కేవలం కొన్ని అడుగుల దూరంలోనే ఉంది. ట్రైఎసిటోన్ ట్రై పెరోక్సైడ్ (టీఏటీపీ) అత్యంత సున్నితమైందని నిపుణులు పేర్కొంటున్నారు. ఘర్షణ, ఒత్తిడి, ఉష్ణోగ్రత పెరగడం వంటి భౌతిక పరిసరాల్లో ఏ చిన్న మార్పైనా పేలుడుకు దారితీస్తుంది. రసాయనికంగా, ఉష్ణస్థితిగతంగా స్థిరంగా ఉండే అమోనియం నైట్రేట్‌కు మాత్రం డెటోనేటర్ అవసరం పడుతుంది, ప్రపంచవ్యాప్తంగా నిషేధిత బాంబుల తయారీకి విస్తృతంగా ఉపయోగించడం వల్ల దీనిని 'మదర్ ఆఫ్ సైతాన్'గా పేర్కొంటారు. 2017 బార్సిలోనా, 2015 పారిస్ దాడులు, 2017 మాంచెస్టర్, 2016 బ్రస్సెల్స్ పేలుళ్లలోనూ ఈ సంయోగ పదార్థం ఆనవాళ్లు లభ్యమయ్యాయి. ఇటువంటి పేలుడు పదార్థాలను తయారు చేసిన వ్యక్తులు ఏదో రూపంలో ఉగ్రవాద శిక్షణ పొందినవారే అని నమ్ముతుంటారు. ఢిల్లీలో సంఘటనా స్థలిలో ధ్వంసమైన తీరును పరిశీలిస్తే టీఏటీపీకు సాధారణంగా కనిపించే లక్షణాలకు అనుగుణంగా ఉన్నాయి. శక్తివంతమైన ప్రకంపనలకు ప్రసిద్ధి చెందిన ఈ రసాయనం ఇలాంటి విధ్వంసాన్ని సృష్టించగలదని నిపుణులు చెబుతున్నారు. ప్రస్తుతం ఘటనా స్థలిలో నమూనాలను సేకరించిన ఫోరెన్సిక్ బృందాలు టీఏటీపీ ఉపయోగించారా అనేది నిర్ధారించే పనిలో ఉన్నాయి. పేలుడు తీవ్రతను బట్టి చూస్తే కారు లోపల ఉష్ణోగ్రత లేదా అస్థిర వాతావరణం కారణమై ఉండొచ్చని అభిప్రాయం వ్యక్తమవుతోంది. భారీ ఉగ్రదాడుల కోసం తరలిస్తున్న సమయంలో అది అనుకోకుండా పేలిపోయిందా అనే కోణంలో కూడా దర్యాప్తు జరుగుతోంది. టీఏటీపీ తయారీకి అవసరమైన రసాయనాలను నిందితుడు ఉమర్ ఎలా సంపాదించాడు అనే విషయంపై దర్యాప్తు అధికారులు ఆరా తీస్తున్నారు. ఎందుకంటే దీని తయారికి పలురకాల రసాయనాలు అవసరం అవుతాయి. ఏదైనా విస్తృత నెట్‌వర్క్ నుంచి అతడికి సహాయం లభించిందా లేదా ఈ పేలుడు పదార్థాన్ని సిద్ధం చేయడంలో మరెవరైనా పాల్గొన్నారా అనేది కూడా విచారిస్తున్నారు. పోలీసులు, కేంద్ర దర్యాప్తు సంస్థలు పేలుడుకు ముందు నిందితుడు ఉమర్ డిజిటల్ కార్యకలాపాలు, ప్రయాణ వివరాలు, కమ్యూనికేషన్ రికార్డులను పరిశీలించి అతని కార్యకలాపాల పూర్తి మ్యాప్ రూపొందిస్తున్నారు.

## పెళ్లికావట్లేదని చిన్నారిని చిదిమేసిన అక్కాచెల్లెళ్లు!



**జైపూర్, నవంబరు 16:** వయసు మీరిపోతున్నా ఇంకా పెళ్లి కావట్లేదని రాజస్థాన్‌లో నలుగురు యువతులు ఆటవిక చర్యకు పాల్పడ్డారు. 17 రోజుల వయసున్న పసికందును క్షుద్ర పూజలకు బలిచ్చారు. ఇలా చేస్తే తమకు పెళ్లి అవుతుందని ఈ దారుణానికి ఒడగట్టారు. చిన్నారి తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు నలుగురిని అరెస్ట్ చేశారు. జోధ్‌పూర్‌లోని నెహ్రూ నగర్ కాలనీలో నలుగురు యువతులు నివసిస్తు న్నారు. వీరి సోదరికి పెళ్లై ఇద్దరు పిల్లలు ఉన్నారు. మళ్లీ డెలివరీ అయింది. అయితే ఈ నలుగురికి మాత్రం వయసు మీరిపోతున్నా ఇంకా పెళ్లి కాలేదు. గత కొన్నేళ్ల నుంచి పెళ్లి సంబంధాలు చూస్తున్నా ఫలితం లేకుండా పోయింది. దీంతో ఈ నలుగురు అక్కాచెల్లెళ్లలో అసహనం పెరిగిపోయింది. ఈ క్రమలో తమ సోదరి బాత్రూమ్‌కు వెళ్లిన సమయంలో ఈ నలుగురు బాలుడ్ని తమ రూమ్‌లోకి తీసుకెళ్లారు. అనంతరం పిల్లాడు నోరు నొక్కి, కాళ్లు చేతులు విరిచేసి చంపేశారు.

# ఉగ్రవాదుల కార్యకలాపాలకు అడ్డాగా 'అల్‌ఫలా'




## పోలీసుల వరుస సోదాలు, అరెస్టులతో వర్సిటీని ఖాళీ చేస్తున్న విద్యార్థులు

**హైదరాబాద్, నవంబరు 16, ప్రభాతవార్త:** దేశ వ్యాప్తంగా సంచలనం రేపిన ఢిల్లీ కారు బాంబు పేలుడు తరువాత హరియాణాలోని ఫరీదాబాద్‌లో గల అల్‌ఫలా యూనివర్శిటీ పేరు మీడియాలోఒక్కసారిగా పతాక శీర్షికలకు ఎక్కింది. కారు బాంబు పేలుడులో నింది తులుగా వున్న ముగ్గురు వైదు ్యలు (ఇందులో ఒకరు మహిళ వుంది) ఈ వర్సిటీలో పనిచేస్తున్న వారు కాగా మరో ఇద్దరు వైద్యులు ఈ వర్సిటీతో సంబంధాలుండడంతో పోలీసు లు వారం రోజులుగా వరుసగా సోదాలు చేస్తుండడంతో పాటు అనుమానితులను అరెస్టు చేస్తున్నారు. ఈ క్రమంలో రెండు రోజుల నుంచి విద్యారు ్థలు హాస్టళ్లను ఖాళీ చేసి ఇళ్లకు వెళ్లిపోతున్నారు.

ఈ నెల 10వ తేదీన ఢిల్లీలోని ఎర్రకోట వద్ద జరిగిన కారు బాంబు పేలుడు ఐఎస్ఐ ఉగ్రవాదుల ఆత్మాహుతి దాడిగా నిర్ధారణ అయిన తరువాత ఇందుకు కారకులైన వైద్యులు హరియాణాలోని ఫరీదాబాద్‌లో గల అల్‌ఫలా యూనివర్శిటీ ఉద్యోగులని తేలడంతో పోలీసులు షాక్‌కు గురయ్యారు. వీరిలో డాక్టర్ ముజమిల్ షకీల్, డాక్టర్ ఉమర్ మహమ్మద్‌లు కాశ్మీర్‌కు చెందిన వారు కాగా మహిళా వైద్యురాలు షహీన్ షహీద్ యుపిలోని లక్నోకు చెందినదిగా పోలీసులు గుర్తించారు. ఆత్మాహుతి దాడికి కారకుడైన డాక్టర్ ఉమర్ నబీ కాశ్మీర్‌లోని పుల్వామకు చెందిన వైద్యుడు అయినా ఇతను తన సహచర ఉగ్ర వైద్యులతో సంబంధం కలిగి వున్నట్లు తేలింది. కాగా ఈ యూనివర్శిటీలో పనిచేస్తున్న డాక్టర్ ముజమిల్ షకీల్ సమీపంలోని దౌజా గ్రామంలో రెండు గదులను అద్దెకు తీసుకుని అందులో ఐఈడీ బాంబుల తయారీకి వాడే అమ్మోనియం నైట్రేట్ పేలుడు పదార్థం 2950 కిలోలను కొన్ని టైమర్లను, ఇంకొన్ని వస్తువులను ఢిల్లీ, హరియాణా పోలీసులు పట్టుకోవడం తెలిసిందే. వీరంతా పాక్ కేంద్రంగా పనిచేస్తున్న నిషిద్ధ ఉగ్రవాద సంస్థ జైష్ ఏ మహమ్మద్‌కు చెందిన వారుగా తేలింది. ఆపరేషన్ సింధూర్ తరువాత జైష్ ఏ మహమ్మద్ భారత్‌లో తమ కార్యకలాపాల విస్తరణ కోసం వీరు వ్యూహాలు రచించినట్లు ఇందులో మహిళలను రంగంలో దించినట్లు పోలీసులు తేల్చారు. ఇందులో జైష్ ఏ మహమ్మద్ సంస్థకు మహి ళా కమాండర్‌గా డాక్టర్ షహీన్ షహీద్ నియమితులైంది. వైట్ కలర్ టెర్రర్ మాడ్యూల్‌లో వైద్యులతో పాటు వైద్య విద్యార్థులను, పారా మిలటరీ సి బ్బందిని ఉగ్రవాదులుగా తయారు చేయడం కోసం జైష్ ఏ మహమ్మద్ నిర్ణీత కాల వ్యవధిని నిర్ణయించుకుని పనిచేస్తున్నట్లు పోలీసులకు ఆధారాలు లభించాయి. ఇందుకు జైష్ ఏ మహమ్మద్ ఫరీదాబాద్‌లోని అల్‌ఫలా వర్సిటీని అడ్డాగా మార్చుకుందని పోలీసులు ఆధారాలు సేకరించారు. ఈ క్ర మంలోనే జమ్మూ కాశ్మీర్, ఢిల్లీ సహా దేశ వ్యాప్తంగా పేలుళ్లకు జైష్ ఏ మహమ్మద్ కుట్రలు పన్నగా వాటిని భద్రతా బలగాలు నిర్వీర్యం చేశాయి. ఢిల్లీ పేలుడు తరువాత అల్‌ఫలా యూనివర్శిటీలో వారం రోజులుగా పోలీసులు వరుసగా సోదాలు చేస్తున్నారు. దీంతో పాటు పదుల సంఖ్యలో అనుమానితులను అదుపులోకి తీసుకుంటున్నారు. వీరిలో కొందరిని అరెస్టు చేశారు. వీరిచ్చిన సమాచారంతో కాశ్మీర్ సహా పలు ఉత్తరాది రాష్ట్రాలలో మరికొందరిని పోలీసులు అదుపులోకి తీసుకుంటున్నారు. ఈ క్రమంలో అల్‌ఫలా వర్సిటీని విద్యార్థులు ఖాళీ చేస్తున్నారు. వర్సిటీ అధికారులు కూ డా కొన్ని విభాగాలకు కొన్ని రోజుల పాటు సెలవులు ప్రకటించడంతో ఈ యూనివర్శిటీలో నిశబ్ద వాతావరణం నెలకొంది.


## సంక్షిప్తంగా..

### పేలుడు స్థలంలో 3 బుల్లెట్లు స్వాధీనం



**న్యూఢిల్లీ, నవంబరు 16:** ఢిల్లీలోని ఎర్రకోట సమీపంలో జరిగిన కారు పేలుడు ఘటనపై దర్యాప్తు బృందాలు విచారణను వేగవంతం చేశాయి. ఈ కేసులో కీలక ఆధారాలు లభించాయి. ఘటనా స్థలంలో ఫోరెన్సిక్ బృందాలు మూడు బుల్లెట్లను స్వాధీనం చేసుకున్నట్లు ఢిల్లీ పోలీసులు తెలిపారు. ఇవి సైనికులు వాడే 9 ఎంఎం కాట్రిడ్జ్‌లు అని వెల్లడించారు. అయితే, ఆ ప్రదేశంలో ఎలాంటి తుపాకీ లభ్యం కాలేదని స్పష్టం చేశారు. ఘటనా స్థలంలో భద్రతా విధుల్లో ఉన్న పోలీసులు, భద్రతా సిబ్బందికి అందించిన బుల్లెట్లను పరిశీలించామని, స్వాదీనం చేసుకున్న బుల్లెట్లు వారికి సంబంధించినవి కావని పోలీసులు ధ్రువీకరించారు. దీంతో భద్రతా బలగాలు వాడే బుల్లెట్లు అక్కడికి ఎలా వచ్చాయనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. దీనిపై స్పష్టత కోసం స్థానికంగా ఉన్న సీసీటీవీ ఫుటేజీలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు.

### పాక్ ప్రధానిపై మాజీ క్రికెటర్ సెటైర్లు..



**ముంబయి, నవంబరు 16:** భారత మాజీ క్రికెటర్, వ్యాఖ్యాత ఆకాశ్ చోప్రా పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్‌పై తన ధైన శైలిలో వ్యంగ్యాస్త్రాలు సంధించారు. శ్రీలంకపై వన్డే సిరీస్ గెలిచినందుకు పాక్ జట్టును అభినందిస్తూ షరీఫ్ చేసిన ట్వీట్‌పై చోప్రా ఘాటుగా స్పందించారు. ఒక ద్వైపాక్షిక సిరీస్ విజయాన్నే గొప్పగా చెప్పుకుంటున్నారంటూ ఆయన ఎద్దేవా చేశారు. రావల్పిండి వేదికగా శ్రీలంకతో జరిగిన మూడు వన్డేల సిరీస్‌ను పాకిస్థాన్ 2-0 తేడాతో కైవసం చేసుకుంది. ఈ విజయంపై పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ ఎక్స్ వేదికగా స్పం దిస్తూ జట్టును, పీసీబీ చైర్మన్ మొహ్సిన్ నఖ్వీని అభినందించారు.

ఇస్లామాబాద్‌లో పేలుడు ఘటన జరిగినప్పటికీ సిరీస్‌లో పాల్గొన్నందుకు శ్రీలంక ఆటగాళ్లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అయితే, షరీఫ్ చేసిన ఈ ట్వీట్‌పై ఆకాశ్ చోప్రా స్పందిస్తూ, ఒక ద్వైపాక్షిక సిరీస్ గెలవడం మాత్రమే మీకు గొప్పగా చెప్పుకోవడానికి మిగిలి నప్పుడు ఇలాగే ఉంటుందంటూ సెటైర్ వేశారు.

### భారత్ సంతతి ఎడ్యుటెక్ సిఇఒకు అమెరికాలో అవమానం



**వాషింగ్టన్, నవంబరు 16:** ప్రముఖ ఎడ్యుకేషన్ టెక్నాలజీ సంస్థ మైండ్‌వ్యాలీ వ్యవస్థాపకుడు, సీఈఓ విషెన్ లఖియానీకి అమెరికాలో చేదు అనుభవం ఎదురైంది. భారత సంతతికి చెందిన ఈ మలేషియన్ వ్యాపారవేత్త, అమెరికాలో పెరుగుతున్న జాత్యహంకారం, విదేశీయుల పట్ల వ్యతిరేకతపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. అసాధారణ ప్రతిభావంతులకు ఇచ్చే ఓ1 వీసా తన వద్ద ఉన్న ప్పటికీ, యూఎస్ విమానాశ్రయంలో ఎఫ్‌బిఐ అధికారులు తనను అడ్డుకున్నారని ఆయన తెలిపారు. ఒకప్పుడు ఎంతో ఇష్టపడిన అమెరికాకు రావాలంటేనే ఇప్పుడు భయ మేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. తాను గత 22ఏళ్లుగా అమెరికాలో పన్నులు చెల్లి స్తున్నానని, తన కంపెనీలో ప్రపంచవ్యాప్తంగా 230 మంది ఉద్యోగులు ఉన్నారని గుర్తుచేశారు.

### కొన్ని రకాల ఉత్పత్తులపై సుంకాలు తొలగించిన ట్రంప్



**వాషింగ్టన్, నవంబరు 16:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల పలు దేశాలపై సుంకాలు విధించి దారికి తెచ్చుకునే ప్రయత్నం చేశారు. కానీ ఆ ప్రయత్నాలు బెడిసికొట్టాయి. ట్రంప్ సుంకాల కారణంగా అమెరికాలో పలు వస్తువుల ధరలు పెరిగిపోయాయి. వినియోగదారులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేయడంతో ఒత్తిడికి తలొగ్గిన ట్రంప్ ఆహార ఉత్పత్తులపై సుంకాలను తొలగించారు. ఈ మేరకు ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌పై సంతకం చేశారు. ఇటీవల ఎన్నికల్లో ఎదురుదెబ్బ తగలడం కూడా ట్రంప్ దిగి రావడానికి ఒక కారణంగా చెప్పవచ్చు. ఎట్టకేలకు దిగొచ్చిన ట్రంప్. గొడ్డు మాంసం, కాఫీ, అరటి పండ్లు, నారింజ, పండ్ల రసం లాంటి పలు ఆహార ఉత్పత్తులపై సుంకాలను తొలగించారు. పలు దేశాలపై భారీగా సుంకాలు విధించినప్పటికీ ఆ ప్రభావం వినియోగదారులపై పడదని ఇంతకాలం ట్రంప్ చెబుతూ వచ్చారు.



## ఉగ్రవాదంలోకి వైద్యులు రావడంపై లోతుగా దర్యాప్తుచేయాలి

## జమ్ముకాశ్మీర్ మాజీ సీఎం ఫరూక్ అబ్దుల్లా

**శ్రీనగర్, నవంబరు 16:** జమ్ముూకశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి, నేషనల్ కాన్ఫరెన్స్ అధినేత ఫరూక్ అబ్దుల్లా ఒకే రోజు రెండు వివాదాస్పద వ్యాఖ్యలు చేసి రాజకీయంగా కలకలం రేపారు. హర్యానాలో ఇటీవల పట్టుబడిన వైట్ కాలర్ టెర్రరిస్ట్ మాడ్యూల్‌లో డాక్టర్లు ఉండటంపై ఆయన స్పందిస్తూ, వారు ఆ మార్గాన్ని ఎందుకు ఎంచుకున్నారో లోతుగా దర్యాప్తు చేయాలని సూచించారు. చదువుకున్న డాక్టర్లు ఈ దారి పట్టడానికి కారణాలేంటి దీని వెనక ఎవరున్నారు అనే విషయాలపై సమగ్రమైన విచారణ జరిపి, అధ్యయనం చేయాల్సిన అవసరం ఉందని అబ్దుల్లా అన్నారు.

# వీధికుక్కలను ఇంట్లోకి తెస్తోంది.. విడాకులిప్పించండి

## గుజరాత్ హైకోర్టులో ఓ భర్త పిటిషన్



**అహ్మదాబాద్, నవంబరు 16:** తన భార్య రోజూ వీధికుక్కలను ఇంటికి తీసుకువస్తోందని, ఆమెకు వీటిపట్ల ఉన్న మమకారంతో నా వైవాహిక జీవితం నరకప్రాయం అయిందని విడాకులు కావాలంటూ గుజరాత్ హైకోర్టులో 41 ఏళ్ల వ్యక్తి గుజరాత్ హైకోర్టును ఆశ్రయించారు. అహ్మదాబాద్‌కు చెందిన ఈ 41 ఏళ్ల వ్యక్తి ఒక ప్రైవేటు సంస్థలో సీనియర్ ఉద్యోగిగా పని చేస్తున్నారు. అయితే 2006లో అదే ప్రాంతానికి చెందిన ఓ మహిళను పెళ్లి చేసుకున్నారు. ప్రస్తుతం ఆమె వయసు 40 ఏళ్లు కాగా ఈమె కూడా ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తోంది. అయితే ఈమెకు ముందు నుంచీ శునకాలు అంటే ఇష్టం. దీంతో తరచుగా వీధి కుక్కలను ఇంట్లోకి తీసుకు వస్తుండేది. కానీ భర్తకు ఇది ఏమాత్రం నచ్చట్లేదు. ముఖ్యంగా ఆమె తరచూ వీధి శునకాలను ఇంటికి తీసుకురావడం, వాటిని ఇంట్లోనే ఉంచడం, తనకంటే వాటి సంరక్షణకే ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వడం వంటి పనులతో ఇద్దరి మధ్య గొడవలు ప్రారంభం అయ్యాయి. వీధి శునకాలను ఇంట్లోకి తీసుకురావద్దని భర్త ఎన్నిసార్లు వారించినా భార్య ఆ మాటలను పట్టించుకోలేదు. దీంతో ఎంత చెప్పినా వినడం లేదని విడాకులు తీసుకోవడానికి సిద్ధమయ్యాడా భర్త. ఈక్రమంలోనే గుజరాత్ హైకోర్టును ఆశ్రయించాడు. తన భార్య ఇంటికి తీసుకు వస్తున్న వీధి శునకాల్లో ఒకటి తనను కరిచినప్పటికీ భార్య ప్రవర్తనలో ఎలాంటి మార్పు రాలేదని పిటిషన్‌లో వివరించారు. వీధి శునకాల కారణంగా తనకు తీవ్ర మానసిక వేదన కలిగిందని ఇకపై ఆమెతో కలిసి జీవించలేనని ఆయన కోర్టుకు విన్నవించుకున్నారు. శునకాల వివాదంతో పాటు భార్య తనపై వివాహేతర సంబంధం ఆరోపిస్తూ ఓ రేడియో ఛానెల్‌తో కలిసి ప్రాంక్ కాల్ చేయించిందని ఇది తనకు సమాజంలో, ఉద్యోగంలో ఎంతో మానసిక ఒత్తిడి కల్గించిందని పేర్కొన్నారు. ఈ వివాదాల కారణంగా విడాకులు కోరుతూ భర్త 2017లోనే కుటుంబ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. అయితే కుటుంబ కోర్టు ఈ ఆరోపణల ఆధా రంగా క్రూరత్వం నిరూపితం కాలేదని పేర్కొం టూ పిటిషన్‌ను తిరస్కరించింది. దాంతో భర్త తీర్పును సవాల్ చేస్తూ తాజాగా గుజరాత్ హైకోర్టు తలుపు తట్టారు. మరోవైపు భర్త ఆరోపణలను భార్య పూర్తిగా తోసిపుచ్చింది. విడాకులకు అంగీకరిస్తే తనకు భరణం కింద ఏకంగా రూ.2 కోట్లు చెల్లించాలని ఆమె డిమాండ్ చేసింది. దీనిపై విచారణ జరిపిన హైకోర్టు ఇరువురు పార్టీలకు నోటీసులు జారీ చేసి, తదుపరి విచారణను డిసెంబరు 1కి వాయిదా వేసింది. వీధి శునకాలు, పెంపుడు జంతువుల ప్రేమ ఇప్పుడు విడాకులకు కారణం అవుతున్న నేటి సామాజిక పోకడలకు ఈ కేసు నిదర్శనంగా నిలిచింది.

# అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లండి



పాలకొల్లు, నవంబరు 16 ప్రభాతవార్త: కూటమీ ప్రభుత్వ 16 నెలల పాలనలో జరిగిన అభివృద్ధి, సంక్షేమంతోపాటు మనం చేసే మంచి పనులను గడప గడపకు తీసుకువెళ్లాలని మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. ఇదే సమయంలో గత ఐదేళ్ల నియంతృత్వ, నిరంకుశ, కక్షలు, వేధింపులు, కేసులతో రాష్ట్రాన్ని ఆర్థిక విధ్వంసంతో పాలన చేసిన వైసీపీ మళ్లీ అసత్యాలు, అబద్ధాలతో ప్రజల్లోకి వస్తుందని, దీన్ని ప్రతి ఒక్కరు నిలదీసేలా వాస్తవాలను తెలపాలన్నారు. ఆదివారం పాలకొల్లులోని కార్యాలయ వద్ద జరిగిన పోడూరు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్ష కార్యదర్శులు, బూత్ కన్వీనర్లు, సేవా మిత్ర, సాధికార, యువత, సోషల్ మీడియా సమావేశంలో మంత్రి రామానాయుడు మాట్లాడారు. జగన్ ఐదేళ్ల పాలన విధ్వంసం వైపు సాగగా కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి సంక్షేమ వైపు పరుగులు పెడుతుందన్నారు. పాలకొల్లు నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి సంక్షేమాన్ని ప్రజల్లోకి తీసుకు వెళ్లాల్సిన బాధ్యత మీ అందరిపై ఉందని మంత్రి రామానాయుడు తెలిపారు. ఎమ్మెల్యేగా మూడుసార్లు వరుసగా గెలిపించిన అన్ని వర్గాల ప్రజల మనం తీర్చుకునేలా విశ్రాంతి లేకుండా పనిచేస్తూ అహర్నిశలు శ్రమిస్తున్నానని, మీరు కూడా పార్టీ కోసం, ప్రజల కోసం పనిచేయాలని మంత్రి రామానాయుడు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ ముఖ్య నాయకులు దాసరి రత్నం రాజు, గొట్టుముక్కల సూర్యనారాయణ రాజు, మేడిశెట్టి బుజ్జి, శీలం శ్రీనివాస్, పెనుమత్స రాంబద్ర రాజు, ఎల్లమిల్లి వెంకటరావు, కుక్కల సత్యనారాయణ పాల్గొన్నారు.

# ఉచిత విద్య నిరుపేద విద్యార్థులకు ఆస్తి

**● మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ**



నెల్లూరు(వైద్యం), నవంబరు 16 ప్రభాతవార్త: నిరుపేద విద్యార్థులకు ఉచితంగా కార్పొరేట్ విద్యను ఆస్తిగా ఇవ్వడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వంలో వ్యూహాత్మక ప్రణాళికలు చేస్తున్నామని రాష్ట్ర పురపాలక అభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ తెలియజేశారు. నెల్లూరు మూలపేట బాలికోన్నత పాఠశాల ఆధునీకరణ పనులను మంత్రి నారాయణ పరిశీలించారు. నిర్మాణ పనులపై అధికారులకు పలు సూచనలు చేశారు. పనులు వేగంగా చేస్తున్న డీఎస్ఆర్ కంపెనీ సిబ్బందిని మంత్రి అభినందించారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ పాఠశాలల్లో దాతల సహకారంతో అధునాతన వసతులు కల్పిస్తున్నట్లు తెలియజేశారు. అయితే గత ప్రభుత్వం వీఆర్ హైస్కూల్‌ని మూసేసిందని, ఆ ప్రభుత్వానికి మూసేయటం తప్ప ఇంకేమీ తెలియదని తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. కానీ తాను ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం ఎన్‌సీసీతో పాటు, తన పిల్లల సహకారంతో వీఆర్సీ స్కూల్‌ని అంతర్జాతీయ ప్రమాణాలతో తీర్చిదిద్ది ప్రారంభించామని తెలియజేశారు. వీఆర్ఎంసీ హైస్కూల్‌కు సీఎస్ఆర్ ఫండ్స్ కింద కోటి ఇరవై లక్షల విలువ చేసే 4 బస్సులను యూనియన్ బ్యాంకు అందజేసిందన్నారు. వీఆర్ఎంసీ స్కూల్ స్ఫూర్తితో మూలపేట స్కూల్‌ని డీఎస్ఆర్ కన్‌స్ట్రక్షన్స్ అధినేత సుధాకర్‌రెడ్డి దత్తత తీసుకొన్నారని తెలిపారు. 40 వేల చదరపు అడుగుల్లో అద్భుతమైన నిర్మాణం చేస్తున్నారన్నారు. రెండు ఫ్లోర్‌ల నిర్మాణం పూర్తయిందని, నర్సరీ నుంచి పదో తరగతి వరకు పేద పిల్లలకు కార్పొరేట్ విద్య అందిస్తామని స్పష్టం చేశారు. అత్యాధునిక పరికరాలతో ప్లే గ్రౌండ్ సిద్ధం చేస్తున్నారని చెప్పారు. వచ్చే విద్యా సంవత్సరానికి వీఆర్సీని మించిన వసతులతో ప్రారంభిస్తామన్నారు. సిటీలోని 15 హైస్కూల్స్‌ని దాతల సహకారంతో వీఆర్సీ తరహాలో సిద్ధం చేస్తామని తెలియజేశారు. సిటీలోని 15 వేల మంది పేద పిల్లలకి ఉచితంగా కార్పొరేట్ విద్య అందించాలన్నదే లక్ష్యం అని స్పష్టం చేశారు. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, రాజ్యసభ సభ్యులు బీదా మస్తాన్‌రావు, జిగ్మా కంపెనీ, టీవీఎస్ కంపెనీ, రెడ్డి ల్యాబ్స్, ఏఎంఆర్ కంపెనీలు స్కూల్స్ దత్తతకు ముందుకొచ్చారన్నారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ముందుకొస్తున్న దాతలకు మంత్రి అభినందనలు తెలిపారు. పేద కుటుంబం నుంచి వచ్చిన తనకు కష్టాలు తెలుసు కాబట్టే పేద పిల్లలకు ఉచితంగా మెరుగైన విద్యను ఆస్తిగా ఇవ్వాలని సంకల్పించామన్నారు. ఒక్క స్కూల్‌కి హామీ ఇచ్చి 15 స్కూల్స్‌ని అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. నారాయణ స్కూల్స్ కంటే మెరుగ్గా 15 హైస్కూల్స్‌ని తీర్చి దిద్దుతామన్నారు. మాది మాటల ప్రభుత్వం కాదని, చేతల ప్రభుత్వమని మంత్రి నారాయణ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కమీషనర్ నందన్‌తోపాటు 39, 40వ డివిజన్ క్లస్టర్ ఇన్‌చార్జి అన్నంగి ప్రసాద్, డివిజన్ అధ్యక్షుడు మనోహర్, జనరల్ సెక్రటరీ గౌతమ్ మధు సూదన్‌రెడ్డి, 40 డివిజన్ అధ్యక్షుడు గండవరం నాని, యూనిట్ ఇన్‌చార్జి అమ్మని, టీడీపీ ముఖ్య నేతలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# మల్లెమడుగు రిజర్వాయర్‌లో మునిగిపోయి ఇద్దరు మృతి

రేణిగుంట, నవంబరు 16 ప్రభాతవార్త: రేణిగుంట మండలం కరకంబాడి పంచాయతీ మల్లెమడుగు రిజర్వాయర్ నీటిలో మునిగిపోయి ఇద్దరు యువకులు మృతి చెందిన సంఘటన ఆదివారం ఉదయం జరిగింది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా... తిరుపతికి చెందిన శేఖర్ (32), శివ (35) నరేష్ (36) ఈత కోసం మల్లెమడుగు రిజర్వాయర్‌కు వచ్చారు. వీరిలో శివ అనే వ్యక్తికి ఈత రాదు. అతను ముందుగా రిజర్వాయర్‌లోకి దిగాడు. ఈతరాక శివ మునిగిపోతూ ఉండడాన్ని ఈత తెలిసిన నరేష్ గుర్తించాడు. వెంటనే నీటిలోకి దిగి అతనిని కాపాడే ప్రయత్నం చేశాడు. కాపాడ్డానికి వెళ్లిన ఇతను కూడా మునిగిపోయాడు. ఇది గమనించిన శేఖర్ వెంటనే గ్రామస్తులతోపాటు పోలీసులకు సమాచారం ఇచ్చాడు. గ్రామస్తులు నీట మునిగిన ఇద్దరిని బయటకు తీశారు. అప్పటికే వారు మృతి చెంది ఉన్నారు. అర్బన్ సిఐ జయచంద్ర ఆదేశాల మేరకు ఎస్ఐ నాగరాజు సిబ్బందితో అక్కడకు చేరుకొని పరిస్థితులను సమీక్షించి మృతదేహాలను స్వాధీనం చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి రుయాకు తరలించారు.

# ఆటోను ఢీకొన్న సిమెంట్ లారీ

**- 12 మందికి గాయాలు - నలుగురి పరిస్థితి విషమం**



మర్రిపాడు (నెల్లూరు), నవంబరు 16 ప్రభాతవార్త: నెల్లూరు జిల్లా మర్రిపాడు మండలం నందవరం క్రాస్‌రోడ్డు జాతీయ రహదారిపై ఆదివారం కూలీలతో వెళుతున్న ఆటోను సిమెంట్ ట్యాంకర్ లారీ ఢీకొట్టింది. 12 మంది కూలీలతో వెళుతున్న ఆటో ఆత్మకూరు మండలం బంట్లపలి నుంచి వింజమూరు మండలం నల్లగొండ్లకు జామాయిల్ నాట్లు కసం వెళుతోందని, నందవరం కూడలి వద్దకు రాగా సిమెంట్ లారీ ఢీకొటిందని దాంతో ఆటో తిరగబడిందని పోలీసులు తెలిపారు. 12 మంది కూలీలకు గాయాలు కాగా వారిని చికిత్సకై 108 వాహనంలో ఆత్మకూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వీరిలో నలుగురి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. వారిని మెరుగైన చికిత్సకై నెల్లూరు ఆసుపత్రికి తరలించారు. ఆస్పత్రిలో క్షతగాత్రులను ఆత్మకూరు సిఐ గంగాధర్, మర్రిపాడు ఎస్ఐ శ్రీనివాసరావులు పరామర్శించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్ఐ శ్రీనివాసరావ్ తెలిపారు.

# డబుల్ ఇంజన్ సర్కారుపై పెట్టుబడిదారుల్లో పెరిగిన విశ్వాసం

**సిఐఐ సదస్సు విజయంతంపై మంత్రి సత్యకుమార్**



సచివాలయం, నవంబరు 16 ప్రభాతవార్త: విశాఖలో సిఐఐ 30వ పారిశ్రామిక భాగస్వామ్య సదస్సు విజయవంతం కావడం పట్ల రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ప్రశంసల జల్లు కురిపించారు. ప్రధాని మోడీ దిశా, నిర్దేశం, సహకారం, అండదండలు, సీఎం చంద్రబాబు పరిపాలనా దక్షత, కార్యాచరణవల్ల ఎపిలో పెట్టుబడులు వెలువెత్తాయని పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం ఓ పత్రికా ప్రకటన జారీచేశారు "గత వైకాపా పాలనలో గతి తప్పిన రాష్ట్ర అభివృద్ధిని గాడిలో పెట్టేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా చేస్తున్న కృషివల్ల ఎపికి అంతర్జాతీయ స్థాయిలో ఖ్యాతి లభిస్తోంది. విశాఖలో మూడురోజులపాటు పెట్టుబడులపై జరిగిన వరుస సమావేశాల ద్వారా అంచనాలకు మించి, 12 రంగాల్లో రూ.13.25 లక్షల కోట్ల పెట్టుబడులు రావడం పిఎం, సిఎంల దార్శనికత, ఐక్యత, సమర్ధతకు నిదర్శనం. సిఎం చంద్రబాబు స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానం పెట్టుబడులు పెట్టే వారికి ప్రోత్సాహకరంగా ఉంది. ఒప్పందాలు జరిగిన వెంటనే పారిశ్రామిక సంస్థలకు అనుకూల ఉత్తర్వులు ఇవ్వడం ఓ చరిత్ర. ఇలాంటి ఉత్తమ విధానాలు పెట్టుబడిదారుల్లో ఉత్సాహాన్ని నింపుతున్నాయి. ఏడాది వ్యవధిలోనే పిఎం మోడీ రాష్ట్రంలో 3సార్లు పర్యటించి, రూ.2.80 లక్షల కోట్ల విలువైన అభివృద్ధి ప్రాజెక్టులు, పరిశ్రమలకు సంబంధించి శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేసారు. వరుస పర్యటనల ద్వారా రాష్ట్రంపై తనకు ఉన్న ప్రత్యేక శ్రద్ధ గురించి పిఎం మోడీచాటిచెబుతున్నారు. రాష్ట్ర అభివృద్ధిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమష్టి కృషితో వ్యవహరిస్తున్నందున ఫలితాలు బ్రహ్మాండంగా కనిపిస్తున్నాయి. గూగుల్ సంస్థ అమెరికా వెలుపల దేశంలోనే తొలిసారిగా విశాఖ సాగరతీరంలో కృత్రిమ మేధ హబ్ నిర్మించబోతుంది.

అదే సాగరతీరంలో పారిశ్రామిక సంస్థలు తాజాగా ప్రకటించిన పెట్టుబడులతో విశాఖ మహానగర ఖ్యాతి మరింత విస్తరించబోతుంది. 2040 నాటికి వికసిత భారత్ లక్ష్య సాధనకు జరిగే కృషిలో ఆంధ్రప్రదేశ్ కీలకంగా వ్యవహరించబోతుంది. మరోపక్క సంక్షేమ పథకాల అమల్లోనూ కూటమి ప్రభుత్వం దూసుకుపోతోంది. సూపర్ సిక్స్ హామీలు ఖినూవర్ హిటు అయ్యాయి" అని మంత్రి సత్యకుమార్ పేర్కొన్నారు.



ముఖ్యఅతిథి రాఘవన్ వరదరాజన్‌కి మెమొంటో అందిస్తున్న ఐసర్ రిజిస్ట్రార్ ఇంద్రపీత్ సింగ్ కోహ్లి

# శాస్త్రీయ పరిశోధనలు సాగాలి

శ్రీకాళహస్తి, నవంబరు 15 ప్రభాతవార్త: సామాజికాభివృద్ధికి శాస్త్రీయ పరిశోధనలు విస్తృతంగా సాగాలి, భారత ప్రభుత్వ లక్ష్యం వికసిత భారత్ 2047 కల సాకారం కలగాలని మూడు రోజులు ఇక్కడి ఐసర్‌లో జరిగిన ఇండియన్ అకాడమి ఆఫ్ సైన్సెస్ 91వ వార్షికోత్సవ సభల్లో మేధావులు, శాస్త్రవేత్తలు, ప్రొఫెసర్లు అభిప్రాయపడ్డారు. ఆదివారం ముగింపు సమావేశంలో తిరుపతి ఐఐటి డైరెక్టర్ ప్రొఫెసర్ సత్యనారాయణ, ఎన్ఏఆర్ఎల డైరెక్టర్ ప్రొఫెసర్ అమిత్ మిత్రా, ఎస్‌వి విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ టాటా నరసింహారావు సందేశాల నిచ్చారు. దేశ వ్యాప్తంగా ఉన్న సంస్థల్లో 91వ వార్షికోత్సవ నిర్వహణ అవకాశం తిరుపతి ఐసర్‌కు ఇవ్వటం మూడు రోజులపాటు విజయవంతంగా నిర్వహించటం గర్వించదగ్గ విషయ మని రిజిస్టార్ కింగ్‌కోహ్లి వివరించారు. రాష్ట్రాన్ని శాస్త్రీయ, విద్యానైపుణ్యాల దిశగా నడిపించాల్సిన అవసరం ఎంతైనా ఉందని వక్తలు అభిప్రాయపడ్డారు. రాబోవురోజుల్లో వాతావరణానికి అనుగుణంగా వాయుకాలుష్యంతో తల్లడిల్లుతున్న సమాజంలో ఆరోగ్యరక్షణకు 'వాక్సిన్' అభివృద్ధికి సంబంధించి నొక్కి వక్కాణించారు. శాస్త్రీయ ఆవిష్కరణలను నడిపించటంలో, సహకార, జ్ఞానఆధారిత భారతదేశం దార్శనికతకు దోహదపడుతుందని ఇందుకు ఐసర్‌కు అవకాశం రావాలనిఎదురుచూస్తుందని రిజిస్ట్రార్ వివరించారు.

# హిందూపురం శివారులో వైసీపీ నేతలను అడ్డుకున్న పోలీసులు

**నిరసనగా రోడ్డుపైనే బైఠాయింపు, అరెస్ట్... అనంతపురం తరలింపు**

అనంతపురం, నవంబరు 16 ప్రభాతవార్త బ్యూరో: తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి హిందూపురంలో ఆ పార్టీని గెలిపిస్తున్నా ప్రజలకు ఒరిగిందేమీ లేదని వైసీపీ అనంతపురం జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి అన్నారు. బాలకృష్ణ మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలిచారని.. ఎన్నికలకు ముందు కుటుంబ సభ్యులతో రావడం, ఆ తర్వాత సినిమాలకు పరిమితం కావడం పరిపాటిగా మారిందన్నారు. హిందూపురం నియోజకవర్గానికి బాలకృష్ణ గెస్ట్ ఆర్టిస్ట్ అని వ్యాఖ్యానించారు. శనివారం హిందూపురంలో వైసీపీ కార్యాలయంపై టీడీపీ గూండాలు దాడి చేసిన విషయం తెలిసిందే. ఆదివారం పార్టీ నాయకులతో కలిసి హిందూపురానికి బయలుదేరిన అనంత వెంకటరామిరెడ్డిని ఆయన స్వగృహం వద్దే పోలీసులు అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఈ సందర్భంగా పోలీసుల తీరుపై మండిపడ్డ అనంత.. చివరకు హిందూపురం వెళ్లారు. అక్కడ పట్టణ శివారులోని ఇందిరమ్మకాలనీ వద్దకు చేరుకోగానే అనంతతో పాటు తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి రమేష్ గౌడ్, యువజన విభాగం అనంతపురం జిల్లా అధ్యక్షుడు సాకే చంద్రశేఖర్, వైసీపీ అనంతపురం నగర అధ్యక్షుడు చింతా సోమశేఖరరెడ్డి, వైసీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి వెన్నం శివారెడ్డి, యువజన విభాగం అనంతపురం నగర అధ్యక్షుడు శ్రీనివాస్ దత్త, ఎస్సీసెల్ జిల్లా ఉపాధ్యక్షుడు సాకే శ్రీనివాసులను పోలీసులు అడ్డుకున్నారు. పట్టణంలోకి అనుమతించేది లేదని తేల్చిచెప్పారు. ఆ క్రమంలో పోలీసులకు, అనంతకు మధ్య వాగ్వాదం జరిగింది. పార్టీ కార్యాలయంపై టీడీపీ మూకలు దాడి చేస్తే పరిశీలించేందుకు రాకూడదంటే ఎలా? అని సూటిగా ప్రశ్నించారు. తాము అల్లర్లు చేయడానికి వెళ్లడం లేదని, పార్టీ శ్రేణులకు భరోసా ఇవ్వాల్సిన బాధ్యత తమపై ఉందన్నారు. తమను అడ్డుకోవడం తగదంటూ రోడ్డుపైనే బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. చివరకు పోలీసులు వారిని వాహనాల్లో అనంతపురం తరలించారు. విషయం తెలుసుకున్న వైసీపీ నాయకులు పెద్ద ఎత్తున కోర్టు రోడ్డుకు చేరుకున్నారు. పోలీస్ వాహనం రాగానే రోడ్డు మీద బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం పోలీసులు అనంతను స్వగృహానికి చేర్చి బందోబస్తు చేపట్టారు.

### కూటమి పాలనలో రావణకాష్టం

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రాన్ని రావణకాష్టంగా మారుస్తున్నారని అనంత వెంకటరామిరెడ్డి మండిపడ్డారు. అనంతపురంలో ఆయన మీడియాతో మాట్లాడారు. హిందూపురంలోని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంపై టీడీపీ గూండాలు, అల్లరి మూకలు దాడి చేసి సిబ్బంది, కార్యకర్తలను గాయపర్చారన్నారు. దాడిలో గాయపడ్డ వారితో పాటు పార్టీ శ్రేణులతో మాట్లాడేందుకు వెళ్తుంటే పోలీసులు అడ్డుకోవడం దారుణమన్నారు. ఎక్కడికక్కడ కీలక నాయకులను గృహ నిర్బంధం చేయడం ఏంటని ప్రశ్నించారు. తాము అల్లర్లు చేయడానికో, రెచ్చగొట్టడానికో వెళ్లలేదని స్పష్టం చేశారు. పోలీస్, రెవెన్యూ వ్యవస్థలను అడ్డుపెట్టుకుని ఎమ్మెల్యే బాలకృష్ణ పీఏలు అరాచకం చేస్తున్నారని అనంత వెంకటరామిరెడ్డి మండిపడ్డారు. మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన బాలకృష్ణ నియోజకవర్గానికి ఏం చేశారని ప్రశ్నించారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రజల పక్షాన ఉంటుందని, ఎవరికీ భయపడేది లేదని తెలిపారు.

### దాడిని ఖండించిన వెన్నపూస



దేవుడి విగ్రహాలని, మా పార్టీకి దేవుడు లాంటి వైఎస్ఆర్ విగ్రహాన్ని పగలకొట్టడానికా.. బాలకృష్ణ మిమల్ని ప్రజలు ఎన్నుకుంది..? అని వైఎస్ఆర్‌సిపి పంచాయితీరాజ్ విభాగం రాష్ట్ర అధ్యక్షులు వెన్నపూస రవీంద్రారెడ్డి ప్రశ్నించారు. శనివారం హిందూపురంలో వైస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంపైన ఎమ్మెల్యే బాలకృష్ణ సైకో అనుచరులు చేసిన దాడిని తీవ్రంగా ఖండించారు. రెడ్ బుక్ రాజ్యాంగం అంటే ఇదేనా.. పార్టీల కార్యాలయాలపై దాడులు, ప్రశ్నించినందుకు వైఎస్ఆర్‌సిపి నాయకులు, కార్యకర్తలపై దాడులు చేయడం అని ఆయన ప్రశ్నించారు. కనీసం పరామర్శ కూడా నేరమేనా..? పరామర్శకి వెళ్తున్న వైస్సార్సీపి ముఖ్య నాయకులైన సతీష్ రెడ్డి, అనంత వెంకటరామిరెడ్డి, ఉషశ్రీ చరణ్, పెద్దారెడ్డి, మగ్బూల్, పూల శ్రీనివాస్ రెడ్డి తదితర ముఖ్య నాయకులని పోలీసులు అరెస్టు చేయడం ఏమిటని ప్రశ్నించారు. నేరుగా పార్టీలపై దాడులు చేస్తున్నా పోలీసులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. రెడ్‌బుక్ రాజ్యాంగం నడిపే ఆలోచనలో కూటమి ప్రభుత్వం నిమగ్నమైందని మండిపడ్డారు.



# సత్యసాయి శతజయంతి ఉత్సవాలను సమన్వయంతో విజయవంతం చేద్దాం

**● సాయి యాప్ సద్వినియోగం చేసుకోండి ● ప్రముఖుల కోసం నాలుగు హెలీపాడ్లు ● జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్**

శ్రీ సత్యసాయి జిల్లా, నవంబరు 16 ప్రభాతవార్త ప్రతినిధి: భగవాన్ సత్యసాయిబాబా శత జయంతి ఉత్సవాలను ఆ ట్రస్ట్ వర్గాలు, అధికార యంత్రాంగం సమన్వయంతో ప్రణాళికబద్ధంగా విజయవంతం చేద్దామని శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్ పిలుపునిచ్చారు. ఈ నెల 18 నుండి 23 వరకు పుట్టపర్తి సత్యసాయిబాబా శత జయంతి వేడుకల సందర్భంగా జరిగే కార్యక్రమాలను ప్రజలు భక్తాదులు తమ వంతు సహకారాలు అందించి వేడుకలను జయప్రదం చేయాలని జిల్లా కలెక్టర్ ఏ.శ్యాంప్రసాద్ కోరారు. ఆదివారం ఉదయం కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ సమావేశం మందిరంలో మీడియా సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ఈనెల 19న దేశ ప్రధాని నరేంద్ర మోడీ రానున్నారని, అలాగే భారత రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము, ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్, రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, వస్తున్నట్లు తెలిపారు. అలాగే ఉపముఖ్య మంత్రి పవన్ కల్యాణ్, కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ తదితర ప్రముఖులు కూడా వచ్చే అవకాశాలు ఉన్నట్లు జిల్లా కలెక్టర్ సూత్రప్రాయంగా తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ద్వారా బాబా జన్మదిన వేడుకల నిర్వహణకు సంబంధించి మంత్రుల బృందం, జిల్లా మంత్రులు, ఎమ్మెల్సీ, ఎంపీ, ఎమ్మెల్యేలు ఇతర ప్రజా ప్రతినిధుల సూచనలు సలహాలను పాటిస్తూ పనులను వేగవంతం చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. తాను కూడా క్షేత్రస్థాయిలో లోటుపాట్లను గుర్తించి ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చర్యలు తీసుకొని పనులను పూర్తి చేయడం జరుగుతుందన్నారు. ప్రధాని పర్యటన సందర్భంగా ఆ రోజున సుమారు లక్ష మంది ప్రజలు భక్తాదులు హాజరు అవుతున్నట్లు అంచనా ఉందని, దీనికై ప్రయాణికుల సౌకర్యం కోసం 200 పైగా బస్సులు ఏర్పాటు చేశామని, అలాగే రైల్వే స్టేషన్ నుంచి బాబా మందిరం వరకు వచ్చే భక్తాదులకు ఉచితంగా బస్సు సౌకర్యం కల్పించామన్నారు. జిల్లాలోని అన్ని మున్సిపల్ కమిషనర్ల నేతృత్వంలో 300 దాకా పారిశుద్ధ్య కార్మికులను ఏర్పాటు చేసి సకాలంలో పారిశుద్ధ్య పనులు పూర్తి చేస్తున్నట్లు తెలిపారు. సాయి ఆరామంలో వేడుకల సందర్భంగా ప్రత్యేకంగా కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని, అలాగే టోల్ ఫ్రీ నంబర్ 18002335598 ద్వారా ఏవైనా ఇబ్బందులు తగిన సమాచారం తెలుసుకొనే విధంగా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. శ్రీ సత్యసాయి విమానాశ్రయంలో ప్రస్తుతం 2 హెలిప్యాడ్లను ఏర్పాటు చేశామని మరో రెండు ఏర్పాటు చేయుటకు చర్యలు తీసుకున్నామని వివరించారు. బాబా శత జయంతోత్సవాల సందర్భంగా సమాచారం అందించేందు కోసం క్యూ ఆర్ కోడ్‌తో కూడిన "సాయి 100 యాప్" ఏర్పాటు చేశామని ప్రజలు, భక్తులు ఈ "యాప్"ను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు. ఈ యాప్ ద్వారా రోజు వారీగా ప్రశాంతి నిలయం లో జరిగే కార్యక్రమాలు, ఇతర ఈవెంట్లు, పుట్టపర్తి ఆకర్షణలు, భక్తులకు భోజన కౌంటర్ల ఏర్పాటు, వసతి వివరాలు, వాహనాల పార్కింగ్ ప్రాంతాలు, ప్రథమ చికిత్స కేంద్రాలు, అత్యవసర సేవల సమాచార కేంద్రాలు, ఫిర్యాదులు, కమాండ్ కంట్రోల్ సెంటర్, తాగునీటి పాయింట్లు, పుట్టపర్తి చుట్టూ ఉన్న ప్రదేశాలు, తదితర అంశాల గురించి పూర్తి స్థాయి సమాచారాన్ని తెలుసుకునేందుకోసం ఈ యాప్ ఎంతగానో ఉపయోగ పడుతుంద న్నారు. సోమవారం నుండి నవంబర్23 వరకు స్థానిక శిల్పకళారామంలో ఐదు రోజులపాటు పర్యాటక శాఖ ఆధ్వర్యంలో వివిధ కళా సంస్థల ద్వారా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. అలాగే ప్రస్తుతం గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో అఖిల భారత సరస్ బజార్ ఏర్పాటు చేశామని, ఇందులో స్వయం సహాయక సంఘాలు మరియు గ్రామీణ కళాకారుల ద్వారా తయారుచేసిన హస్తకళలు, ఆహార ఉత్పత్తుల ప్రదర్శనలు, హస్తకళలు, గృహ అలంకరణలో చేనేత ఉత్పత్తులు అమ్మకాల నిమిత్తం స్టాల్స్‌ను ఏర్పాటు చేశామని కలెక్టర్ పేర్కొన్నారు.




# సత్యసాయి శత జయంతి వేడుకలకు వస్తున్న ప్రముఖులు వీరే

పుట్టపర్తి రూరల్ నవంబరు 16 ప్రభాతవార్త: సత్యసాయిబాబా శతజయంతి వేడుకలకు వివిధ రాష్ట్రాల నుండి పలువురు ప్రముఖులు హాజరు కానున్నారు. ఇందులో భాగంగా నవంబర్ 19న దేశ ప్రధాని నరేంద్ర మోడీ, 20న కేంద్ర మంత్రి నితిన్ గట్కరి, 21న మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్, ఒడిశా గవర్నర్ కంభంపాటి హరిబాబు, 22న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్ పాల్గొంటున్నారు. వీరితోపాటు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక ముఖ్యమంత్రులు నారా చంద్రబాబు నాయుడు, యనమల రేవంత్ రెడ్డి, సిద్ధి రామయ్యలు హాజరుకానున్నారు. గ్లోబల్ కౌన్సిల్ పరిధిలోని 130 దేశాల నుండి పలువురు విదేశీ ప్రముఖులు రానున్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలు సత్యసాయి జయంతిని రాష్ట్ర పండుగగా ప్రకటించడంతో ప్రభుత్వ యంత్రాంగం మొత్తం ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. పుట్టపర్తికి రానున్న ప్రముఖులను దృష్టిలో పోలీసులు పటిష్టమైన బందోబస్తు చర్యలను చేపట్టారు.




ప్రశాంతి నిలయంలో సత్యసాయి బాబా శతజయంతి వేడుకలను సత్య సాయి సెంట్రల్ ట్రస్ట్ మరియు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోంది. ఈ సందర్భంగా సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నవంబర్ 18న సత్యనారాయణ వ్రతం, సత్యసాయి బాబా నూతన వెండి రథోత్సవం నిర్వహించనున్నారు. 19న హిల్ వ్యూ స్టేడియంలో నిర్వహించనున్న మహిళా దినోత్సవ కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోడీ పాల్గొని ప్రసంగించనున్నారు. 20 21న సత్యసాయి సేవా సంస్థల జాతీయ సదస్సు నిర్వహించబడుతుంది. 22న శ్రీ సత్యసాయి హయ్యర్ సెకండరీ యూనివర్సిటీ 45వ స్నాతకోత్సవం జరగనుంది. 23న సత్యసాయి బాబా శతజయంతి వేడుకలను హిల్ వ్యూ స్టేడియంలో నిర్వహించనున్నారు ఈ కార్యక్రమంలో స్వర్ణ రథోత్సవంతో వేడుకలు ప్రారంభించనున్నారు. ప్రశాంతి నిలయంలో జోలోత్సవం నిర్వహిస్తారు. సత్యసాయి జయంతి వేడుకలను పురస్కరించుకొని ప్రపంచవ్యాప్తంగా నవంబర్ 18 నుండి 23 వరకు దాదాపు 15 లక్షల మంది సత్యసాయి భక్తులు సత్యసాయిని దర్శించుకొనున్నారు. రానున్న భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు తలెత్తకుండా ప్రభుత్వం మరియు సెంట్రల్ ట్రస్ట్ అన్ని మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేశారు.



# శ్రీకాళహస్తీశ్వరాలయంలో కార్తికమాసం రద్దీ

**కాలసర్పదోష పూజలకు గిరాకి**

శ్రీకాళహస్తి, నవంబరు 15 ప్రభాతవార్త: కార్తీక మాసం, వారాంతపు రద్దీ, ఆదివారం శ్రీకాళహస్తీశ్వరాలయం భక్త జనులతో కిటకిటలాడింది. విఐపిల సేవలో చైర్మన్ కొట్టె సాయిప్రసాద్, ఇఓ డి.బాపిరెడ్డి, డిప్యూటి ఇఓ ఎన్ కృష్ణారెడ్డి, ఎఇఓలో మోహన్, విద్యాసాగర్‌రెడ్డి వారి సిబ్బంది జవాబుదారితనంతో ప్రోటోకాల్‌ను నిర్వహించారు. శనివారం రాత్రి నుంచి భక్తులు సునామిలా కదలి వచ్చారు. దక్షిణ భారత దేశంలో పంచభూత లింగాల్లో వాయులింగేశ్వరుడు స్వయంభువుగా వెలసిన దివ్యక్షేత్రం శ్రీకాళహస్తి. ఇక్కడ నిర్వహిస్తున్న కాలసర్పదోష నివారణ పూజలకు ఎనలేని ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ పూజల కోసం దేశ విదేశాల నుంచి భక్తులు తరలి వస్తున్నారు. దాంతో రద్దీ చోటు చేసుకుంది. శ్రీకాళహస్తీశ్వరుని దర్శనం కోసం ఇక్కడ నిర్వహించే రాహుకేతుదోష నివారణ పూజల కోసం భక్తులు నిరీక్షించారు. ఉదయం నుంచి ఆలయంలోనూ, పట్టణంలో భక్తుల రద్దీ చోటు చేసుకుంది. ఆదివారం ఉదయం శనీశ్వరాలయంలోనూ, రాహు కాల సమయంలో ఇసుకేస్తే రాలనంత రద్దీ చోటుచేసుకుంది.

17-11pg7exHMNWJQE 11_17-11pg7exHMNWJQE.qxd 17/Nov/25 12:16 AM Page 1



# స్పీకర్ వ్యవహారంపై నేడు సుప్రీం విచారణ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,నవంబర్16:** పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయడంలో జాప్యం చేస్తున్నారంటూ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ పై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సుప్రీంకోర్టులో ధిక్కార పిటిషన్‌ను దాఖలు చేసిన సంగతి తెలిసిందే. ఆ పిటిషన్ సుప్రీంకోర్టులో సోమవారం విచారణకు రాబోతోంది. గతంలో అత్యున్నత న్యాయస్థానం నిర్దేశించిన మూడు నెలల గడువులోగా స్పీకర్ నిర్ణయం తీసుకోలేదని, ఇది కోర్టు ఆదేశాలను ధిక్కరించడమేనని పిటిషన్‌లో పేర్కొన్నారు. ఎమ్మెల్యేలపై విచారణకు సంబంధించి తమకు మరింత గడువు కావాలని కోరుతూ స్పీకర్ కార్యాలయం సైతం ఇప్పటికే సుప్రీంకోర్టులో అదనపు పిటిషన్ దాఖలు చేసింది. బీఆర్ఎస్ పిటిషన్‌తో పాటు స్పీకర్ కార్యాలయం వేసిన అదనపు పిటిషన్‌పై కూడా సోమవారం విచారణ జరగనుంది.

### వామన్‌రావు దంపతుల హత్య కేసు:

# పుట్ట మధుకు సిబిఐ నోటీసులు

**హైదరాబాద్, నవంబరు 16, ప్రభాతవార్త:** రాష్ట్రంలో సంచలనం రేపిన హైకోర్టు న్యాయవాద దంపతులు గట్టు వామన్ రావు, నాగమణిల హత్య కేసులో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న మంథని మాజీ ఎంఎల్ఎ పుట్ట మధుకు సిబిఐ నోటీసు లు జారీ చేసింది. సోమవారం నాడు రామగుండంలో జరిగే విచారణకు హాజరు కావాలని అందులో వుంది. పెద్దపల్లి జిల్లా కామగిరి మండలం కల్వచర్ల వద్ద 2021 ఫిబ్రవరి 17వ తేదీన వీరిని హత్య చేయడం తెలిసిందే. దీనిపై మొదట రామగుండం కమిషనరేట్ పోలీసులు విచారణ చేబట్టగా వామన్ రావు తండ్రి కిషన్ రావు దీనిపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ సిబిఐ విచారణకు డిమాండ్ చేయడం విదితమే. దీనిపై కిషన్ రావు సుప్రీం కోర్టు నుంచి ఉత్తర్వులు పొందిన తరువాత వామన్ రావు దం పతుల హత్య కేసు విచారణ సిబిఐకి బదిలీ అయ్యింది. ఈ కేసులో పుట్ట మధుపైనా అభియోగాలు వుండడంతో ఆయనను విచారించాలని నిర్ణయించిన సిబిఐ అధికారులు ఈ మేరకు నోటీసులు జారీ చేశారు.

# అమరావతిలో 'బేసిల్ ఉడ్స్' పాఠశాలకు భూకేటాయింపు

విజయవాడ, నవంబరు 16 ప్రభాతవార్త ప్రతినిధి: రాజధాని అమరావతిలో 'బేసిల్ ఉడ్స్' పాఠశాల ఏర్పాటుకు ప్రభుత్వం నాలుగెకరాల భూమిని కేటాయించింది. ఈ మేరకు విశాఖలో మున్సిపల్ శాఖ మంత్రి నారాయణతో 'హరేకృష్ణ మూవ్‌మెంట్' ప్రతినిథులు వంశీధరదాస, విలాస విగ్రహదాస, రఘునందన్‌దాస సంయుక్తంగా అవగాహన ఒప్పందం చేసుకున్నట్లు ఆ సంస్థ ఓ ప్రకటనలో వెల్లడించింది. భారతీయ సంప్రదాయ విలువలతో పాటు ప్రపంచ స్థాయి విద్యా ప్రమాణాలను సమన్వయం చేస్తూ విద్య అందించడమే లక్ష్యంగా ఈ పాఠశాల ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొంది.



# ఆ ఆరోపణలు అవాస్తవం

### ఎలమంచిలి ఎమ్మెల్యే విజయ్ కుమార్

విశాఖపట్నం, నవంబరు 16 ప్రభాతవార్త: ఈ మధ్యకాలంలో తనపై అనేక ఆరోపణలు వస్తున్నాయని వాస్తవం కాదని ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ అన్నారు. ఆదివారం పౌర గ్రంథాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తన ఎదుగుదలను చూసి ఒక వర్గం తనపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నదని, తన వల్ల పార్టీ అధినేతకు కానీ పార్టీ కానీ ఎటువంటి మరక అంటకూడదని నిజం ప్రజలకు తెలిసేందుకే తాను మీడియా ముందుకు వచ్చాను అని తెలిపారు. తాను రాజకీయాలకు రాకముందు నుండి ప్రజలకు సేవ చేస్తూనే ఉన్నానని అందువల్లే తనకు 50 వేల మెజార్టీతో ప్రజలు గెలిపించుకున్నారని తెలిపారు. తాను ఎప్పుడు ప్రజలకు రుణపడి ఉంటానని ఎటువంటి పరిస్థితుల్లో తనపై నమ్మకం పెట్టుకున్న వారికి అన్యాయం చేయనని తెలిపారు. కొంతమంది కావాలని కొన్ని పత్రికలను అడ్డం పెట్టుకొని తనపై అవాస్తవాలు ప్రచురిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వీటిపైనే తాను న్యాయం గానే పోరాటం చేస్తానని ఆయన స్పష్టం చేశారు. తాను ఎటువంటి భూవివాదాల్లో తల దూర్చలేదు. దూర్చనని చెప్పారు.

# గొల్లపల్లి లక్ష్మి స్మారక పురస్కారాల ప్రదానం

విజయవాడ, నవంబరు 16 ప్రభాతవార్త ప్రతినిధి: సామాజిక సాహిత్యవేత గొల్లపల్లి లక్ష్మి స్మారక పురస్కార సభ విజయవాడలోని బుక్ సొసైటీ హాల్లో ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమంలో తంగిరాల సోనీ, పేరూరు మురళి కుమార్, డాక్టర్ నూకతోటి రవికుమార్, గొల్లపల్లి అంబేద్కర్, బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు గుప్తా, అంబేడ్కర్ జాషువా, ఫూలే అధ్యక్షులు బత్తుల విల్సన్, రాష్ట్ర నలుమూలల నుంచి అనేకమంది సాహిత్యకారులు హాజయ్యారు. ఈ కార్యక్రమం సామాజిక న్యాయ పోరాట సమితి, బహుజన రచయితల వేదిక ఆధ్వర్యంలో జరిగింది.

# బిర్సా ముండా ఆశయాలతో యువత ముందుకు నడవాలి

● ఒడిశా ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ ● పాడేరులో బిర్సా ముండా విగ్రహావిష్కరణ



పాడేరు, నవంబరు 16 ప్రభాతవార్త: జన జాతీయ గౌరవ దివాస్ కార్యక్రమంలో భాగంగా 150వ బిర్సా ముండా జయంతి సందర్భంగా వనవాసి కళ్యాణ ఆశ్రమం ఆధ్వర్యంలో నిర్వహించిన ఒడిశా సిఎం మోహన్‌చరణ్ మాఝీ బహిరంగ సభలో పాల్గొన్నారు. ముందుగా సభా ప్రాంగణం వద్ద ఏర్పాటు చేసిన జిసిసి, వందన్ వికాస్ స్టాల్స్‌ను సందర్శించారు. గిరిజనుల హక్కుల కోసం పోరాడిన బిర్సా ముండా జయంతి సందర్భంగా పాడేరు మండలం లగిశపల్లి సమీపంలోని చింతలవీధి కూడలిలో ఏర్పాటు చేసిన బిర్సా ముండా విగ్రహాన్ని ఒడిశా సీఎం మోహన్ చరణ్ మాఝీ ఆవిష్కరించారు. తొలుత ఒడిశా సీఎంకు రాష్ట్ర మంత్రులు సత్య కుమార్, సంధ్యారాణి, బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు పివిఎస్ మాధవ్ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా గిరిజనులతో కలిసి ఒడిశా సిఎం సంప్రదాయ నృత్యం చేశారు. బిర్సా ముండా విగ్రహావిష్కరణ అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో మోహన్ చరణ్ మాఝీ పాల్గొన్నారు. జ్యోతి ప్రజ్వలన చేసి సభా కార్యక్రమాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఒడిశా సీఎం మోహన్ చరణ్ మాంఝీ తెలుగులో మాట్లాడుతూ జిల్లా ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలిపారు. భగవాన్ బిర్సా ముండా.. మన భూమి మన ప్రదేశం అనే నినాదంతో పోరాటం చేశారని కొనియాడారు. బిర్సా ముండా స్వాతంత్రయ సమరయోధులు మాత్రమేకాదు ఆధ్యాత్మిక వేత్త. ఆయన 25 ఏళ్ళు మాత్రమే జీవించారు.. కానీ పోరాట పటిమ గొప్పది. బిర్సా ముండాకి ప్రధాని మోడీ జాతీయ గౌరవం ఇచ్చారు. ఈ రోజు ఆదివాసీ గౌరవ దినోత్సవం జరుపుకుంటున్నాము. ఆదివాసీ బిడ్డ దేశ అత్యున్నత పదవి రాష్ట్రపతిగా ఉన్నారు. ఒడిశా, ఛత్తీస్‌గఢ్‌లో గిరిజనులను సిఎం చేసినందుకు ధన్యవాదాలు. ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నో గిరిజన తెగలు ఉన్నాయి. కొండదొర తెగవారు అటవీ జీవితం సమాజాన్నికి ఎన్నో ఉత్పతులు ఇస్తున్నారు. సవర తెగ వారు గిరిజన భాషను పరిరక్షిస్తున్నారు. కొండ సవరాలు సమాజానికి మేలు చేస్తున్నారు. ఒడిశాలో 28 లక్షల పిజిటిలకు విద్య, వైద్య సేవలు ఇస్తున్నాము. 90 వేల ఇళ్లకు మంచి నీరు అందిస్తున్నాము. ఎపి కూడా సవర, కొండ సవర గభ, తెగలకు ప్రభుత్వాలు మేలు చేస్తున్నాయి. ఏకలవ్య స్కూల్స్ ద్వారా నాణ్యమైన విద్య అందిస్తున్నారు. ఏడు కోట్ల ఆదివాసీలకు ఆరోగ్య మేలు అందుతోంది. 1650 యుగిరిజనులకు రుణాలు ఇచ్చారు. 415 బంధన్ వికాస స్కూల్ ఎపిలో తర్ఫీదు ఇస్తున్నారు. లంబ సింగి ప్రాంతంలో మ్యూజియం ఏర్పాటు అవుతోంది. లోకల్ నుంచి గ్లోబల్ 195 స్టోర్‌లో గిరిజన ఉత్పతిలు ప్రమోట్ చేసాం. ఆదివాసీ తెగలు స్వయం సమృద్ధి శక్తులు. గిరిజనులు మన దేశ గుండెకాయ లాంటి వారు.. బిర్సా ముండా హీరో మాత్రమే కాదు.. భవిష్యత్‌కు దిక్సూచి, అల్లూరి సీతారామరాజు ఆంధ్రప్రదేశ్ ఆత్మ గౌరవ సూచిక. మన్యం వీరుడుగా ప్రజల్లో నిలిచాడు. యువతకి ప్రేరణగా నిలిచారు. యువతను వారిని ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గిరిజన మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు పాంగి రాజారావు, మాజీ ఎమ్మెల్యే ఈశ్వరి, జిసిసి చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్, వనవాసి కళ్యాణ్ ఆశ్రమం అధ్యక్షుడు మటన్ సన్యాసినాయుడు, బిజెపి జిల్లా అధ్యక్షుడు, సర్పంచ్ మఠం శాంతకుమారి, ఎస్టీ కమిషన్ చైర్మన్ సోలాబుజ్జి రెడ్డి, పాలకొండ ఎమ్మెల్యే, బిజెపి అధ్యక్షులు, నేతలు తదితరులు పాల్గొన్నారు.



# శాంతిభద్రతలకు విఘాతం కల్గిస్తే తాటతీస్తాం

### తిరుపతి జిల్లాలో ఆరుగురిపై పిడియాక్టు: జిల్లా ఎస్పీ

తిరుపతి, నవంబరు 16 ప్రభాతవార్త ప్రతినిధి: పలు రకాల నేరస్వభావం కలిగిన నేరచరిత్రులు శాంతిభద్రతలకు విఘాతం కల్గిస్తే తాటతీస్తామని తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు హెచ్చరించారు. ప్రజలశాంతికి విఘాతం కలిగిస్తున్న ఆరుగురిపై పిడియాక్టు క్రింద కేసు నమోదు చేయడం జరిగిందని తెలిపారు. ఆదివారం ఉదయం తిరుపతి పోలీసు అతిథిగృహంలో అదనపు ఎస్పీ రవిమనోహరచారితో కలసి పిడి యాక్టు కేసు వివరాలు మీడియాకు వెల్లడించారు. జిల్లాలో ప్రజా శాంతిభద్రతలకు, ఆస్తులకు ముప్పుగా వ్యవహరిస్తున్న వ్యక్తులను గుర్తించి వారిపై కఠిన చర్యలు చేపడతామన్నారు. డ్రగ్స్ వాడకం, అక్రమరవాణా, హత్యాయత్నం, మహిళలపై నేరాలు, అక్రమ రవాణాదారులు దోపిడీదారులు వంటివాటిల్లో భాగస్వామమైన వారిని గుర్తించి వారిని చట్టం ముందుకు తీసుకు వస్తామన్నారు. పదేపదే నేరాలలో పాల్గొన్న ఆరుమంది తిరుపతి జిల్లా గూడూరుమండలం చవటపాలెంకు చెందిన షేక్‌కాలేషా (33), గూడూరు టౌన్ అరుంధతియపాలెంకు చెందిన కనుపూరు శ్రీహరి(38), తిరుపతి నగరం కొర్లగుంటకు చెందిన సయ్యద్ అజీమ్ (30), చిత్తూరు జిల్లా పులిచర్లమండలం కమ్మపల్లి గ్రామానికి చెందిన వట్టికుంట అరుణ్ కుమార్ (32), నెల్లూరు జిల్లా పెన్నానది వంతెన దగ్గరుండే మీధూరి సునీల్(29), సూళ్ళూరుపేట టౌన్‌కు చెందిన ప్రసన్నకుమార్ (32)లపై పిడి కేసులు నమోదు చేశామన్నారు. వీరందరిపై పలు పోలీస్‌స్టేషన్‌లలో పలురకాల కేసులు ఉన్నాయన్నారు. ప్రజాశాంతికి భంగం కలిగించే ఏదైనా కార్యకలాపాలు గమనించినపుడు 112కు ఫోన్‌చేసి తెలియజేయాలని ఎస్పీ సుబ్బరాయుడు కోరారు.

# ఎన్నికల సంస్కరణలు అవశ్యం

### మీట్ ది ప్రెస్‌లో సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా



విజయవాడ, నవంబరు 16 ప్రభాత వార్త: రాజ్యాంగబద్ధ ఎన్నికల సంఘం పాత్ర ప్రశ్నార్థకమైన నేపథ్యంలో సమగ్ర ఎన్నికల సంస్కరణలు ఆవశ్యమని సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా ఉద్ఘాటించారు. బీహార్‌లో ఎన్నికల సంఘం ఎన్నో ఇబ్బందులను కల్పించిందన్నారు. తల్లిదండ్రుల పుట్టిన తేదీ సర్టిఫికెట్లను సమర్పించాలంటూ తీవ్రమైన ఆంక్షలు విధించిందని, తద్వారా అత్యధిక సంఖ్యాకులు ఓటర్లుగా నమోదు చేసుకోలేకపోయారని ఆయన పేర్కొన్నారు. బీహార్ ఎన్నికల ఫలితాలు ఇండియా కూటమి పార్టీలను నిరాశపరిచాయన్నారు. దీనిపై వారు నిశితంగా ఆత్మ పరిశీలన చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో ఆదివారం విజయవాడ ప్రెస్ క్లబ్ నిర్వహించిన మీట్ ది ప్రెస్ కార్యక్రమంలో డి.రాజా మాట్లాడారు. దేశం నేడు సంక్లిష్ట పరిస్థితుల్లో ముందుకు సాగుతున్నదని, భారత రాజ్యాంగం, ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడ్డాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. హిందూ రాజ్యాన్ని స్థాపించడానికి ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీ ప్రయత్నిస్తున్నాయని రాజా మండిపడ్డారు. బి.ఆర్ అంబేద్కర్ రాజ్యాంగం రాసిన ఈ దేశానికి ఇటువంటి రాజ్య స్థాపన ఎంతో వైపరీత్యంగా పరిగణిస్తుందని ఆయన ఆవేదన వ్యక్తం చేసారు. రాజ్యాంగంలో పేర్కొన్న సౌభ్రాతృత్వం, సమానత్వం, ఐక్యత ప్రాథమిక సూత్రాలను ఆర్‌ఎస్‌ఎస్ ఎన్నడూ అంగీకరించలేదని ఆయన గుర్తు చేశారు. దేశ అత్యున్నత చట్టసభైన పార్లమెంటు సక్రమంగా పనిచేయకపోతే ప్రజాస్వామ్యం మనుగడ సాధించలేదని రాజ్యాంగంలో స్పష్టంగా పేర్కొనబడిందన్నారు. దేశంలో మతోన్మాద పార్టీలు, కార్పొరేట్ శక్తుల మధ్య సంబంధాలు బలంగా ఏర్పడ్డాయని, విశాఖ ఉక్కు కర్మాగారంతో సహా ప్రభుత్వ రంగ సంస్థలన్నీ కార్పొరేట్లకు అప్పచెప్పడమే ఇందుకు నిదర్శనమన్నారు. బీహార్ ఎన్నికల ఫలితాలు అనంతరం, ఇక పశ్చిమ బెంగాల్ వంతు అంటూ ప్రధాని మోడీ ప్రకటించడాన్ని ఆయన తప్పుపట్టారు. బెంగాల్ ఒక సునిసితమైన రాష్ట్రం అన్నారు. 2026లో తమిళనాడు, కేరళ, పశ్చిమబెంగాల్లో ఎన్నికలు జరగనుండగా, ఆ రాష్ట్రాల్లో కూడా పాగా వేసేందుకు ఇప్పటి నుండే కుటిల ప్రయత్నాలు ప్రారంభమయ్యాయన్నారు. ఈ నేపథ్యంలో భారత రాజ్యాంగ, ప్రజాస్వామ్య రక్షణకు లౌకిక, వామపక్ష, ప్రజాస్వామ్య శక్తులన్నీ ఐక్యం కావాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన పిలుపునిచ్చారు. విజయవాడ ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు కంచల జయరాజ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే విజయవాడ నగర యూనిట్ అధ్యక్ష, కార్యదర్శులు చావా రవి, దారం వెంకటేశ్వరరావు, ఐజేయూ సభ్యులు షేక్ బాబు, సామ్నా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ రమణారెడ్డి, ప్రెస్ క్లబ్ కార్యదర్శి దాసరి నాగరాజు పాల్గొన్నారు.



# కార్మికులను సిఎం బెదిరించడం తగదు

విజయవాడ, నవంబరు 16 ప్రభాతవార్త ప్రతినిధి: కార్మికులపై పిడి యాక్టు ఉపయోగిస్తామంటూ విశాఖ ఉక్కు కార్మికులను బెదిరించే ధోరణితో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేసిన వాఖ్యలను సిపిఐ(యం) రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండించింది. కార్మికులను ముఖ్యమంత్రి బెదిరించడం తగదు అని పేర్కొంది. అవాస్తవాలు, అర్థ సత్యాలతో ప్రజలను తప్పు దారి పట్టించడం ముఖ్యమంత్రికి తగదు అని చెప్పారు. కార్మికుల వేతనాలను ఉత్పత్తితో ముడి పెడుతూ ఉక్కు యాజమాన్యం తాజాగా సర్క్యులర్ జారీ చేయడం మరింత అనిశ్చితికి గురి చేస్తుందన్నారు. ప్రభుత్వ విధానాలు, గనులు లేకపోవడం, ఇతర పాలనాపరమైన కారణాల వల్ల నష్టాలు వస్తుంటే అందుకు నెపం కార్మికులపై నెట్టడం దారుణమన్నారు. దేశ దేశాలు తిరిగి పారిశ్రామికవేత్తలకు వేల కోట్ల రూపాయల రాయితీలిస్తామని ఎర్రతివాచీ పరిచిన ముఖ్యమంత్రి రేయింబవళ్ళు శ్రమ చేసే కార్మికులను పి.డి.యాక్టు పెట్టి జైళ్లలో వేస్తామనడం ఈ ప్రభుత్వం ఎవరి పక్షమో స్పష్టం చేస్తోందన్నారు. ఉక్కు ఫ్యాక్టరీ రక్షణ కోసం కార్మికులు పోరాడుతుంటే వారికి మద్దతు ఇవ్వకపోగా నిందించడం అన్యాయమని ధ్వజమెత్తారు.

# ప్రజా సమస్యల పరిష్కారం కోసం సమన్వయంతో పనిచేయాలి



విజయవాడ, నవంబరు 16 ప్రభాతవార్త ప్రతినిధి: ప్రజా సమస్యల పరిష్కారం కోసం కార్పొరేటర్లు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని విజయవాడ పశ్చిమ ఎమ్మెల్యే సుజనా చౌదరి సూచించారు. తాడిగడపలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం అడిషనల్ కమిషనర్ ప్రాజెక్ట్స్ డ. చంద్రశేఖర్, చీఫ్ ఇంజనీర్ కె.సత్యవతి, జోనల్ కమిషనర్ రమ్య కీర్తన, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జె.శ్రీనివాస్, చీఫ్ సిటీ ప్లానర్ సంజయ్, జెడి అమృత్, కెబిఎన్‌ఎస్ లత, డిసిపి చంద్రబోస్, హెల్త్, టౌన్ ప్లానింగ్, ఇంజనీరింగ్, హౌసింగ్ అధికారులు, కూటమి కార్పొరేటర్లు మరుపిళ్ళ రాజేష్, మహాదేవు అప్పాజీరావు, బుల్లా విజయ్ కుమార్, గుడివాడ నరేంద్ర రాఘవ, అర్షద్, ఉమ్మడి వెంకటేశ్వరరావు (చంటి) మైలవరపు మాధురి లావణ్యలతో కలిసి సమీక్ష నిర్వహించారు. పశ్చిమలో ప్రధాన సమస్యలైన రోడ్లు, డ్రైనేజీలు, తాగునీరు, పారిశుద్ధ్యం, తదితర అభివృద్ధి పనులు, చేపట్టనున్న, ప్రారంభించవలసిన పనులను గురించి కార్పొరేటర్లను, సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. టిడ్కో ఇళ్లకు సంబంధించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. పూర్తి అయిన, అసంపూర్తిగా ఉన్న, చేపట్టవలసిన ఇళ్లను గురించి వివరాలను అందజేయాలని కోరారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు ప్రజలకు మెరుగైన సేవలు అందించడానికి అభివృద్ధి పనులను వేగవంతం చేయడానికి సమన్వయంతో పని చేయాలన్నారు. ఇద్దరూ కలిసి పనిచేయడం వలన సమస్యలు పరిష్కారం అవుతాయని, అభివృద్ధి పనులు సకాలంలో పూర్తవుతాయన్నారు. పశ్చిమ నియోజకవర్గాన్ని అగ్రగామిగా తీర్చిదిద్దడం తన లక్ష్యమన్నారు. కార్పొరేటర్లు, అధికారులు తక్షణమే చేపట్టవలసిన అవసరాలు, సమస్యలను ఎమ్మెల్యేకు వివరించగా సమస్యలపై చర్యలను తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ సమీక్షలో టీడీపీ సీనియర్ నాయకులు మైలవరపు దుర్గారావు, అత్తలూరి పెద బాబు, రిటైర్డ్ ఎస్‌ఈ అర్నిపల్లి ఉదయ్‌కుమార్, రిటైర్డ్ ఈఈ నారాయణమూర్తి, సిఎల్‌టిసి సమత, డిఇ పురుషోత్తం, సిడిఓ శ్రీకాంత్, సుజనా మిత్రా కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.



# మల్లంపేటలో నల్లచెరువుపొర్లు కట్టు విధ్వంసం

### ఎర్రమట్టితో బూడిద పాల్జేస్తారని రైతులు ఆగ్రహం

రౌతులపూడి, నవంబరు 16 ప్రభాతవార్త: రౌతులపూడి మండలంలోని మల్లంపేటలో నల్లచెరువు నీరుపారుదలకి నిర్మించిన పొర్లు కట్టును లాటరైట్ రవాణాకు చెందిన ప్రతినిధులు రెండు భారీ యంత్రాలతో గ్రామస్తులకు తెలియపరచకుండా ఆదివారం విధ్వంసం చేశారు. ఈ విషయం తెలుసుకున్న గ్రామ పెద్దలు, ఆయకట్టు రైతులు తరలి వెళ్లి ఆయా ప్రతినిధులను నిలదీశారు. ఎందుకిలా చేస్తున్నారని ప్రశ్నించారు. తూరలు వేసి రోడ్లు లెవెల్ చేస్తామని వారనడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో ఈ ప్రాంత క్వారీ యజమాని చేస్తానంటే మా పంటలు ముంపుకు గురై, నష్టం కలుగుతుందని చెప్పడంతో అప్పట్లో ఆపేయడం జరిగిందన్నారు. ఈ ప్రాంతంలో లేటరైట్ క్వారీలు లేనప్పటికి ఎక్కడో ఉన్న భమిడికలొద్దు నుండి తరలించే లేటరైట్ కోసం తూరలువేసి మీరు రోడ్డు నిర్మించుకుంటారా? మీ వ్యాపారాల కోసం మా పొలాలని ముంచేస్తారా అని రైతులు ప్రశ్నించారు. ఎర్రమట్టితో మా గ్రామాన్ని బూడిద పాలు చేస్తారా? గ్రామ అభివృద్ధికి అధికారులు సహకరించకపోయినా, మీ వ్యాపారాలకు అధికారులు వత్తాసు పలకడంతో ఇష్టారాజ్యం అయిపోతుందని వారు వాపోయారు. దీనిపై జిల్లా స్థాయి అధికారులు స్పందించాలని వారు కోరారు.

### ప్రతిభావంతులైన విద్యార్థులకు

# రూ.25 లక్షల ఉపకార వేతనాలు

### కమ్మ కల్యాణ మండపం

విజయవాడ, నవంబరు 16 ప్రభాతవార్త ప్రతినిధి: ప్రతిభ ఉన్న పేద విద్యార్థులకు ఆర్థిక చేయూత ఇచ్చేందుకు వచ్చే సంవత్సరం నుంచి కమ్మ కళ్యాణ మండపం ద్వార దాతల సహకారంతో రూ.25 లక్షలు వరకు స్కాలర్ షిప్‌ల రూపంలో అందజేయడం జరుగుతుందని కమ్మ కళ్యాణ మండపం గౌరవ అధ్యక్షుడు మైలవరం శాసనసభ్యులు వసంత కృష్ణ ప్రసాదు తెలిపారు. ఆదివారం నందిగామలోని కమ్మ కళ్యాణ మండపంలో కార్తీక వనసమారాధన నిర్వహించారు. ఈ సందర్భంగా పేద విద్యార్థులకు రూ.12 లక్షల స్కాలర్ షిప్‌లను అందజేశారు. అదే విధంగా తల్లిదండ్రులను కోల్పోయి సరైన అదరణ లేని ఆరుగురు విద్యార్థులను గుర్తించగా వారిలో ముగ్గురిని తాను దత్తత తీసుకుంటున్నట్లు వేదిక పై నుంచి వసంత కృష్ణ ప్రసాదు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్, జిల్లా తెలుగు దేశం పార్టీ అధ్యక్షులు, జిల్లా కేంద్ర సహకార బ్యాంకు అధ్యక్షులు నెట్టెం రఘురాం, అప్కాబ్ మాజీ చైర్మన్ తోండపు దశరథ జనార్దన్, నందిగామ శాసనసభ్యురాలు తంగిరాల సౌమ్య, తన్నీరు నాగేశ్వరరావు, బోడ్డులూరి రామారావు, కమ్మ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

# ప్రేమ పేరుతో బాలికపై అత్యాచారం

### బాధితురాలి తల్లి ఫిర్యాదు

### పోక్సో కేసు నమోదు

విజయవాడ, నవంబరు 16 ప్రభాతవార్త ప్రతినిధి: మైనర్ బాలికను ప్రేమ పేరుతో నమ్మించి గర్భవతిని చేసి, అనంతరం ముఖం చాటేసాడో యువకుడు, ఎన్టీఆర్ జిల్లా కంచికచర్ల మండల కేంద్రం లోని ఓ కాలనీలో నివాసముంటున్న ఒక యువకుడు అదే కాలనీకి చెందిన 15 ఏళ్ళ బాలికతో పరిచయం పెంచుకున్నాడు. క్రమంగా ఆమెను ప్రేమిస్తున్నానంటూ దగ్గరయ్యాడు, బాలిక గర్భం దాల్చడంతో కన్పించకుండా పోయాడు. బాలిక శరీరంలో మార్పులు గమనించిన ఆమె తల్లి విషయం తెలుసుకుని పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ ఫిర్యాదుపై పోక్సో చట్ట పరిధిలో కేసు నమోదు చేసి, విచారిస్తున్నట్లు కంచికచర్ల ఎస్‌ఐ విశ్వనాథం తెలిపారు.

# దుర్గమ్మ ఆలయంలో వేదోక్తంగా పూజలు



ఇంద్రకీలాద్రి, నవంబర్ 16 ప్రభాతవార్త: దుర్గమ్మ వారి ఆలయంలో ఆదివారం కార్తీకమాస పూజలు వేదోక్తంగా నిర్వహించారు. ఇఓ, చైర్మన్లు కార్యక్రమంలో పాల్గొనగా వేదపండితులు అర్చనలు చేశారు. చతుర్వేద స్వస్తి, పంచహారతులు, మహా నివేదనలు గావించారు. సహస్ర దీప కాంతులతో శ్రీ స్వామి అమ్మ వారు భక్తులను ఊంజల్ సేవలందుకుని అనుగ్రహించారు. పవిత్ర కార్తీకమాసం సందర్భంగా సహస్ర లింగార్చన సేవలో పాల్గొనాలని భక్తులకు ఇఓ వికె శీనా నాయక్, చైర్మన్ బొర్రా రాధాకృష్ణలు తెలిపారు. అర్చకస్వాములు వేదమంత్ర పఠనాలతో శ్రీ స్వామివారికి సేవలు నిర్వహించి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. సాయం సంధ్యాకాలంలో శ్రీ స్వామి అమ్మవార్లు ఊంజల్‌పై భక్తుల సేవలందుకుని అనుగ్రహించారు. ఈ సందర్భంగా చతుర్వేద పఠనాలు పండితులు చేశారు. దుర్గమ్మవారి ఆలయంలో జరుగుతున్న నిత్యాన్నదాన పథకానికి తెలంగాణలోని సూర్యాపేటకు చెందిన వనమ రవికుమార్ వారి కుటుంబసభ్యులు ఆదివారం నిత్యాన్నదానానికి రు.1,00,116ల విరాళమందించారు. అలాగే శ్రీకాకుళంకు చెందిన ఎం ప్రభాకర్ దంపతులు, రు.1,00,116ల విరాళాన్ని వారి పిల్లలు చిరంజీవి, జోషిమా జయశ్రీ, శ్రీక జయశ్రీల పేరిట అందించారు. హైదరాబాద్‌కు చెందిన పట్టపు భగవత్ ప్రసాద్, చంద్రావతి, వారి కుటుంబసభ్యులతో కలిసి రు.1,00,116ల విరాళం అందించారు. దాతలకు దుర్గమ్మ వారి దర్శనం ఏర్పాటు చేసిన అనంతరం దుర్గమ్మవారి ప్రసాదం, శేషవస్త్రం, మెమెంటోలు అందించారు. వేదపండి తులు వేదాశీర్వచనాలు పలికారు. దుర్గమ్మ వారిని ఆదివారం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ హరినాథ్ దంపతులు దర్శించుకున్నారు.

### దుర్గమ్మవారి ఆలయంలో సూర్యఉపాసన

ఆదివారం సందర్భంగా దుర్గమ్మవారి ఆలయంలో సూర్య ఉపాసన సేవను నిర్వహించారు. దుర్గమ్మవారి ఆలయంలో ఆదివారం ఇఓ వికె శీనా నాయక్ టోల్‌గేట్, మరియు టికెట్ కౌంటరును పరిశీలించారు. ఇఓతో పాటు ఎఇఓ గంగాధర్ పాల్గొన్నారు.



## వరల్డ్ బాక్సింగ్ కప్.. సెమీస్‌కు మినాక్షి, ప్రీతి, అంకుష్, నరేందర్

**న్యూఢిల్లీ:** ప్రపంచ బాక్సింగ్ కప్-2025లో క్వార్టర్ ఫైనల్ పోటీలలో నలుగురు భారత్ బాక్సర్లు విజయం సాధించారు. గ్రేటర్ నోయిడాలో ఆదివారం జరిగిన ప్రపంచ బాక్సింగ్ కప్ ఫైనల్స్‌లో నలుగురు అథ్లెట్లు మీనాక్షి హుడా, ప్రీతి, అంకుష్ ఫంగల్, నరేందర్ బర్వాల్‌లు ఘనంగా ఆరంభించి సెమీఫైనల్‌కు చేరుకున్నారు. మహిళల 48 కిలోల క్వార్టర్ ఫైనల్స్‌లో కజకిస్తాన్‌కు చెందిన అక్బోటా బోలాట్‌పై ఏకగ్రీవ విజయంతో ప్రస్తుత ప్రపంచ ఛాంపియన్ మినాక్షి రోజును ప్రారంభించింది. ఆమె తర్వాత, ప్రీతి పవార్ (54 కిలోలు) కూడా పారిస్ ఒలింపిక్స్ తర్వాత తన మొదటి ప్రధాన పోటీలో ఉజ్బెకిస్తాన్‌కు చెందిన నిగినా ఉక్తమోవాను ఓడించడం ద్వారా అద్భుతమైన అరంగేట్రం చేసింది. ఈ రెండు విజయాలు మహిళల బాక్సింగ్‌లోని పది వెయిట్ విభాగాలలోనూ భారత్‌కు పతకాలు ఖాయం అయ్యాయి.ఇక భారత పురుష బాక్సర్లు అంకుష్ (80 కిలోలు), నరేందర్ (90+కిలోలు) ఇద్దరూ తమ మ్యాచ్‌లను ఏకగ్రీవంగా గెలిచి సెమీ ఫైనల్‌కు చేరుకున్నారు.

# టార్గెట్ 2026

## స్టార్ ప్లేయర్లకు చెక్

### సన్‌రైజర్స్ హైదరాబాద్ మాస్టర్ స్కెచ్



**న్యూఢిల్లీ:** ఐపిఎల్ 2026 సీజన్‌కు సన్‌రైజర్స్ హైదరాబాద్ టీమ్ సిద్ధమైంది. 2016 ఛాంపియన్‌గా నిలిచిన సన్‌రైజర్స్ 2024 రన్నరప్‌గా నిలిచింది. డేంజరస్ బ్యాటింగ్‌తో దడదడలాడించిన హైదరాబాద్ జట్టు ప్రతీ మ్యాచ్‌నూ కొత్త శిఖరాలకు చేర్చింది. పాట్ కమ్మిన్స్ నేతృత్వంలోని జట్టు గత సీజన్‌లో దారుణమైన ప్రదర్శనతో ఫ్యాన్స్‌ను తీవ్రంగా నిరాశపరిచింది. సన్‌రైజర్స్ ఆడిన 14 ఆటల్లో కేవలం ఆరు మాత్రమే గెలిచి పట్టికలో ఆరవ స్థానంలో నిలిచింది. మొదటి 10 ఆటల్లో కేవలం మూడు విజయాలతో పూర్తిగా తేలిపోయింది. అయితే, ఆ తర్వాత నాలుగు మ్యాచ్‌లలో మూడు విజయాలతో తిరిగి వచ్చినా అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయింది. దీంతో ఆ సీజన్‌లో కోల్పోయిన వైభవాన్ని 2026లో తిరిగి పొందాలని లక్ష్యంగా పెట్టుకుంది. దీన్ని దృష్టిలో ఉంచుకుని కొంతమంది ప్లేయర్లను ఆ ఫ్రాంచైజీ రిలీజ్ చేసి ఐపీఎల్ 2026 సీజన్‌కు సన్‌రైజర్స్ టీమ్‌ను ప్రకటించింది. పాట్ కమ్మిన్స్ నేతృత్వంలోని హైదరాబాద్ స్టార్ ప్లేయర్లను మరోసారి రిటైన్ చేసుకుంది. సన్‌రైజర్స్ బ్యాటింగ్‌కు అభిషేక్ శర్మ, ట్రావిస్ హెడ్ మరోసారి కీలకం కానున్నారు. ఈ సీజన్‌లో ట్రావిస్ హెడ్ 13 మ్యాచ్‌ల్లో 162.61 స్ట్రైక్ రేట్‌తో 374 పరుగులు చేయగా, అభిషేక్ శర్మ 14 మ్యాచ్‌ల్లో 33.77 సగటు, 193.39 స్ట్రైక్ రేట్‌తో 439 రన్స్ చేశాడు. మహ్మద్ షమీని రిలీజ్ చేసి సన్‌రైజర్స్ హైదరాబాద్‌లో రూ.10 కోట్లు మిగిలించుకుంది. షమి ఆడిన 9 మ్యాచ్‌ల్లో కేవలం 6 వికెట్లు మాత్రమే తీశాడు. ఎకానమీ కూడా 11.23 బాగా ఎక్కువగానే ఉంది. అయితే అంతే ధర చెల్లించి షమీని గుజరాత్ టైటాన్ ట్రేడ్ చేసుకుంది. స్టార్ స్పిన్నర్లు ఆడమ్ జంపా, రాహుల్ చాహర్‌లను హైదరాబాద్ విడుదల చేసింది. వీరితోపాటు వియాన్ ముల్డర్, అభినవ్ మనోహర్, అథర్వ టైడే, సచిన్ బేబీ, సిమర్‌జీత్ సింగ్‌లను కూడా రిలీజ్ చేసింది. దీంతో సన్‌రైజర్స్ పర్స్‌లో మొత్తం రూ.25.5 కోట్లు మిగిలాయి. డిసెంబర్‌లో జరగనున్న మినీ వేలంలో ఎవరిని దక్కించుకుంటుందో చూడాలి. మొత్తానికి మినీ వేలానికి ముందు కావ్య మారన్ మాస్టర్ స్కెచ్‌తో రిటెన్షన్ జాబితాను రూపొందించినట్లు తెలుస్తోంది. రిటైన్, వేలానికి వదిలేసిన తర్వాత సన్‌రైజర్స్ హైదరాబాద్ టీమ్‌లో పాట్ కమిన్స్ (కెప్టెన్), ట్రావిస్ హెడ్, అభిషేక్ శర్మ, ఇషాన్ కిషన్, హెన్రిచ్ క్లాసెన్, నితీష్ కుమార్ రెడ్డి, హర్షల్ పటేల్, అనికేత్ వర్మ, ఆర్.స్మరన్, హర్ష్ దూబే, కమిందు మెండిస్, బ్రైడన్ కార్సే, జయదేవ్ ఉనద్కత్, జిషాన్ అన్సర్కత్, జిషాన్ మలింగస్ ఉన్నారు.



## ధనుష్‌కు రైఫిల్ టైటిల్

### మహిత్, కోమల్‌కు రజత, కాంస్యం

**న్యూఢిల్లీ:** టోక్యో డెఫ్లింపిక్స్-2025 పురుషుల, మహిళల ఎయిర్ రైఫిల్ ఫైనల్స్‌లో భారత్ రెండు పతకాలు సాధించింది. ప్రపంచ రికార్డుతో ధనుష్ శ్రీకాంత్ ఎయిర్ రైఫిల్ టైటిల్‌ను నిలబెట్టుకున్నాడు. మహిళల విభాగంలో ఒక రజతం, ఒక కాస్యం లభించాయి. జపాన్‌లోని టోక్యోలో ఆదివారం జరిగిన డెఫ్లింపిక్స్‌లో షూటర్ ధనుష్ శ్రీకాంత్ ప్రపంచ రికార్డుతో ఎయిర్ రైఫిల్ బంగారు పతకాన్ని గెలుచుకోవడం ద్వారా భారతదేశానికి అద్భుతమైన ఆరంభాన్ని ఇచ్చాడు. ఫైనల్‌లో 252.2 స్కోరుతో మొహమ్మద్ వానియా (250.1)ను ఓడించాడు. ధనుష్, వానియా కూడా అర్హత రౌండ్‌లో మొదటి, రెండవ స్థానాల్లో నిలిచారు. చివరకు ఫైనల్లో ధనుష్ విజయం సాధించి టైటిల్‌ను దక్కించుకున్నాడు. ఇక మహిళల ఎయిర్ రైఫిల్ ఈవెంట్‌లో భారత్ షూటర్లు మహిత్ సంధు, కోమల్ వాగ్మారే రజత, కాంస్య పతకాలను గెలుచుకున్నారు. దీంతో మహిత్, కోమల్ భారత్ మొట్టమొదటి మహిళా ఎయిర్ రైఫిల్ పతక విజేతలుగా నిలిచారు. కాగా కాంస్య పతక పోరులో సాక్షిబన్సోడే ఓడిపోయింది. ఇక ఇతర క్రీడలైన బ్యాడ్మింటన్, జూడోలో కొన్ని పతక ఈవెంట్‌లతో ప్రారంభమైంది. జూడోలో సాక్షి బన్సోడే కిర్గిజ్స్తాన్‌కు చెందిన ఐగెరిమ్ డానియారోవాపై గెలుపొంది సెమీఫైనల్‌కు చేరుకుంది. అయితే తదుపరి టర్కియేకు చెందిన బుసే టిరాస్ చేతిలో ఓటమిచవిచూసింది. మహిళల 57 కిలోల విభాగంలో దక్షిణ కొరియాకు చెందిన యుంజి సియోతో జరిగిన కాంస్య పోటీలో ఆమె మరో కఠినమైన ఓటమిని చవిచూసింది.

## వరల్డ్ ఛాంపియన్‌షిప్‌లో నిరాశపరచిన భారత షూటర్లు



**న్యూఢిల్లీ:** ఐఎస్ఎస్ఎఫ్ ప్రపంచ ఛాంపియన్‌షిప్-2025లో భారత్ షూటర్లు నిరాశపరిచారు. ఈజిప్టు లోని కైరోలోని ఒలింపిక్ షూటింగ్ రేంజ్‌లో జరిగిన 25 మీటర్ల స్టాండర్డ్ పిస్టల్ ఈవెంట్‌లో భారత షూటర్లు పతకాలు సాధించలేకపోయారు. ఒలింపియన్ గుర్‌ప్రీత్ సింగ్ తొమ్మిదవ స్థానంలో నిలిచాడు. చైనాకు చెందిన యావో క్వియాన్‌క్సన్ తన అద్భుతమైన పరుగును కొనసాగించింది. 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ టీమ్ స్వర్ణం, 25 మీటర్ల స్పోర్ట్స్ పిస్టల్ ఈవెంట్‌లో రజతంతో పాటు తన మూడవ వ్యక్తిగత స్వర్ణ పతకాన్ని సాధించింది. పురుషుల విభాగంలో స్విట్జర్లాండ్‌కు చెందిన అడ్రియన్ షాబ్ ప్రపంచ ఛాంపియన్‌గా నిలిచాడు. పతకాల పట్టికలో చైనా, దక్షి ణ కొరియా తర్వాత భారత్ 3 స్వర్ణాలు, 5 రజతాలు, 4 కాంస్య పతకా లతో మూడవ స్థానంలో కొనసాగింది. చైనా 12 స్వర్ణాలు, 7 రజతాలు, 2 కాంస్యలు, కొరియా 7 స్వర్ణాలు, 3 రజతాలు, 1 కాంస్యం సాధించింది. ఇక పురుషుల ఈవెంట్‌లో గుర్పిత్ సింగ్ మొత్తం 571-14 స్కోరుతో తొమ్మిదో స్థానంలో నిలిచాడు. పోటీలో పాల్గొన్న ఇతర షూటర్లు ఉదయవీర్ సిద్ధు, రాజ్‌కన్వర్ సింగ్ సంధు వరుసగా 561-9, 559-6 స్కోరుతో 23, 24వ స్థానంలో నిలిచారు. మహిళల విభాగంలో, పరిషా గుప్తా 556-11 స్కోరుతో భారత షూటర్లలో అత్యధికంగా 10వ స్థానంలో నిలిచింది. శిఖా చౌదరి 555-11 స్కోరుతో 12వ స్థానంలో నిలవగా, అగం గ్రేవాల్ 547-9 స్కోరుతో 19వ స్థానంలో నిలిచింది.





# గెలిచే మ్యాచ్‌లో ఓడిన భారత్

## సౌతాఫ్రికా 30 రన్స్ తేడాతో విక్టరీ

**న్యూఢిల్లీ:** సౌతాఫ్రికాతో రెండు టెస్ట్‌ల సిరీస్‌ను టీమిండియా ఓటమితో ప్రారంభించింది. కోల్‌కతా వేదికగా ఆదివారం ముగిసిన తొలి టెస్ట్‌లో సౌతాఫ్రికా 30 రన్స్ తేడాతో టీమిండియాను చిత్తు చేసింది. 124 పరుగుల స్వల్ప లక్ష్య ఛేదనకు దిగిన భారత్ రెండో ఇన్నింగ్స్‌లో 93 పరుగులకు ఆలౌటైంది. వాషింగ్టన్ సుందర్(31) టాప్ స్కోరర్‌గా నిలవగా, మిగిలిన వారు దారుణంగా విఫలమయ్యారు. ఓపెనర్లు యశస్వి జైస్వాల్(0), కేఎల్ రాహుల్(1), ధ్రువ్ జురెల్(13), రిషభ్ పంత్(2), రవీంద్ర జడేజా(18), కుల్దీప్ యాదవ్ (1నాటౌట్), మహమ్మద్ సిరాజ్(0) తీవ్రంగా నిరాశపర్చారు. చివర్లో అక్షర్ పటేల్ 26తో సరిపెట్టాడు. సౌతాఫ్రికా సిమన్ హర్మర్, మార్కో జాన్సన్, కేశవ్ మహరాజ్ రెండేసి, ఎయిడెన్ మార్క్‌రమ్ ఒక వికెట్ దక్కింది. ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్ చేసిన సఫరీల తొలి ఇన్నింగ్స్‌లో 159 రన్స్‌కు ఆలౌటైంది. ఎయిడెన్ మార్క్‌రమ్ 31, వియాన్‌మల్డర్ 24 తో టాప్ స్కోరర్లుగానిలిచారు. భారత బౌలర్లలో జస్‌ప్రీత్ బుమ్రా 5 వికెట్లతో సౌతాఫ్రికా పతనాన్ని శాసించగా, సిరాజ్, కుల్దీప్ రెండేసి, అక్షర్ ఒక వికెట్ పడగొట్టారు. అనంతరం భారత్ 189 పరుగులకుఆలౌటైంది. రాహుల్(39), సుందర్(29) టాప్ స్కోరర్లుగా నిలిచారు. రిషభ్(27), జడేజా(27) కీలక ఇన్నింగ్స్ఆడారు. సౌతాఫ్రికా బౌలర్లలో మార్కో జాన్సెన(3/35), సిమన్ హర్మర్(4/30) భారత్ పతనాన్ని శాసించగా, కేశవ్ మహరాజ్, కోర్బిన్ బోష్ చెరో వికెట్ పడగొట్టారు. 30రన్స్ లోటుతో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన సౌతాఫ్రికా 153 పరుగులకు కుప్పకూలింది. కెప్టెన్ టెంబా బవుమా(55 నాటౌట్) అజేయ హాఫ్ సెంచరీతో ఒంటరి పోరాటం చేయగా, కార్బిన్ బోష్(25) అండగా నిలిచాడు. భారత బౌలర్లు జడేజా, కుల్దీప్, సిరాజ్ రెండేసి, బుమ్రా, అక్షర్ చెరో వికెట్ దక్కింది. దాంతో భారత్ ముందు 124 పరుగుల లక్ష్యం నమోదైంది. బవుమా, కార్బిన్ బోష్ 8వ వికెట్‌కు 44 పరుగులు జోడించారు. ఈ భాగస్వామ్యం మ్యాచ్‌ను సౌతాఫ్రికావైపు మలుపు తిప్పింది.

# ఎంక్యాష్ సేవలు నిలిపివేస్తున్న ఎస్‌బిఐ




**న్యూఢిల్లీ, నవంబరు 16:** ప్రభుత్వరంగ బ్యాంకింగ్ దిగ్గజం భారతీయ స్టేట్‌బ్యాంకు ఎంక్యాష్ సర్వీసులు నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది. ఈనెల 30వ తేదీ తర్వాత అమలులోకి వస్తుంది. ఆన్‌లైన్ ఎస్‌బిఐ, యోనోలైట్ ద్వారా ఎంక్యాష్ సేవలువాడుకోలేరు. లబ్దిదారుని రిజిస్టరుచేయకుండా సొమ్ములు పంపిం చడం లేదా ఎంక్యాష్ లింక్‌ద్వారా ఆడబ్బును క్లెయిమ్‌చేసుకోడం వంటివి ఇకపై వీలుకాదు. ఇప్పటివరకూ నెట్‌బ్యాంకింగ్ కస్టమర్లు ఎవరికైనా సొమ్ము పంపించాలనుకుంటే ముందు బెనిఫిషియరీగా రిజిస్టరుచేసుకోవాల్సిన అవసరం ఉండేదికాదు. డబ్బు అందుకునే వ్యక్తి మొబైల్ నంబరు, మెయిల్ ఐడిని ఉపయోగించి సొమ్ములు పంపించేవారు. రిసీవర్ ఒక ఎస్ఎంఎస్‌లేదా మెయిల్‌రూపంలో ఎనిమిది అంకెల పాస్‌కోడ్ ఉండే సురక్షితమైన లింక్‌వచ్చేది. ఆ లింక్‌ద్వారా ఎస్‌బిఐ ఎంక్యాష్‌మొబైల్ యాప్‌ద్వారా ఏబ్యాంకు అకౌంట్‌లోఅయినా సొమ్మును క్లెయిమ్‌చేసుకునే అవకాశంఉండేది. ఇపుడు ఈ సేవలను నిలిపివేస్తోంది. ఎస్‌బిఐ ఇందుకోసం యుపిఐ,ఐఎంపిఎస్, నెఫ్ట్,ఆర్టీజీఎస్ వంటి మార్గాల్లో సొమ్ములు పంపించుకోవాలని డిమాండ్‌చేసింది. భీమ్‌ఎస్‌బిఐ పే యుపిఐ యాప్‌ను కూడా ఉపయోగించుకోవచ్చునిసూచించింది. భీమ్ ఎస్‌బిఐపే యాప్‌లోక లాగిన్ అయి పే అనే ఆప్షన్ ఎంచుకుని విపియె లేదా అకౌంట్‌నంబర్, ఐఎఫ్ఎస్‌సికోడ్ లేదా క్యూఆర్‌కోడ్‌వంటి ఒకపద్దతి ఎంపికచేసుకోవాలి. డబ్బుపంపించే ఖాతాను ఎంచుకుని యుపిఐ పిన్ నమోదుచేస్తే లావాదేవీ పూర్తవుతుంది. ఎంక్యాష్ ఆగిపోయినా కస్టమర్లు ఎలాంటిఇబ్బందుల్లేకుండా డిజిటల్ చెల్లింపులుచేయొచ్చు.



## జమ్ముకాశ్మీర్‌లో 2.95 లక్షల బినామీ ఖాతాలు

### అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్లు రూ.465.79 కోట్లు

**శ్రీనగర్, నవంబరు 16:** ఉగ్రపీడిత జమ్ము కాశ్మీర్‌లో బ్యాంకు ఖాతాలుకూడాఅనేకం బినామీ ఖాతాలున్నాయి. ఈ ఖాతాలు సుదీర్ఘకాలంగా అన్‌క్లెయిమ్డ్ ఖాతాలుగా పేరుకున్నాయి. వీటిలో ఉన్న మొత్తం సొమ్ము 465.79 కోట్లు ఎవ్వరూ తమవిగా క్లెయిమ్‌చేసుకోలేదని ఆర్‌బిఐ వెల్లడించింది. నిజమైన యజమానులను గుర్తించి వీలైనంత సత్వరమే ఈ మొత్తం తిరిగి ఇచ్చే ప్రక్రియను పూర్తిచేయాలని ఆర్‌బిఐ బ్యాంకులకు విజ్ఞప్తిచేసింది. జమ్ముజిల్లాలోమాత్రమే 2,94,676 బినామీ ఖాతాలు ఉంటే వీటిలో మొత్తం 197.27 కోట్లవరకూసొమ్ము జమ అయి ఉందని ఆర్‌బిఐ ప్రాంతీయ డైరెక్టర్ చంద్రశేఖర్ ఆజాద్ తెలిపారు.

ఈ పథకం కింద బినామీ ఖాతాలను యాక్టివ్‌చేసినందుకు లేదా మొత్తం తిరిగి ఇచ్చినందుకు బ్యాంకులకు నిల్వల్లో 7.5 శాతంలేదా గరిష్టంగా రూ.25వేల వరకూ ప్రోత్సాహకాలు ఇస్తామని ఆజాద్ తెలిపారు. ఈస్కీం వచ్చే ఏడాది సెప్టెంబరు 30వరకూ అమలులో ఉంటుందని జమ్ముకాశ్మీర్ కేంద్ర పాలిత ప్రాంతాలస్థాయి బ్యాంకర్ల కమిటీ అవగాహన, పరిష్కార శిబిరాలను నిర్వహించారు. ఇక్కడి ప్రజలకు వారి క్లెయిమ్‌చేయని బ్యాంకు ఖాతాలు గురించి సమాచారం కూడా అందిస్తు న్నట్లు ఆజాద్ తెలిపారు.

# రుణాలకు క్రెడిట్‌స్కోరు ఒక్కటే ప్రామాణికం కాదు!




**ముంబయి, నవంబరు 16:** రిటైల్ రుణాలు, ఆన్‌లైన్ రుణాలు తీసుకునే కస్టమర్లు సహజంగా క్రెడిట్ స్కోరు 750 లేదా అంతకంటే ఎక్కువ ఉన్నప్పటికీ రుణం లేదా క్రెడిట్ కార్డ్ దరఖాస్తులు తిరస్కరిస్తారు.ఎందుకంటే బ్యాంకులు స్కోరును మాత్రమే చూడవు, మొత్తం ఆర్థిక పరిస్థితి, ఉద్యోగ స్థిరత్వం, బాధ్యతల స్థాయిని కూడా పరిశీలిస్తాయి. క్రెడిట్ స్కోర్ అనేది గత చరిత్ర, గత రుణాలను తిరిగి చెల్లించే సామర్థ్యాన్ని సూచిస్తుంది. అయితే క్రెడిట్ స్కోర్ ఆధారంగా మాత్రమే మొదటిసారి రుణగ్రహీతలను తిరస్కరించడం సముచితం కాదని ప్రభుత్వం,ఆర్‌బిఐ ఇప్పుడు స్పష్టం చేశాయి. కస్టమర్ మొత్తం ఆర్థిక సామర్థ్యాలు, సాధారణ ఆదాయం, ప్రస్తుత ఆర్థిక బాధ్యతలను అంచనా వేసిన తర్వాత మాత్రమే నిర్ణయం తీసుకోవాలని బ్యాంకులకు సూచించింది. రుణ మంజూరులో ఆదాయం, ఉద్యోగ స్థిరత్వం. తరచుగా ఉద్యోగాలు మారుస్తుంటే లేదా ఎక్కువ కాలం నిరుద్యోగిగా ఉంటే, బ్యాంకులు ప్రమాదకర కస్టమర్‌గా పరిగణించవచ్చు. ఒకే రంగంలో స్థిరంగా పనిచేయడం, నమ్మకమైన కంపెనీతో సంబంధం కలిగి ఉండటం అనుకూలంగా పనిచేస్తుంది. మీ ప్రస్తుత అప్పు బ్యాంకులకు కూడా ముఖ్యమైనది. మీ ఆదాయంలో 40నుంచి 50 శాతం కంటే ఎక్కువ ఇఎంఐ చెల్లింపుల కోసం ఖర్చు చేస్తే, బ్యాంకులు కొత్త రుణం ఇవ్వడానికి వెనుకాడతాయి. మరో ప్రధాన కారణం ఏమిటంటే ప్రజలు ఒకేసారి ఒకటి కంటే ఎక్కువ లోన్లు లేదా క్రెడిట్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకుంటారు. దీని ఫలితంగా మీ క్రెడిట్ నివేదికలో బహుళ కఠినమైన విచారణలు కనిపిస్తాయి. బ్యాంకులు దీనిని ఆర్థిక ఒత్తిడికి సంకేతంగా భావిస్తాయి, ఇది దరఖాస్తు తిరస్కరించబడే అవకాశాలను పెంచుతుంది. అదనంగా మీరు దరఖాస్తు చేసుకుంటున్న బ్యాంకుతో మీ గత రికార్డు కూడా ముఖ్యమైనది. కొత్త నిబంధనల ప్రకారం మొదటిసారి రుణం తీసుకునేవారికి కనీస క్రెడిట్ స్కోర్ నిబంధన తొలగించబడింది. దీని అర్థం బ్యాంకులు ఇకపై కేవలం స్కోరు ఆధారంగా మాత్రమే రుణాలను తిరస్కరించలేవు. వారు కస్టమర్ ఆర్థిక బలం, రుణం తిరిగి చెల్లించే సామర్థం, ఉద్యోగ భద్రత వంటి ఇతర అంశాలను అంచనా వేస్తారు.




Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., and printed at Sy No.658/A , NH-5, Ankireddy Palem, Guntur Dist-522005. Ph:2355939, 2512322(0863), 9848812526. RNI No : APTEL / 2004 / 13725, Editor : *Damerla Sai Baba, Postal Licence/AP/Vj/GTR/57/08-10 *Responsible for selection of News under the PRBAct. Regd.: No.H/SD/337/12-14